ప్రపంచ సాహిత్యం-17



ఇల్లంగొ అదిగళ్

విరచిత

# శిలప్పదికారం



(కన్నగి పాదమంజీర గాథ)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-17

ఇల్లంగో అదిగళ్

విరచిత

# శిలప్పదికారం

(కన్నగి పాదమంజీర గాథ)

స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ఇల్లంగో అదిగళ్ విరచిత

# శిలప్పదికారం

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

January 2015

All rights reserved

Copyright @ 2015
by **Dr. Lanka Siva Rama Prasad**

Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

**E-book: www.kinige.com**

Price : ₹ **200  $ 4**

Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

*This book is presented to...*

<u>ఈ రచనకు ముఖ్య ఆధార గ్రంథాలు</u>

1) **Silappadikaram (Tamil) - Illango Adigal**
2) **The story of an Anklet - R. Parthasarathy**
3) **కాలి అందియ కథ** (పద్యకావ్యం) **– శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి**

## ముందుమాట

# శిలప్పదికారం (కన్నగి పాదమంజీర గాథ)

శిలప్పదికారం, మణిమేఖల, జీవక చింతామణి, వలయపతి, కుండలకేశి ఈ అయిదు తమిళ పంచకావ్యాలు. వీటిలో శిలప్పదికారం, మణిమేఖలలను జంట కావ్యాలుగా పిలుస్తారు.

కాలి అందియ కథగా, పాదమంజీర గాధగా, కన్నగి కథగా, పత్తిని (పత్ని) దేవీచరితంగా ప్రసిద్ధికెక్కిన శిలప్పదికారం– చేర రాజకుటుంబీకుడైన ఇల్లంగొ అదిగళ్‌చే క్రీస్తుశకం 150–400 సంవత్సరాల ప్రాంతంలో వ్రాయబడింది. 5270 వాక్యాలు, 30 భాగాలు, మూడు పుస్తకాలు (పుగార్ కాండము, మధురై కాండము, వంజి కాండము– పది, పదమూడు, ఏడు భాగములు వరుసగా)గా రచింపబడిన ఈ కావ్యానికి కొనసాగింపుగా 'మణిమేఖల' కావ్యం ఇల్లంగొ అదిగళ్‌కు సమకాలికుడు, ధాన్యవ్యాపారి, కవి శీత్తలై శాత్తనార్‌చే రచింపబడి ప్రసిద్ధికెక్కింది.

### శిలప్పదికారంలోని కొన్ని ప్రత్యేకతలు

1. శిలప్పదికారం అనగా కాలిఅందియ కథ అని అర్థం. (శిలంబు=నూపురం; మంజీరం, కాలి అందియ)

2. ఇల్లంగొ అదిగళ్ (రాజర్షి). ఆరోజుల్లో కవులు తమ నిజనామాన్ని చెప్పుకునేవారు కాదు. చేరరాజు సెంగుట్టవన్ (వెల్ కెలు కుట్టవన్) తమ్ముడైన ఇల్లంగొ జ్యోతిష్కుడొకడు నీవు చేరరాజ్య చక్రవర్తివి అవుతావు అని పలుకగా, 'అగ్రజునికి చెందాల్సిన రాజ్యం నాకు వద్దు' అని అతడు జైనమతం స్వీకరించి కవి చక్రవర్తిగా పేరుపొందినాడు.

3. ఎక్కువభాగం (25 భాగాలు) 'అగవల్' ఛందస్సులో వ్రాయబడిన శిలప్పదికారంలో జానపద గేయాలు అందంగా కూర్చబడి ఆనాటి ప్రజల స్థితిగతులను కడు రమ్యంగా వర్ణిస్తాయి. 'అగవల్' అంటే పిలుపు. మరొక ఛందస్సు కవులభాష అయిసిరిగప్పు (గురుభాష).

తమిళభాషా సాహిత్యంలో ఇయల్ (సాహిత్యం); ఇశై (సంగీతం); నాడగం (నాటకం) అనే మూడు ప్రక్రియలను వివరించిన గ్రంథంగా, 'ఇయల్ ఇశై నాడగ పొరుళ్ తొడర్ నిలై సెయ్యుళ్' అని, నాడగ కాప్పియం (నాటకకావ్యం) అని శిలప్పదికారం కావ్యాన్ని విజ్ఞులు ప్రస్తుతిస్తారు.

4. చోళ, పాండ్య, చేర రాజ్యాలు ఆనాటి 'తమిళగమ్'లో భాగాలు. ఉత్తరాన వెంకటాచలం (తిరుపతి), దక్షిణాన కుమారి అగ్రం వరకున్న దేశము తమిళదేశం. కిరీటధారులైన ముగ్గురు రాజులు తమతమ ప్రత్యేకతలను చాటుకుంటూ నిత్య యుద్ధాలతో తలమునకలవుతున్నా ప్రజా సంక్షేమం గురించి పాటుపడేవారు. రాజభవనం ముందు ధర్మఘంటను వేలాడదీసి, అన్యాయం జరిగిందనుకునేవాళ్లు రాజును ఏ సమయంలోనైనా కలవడానికి వీలు కల్పించేవారు. ఈ మూడు రాజ్యాల్లో నడచిన కథ శిలప్పదిగారం. చోళుల రాజధాని పూంపుహార్ (పుకార్, పుగార్, కావేరీ) పట్టణ నివాసి, వణిక్ యువకుడు కోవలన్, కన్నగి భార్యాభర్తలు. ఈ పట్టణంలోని అందాల నర్తకి, గణిక అయిన మాధవి ప్రేమలోబడి ఆస్తిని కోల్పోయి, ఒక దురదృష్టపు రోజున కోవలన్, మాధవి మాటలను అపార్థం చేసుకుని భార్య కన్నగి వద్దకు తిరిగి వస్తాడు. ఆమె వెంటరాగా పుగార్ పట్టణాన్ని విడిచి మధురై నగరాన్ని చేరుకుని, కన్నగి కాలిఅందియను అమ్మబోగా, ఓ స్వర్ణకారుని మోసం వలన దొంగగా అనుమానించబడి చంపబడతాడు. విషయం తెలుసుకున్న కన్నగి, పాండ్య రాజుతో తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించగా తన తప్పు తెలుసుకున్న రాజు, అతడి పత్ని ఇరువురూ అక్కడికక్కడే ప్రాణాలు విడుస్తారు. అయినా కోపం చల్లారని కన్నగి తన ఎడమ రొమ్మును పెరికి మధురా నగర వీధుల్లో విసరగా అది అగ్ని చక్రమై నగరాన్ని భస్మీపటలం చేస్తుంది. అక్కడ నుంచి చేరరాజ్య సరిహద్దులలోని పవిత్ర కొండపై పధ్నాలుగు రోజులు ప్రాయోపవేశమున్న కన్నగిని దేవతలు స్తుతించి ఆమె భర్తతోపాటు ఆమెను స్వర్గానికి తీసుకుపోతారు.

ఈ విషయం తెలిసిన మాధవి సన్యాసిని కావడం, కోవలన్ మాధవిల కుమార్తె మణిమేఖల తానూ తన వృత్తిని అంటకుండా బౌద్ధ సన్యాసినిగా మారి పేరు పొందడం 'మణిమేఖల–భిక్షాపాత్రను స్వీకరించిన స్త్రీ' గా శాత్తనార్ కవిచే రచింపబడి ప్రసిద్ధికెక్కింది.

5. జైనముని ఇల్లంగో అదిగళ్‌చే రచింపబడిన శిలప్పదికారంలో జైన సంప్రదాయం ప్రకారం ఇంద్రుని ప్రస్తావన అధికంగా, ఉన్నా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, మురుగన్‌ల ప్రశస్తి తరచూ కనిపిస్తుంటుంది. గోపాలకులు బలరామకృష్ణులనూ; వేటగాళ్లు, బోయలు దుర్గను, మహంకాళినీ; పర్వతవాసులు ఉమను; జైనులు, బౌద్ధులు తమతమ మతాల్ని అవలంబిస్తూ సమైక్యంగా ఉన్న విధానం మనకు కనిపిస్తుంది. క్రీస్తుశకం 250-600 కాలంలో తమిళగాన్ని పాలించిన కాలభ్రాలు జైనులైనా పరమత సహనాన్ని పాటించారు.

6. శిలప్పదికారం-మధురైకాండం-17వ భాగం-గోపికా నృత్యంలోని గీతాలు-వీనులు వీనులే, కన్నులు కన్నులే, జిహ్వ జిహ్వే కాదు అన్న గీతాలు మనకు భాగవతంలోని పద్యాలను స్ఫురణకు తెస్తాయి. (కమలాక్షునర్చించు...; కంజాక్షునకు గాని కాయంబు... -ప్రహ్లాద చరిత్ర).

   శిలప్పదికారంలో ఇల్లంగో కవి కావ్యవస్తువుకు అనుబంధంగా జానపదగీతాలు, సజీవమైన కళారూపాల్ని కావ్యంలో కూర్చి ఆనాటి ప్రజల ఆచార వ్యవహారాలను అత్యంత నేర్పుతో వర్ణించినాడు. కథలోని నాయికా నాయకులు వ్యాపారస్తుల కుటుంబానికి చెంది ఉండడం విశేషం. నాట్యకత్తెల వంశానికి చెందిన మాధవి తన కులవృత్తిని నిందించి బౌద్ధ సన్యాసినిగా మారడమే కాక తన కుమార్తె మణిమేఖలను సైతం పూర్వీకుల దారిని పోకుండా చేసిన వృత్తాంతాన్ని మనం శిలప్పదికారం, మణిమేఖల కావ్యాలలో గ్రహిస్తాము.

7. తాళపత్రాలలో దాగి ప్రజలకందుబాటులో లేని శిలప్పదికారం (1892), మణిమేఖల (1898), జీవక చింతామణి (1887) కావ్యాలను స్వామినాథ అయ్యర్ నానా వ్యయప్రయాసలకోర్చి ప్రచురించాడు. 'మాపొసి'గా ప్రసిద్ధికెక్కిన M.P. శివజ్ఞానం - శిలప్పదికారంపై అనేక వ్యాఖ్యానాలు వ్రాయడమే కాక, తన కుమార్తెలకు కన్నగి, మాధవి పేర్లు పెట్టి 'శిలంబు సెల్వర్'గా బిరుదుపొందినాడు.

8. ఆంగ్లంలో ఆర్. పార్థసారథి ఈ కావ్యాన్ని 'The tale of an anklet' గా అనువదించగా 1995 సాహిత్య అకాడమి అవార్డును, 1994 PEN అవార్డును, 1996 ఎ.కె. రామానుజన్ అవార్డును పొందింది.

9. తెలుగులో శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి గారు 1955లో శిలప్పదికారాన్ని 'కాలి అందియ కథ' పద్యకావ్యంగా రచించాడు. 1942లో వచ్చిన 'పత్ని'

చిత్రంలో ఋష్యేంద్రమణి, 'కన్నగి'లో కన్నాంబ ముఖ్యపాత్ర ధరించినారు. 1964లో కరుణానిధి మాటలు వ్రాసిన 'పూంపుహార్' చిత్రానికి ఆధారం శిలప్పదికారమే.

10. 'ఆఖరి వాక్యం వ్రాసినాక కావ్యాన్ని, విమర్శ తప్ప ఇంకేమీ అనుసరించదు' అన్నది కవి వాక్యం. శిలప్పదికారం కావ్యాన్ని వచనంలో వ్రాసినాక నాకూ ఆ మాట సత్యమనిపించింది.

| రాజు | చిహ్నం | విజయహారం | పట్టణం |
|---|---|---|---|
| **చోళులు** | **వ్యాఘ్రము (పులి)** | **అత్తిపూలు** | **పుకార్ (కావేరి)** |
| **పాండ్యులు** | **మీనము (చేప)** | **వేపపూలు** | **మధురై (మధుర)** |
| **చేరులు** | **ధనుస్సు (విల్లు)** | **తాటిపూలు** | **వంసి (కరూర్)** |

13-9-2013 నాడు **'అనంత'** గారు అత్యంత ప్రేమతో శిలప్పదికారం The story of an anklet by R. Parthasarathy పంపి అనువాదం చేయమని ఆదేశించినారు. 3-9-2014 నాటికి అనువాదం పూర్తిచేయగలిగాను. వారికి సర్వదా కృతజ్ఞుడిని. నాకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్న **ప్రొఫెసర్ జయదేవ్, ప్రొఫెసర్ సోమసుందరం** గార్లకు ఎప్పటికీ ఋణగ్రస్తుడినే.

సృజనలోకం ప్రచురించిన ఇలియాడ్ నుంచి ఫాస్ట్ వరకు అనేక అనువాద గ్రంథాలను, కావ్యాలను ఆదరించిన తెలుగు పాఠకులకు మరో కానుక ఈ శిలప్పదికారం.

**- డాక్టర్ లంకా శివరామప్రసాద్**



**కోవలన్** (కోవలుడు, గోపాలుడు) – యువవ్యాపారి

**కన్నగి** (కణ్ణగి) – కోవలన్ భార్య

**మగత్తువన్** (మగట్టువన్) – కోవలన్ తండ్రి

**మణైకన్** (మణైగన్) – కన్నగి తండ్రి

**మాధవి** – గణిక, నాట్యకత్తె, కోవలన్ ప్రియురాలు

**మణిమేఖల** – కోవలన్, మాధవిల కుమార్తె.

**చిత్రావతి** – మాధవి తల్లి

**వసంతమాలై** – మాధవి నెచ్చెలి

**మాదరి** – గోప వనిత

**కౌసిగన్** (కౌశికుడు) – మాధవి దూత

**మాదలన్** (మాదలుడు) – బ్రాహ్మణ యాత్రికుడు

**కవుంతి** (కౌంతి) – జైన సాధ్వి

**దేవంతి** (తేవంతి) – కన్నగి స్నేహితురాలు

**అయ్యాయి** – మాదరి కుమార్తె

**కొప్పెరిందేవి** – పాండ్యరాణి

**నెడుంజెళియన్** – పాండ్యరాజు

**సెంపియాన్** (కెంపియాన్) – చోళ ప్రభువు

**సెంగుట్టవన్** – చేర ప్రభువు

**ఇల్లంగొ ఆదిగళ్** – శిలప్పదికారం రచయిత

**శీతలై శాత్తనార్** – మణిమేఖలై రచయిత

**శిలప్పదికారం** – కాలి అందియ కథ.

**పుకార్** (పుగార్, పుహార్, కావేరి, పూంపుహార్) చోళ పట్టణము

**మధురై** (మధుర) పాండ్య పట్టణము

**వంజి** (వంసి, వంశి) చేర పట్టణము (కరూరు)

# ప్రస్తావన

"స్వర్ణ పుష్పకాంతుల శోభిల్లుతున్న
అద్భుతమైన వెంగై వృక్షఛాయన
ఒక పతివ్రతా శిరోమణి ఏక వక్షోజ రమణి
విషాద వదనంతో నిలబడి ఉన్న సమయాన
సమస్త దేవతా పరివేష్ఠితుడై అమరేంద్రుడు
భువిపైకి దిగివచ్చి ఆ లలనామణికి ఆమె ప్రియభర్త
దర్శనము గావించి, ఆమెను తమతో తమ లోకమునకు
తీసుకువెళ్లినాడు. నమ్మశక్యంకాని ఈ దృశ్యాన్ని
మేము మా విప్పారిన కనులతో వీక్షించినాము.
ఆ అద్భుత సంఘటనను తమకు విన్నవించుచున్నాము"–అన్నారు కురవలు.

అమరగిరులపై ఆవాసముండే 'కురవలు'
చేర ప్రభువు 'సెంగుట్టవన్' రాజుకు
విన్నవించిన విషయమిది.
రాజ్యాన్ని త్యజించి సన్యాసాన్ని స్వీకరించిన
'ఇల్లంగో' సోదరుడే ఆ సెంగుట్టవన్ ప్రభువు.
తూర్పుద్వారం వద్ద తమిళ మహాకవి శాత్తనార్,
ఇల్లంగో కవితో ఉన్న సమయాన – సెంగుట్టవన్ ప్రభువుతో

**శాత్తనార్ ఇలా వివరించినాడు–**
–"పుకార్ (పూంపుహార్) పట్టణాన జరిగిన గాథ యిది.
అత్తిపూలతో అలంకృతుడై
సర్వాలంకార శోభితుడైన చోళరాజ పట్టణమది.
సొగసులు వెన్నెలలా కురిపించే నాట్యకత్తె మాధవి
నిరుపమాన సౌందర్య లావణ్యాలకు ఆకర్షితుడై
కోవలన్ అనే ధనిక యువకుడు
తన యావదాస్తినీ ఆమెకర్పించి కడు పేదయైనాడు.
తప్పు తెలుసుకుని తిరిగి తన భార్య 'కన్నగి' వద్దకు

వచ్చి, ఆమెతో పాండ్యుల ప్రసిద్ధ నగరం మధురై
చేరుకుని మరల వ్యాపారం చేయ నిశ్చయించినవాడై
తన భార్య కాలి అందియ నొకటి తీసుకుని
ఆ నగరపు కంసాలికి విక్రయించ తలచగా, మోసగాడైన
ఆ కంసాలి ఆ అద్భుతమైన నగను పరీక్షించి
ఇది మహరాణికే అలంకరణయోగ్యమని పలికి,
అతడిని అక్కడే ఉండమని అర్థించి
రహస్యముగా పాండ్యరాజునకు వర్తమానము నందించినాడు.

***'మహారాణి కాలి అందియను దొంగిలించిన పరదేశి***
***నా గృహము వద్ద ఉన్నాడు. ఆతడే దొంగ'–***
విధివంచితుడైన కోవలన్‌కు ఆ క్షణమున
కర్మ పరిపక్వమై జీవన చక్రభ్రమణం సంపూర్తి అయినది.
వేపపూల కిరీటంతో వెలుగొందే పాండ్యరాజు
వేరు ఆలోచనే చేయకుండా వేగిరపడి
తన విశ్వాసపాత్రులైన భటులను ఆజ్ఞాపించినాడు–
***'ఆ దొంగను వధించి కాలి అందియను స్వాధీనం చేసుకోండి!'***

ఆ విధంగా కోవలన్ మరణించినాడు.
దుఃఖసాగరంలో మునిగిన ఆతని భార్య అనాథ అయినది.
ఆమె ఆగ్రహము మహాగ్నిజ్వాల కాగా
ఆమె పాతివ్రత్య శక్తి పాండ్యరాజుకు శాపమైనది.
ముత్యాలతో అలంకరించబడిన తన వక్షోజాన్నొకదానిని పెరికి
ఆమె మధురై నగరం వేపు విసిరింది.
క్షీరధారలు వర్షించాల్సిన వక్షోజము నుండి
అగ్నికీలలెగసి అవి మధురై నగరాన్ని భస్మీపటలం చేసాయి.
అందరూ కీర్తించే మహాపతివ్రత పత్ని (పత్తిని) గాథ ఇది."

ఇల్లంగో ప్రశ్నించినాడు– 'కోవలన్ కర్మ
పరిపక్వం చెందినదన్నావే? ఏవిటా కర్మ?'

శాత్తనార్ సమాధానమిచ్చినాడు,
'ఓ పావనుడా! సావధానంగా విను!
మచ్చలేని కాంతులతో ప్రకాశించే ప్రాచీన మధురానగరిలో
ఒకనాటి రాత్రి నేను శైవమందిరపు రజత ప్రాంగణంలో
బంగరు రేల పూలతో అలంకరించబడిన
జటాజూటధారి మహాశివుని సన్నిధానాన
విశ్రాంతి తీసుకొనుచుండగా ఈ విశేషాన్ని వీక్షించాను.
దుర్నిరీక్షమైన 'పత్తిని' ముందు ప్రత్యక్షమైన
మధురానగరపు సంరక్షక దేవత ఉప్పొంగుతున్న
దుఃఖమామెను వివశురాలిని చేస్తుండగా ఇలా పలికింది.
–"అమ్మా! భవదీయ వివృత వక్షోజ జనిత విస్ఫుటాగ్నులు
ఈ మధురానగరిని దహించగా నీ పూర్వజన్మ క్లేశములు నశించినవి.
గత జన్మలో నీవూ, నీ భర్త–
ప్రసిద్ధ సింగాపురపు వ్యాపారి సంగమన్ భార్యచే
శపించబడినారు–
ముడివేయబడని శిరోజాలు అలల్లా
కదుల్తాన్న ఓ లావణ్యవతీ! ఈనాటి నుండి
పధ్నాలుగవ రోజున నీవు నీ భర్త దివ్యరూపాన్ని
కాంచగలవు. అతడికి మానవ దేహంతో
అవసరం తీరినది"–

శాత్తనార్ కవి అన్నాడు–
'నేను విన్న ఈ మాటలు అక్షరాలా వాస్తవమైనాయి'.

ఇల్లంగో అప్పుడన్నాడు.
–'మనం ఒక అద్భుతమైన కావ్యాన్ని సృజిద్దాము.
ధర్మచ్యుతుడైన వాడు ప్రభువైనా
సరే శిక్షింపబడక తప్పదనే సత్యాన్ని
ప్రబోధించే మహత్తరమైన రచనకు నాంది పలుకుదాం!
ప్రసిద్ధ వ్యక్తులు 'పత్ని' సౌశీల్యాన్నిక పొగడుదురు గాక!
పరిపక్వము చెందిన కర్మభ్రమణం పూర్తి అగునని

ప్రజలు తెలియుదురు గాక!
ఈ కావ్యం 'శిలప్పదికారం' అనే పేరిట
'పాదమంజీర గాథ', 'కాలి అందియ కథ'గా గణుతికెక్కును గాక!

శాత్తనార్ అర్థించినాడు– "మహానుభావా! ఇల్లంగో!
ఈ కావ్యాన్ని రచించ నీవే సమర్థుడివి
చేర, చోళ, పాండ్య రాజులు ముగ్గురినీ వారి రాజ్యాల్నీ వర్ణించే
ఈ కథను అక్షరబద్ధం చేసి, లోకోపకారం గావించగలవు"


శాత్తనార్ కవి విన్నపాన్ని విన్నవాడై
ఇల్లంగో అదిగళ్ తన ప్రతిభా పాటవాల్ని రంగరించి
ఈ మహాకావ్యాన్ని పద్యగద్య సహితంగా మూడు పుస్తకాలు,
ముప్పది భాగాలుగా రచించినాడు. **'పుగార్ కాండం'** (పుస్తకం)
–ప్రశంసాగానం, గృహప్రవేశం, అరంగేట్రం,
సాయంకాలం, ఇంద్రపూజ, సముద్రస్నానం,
ప్రేమగీతాలు, వసంతకాలం, స్వప్నవృత్తాంతం,
పల్లె దృశ్యాలు – ఈ పది మొదటి పుస్తకం
'పుగార్'లోని భాగాలు.

రెండవ పుస్తకం **'మధురై కాండం'** లోని పదమూడు భాగాలు–
అటవీదృశ్యాలు, వేటగాళ్ల ఆటపాటలు,
నగరపు పొలిమేరలు, నగర సందర్శనం,
ఆశ్రయం, హత్యాప్రదేశము, గోపికా నృత్యం,
దుఃఖగుచ్ఛం, కన్నగి న్యాయపోరాటం,
ఆగ్రహజ్వాల, అగ్నికీలలు, వివరణ.
మూడవ పుస్తకం– **'వంసి కాండం'** లో
గిరిజనుల నృత్యం, శిలాన్వేషణ, శిల తరలింపు,
ప్రక్షాళన, విగ్రహప్రతిష్ఠ, స్తుతి, వరప్రసాదం – ఉంటాయని
మహాముని ఇల్లంగో చెప్పగా మధురై ధాన్యవ్యాపారి, కవి శాత్తనార్
విన్న మహాకావ్యపు తొలిపలుకులివి.

# మొదటి పుస్తకం

# పుకార్ (పుగార్) కాండం


1. ప్రశంసాగానం ........................................ 1
2. గృహప్రవేశం ........................................ 5
3. అరంగేట్రం ........................................ 10
4. సాయంకాలం ........................................ 16
5. ఇంద్రపూజ ........................................ 20
6. సముద్రస్నానం ........................................ 28
7. ప్రేమగీతాలు ........................................ 34
8. వసంతకాలం ........................................ 51
9. స్వప్న వృత్తాంతం ........................................ 56
10. పల్లె దృశ్యాలు ........................................ 59



**మాధవి**

# 1. ప్రశంసాగానం

వెండి వెన్నెలలు వెలయించు నెలరాజును స్తుతిద్దాం!
చల్లని, తెల్లని ఛత్రఛాయ క్రింద పుప్పొడితో నిండిన
పూలమాల ధరించిన చోళ ప్రభువులా అతడు
సస్యశ్యామలమైన భూమిపై కాంతి సరస్సులను ప్రకాశింపచేస్తున్నాడు.

ప్రజ్వలించే కాంతులతో పగటిని పరిపాలించే భానుడిని ప్రస్తుతిద్దాం!
కావేరి ప్రభువుల ప్రకటిత శాసనాల్లా అతడు స్వర్ణకిరీటధారియై
మేరు పర్వతాన్ని చుట్టి వస్తుంటాడు నిరవధికంగా!

ఎండ వేడికి తల్లడిల్లిన తల్లి నేలను చల్లబరిచే వరుణదేవుని ప్రార్థిద్దాం!
చోళ ప్రభువు రాజ్యంలా అతడికి సరిహద్దు ఉత్తుంగ
తరంగాల ఘోషతో ఉబికి పడే సముద్రమే!
వలసినప్పుడల్లా వర్షాల్ని కురిపించే వానదేవుడతడు.

సమస్త భోగభాగ్యాలతో శోభిల్లే పుకార్ నగరాన్ని పొగడుదాం!
చతురంబోధీ పర్యంత సామ్రాజ్యాధిపతులకు రాజధాని అది.
ఆ నగర ప్రశస్తి దూరతీరాలకు వ్యాపించగా
ఎందరో ప్రాచీన కుటుంబాలకు ఆవాసమైన నగరమది
పొటియల్ కొండల్లా, హిమాలయ పర్వత శ్రేణుల్లా
పావనులైన ప్రసిద్ధ వ్యక్తులతో అలరారే జనావాసమది.
జ్ఞానులు, బాటసారులు ప్రస్తుతించే పట్టణమది.

కీర్తిలో అమరావతికి, సుఖాలలో నాగలోకానికి,
సరితూగే ఈ నగరంలో వర్షమేఘంలా
ఉదారుడైన 'మణైకన్' అనే సద్వంశ సంజాతకునికి
అల్లారుముద్దుగా పెరిగినది, అపరంజి బొమ్మ,
బంగరు తీగెలాంటి కుమార్తె పన్నెండేళ్ల కన్నగి.
అంతటి సుకుమారిని, సౌశీల్యవతిని వలచినవాడు కోవలన్.

అందరు స్త్రీలు ఆమెను పొగిడేవారు.
“సాక్షాత్ లక్ష్మిస్వరూపమీ లావణ్యవతి.
అందంలో, రూపలావణ్యాలలో సాటిలేనిది.
అరుంధతిలా ఎటువంటి మచ్చ లేనిది”

అత్యంత ధనవంతుడైన మగట్టువన్ స్వస్థలమిదే!
తన రాజ్యంలోని ఉన్నత కుటుంబీకులలో పెద్దగా
ఆతడిని ఆ దేశ ప్రభువు గౌరవించేవాడు.
అడిగినవారికి లేదనకుండా సాయంచేసే అపర కుబేరుడతడు.

పదహారేళ్ల కోవలన్ అతడి ఏకైక కుమారుడు.
చిరుత ప్రాయంలోనే అతడి ఖ్యాతి నేల నలుచెరగులా విస్తరించింది.
చంద్రబింబాల్లా వెలుగుతున్న వదనాలతో
మధుర సంగీత స్వరద్రోణిని మరపించు మాటలతో
ఆ పురమందలి మహిళలు ఆతని గురించి గుసగుసలాడేవారు.
“అతడు మన్మధుడిలా అందగాడు.
మురుగన్‌లా అరివీర భయంకరుడు!”

వారి వివాహాన్ని రంగరంగ వైభోగంగా చేసేందుకు
పెద్దలు నిర్ణయించినారు శుభముహూర్తాన్ని.
నానా విధ రత్నహారములు దాల్చిన సొగసుకత్తెలు
గజరాజ పరివేష్ఠితలై నగరమెల్ల తిరిగి శుభవార్త చాటినారు.
చంద్రుడు రోహిణి నక్షత్ర గృహమునున్న రోజున
భేరీ వాయిద్యములు మ్రోగెను, శంఖధ్వనులుప్పొంగెను.
వెండి జలతారు శ్వేతఛత్రావళి నింగిని కమ్మెను.
రాజ వైభోగములను మించిన పెండ్లి ఊరేగింపుతో
పల్లకిలో పెండ్లి కూతురు తరలివచ్చెను.

ముత్యాల వరుసలున్న నీలిరంగు పట్టువస్త్రాలచే
అలంకృతమైన పెండ్లిపందిరి జగన్మోహనముగా నుండగా

వజ్రవైడూర్యాది మణిఖచిత స్తంభావళి
వివిధ విచిత్ర పతాకావిలంబిత తోరణ సహితమై
ఉన్న పెండ్లి మంటపం చూచువారలకు
నయనానందకరమై ఒప్పుగా ఆ ఆనంద సమయాన
కోవలన్ పెండ్లికుమార్తెతో అగ్నిహోత్రము
చుట్టూరా ఏడడుగులు నడచెను.

వేదవేద్యులైన పండితులు పెండ్లిమంత్రములు
చదువగా అరుంధతీ నక్షత్రంలా మచ్చలేని
ప్రకాశము గల కన్నగితో కోవలన్‌కు వివాహమాయెను.
ఆ వివాహమును వీక్షించినవారు తమ జన్మ ధన్యమైనదని భావించినారు.
అతిధులకు అప్సరల తలదన్ను సుందర కన్యలు పూలూ
తాంబూలములను అందించినారు. ప్రౌఢ యువతులు
మనోహరముగా గానము చేసినారు.
అతిలోక సుందరులైన అతివలు
కదలాడు సర్పముల వంటి కేశపాశము కలిగినవారు
అగరు, చందనం, కర్పూరాది సుగంధ ద్రవ్యములను
అందించినారు. వృద్ధ వనితలు పెండ్లిపందిరి
అంతటా కలయదిరుగుతూ, చిరునవ్వుల వాత్యల్యాలు
చిలికిస్తూ, దీపాలు చేతబూని, పాత్రలలో
కలశాలలో పలికాయి (స్వర్ణజాజి) చిగుర్లు,
మొగ్గలున్న నీళ్లను అతిధులపై చిలకరిస్తున్నారు.
చక్కగా ముడిచిన శిరోజాలలో అందమైన
పూలనలంకరించి బంగరువన్నె తీగెల్లా
నడయాడుతున్న లలనామణులతో
ఆ పెండ్లిపందిరి కళకళలాడ్తున్నది.
పూలరేకులను వర్షంలా కురిపిస్తూ వారు
కొత్త జంటను ఆశీర్వదించినారు.

"అంతులేని ప్రేమతో మీ ఇరువురి కరములు కలిసి మీకు
గాఢ పరిష్వంగ సౌఖ్యముల నొసగుగాక! ఏనాడూ
విడిపోకుండా, మీరిరువురూ కళంక రహిత జీవితము
గడుపుదురు గాక!"

ఆ తరువాత వారు 'కన్నగి'ని శోధనరాత్రి వేళ
శయన మందిరమునకు పంపినారు. శుభాశీస్సులు
తెలుపుతూ ఇలలోని అరుంధతియైన ఈ చిన్నారిని
ఆమె భర్త వద్దకు చేర్చి వెడలినారు.

✤✤✤✤✤

మంచుకొండల కనుబొమలపై అలరారే వ్యాఘ్ర పతాక
స్వర్ణ శిఖరాగ్రాన శాశ్వతంగా ఎగురును గాక!
ప్రచండోగ్రశూలాన్ని చేతబూనిన సెంపియాన్ ప్రభువు
విజయ రథచక్ర వీర విహారాలకు అడ్డులేకుండును గాక!

✤✤✤✤✤



# 2. గృహప్రవేశం

సమస్త భోగభాగ్యాలు కలిగిన మహాప్రభువులు కూడా,
సముద్ర వర్తకంలో రాణించిన పుకార్ పట్టణ వ్యాపారుల
ధన సంపాదనకు అసూయ చెందేవారు. నౌకలు,
కాలిబాటన వచ్చేవ్యాపార శ్రేణులు దేశ విదేశాల నుంచి
వచ్చి పుకార్ పట్టణాన విడిది చేసేవి.
అపురూపమైన వస్తువులతో, వివిధ రకాల సరకులతో
వీధులు జనసమ్మర్ధమై ఉండేవి.
ప్రళయోగ్రంగా గర్జించే సముద్రపు తీరమే కావలి కాగా
ఆ నగర సంపదలు అత్యంత రక్షణను పొందేవి.
పద్మనేత్రి అయిన కన్నగి, కోవలన్ జంట అదృష్టవంతులు.
ఉన్నత వంశ సంజాతలు, అంతులేని సంపదలకు వారసులు వారు.
ఉత్తర కురురాజ్యంలా పుకార్ పట్టణ ప్రజలు అంతులేని
సంపదలతో పాటు పవిత్ర కర్మకాండల పట్ల నిబద్ధతను
కలిగి ఉండేవారు.

మగట్టువన్ విశాల భవనంలోని పడకగది
సాక్షాత్ మయశిల్పి నిర్మితమైనట్లు అత్యంత
సుందరంగా ఉన్నది. కాంచన మణిమయ
తల్పమాగదిలో సర్వాంగ సుందరమై శోభిల్లుతూ
నూతన వధూవరుల ఆగమనం కోసం నిరీక్షిస్తున్నది.
దక్షిణపు గాలి వారినాహ్వానిస్తూ పంపిన
తుమ్మెదల బృందం గవాక్షపు తలుపులను,
నాలుగు వరసల ముత్యాల తెరల పొరలను దాటి
లోనికి ప్రవేశించి ఝుంకారనాదాన్నాలపిస్తున్నది.
ఎరుపు, నీలి కలువల సుగంధంతో గాలి
పరిమళభరితమై ఉన్నది.
నీలి పద్మాలు వికసించినవి కొన్ని
సగం వికసించినవి కొన్ని, వాటితో తుమ్మెదలు
సరాగాలాడుతున్నవి.

కొండ మల్లెలు తమ తెల్లని రేకులను విప్పి సువాసనలను వెదజల్లుతున్నవి.
అవి సంపెంగపొదలు. అటనున్నది మాధవీలత
తుమ్మెదలు మకరందాన్ని త్రావగా విచలితలైన పుష్పాలు
ఆ అందాలరాశి కురులలో సేదదీరుతున్నవి.

వారిరువురు ఒకరి కౌగిలిలో మరొకరు ఒరిగి
భవనపు పై ఆవరణకు చేరుకున్నారు.
నీలాకాశమే పైకప్పు కాగా, పూర్ణచంద్రుడే దివ్వెకాగా
ప్రేమసామ్రాజ్యపు ప్రభువు అనంగుడు తన పుష్పబాణాలను
సంధిస్తుండగా వారు మన్మధ సామ్రాజ్యానికి అభిషిక్తులైనారు.
వారి శయ్యపై మనోహరంగా అలంకరించబడిన
పూదండలలోని పుష్పమకరందాన్ని త్రావి తుమ్మెదలు
మత్తెక్కి తూగుతూ ఝుంకారనాదాల్ని చేస్తున్నాయి.
అందమైన కన్నగి భుజాలపై, స్వర్ణకాంతులీనుతున్న
చెరకు గడను విల్లులా వంచి, కోవలన్ ఆమెను
రతీదేవిలా రమణీయంగా రంజిల్ల చేసినాడు.
సూర్యచంద్రు లిరువురు ఒకేచోట ఉన్నట్లున్నదా దృశ్యం.
ఈ సమస్త ప్రపంచాన్ని రాత్రింబవళ్ల నభోదీపాలు
తమ కాంతుల వర్షాలతో తడుపుతుండగా
సముద్ర జలాలు అలలు అలలుగా పైకెగసి పడ్తున్నవి.
అరవిరిసిన మల్లెదండ నతడు ధరించగా అది వెన్నెలలు
వెదజల్లుతూ ప్రకాశిస్తున్నది.
ఎరుపు ఊదారంగు నీటి కలువలను దండలుగా ఆమె ధరించి
మరుని విరిబాణములను మరింత ప్రజ్వలింపజేస్తున్నది.
వారి కౌగిలింతలకు ఆ పూలదండలు
ఒకదానితో ఒకటి కలిసి చిక్కుముడులు పడుతున్నవి.
ఎంతకీ తగ్గని ఉద్వేగంతో కోవలన్ తన ప్రియురాలి
ప్రకాశవంతమైన వదనంలోకి చూస్తూ ఇలా పలికాడు–
తన మనసులోని మాటను వెల్లడించినాడు.

"సమస్త దేవతావందితుడైన పరమశివునికి వందనం!
అతడి జటాజూటం నుంచి జారిపడిన చంద్రవంక
ఎప్పుడు నీ వదనమై భాసిల్లినదో చెప్పగలవా కన్నగీ!
లేక, చంద్రుడు నీ తోడబుట్టినవాడా?
మరి అనంగుడైన కాముడు తన చెరకు వింటిని
నీకివ్వగా అవి నీ కనుబొమలుగా రూపుదిద్దుకున్నాయా!
యుద్ధంలో ఓడిన శత్రువులు తమ ఆయుధాలను
విజేతకు సమర్పించినట్లు అవి నీ వశమైనవా!
అమరులను రక్షించే వజ్రాయుధాన్ని ఇంద్రుడు
వర్జించగా అది నీ సన్నని తనూ మధ్యగా తరలివచ్చినదా!
అమృత మంథనానికి ముందే జనించిన అప్సరకన్యవా నీవు!
షణ్ముఖుడైన మురుగన్ దేవుడితో నాకు తగాదా లేదు.
అతడు తన ప్రచండ శూలాన్ని నీ కనుదోయిగా మార్చి ఒసంగినాడు–
నేను ఈ బాధతో విలవిలలాడ్తుండగా చూసి
ఎంత ఆనందిస్తున్నాడో చూడు!

నీ అందానికి తలవంచి ప్రశస్తమైన వన్నెచిన్నెల
ఆ నెమలి అడవి పొదల మధ్య అదృశ్యమైనది.
నీ సొగసైన నడకను చూసి రాయంచ సిగ్గుపడి
తామరపూలతో నిండిన తటాకపు నీళ్లలోకి తరలిపోయినది.
మధుర మంజుల భాషణాలను పలికే రామచిలుకలు
వేణువీణా నాదపు అమృత స్వరాలను మించిన నీ మాటలు విని
నిశ్శబ్దం పాటించినాయి.
ఓ ప్రియురాలా! నీ మృదుపాణి నలంకరించిన
నీలి కలువ చాలదా, వేరు ఆభరణాలేల?
నీ శిరోజములకున్న సహజ గంధము చాలదా,
ఇన్ని పుష్పాలదండలేల?
మామూలు గుగ్గిలపు సువాసనలు చాలవా!

ఘూటైన కస్తూరి పరిమళాలేల?
శీతల చందనపు లేపనము చాలదా నీ వక్షోజముల
నిలువ, ముత్యాలసరాల బరువులేల?
సుకుమారివైన నీపై ఎవరు మోపినారీ ఏడువారాల నగలు?
ఆభరణ భారాన వంగిన నడుము, బాధతో స్వేదంతో
కందునని ఎరుగరా?
తుమ్మెద రెక్కల వర్ణాన్ని మరపించు శిరోజములున్న ప్రేయసీ!
నీవు సజీవ స్వర్ణ శిల్పానివి.
దక్షిణావృతమైన శంకువులో లభించిన మేలి ముత్యానివి.
ప్రశంసలకందని పరిమళానివి.
ఇక్షురసం, తేనెలను మించి, మాటలకందని మధుర సుధా ప్రవాహానివి.
జీవాన్నిచ్చే అమృతానివి.
వర్తకుల యువరాజు గారాల పట్టివి.
మరల మరల నేను చెబుతున్నాను నీవు వెలకట్టలేని
మరకతానివి. ఏ గనులలో దొరకని అమూల్యమణివి.
ఏ సముద్ర మథనంలో జనించని అమృతానివి.
ఏ వీణా, వేణువు పలికించని అతిలోక రాగానివి"–

ఈ విధంగా అతడు ఎన్నో విధాలైన ప్రశంసలు కురిపించినాడు.
మత్తెక్కించే సువాసనలు వెదజల్లుతున్న పూదండల
మధ్య వారు రతీ మన్మధుల్లా కాలం గడిపినారు.

సద్గుణవతి, సాధ్వి అయిన కోవలన్ మాతృమూర్తి
అందమైన శిరోజాలతో అలరారే కన్నగిని
విశ్వాసపాత్రులైన సేవకులు, వెలకట్టలేని సంపదలు
ఉన్న గృహానికి యజమానురాలిగా చేసినది.
పెద్దల మనసెరిగిన కన్నగి అనుభవమున్న
గృహస్థురాలిగా బంధుమిత్ర పరివారమును, సాధుసంతులను

ఆదరిస్తూ మంచి గృహిణిగా ఊరూవాడా ప్రశంసించే విధంగా
అచిరకాలంలోనే ఆ దేశాన ప్రసిద్ధికెక్కినది.

ప్రేమాతిశయాన నాగుల జంట మెలిచుట్టుకునే విధాన
ప్రేమ సామ్రాజ్యాధిపతులు రతీమన్మధులు ఒకరి కౌగిలిలో
ఒకరు ఒరిగిన విధాన,
కోవలన్, కన్నగిలు సుఖ సంతోషాల ఓలలాడుతూ
ఒకరికొకరు తోడునీడగా హాయిగా సుఖిస్తున్నారు.
'ఈ భువిపై జీవించే ఈ కొద్దికాలాన్ని
ఆనందంగా అనుభవిద్దామనుకుంటూ
ఒకరి కౌగిలిలో ఒకరు ఒరిగి పోతున్నారు'–

*****



# 3. అరంగేట్రం

మహా తపశ్శాలి అగస్త్య మహాముని ఒకనాడు
ఇంద్రకుమారుడు జయంతుడిని, అతడి ప్రియురాలు
ఊర్వశిని శపించినాడు. ఆనక తన సమ్మోహనకరమైన
నాట్యంతో అందరినీ అలరించిన ఊర్వశి కళాకౌశల్యానికి మెచ్చి
శాపాన్ని ఉపసంహరించుకున్నాడు.
ఆ అప్సరసల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న
నాట్యమయూరి, చతుష్షష్ఠి కళలలో ప్రవీణురాలు మాధవి.
కళంకం లేని జన్మచరితం, అందమైన అవయవ సౌష్ఠవం,
కెరటాల్లా ఎగసిపడే వంపులున్న శిరోజాలు
కొప్పులో అలంకరించుకున్న పూల నుండి రాలే పుప్పొడి వర్ణాలు,
అద్భుత పద విన్యాసంతో చూపరులను కట్టిపడేసే నడకలు
ఆమె స్వంతం.
ఏడేళ్లు ఆమె కఠోర శ్రమ చేసి నేర్చుకున్నది.
నృత్యగాన సంగీతాల్ని, అవి ఆమె అందాలకు మరింత శోభనిచ్చినవి.
ద్వాదశ వర్ష ప్రాయంలోనే ఆమె వీరాధివీరుడైన
మహరాజు సమక్షాన తొలి నాట్య ప్రదర్శన ఇవ్వదలచినది.

ఆమె ఆచార్యుడికి తెలియును,
శాస్త్రీయ జానపద నృత్యరీతుల్లో పోలికలు, భేదాలు,
ప్రజారంజక జాతీయము, పొదువియల్–పురం,
రాజోచిత చైత్రము (వెట్టియల్–ఆకమ్)
నృత్యగాన సమ్మిళితాలైన రీతుల్ని ఆతడు రూపొందించినాడు.
పరంపరాగతమైన పదునొకండు నృత్యాలలో ప్రవీణుడాతడు.
అద్భుతమైన పాటలు, ప్రతిధ్వనించే మృదంగ ధ్వనులు
వాచికం, గానం, అభినయం, అభివ్యక్తీకరణం, ఆంగికం
హస్తముద్రలు, ఏకహస్త, ద్విహస్తముద్రాభినయం
ఇవన్నీ కొట్టిన పిండి ఆతడికి.
కురవాయి, వారి నాట్యరీతులలోని భేదాలు
స్వచ్ఛమైన సహజమైన అభివ్యక్తీకరణకూ,
కృత్రిమ నటనకూ తేడాలు, సంస్కరణలూ తెలియును.
వీణా, వేణు వాయిద్యాలలో నిపుణుడతడు.

చక్కని గొంతుతో మృదంగ ధ్వనుల్నే చిన్నబుచ్చగలవాడు.
ఈ ధ్వనులన్నిటిని అతడు నాట్యరీతులతో జతపరచినాడు.
టెసికమ్ సంగీతపు రహస్యగతుల, సంగతుల నెరుగునతడు.
సంగీత శాస్త్రమునందు వర్ణించిన పద్ధతులన్నీ తెలిసినవాడు.
వివిధ రకాల నాట్యరీతులను విభజించి,
సంగీత సాహిత్యాలను సమ్మేళనపరచి
వాటిని రచించిన సంగీత కర్తల అభిప్రాయలకనుగుణంగా
మెరుగు పరచినవాడతడు.

సముద్రమే హద్దులుగా కలిగిన
తమిళ దేశమందు ప్రసిద్ధికెక్కిన కవిపండితుడామె మిత్రుడు.
నాటక రంగంలోని వెట్టియల్ (శుద్ధనృత్యం–శాంతి)
పొదువియల్ (పాటతో నృత్యం–వినోది)
విభాగాలపై సాధికారత గలవాడతడు.
సంగీత విద్వాంసుడిగా కావ్యమాధురి ఎరిగినవాడు.
సంగీత శాస్త్రపు నిబంధనలు తెలిసినవాడు.
తన ప్రతిద్వంద్వుల బలహీనతలను, లోపాల్ని గ్రహించి
తన రచనలలో అవి ప్రతిబింబించకుండా జాగ్రత్త వహించే
నేర్పుగలవాడు.

ఆమె మృదంగ విద్వాంసుడు ఉత్తమశ్రేణికి చెందినవాడు.
సంగీత గతులలో, గానంలో, తమిళ దేశ సంప్రదాయాల్ని
పాటించడంలో, భాషలో, మాధుర్య రీతిలో, గమకంలో,
నడకలో, వివిధ పదాల వాడుకలో నేర్పరి ఇతడు.
ప్రదర్శనలో లోపాల్ని పసిగట్టగలడు.
ఏక శబ్దాల్ని, ద్వంద్వాల్ని, రెంటినీ ఏకకాలమందు, వేరుగా
వినిపింపజేస్తూ, పక్కవాద్యాలైన వీణ, వేణు
నాదాలో – నేర్పుగా మిళితమొనర్చగలడు.
వేలి కొనలతో మృదంగ ధ్వనులను శాంతపరచి
సహవాయిద్యాల శబ్దాల్ని వినిపింపచేసినా
అవసరమైనప్పుడు ప్రచండ వర్షమేఘ ధ్వనులను
తన మృదంగం నుంచి సృష్టించి అన్ని వాద్యాల ధ్వనులను
అవనతం చేయగలడు.

వేణువునూదే వాయిద్యకారుడు ఆమెకు సైదోడు
పారంపర్య సంగీతంలో ఘనాపాఠి
వీనులకింపుగా మృదు మధుర ధ్వనులను సృష్టించగలడు.
నాలుగు రకాల స్వర కంపనాలు తెలిసినవాడు.
స్వరస్థాయీ బేధములను గ్రహించి మొదటి, అయిదవ
స్థానాలను అధిగమించి తబలా ధ్వనులతో అన్వయింపగలడు.
అయిదయిదు వరుసలలో రాగాలను వేణువుపై పలికిస్తూ
గాయకుని అనుసరిస్తూ, గానాన్ని అనుకరిస్తూ
మెరుగుపరుస్తూ, రాబోయే సంగతుల్ని ఊహించగలవాడు
స్వరములను అలవోకగా పలికిస్తూ వేణువుపై
అతిలోక గానాన్ని చేయగల సమర్థుడాతడు.

ఆమె వైణికుడు రాగాల మాంత్రికుడు.
సప్తస్వరాలు, పధ్నాలుగు స్థాయీ బేధాలు,
మొదటి స్వరపు అవరోహణ నుంచి
ఏడవ స్వరపు ఉచ్ఛస్థాయికి ఆరోహణం చేస్తూ
మూడవ స్వరాన్ని వినిపించగలడు.
ఏడవ స్వరాన్నుంచి దిగివస్తూ తృతీయ స్వరాన్ని
ఆరవ స్వరాన్ని ఉద్దీపనం చేసి తృతీయ స్వరంతో మిళితం చేయగలడు.
అలా అన్ని స్వరాలలో నూతన పోకడలను రావించగలడు.
వీణకున్న పదునాలుగు తంత్రులపైన రాగాలు సృష్టించి
నాలుగవ స్వరపు మంద్ర స్థాయి నుంచి తృతీయ స్వరపు
ఉచ్ఛస్థాయికి చేరుతూ సెంపలయి గానాన్ని
నవ్యరీతులలో పలికించగలడతడు.

| తెలుగు | తమిళము | మంద్ర | మధ్య | తార |
|---|---|---|---|---|
| 1. షడ్జమం | శెంబాలై | మపదని | సరిగమపదని | సరిగ |
| 2. నిషాదం | పడుపాలై | గమపద | నిసరిగమపద | నిసరి |
| 3. ధైవతం | శెవ్వరిపాలై | రిగమప | ధనిసరిగమప | ధనిస |
| 4. పంచమి | అరుంబాలై | సరిగమ | పదనిసరిగమ | పదని |
| 5. మాధ్యమి | కొడిపాలై | నిసరిగ | మపదనిసరిగ | మపద |
| 6. గాంధారం | విళరిపాలై | దనిసరి | గమపదనిసరి | మపద |
| 7. రిషభం | మేర్చంబాలై | పదనిస | రిగమపదనిస | రిగమ |

ఆ విధంగా తృతీయ స్వరం నుంచి పటుమలయి,
ద్వితీయ స్వరం నుంచి సెవ్వలి, ప్రథమ స్వరం నుంచి ఆరమ్
ఏడవ స్వరం నుంచి కొటి, ఆరవ స్వరం నుంచి విలారి,
అయిదవ స్వరం నుంచి మెర్సెమ్ రాగాలను సృజించినవాడు.

వీణలో స్వరస్థాయి ఎడమనుంచి కుడికి తగ్గుతుంది.
వేణువులో కుడినుంచి ఎడమకు తగ్గుతుంది.
వైణిక విద్వాంసుడు మంద్ర, తార, మధ్యమ స్థాయిలను
సమ్మేళనము చేసి వీనుల కింపైన రాగాలను పలికించగలడు.

ప్రదర్శన కనువైన స్థలం ప్రత్యేక శ్రద్ధతో నిర్ణయించబడినది.
నేలలోని మట్టి స్వభావాన్ని అంచనా వేసి
వాస్తు దోషం లేకుండా వేదికను నిర్మించినారు.
రెండు కణువుల మధ్య ఇరవై నాలుగు అంగుళముల
దూరమున్న వెదురు కర్రలను పవిత్ర వనాల్నుంచి
వెదకి తెచ్చినారు. ఎనిమిది కణుపుల పొడవు
(పదహారు అడుగులు), ఏడు కణుపుల వెడల్పు
(పదునాలుగు అడుగులు), ఒక కణుపు ఎత్తు
(రెండు అడుగులు) ఉన్న వేదిక.
రెండు ప్రధాన ద్వారములు అనువైన చోట్ల ఉన్నాయి.
నాలుగు కణుపులు (ఎనిమిది అడుగులు)
మూల వాసాలకు వేదికకు మధ్య దూరం.
దేవతా మూర్తుల విగ్రహాలు వేదికపై ఉంచబడినాయి.
పూజలు, స్తోత్రాలు నిరవధికంగా సాగుతున్నాయి.
ప్రకాశవంతమైన దీపాలు ప్రజ్వలిస్తూ వేదికపై
స్తంభాల నీడలు పడకుండా వెలుగుతున్నాయి.
ప్రధాన తెర, పక్క తెరలు తాళ్లతో లాగడానికి అనువుగా ఉన్నాయి.
అందంగా చిత్రించబడిన వేదిక పైకప్పు వస్త్రము నుంచి
ముత్యాల సరాలు, పుష్పగుచ్ఛాలు,
రంగురంగుల పూలదండలు వేలాడ్తున్నాయి. అద్భుతమైన
నిర్మాణ శైలిని, పనితనాన్ని పుణికి పుచ్చుకుని, రమణీయంగా
ఉన్నదా వేదిక. ధగద్ధగాయమానంగా మెరుస్తున్న శ్వేతఛత్రము

నకు ఉన్నది పరాజితులైన రాజుల వద్ద నుంచి
సంగ్రహించిన రాజదండం. స్వచ్ఛమైన మేలిమి బంగారపు
రేకులతో తాపడం చేయబడిన ఆ దండానికి నవరత్నాలు అత్యంత
రమణీయంగా అలంకరించబడినవి. ఇంద్రుని కుమారుడు
జయంతుడి చిహ్నమైన ఈ శ్వేతఛత్రాన్ని చోళప్రభువులు
తమకు రక్షగా భావించి పూజిస్తారు. ఎవరైనా నాట్యగత్తె
అరంగేట్రం చేసే సమయాన ఆమె ఆ శ్వేతఛత్రానికున్న
దండాన్ని స్వర్ణ కలశంలోని పవిత్ర జలాలతో శుద్ధిచేసి, పూలమాలలతో
అలంకరించి దానిని స్వర్ణాభరణాలతో శోభితయైన ఆస్థాన
మదగజమైన పట్టపుటేనుగుకు అర్పిస్తుంది.
శుభసూచకంగా, మంగళవాయిద్యాలు మోగి అన్ని దిక్కులా
ప్రతిధ్వనిస్తాయి. మహారాజు తన పంచమాంగదళాలతో
సలహాదారులతో విచ్చేసి రథం చుట్టూరా ప్రదక్షిణం చేసి
ఆ పవిత్ర దండాన్ని భక్తిశ్రద్ధలతో రథంలో ఆసీనుడైన ఆస్థాన కవికి
అప్పగిస్తాడు. రాజు మదపు టేనుగుపై నెక్కగా ఊరేగింపుతో
అందరూ నగరపు రాజవీధులందు తిరిగి నాట్యవేదిక
వద్దకు వచ్చి ఆ శ్వేత ఛత్రాన్ని ప్రతిష్ఠిస్తారు.

వాయిద్యకారులు తమకు కేటాయించబడిన స్థలాల్లో కూర్చున్నారు. మాధవి కుడికాలు ముందుపెట్టి వేదికపైకి ప్రవేశించింది. కుడివేపున ఉన్న స్తంభం వద్ద శాస్త్ర సమ్మతమైన రీతిలో నిలబడింది. ఎడమ వేపు ఉన్న స్తంభం వద్ద సహచరులైన నాట్యగత్తెలు నిలబడినారు. ఆ విధంగా సుగుణాలు వెల్లువగా ప్రవహించి వక్రదృష్టి, కీడు తొలగిపోతాయని విశ్వాసం. రెండు రకాల పాటలు దేవతాస్తుతి పూర్తికాగానే సకల వాయిద్యాలు ఒక్కుమ్మడిగా మ్రోగినాయి. వేణువును వీణ అనుసరించింది. మద్దెల చప్పుడు వీణాధ్వనులతో సుమధురముగా మిళితమైనది. కుంభ వాయిద్యం మృదంగ నాదాల్ని అనుసరించి, ఎడమవేపున ఉన్న తబలా చప్పుడులో కలిసి ప్రవహించింది. అన్ని వాయిద్యముల ధ్వనులు కలిసిన సంగీత ప్రవాహమది. రెండు దరువులు ఒక్క మృదంగనాదంగా, పదకొండు నాదధ్వనులు ఆ పవిత్ర ప్రదేశాన ప్రతిధ్వనించాయి. శాస్త్రోక్తంగా జరిగిన ప్రారంభ నృత్యం ఆ తరువాత పాలయి రీతిలో మంద్రంగా వినసొంపుగా పాడిన శుభగీతం అందరినీ అలరించినది. పాటలోని నాలుగు విభజనలు

(అతీతము, అనాగతము, సమము, విషమము) మాధవికి కంఠోపాఠమే. మూడు చరణాలతో ప్రారంభించి ఒక దానితో ముగించి అయిదు తాళములకు (రూపక, ఝంప, త్రిపుట, అట, ఏక) అన్వయింపచేసింది. ఆ తరువాత ఆమె వరామ్ పాటలకు నృత్యం చేసి, శాస్త్రీయ జానపద నృత్యాలను సమ్మిళితం చేసి నయనానంద కరంగా నర్తించింది. కదలాడ్తున్న బంగరు తీగెలా ఆమె తన రూపలావణ్యాలతో సభికులను కట్టి పడేసినది.

ప్రజారక్షకుడైన ప్రభువు పరమానందభరితుడై ఆమెకు సుందరమైన పూలమాల ఒక వేయి ఎనిమిది బంగరు తునకలున్న దానిని, బహుమతిగా ఇచ్చి సత్కరించినాడు. జయంతుని శ్వేతఛత్ర దండాన్ని చేబూని వచ్చి తొలి నాట్యప్రదర్శన ఇచ్చిన నర్తకీమణికి ప్రభువులు ఇటువంటి కానుకను ఇచ్చుట తరతరాల సంప్రదాయమే. మాధవి ఆ దండను తన లేడికళ్ల గూని చెలికత్తెకు ఇచ్చి నాలుగు వీధుల కూడలిలో నగర ప్రముఖులు నడయాడే చోట నిలబడి, ఆ దండను విక్రయించమన్నది.

**'వేయి ఎనిమిది స్వర్ణ శకలాలున్న అద్భుతమైన పూలమాల ఇది. ఎవరైతే ఈ మాలను సరసమైన ధరకు కొనగలరో అతడు స్వర్ణలతాంగి అయిన మాధవికి భర్త కాగలడు'–**

కోవలన్ విన్నాడు. అందరికన్నా ఎక్కువ ధనమిచ్చి ఆ దండను కొన్నాడు. మాధవిని గెలుచుకున్నాడు. మాధవి పరిచారికతో కలిసి ఆమె గృహాన అడుగు పెట్టినాడు. ఆ నాట్యమయూరి క్రీగంటి చూపుల ఇంద్రజాలంలో తన వృత్తినీ, చెలికాండ్లనూ, ఇంటినీ, చివరకు భార్యనూ మరచిపోయినాడు.

బంగరు గాజులు తొడిగిన నాట్యమయూరి
కావేరీ పూంపుకార్ నగరానికి చెందిన మాధవి
తన నాట్యంతో నేల నలుచెరగులా ప్రసిద్ధికెక్కినది.
సంఖ్యలు, అక్షరాలు, అయిదు రకాల తమిళ సాహిత్యరీతులు,
సంజ్ఞలు, నాలుగు గాన విభాగాలు,
పదకొండు రకాల నృత్యరీతుల్ని పుక్కిటపట్టిన
విదుషీమణిగా ఆమె ఖ్యాతి దినదిన ప్రవర్ధమానమైనది.

✤✤✤✤✤

# 4. సాయంకాలపు వర్ణన

"ఈ సమస్త భూమండలంపై తన తేజోకిరణ రాశిని కురిపిస్తూ, అసమానమైన ఏకచక్ర రథాన పయనిస్తూ ఈ ప్రపంచాన్ని పరిపాలించే సూర్యనారాయణుడీ నాడు కానరాడు. తన చల్లని వెన్నెల కాంతులతో భూమ్యాకాశాలను రజతమయం చేసే అందాల యువరాజు రాకా చంద్రుడూ అగుపించడీనాడు? ఏడీ అతడు? ఎక్కడున్నాడో?"

తనను సంరక్షించే పెనిమిటి జాడ కానరాక దుఃఖ వదనయై ఉన్న భూదేవి తన వదనాలైన నాలుగు దిక్కులూ చిన్నబోయినా, ఉత్తుంగ తరంగాలతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న నీలిసముద్రమే అంచులుగా ఉన్న ప్రకృతి తనకు వస్త్రమై ఆచ్ఛాదన కాగా గంభీరంగా మహరాణీలా కన్పట్టుచున్నది. కెంపుల్లా ఎర్రబడిన ఆమె కన్నుల నుంచి అశ్రువులు ముత్యాలై ప్రవహిస్తున్నవి. అసహాయ శూరులు, అరివీర భయంకరులైన సైన్యంతో రాజు శత్రుదేశంపై దండయాత్రకు వెడలగా, రాజద్రోహి అయిన నగర సంరక్షకుడు, తన తోటి తిరుగుబాటుదార్లతో రాజ్యాన్ని ఆక్రమించి ప్రజలపై అధికమైన పన్నులు వేసి క్రూరంగా పాలన చేస్తున్నపుడు దుఃఖితులైన ప్రజలు తమ తలలపై చేతులుంచుకుని విలపిస్తూ భయంతో వణుకుతున్నట్లు, భూదేవి ఆపాదమస్తకం కంపించిందా అన్నట్లు ఆ సాయంకాలం– పురాతన నగరమైన పూంపుహార్‌పై తుఫానులా విరుచుకుపడింది. భర్తల నుంచి దూరమైన పతివ్రతా శిరోమణులకు దుఃఖకారణంగా, ప్రియుల కౌగిళ్లలో ఒరిగిన జవరాళ్లకు ఆనందకారకంగా పరిణమించింది. గోపాలురు తమ వేణువులపై విరహ గీతాల్ని గానం చేసారు. తుమ్మెదలు మల్లెలపై వాలి మకరందాన్ని దోచుకుంటున్నాయి. అరవిరిసిన మొగ్గలను అలరిస్తూ దక్షిణపుగాలి వాటిలోని ఆరు కాళ్ల తేనెటీగల్ని అదిలించి, ఆ సుంగధ మరందాన్ని నగర వీధుల్లోకి మోసుకుపోతున్నది. రంగురంగుల గాజులు తొడుక్కున్న ప్రమదలు తమ కోమల హస్తాలతో ప్రమిదలను వెలిగిస్తున్నారు.

పశ్చిమాకాశాన ప్రభవించిన నెలవంక సాయంకాలమనే వీరుడిని ఓడించి సాగనంపుతున్నది. వెన్నెల కిరణాల్ని కురిపిస్తూ నెలరేడు అంబరపు మీనాలైన నక్షత్రాల రాజు తన తెల్లని శీతాంశువుల్ని నేలపై వెదజల్లుతున్నాడు.

మాధవి శయనమందిరంలోని పట్టెమంచం గృహప్రాంగణంలో పెరిగిన మల్లెరేకలతో, బొండుమల్లెలు, విరజాజులు, మరియు అనేక రకాల పూలతో అలంకరించబడి ఉన్నది. ఆమె ప్రేమద్వీపాన్ని కప్పివుంచిన పగడాల వడ్డాణం, నడుమును దాచి ఉంచిన పలుచటి పట్టువస్త్రం దారి తప్పుకుని ఆ స్వర్ణలత అందాల్ని సహజసిద్ధంగా బహిర్గత పరచినవి. రాజహంసలా ఆమె వెన్నెల నిండిన ఆవరణలోకి, కోర్కెలు ఉబుకుతున్న హృదయంతో లలితంగా అడుగులు వేస్తూ– ప్రణయోత్కంఠతతో వేచిచూస్తున్న ప్రియభావుకుడు కోవలన్ ఒడిలో ఒదిగిపోయినది. కాసేపు ప్రేమయుద్ధం, కాసేపు చిలిపి జగడం, కాసేపు ఓరచూపు, కాసేపు బుంగమూతి, వెంటనే మరలా మరింత ఉద్రేకంతో అతడి ఎదపై వాలిపోవడం యిలా ఆ ఇరువురూ ప్రేమ సముద్రంలో తన్మయులై మునిగిపోయినారు.

ఆ సాయంకాలం మాధవి ఒక్కతేకాదు, ఆమె వంటి అనేకమంది ప్రియాంగనలు, పద్మదళాక్షులు తమతమ ప్రియుల కౌగిళ్లలో ఆనంద పారవశ్యాల ననుభవించినారు. చల్లని దక్షిణపు గాలి ఉద్రేకపు వేడిని ఉపశమింపజేసినది. తూర్పు కొండలలో లభ్యమయ్యే నల్లని గుగ్గిలం, సాంబ్రాణి, పడమటి కనుమలలో దొరికే తెల్లని కర్పూరపు సువాసనాధూమాలతో ఆ ప్రదేశమంతా పరిమళ భరితంగా ఉన్నది. దక్షిణ పర్వతాల నుంచి తెచ్చిన చందనపు చెక్కలను ఉత్తరపు కొండల్లో దొరికే నల్లని గుండ్రటి రాతి చెక్కపై అరగదీసి ఆ గంధాన్ని అక్కడి యవ్వనవతులు తమ శరీరాలపై పులుముకున్నారు. లేత ఆకులు, పూలతో ఎర్ర తామర కాడలతో చేయబడిన పూలమాలలను ధరించగా ఆ వివిధ వర్ణశోభితమైన పుష్పాల నుంచి రాలిన పుప్పొడి వారిపై వింత వింత ఆకృతుల చిత్రాలను గీస్తున్నది. నీలికలువ పుష్పాల మధ్య నీటైన ముత్యాల వరుసలు నిగనిగలాడుతుండగా ఆ శయ్యా మందిరంలోని పూల పానుపు ప్రశస్తమైన పూలతోటలా కనువిందుగా ఉన్నది.

అక్కడ కన్నగి దుఃఖిస్తున్నది. ఆమె హృదయం బద్ధలైనది. ఆమె ప్రేమసౌధం కుప్పకూలినది. ఆమె సొగసైన చిన్ని పాదాలకుండే మంజీరాలు సవ్వడి చేయక మౌనంగా ఉండిపోయాయి. బంగారు తీగెలాంటి ఆమె శరీరాన్ని కప్పి ఉంచే తెల్లని వస్త్రం, మదనుని గృహం లాంటి ఆమె కటి వలయంపై

ఆచ్ఛాదనగా ఉండే వడ్డాణం, పూమాలలు వాడిపోయినట్లున్నవి. ఆమె అందమైన వక్షోజాలపై గోరింట, కుంకుమలతో చిత్రించిన చిత్రాల జాడలు లేవు. మంగళసూత్రం మినహా ఆమె వంటిపై మరే ఆభరణమూ లేదు. లోలకులు లేని ఆమె చెవులు సాగి ఊగుతున్నట్లున్నాయి. పూర్ణచంద్రునిలా వెలుగులు కురిపించే వదనంపై ఎటువంటి చెమట ముత్యాలూ కానరావు. మీనాల్లాంటి ఆమె కనుల సౌందర్యాన్ని మెరుగుపరచే కాటుక జాడలేదు. విశాలమైన ప్రశస్త పగడం లాంటి ఆమె నుదుటిపై తిలకం దిద్దిన ఆనవాలు లేదు. కోవలన్‌ను చూడగానే ముత్యాల వరుసలా మెరిసే ఆమె పలువరస చిరునవ్వు లేక చిన్నబోయింది. నల్లటి అలల్లా ఎగసిపడే ఆమె శిరోజాలకు ఎటువంటి తైల సంస్కారమూ చేయబడలేదు.

తమ ప్రియ చెలికాండ్ల సరసన లేని ప్రియాంగనలు విరహంతో వేగిపోతూ ఆనకట్టకు తగిలి విస్ఫోటనమవుతున్న పెను అలల్లా ఘోషపెడ్తూ హోరు ధ్వానాలు చేస్తున్నారు. వేసవి కాలంలో తాముండే శయనమందిరాల్నుంచి చిన్న కిటికీలున్న గదుల్లోకి మారుతున్నారు. తమ వక్షోజాలపై చందనాన్ని అలుము కోలేకపోతున్నందుకు, ముత్యాల సరాలతో అలంకరించుకోలేకపోతున్నందుకు విచారిస్తున్నారు. పుష్పాలతో అలంకరించబడిన పూలశయ్యలపై ఎర్రదామరలు, నీలికలువల మధ్య నిదురించే అవకాశంలేక నిరుత్సాహం చెందుతున్నారు. ప్రియ చెలికాండ్లైన రాజహంసలతో సంభోగ సమయాన రాల్చిన హంసల ఈకలతో చేయబడిన విశాలమైన పాన్పులపై విశ్రమించ వీలులేనందుకు విషాదం చెందుతున్నారు. తమ భర్తలపై చిరుకలహాలకు దిగి బుంగమూతితో అలిగే నెరజాణలు, ఇప్పుడు భర్తలు తమ వద్ద లేనందుకు దుఃఖంతో కన్నీళ్లు కారుస్తున్నారు. ఏడ్చి ఏడ్చి వారి కన్నులు ఎర్రగా మారి వడలిన పూలలా వాలిపోతున్నవి. ఒంటరితనపు నిశ్శబ్దంలో వారి నయన సరస్సుల నుండి దుఃఖాశ్రువులు ధారలా జాలువారుతున్నా వాళ్లు అలానే ఉన్నారు.

తియ్యని మంచినీటి సరస్సులాంటిది ఆ యవ్వనవతి, హంసగమనంతో నడిచే అపురూప లావణ్యవతి ఆమె. మకరందం చిప్పిల్లుతున్న నీటి కలువల పరిమళాలు విరజిమ్మే ఆమె దేహం స్వర్ణలతలా కాంతులీనుతున్నది. ఎర్రదామరల తలపించు ఆమె అధరాలు, నల్లని చల్లని ఇసుక రేణువుల సమూహంలా

ప్రకాశించే ఒత్తైన ఆమె శిరోజాలు తుమ్మెదల ఝుంకారపు నోటిరమ్ రాగం కవిగాయకుల స్వరాన ఆవిష్కృతమైనపుడు నిర్మల సరోవరంలో విచ్చుకున్న నీటి కలువల్లా ఆమె నయనాలు. సహ మృదంగ వాయిద్యపు ధ్వనుల్లా పక్షుల కిలకిలా రావాలు శంఖారావంలా మరల మరల వినవస్తున్న వివిధ వర్ణ శోభిత కుక్కుట రాజస్వరం- దానిననుసరించి పలుకుతున్న కోడికూతలు పూంపుహార్ పట్టణాన్ని నిద్రనుంచి మేలుకొలుపుతున్నవి. ఉదయ కిరణాల ఆగమనంతో రాత్రి చీకటి సముద్రపు ఆటులా వెనక్కి తగ్గినది. మీనకేతనుడు, సుగంధ పుష్పబాణుడు, చెరకు వింటి విలుకాడు అయిన మన్మధుడి నిశిత పర్యవేక్షణలో నగరంలో అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు ఏ ఒక్కరి కంటిపై రెప్ప వాలలేదు.

అతడు ఆకాశాన సుగంధ పుష్పాల్ని విరియజేస్తాడు. తనను ప్రేమించేవారికి చల్లని కాంతిని కొందరికి, శీతాగ్ని జ్వాలలను మరికొందరికి ప్రసాదిస్తాడు. అందరినీ రక్షించే చోళ ప్రభువు శ్వేత ఛత్రంలా ఆనాడు వెన్నెలరేడు, మాధవికి మధుర ప్రసన్నవదనంతో ఆగుపించి, ఒంటరి కన్నగికి అశుభసూచకంగా కానవచ్చినాడు.

*****



# 5. ఇంద్రుని ఉత్సవం

నీలి తరంగాలతో ఉప్పొంగుతున్న సముద్రం ఆమెను ఆచ్ఛాదించిన వస్త్రంగా, నిమ్నోన్నతంగా ఉబికిన పర్వతాలు వక్షోజాలుగా, విశాలమై ప్రవహిస్తున్న నదులు పూలమాలలుగా, ప్రకాశిస్తున్న నల్లమొయిళ్లు మెరుస్తున్న శిరోజాలుగా ఈ ఎల్లలు లేని అనంతమైన భూమి ఓ అందమైన యువతిలా కనిపిస్తున్నది.

'ఉతయ్యా' కొండలపై ఉదయించిన సూర్యుడు తన ప్రకాశవంతమైన కిరణాలతో జగతిని ఆవరించిన చీకటి మేలి ముసుగును తొలగించి పగటి వెలుగులతో నింపినాడు. ఆకాశమే పైకప్పుగా ఉన్న ఆవరణపై, అంతులేని ధనం మణిమాణిక్యాలున్న కోశాగారపు గదుల కిటికీలగుండా, లేడికన్నుల వంటి గాలి సొరంగాలున్న భవనాలలోకి ఉదయసూర్యుని కిరణాలు చొచ్చుకునిపోయి చీకటిని పటాపంచలు చేసినవి. అత్యంత భాగ్యవంతులైన యవన వర్తకుల భవనాలుండే ఓడరేవు దగ్గర తచ్చాడుతున్న బాటసారులు ఆ భవంతుల నిర్మాణశైలి, విశిష్టతను తిలకించి విభ్రమిలౌతున్నారు. తీరం అంచుల వెంబడి తిరుగాడుతూ అక్కడి వ్యాపార శ్రేణులతో మంతనాలు సాగిస్తున్న విదేశీ స్వదేశీ వర్తకులతో ఆ ప్రదేశమంతా కోలాహలంగా ఉన్నది. నౌకలు తీసుకువచ్చిన చందనం, రంగులు, సుగంధ ద్రవ్యాలు, అగరు ధూపపు పొడి, అత్తరులు, వివిధ రకాల పుష్పాలు, పరిమళాలు వెదజల్లుతుండగా చిల్లర వ్యాపారులు వాటిని వీధులలో కేకలు పెడుతూ విక్రయిస్తున్నారు.

అద్భుతమైన పనితనమున్న పట్టు, ఉన్ని వస్త్రాలు, పగడాలు, కెంపులు, చందనం, అగరు, ముత్యాలు, రత్నాలు, మణిమాణిక్యాలతో మెరుస్తున్న స్వర్ణాభరణాలు, అరుదైన వస్తువులు రాశులుగా పోసి అంగళ్లలో అమ్ముతున్నారు.

నవధాన్యాలు కుప్పలుగా ఇంకోచోట, రకరకాల పప్పులు, ఆహార పదార్థాలు మరోచోట, తినుబండారాలను, అప్పాలను అమ్మేవారు, సారాయిని విక్రయిస్తున్న యువతులు, చేపల వర్తకులు, వెండిలా మెరుస్తున్న తెల్లటి ఉప్పును విక్రయిస్తున్నవారు, తమలపాకులు, తాంబూల సామాగ్రిని అమ్మేవారు, అత్తరు వర్తకులు, రకరకాల మాంసాలను అమ్మే మాంసపు కొట్టు వాళ్లు, నూనె వ్యాపారస్తులు, క్రిక్కిరిసిన ఉన్న తినుబండారాల విక్రయశాలలు, కంసాలులు,

వడ్రంగులు, చిత్రకారులు, శిల్పులు, సాలెవాళ్లు, కత్తులు బల్లేలు తయారు చేసేవాళ్లు, రాగిపాత్రలను చేసేవాళ్లు, నగల వర్తకులు, దర్జీలు, చెప్పులు కుట్టేవారు– ఇలా వివిధ రకాలైన హస్తకళలలో నైపుణ్యమున్న పనివారు రూపొందించిన నిర్దుష్టమైన, అపురూపమైన వస్తువులతో ఆ ప్రదేశమంతా సందడి సందడిగా ఉన్నది.

గొప్పగొప్ప సంగీతవేత్తలు, సంప్రదాయ సంగీత కళాకారులు, సప్తస్వరాలను అద్భుతంగా పలికించగల వీణా, వేణుగాన విద్యా విశారదులు, అరుదైన హస్తకళలతో అచ్చెరువు గొలిపించే వస్తు నిర్మాతలు– వీళ్లందరి ఇళ్లూ నగర శివార్లలో రమణీయంగా కానవస్తున్నవి. రాచమార్గాన కిరువైపులా, రథశాలలు, అశ్వగృహాలు, సంతలు జరిగే కూడళ్లు, వాణిజ్యకేంద్రాలు, అత్యంత ధనికులైన వ్యాపారవేత్తల భవన సముదాయాలు, బ్రాహ్మణుల గృహాలు, జమీందారుల గృహాలు, రైతుల ఇళ్లు, వైద్యుల, జ్యోతిష్కుల నివాస గృహాలు, ఇతర వృత్తుల వాళ్ల ఇళ్లు, వజ్రాల నిపుణులు, అలంకరణ శంఖాలను తయారు చేసే వాళ్ల ఆవాసాలు, అన్నీ ఆ చుట్టుపక్కలనే ఉన్నాయి. ఆ దరిదాపులలోనే రథికులు, సూతులు, గాయకులు, వాయిద్యకారులు, ఖగోళ శాస్త్రజ్ఞులు, అందమైన నర్తకీమణులు, వేశ్యలు, నటీమణులు, పుష్పలావికలు, తాంబూల సేవికలు, పరిచారికలు, సంగీతకారులు, విదూషకుల గృహాలున్నాయి.

కోటకు చుట్టుపక్కల అశ్వికుల గృహాలు, మావటీల ఇళ్లు, రథికుల భవనాలు, సైనికుల గృహాలున్నాయి. చతురంగ బలాల సైనికుల విడిదులతో అలరారే ఆ ప్రాంతం రాజప్రముఖులు నివసించే చోటుగా పేరెన్నికగన్నది. సరిసమానమైన బలం గల శత్రురాజులు ముఖాముఖీ తలపడే యుద్ధరంగంలా ఆ ప్రాంతం రాచమార్గానికిరువైపులా విస్తరించి శోభాయమానమై ఉన్నది. దృఢమైన వృక్షకాండాలు స్తంభాలుగా ఉన్న విక్రయకేంద్రాలు ఆ వాణిజ్య కూడలిలో నిరంతర అలజడితో, విక్రేతల, కొనుగోలు దారుల సందడితో తీరికలేకుండా ఉన్నాయి.

చంద్రుడు చైత్రా నక్షత్రాన్ని చేరే ఛైత్ర మాసమందు ప్రౌఢ, వృద్ధ స్త్రీలు నవధాన్యాలను, నువ్వుల ఉండలను, పరమాన్నము, పుష్పాలు, అగరు, సుగంధ ద్రవ్యాలు, మధువు తదితర భక్ష్య పానీయాలను ఇంద్రుని పంపున నగరంలో

వెలసిన ఆ నగర రక్షకదేవునికి సమర్పించి ఆ రాజ్యపు ప్రభువు, అసహాయ శూరుడు, తిరుగులేని ప్రచండ శూలధారి అయిన రాజు ముచుకుంతన్‌కు ఏ చెడూ, దృష్టిదోషమూ, అపకారమూ జరగరాదని ప్రార్థించినారు. దైవారాధనలో ఉత్తేజితులై పూనకమావహించగా వాళ్లు తునంకయి, కురవయి నృత్యాల్ని కడు రమ్యంగా నర్తిస్తూ ఇలా గొంతెత్తి ప్రార్థించినారు

"ఈ గొప్ప రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఘనత వహించిన ప్రభు పరిపాలనలో ఆకలి, వ్యాధి, శత్రు భయం ఉండకుండును గాక! సకాల వర్షాలు, పాడిపంటలు, సకల సౌభాగ్యాలతో ఈ రాజ్యం సుభిక్షమగునుగాక!"

రణశూరులు, వీర విక్రమోపేతులయిన సైనిక బృందాలు, చతురంగ బలాలు పోటీపడుతూ పవిత్ర యజ్ఞవాటికకు చేరుకుని ఇలా ప్రార్థించారు–

"అసూయ చెందిన ధూర్త శత్రురాజుల చెడు దృష్టి మా ప్రభువును సోకకుండునుగాక! రాజ్యరక్షణకై ప్రాణాలొడ్డు వీర సైనికుల ఖ్యాతి విశ్వం నలుచెరగులా వ్యాపించునుగాక!"

వడిసెలలు చేబట్టి వడగళ్లలా రాళ్లు విసిరి శత్రు సైన్యాల్ని కకావికలు చేయువారు, ఈటెలు, బల్లేలు వర్షంలా కురిపించువారు, నల్లటి చర్మంతో తయారైన డాళ్లను తమ శరీరాలకు దగ్గరగా ఉంచుకుని చండ ప్రచండ ఘోషతో విజయధ్వానాలు చేసినారు. శత్రుసైనికులను భయకంపితులను చేసే ఎర్రగా నిప్పు కణికల్లా మెరుస్తున్న నేత్రాలున్న శిరాలను హోమగుండపు అంచుపై ఉంచి వారు బిగ్గరగా ప్రార్థించినారు– "మహాప్రభువుకు జయమగుగాక!" అంటూ ఆ రాజ్యపు రక్షక దేవత నినదించిన ప్రచండ గర్జనలా ధ్వనించినారు. ఆ భేరీభాంకార చప్పుళ్లతో తన కొసగిన బలులను సంతృప్తికరంగా ఆరగించినదా నగర దేవత.

రెండు సరిహద్దులున్న తమిళ రాజ్యంలో తిరుమవలవన్ మహా మల్లయోధుడు. తనకు తగిన ప్రతిద్వంద్వి దొరకక నిరాశతో ఉన్నాడు. ఒక మంచి రోజునాడు అతడు తన ఖడ్గాన్ని, రాజఛత్రాన్ని, యుద్ధపు భేరీని బయటకు తీసి పూజించి ఇలా ప్రార్థించాడు– "నా విశాల భుజాల నెదుర్కొనగల మగటిమి గల శత్రువు ఈ జైత్రయాత్రలో నాకు తారసపడునుగాక!" అలా పలికి అతడు

పవిత్రమైన ఉత్తరదిశగా ప్రయాణం సాగించి తన నెదురించిన వారిని ఓడిస్తూ చివరకు హిమాలయ పర్వతాలను చేరుకున్నాడు– "నా మొక్కవోని పట్టుదల, భుజబలానికి దీటైనది ఈ పర్వతమొక్కటే కాబోలు. అడ్డుగా ఉన్నది" అనుకున్నాడతడు. దేవతలు సంచరించే ఆ మంచుకొండ మెడభాగాన తన చిహ్నమైన వ్యాఘ్రపు చిత్తరువును చిత్రించి ఉత్తరదేశ యాత్రను విజయవంతంగా ముగించి ఇంటికి మరలినాడు. మహాంబుధి సరిహద్దులుగా ఉన్న వజ్రదేశపు రాజు అతడికి ముత్యాల తలకట్టును బహుకరించాడు. ఒకప్పటి అతడి ప్రతిద్వంద్వి, మహాశూరుడు, కత్తిసాములో తిరుగులేనివాడు అయిన మగధరాజు నిండు సభలో సత్కారం చేసి అద్భుత దారు నిర్మిత వేదికనిచ్చినాడు. అవంతీరాజు అతడికి కానుకగా సువర్ణము, మణులతో చేయబడిన శోభాయమానమైన గృహద్వారపు అలంకరణ నొసగినాడు. ఇవి సాక్షాత్తూ విశ్వకర్త మయుని చేత తయారు చేయబడి ముగ్గురు రాజ పూర్వీకులకు బహుమతులుగా ఇవ్వబడినవి. ఆ మూడూ సంధానం చేయబడి దేవాలయపు పవిత్ర మొగసాలగా, పదుగురు మెచ్చిన ఆవరణగా ప్రశంసలనందుకున్నవి.

సముద్రతీరాన గుట్టలు గుట్టలుగా పడి ఉన్న వస్తు సామాగ్రి, వాటిపై వస్తువుల పేర్లు, వాటి తూకపు విలువ నమోదు చేయబడి ఉన్నాయి అక్కడ ఎటువంటి రక్షణ ద్వారమూ లేదు, కాపలావాళ్లూ లేరు. అయినా దొంగలక్కడ అడుగుబెట్టేందుకు సాహసించరు. సాహసించినా అక్కడి నైర్మల్యం పవిత్రత దొంగల మనసులను వ్యాకులపరచి వారిని తిరోహితుల్ని చేస్తుంది.

ఆ నౌకాఘట్టానికి అద్భుత శక్తులున్నవని ప్రతీతి. గూనివాళ్లు, మరుగుజ్జులు, మూగ చెవిటివాళ్లు, కుష్ఠురోగులు అక్కడి చెరువులో స్నానం చేస్తే వారి అంగవైకల్యాలు తొలగి స్వస్థత నొంది చక్కటి ఆరోగ్యంతో ప్రకాశిస్తారు. ఉన్మాదస్థితిలో ఉండి మందులు వేసికోనివాళ్లు మందులు వేసుకోవడం ప్రారంభిస్తారు. పక్షవాత రోగులు, విషసర్ప పీడితులు, దయ్యాలు భూతాలు ఆవేశించినవాళ్లు, మిడిగుడ్లతో భయంకరంగా కనపడేవాళ్లు ఆ దగ్గరలో ఉన్న ప్రకాశవంతమైన పొడుగాటి శిల చుట్టూ ప్రదక్షిణాలు, పూజా పునస్కారాలు చేసి పీడల నుంచి విముక్తులౌతారు.

“వంచకులను, మోసగాళ్లను, వ్యభిచారులను, పరదారాభిలాషులను, అబద్ధపు సాక్షులను, పరులను నిందించేవాళ్లను, దుర్మార్గుల పెడరెక్కలు విరిచి కట్టి చావగొట్టి మింగేస్తాను”– నాలుగు దారుల కూడలిలో ఉండే రక్షక దేవత అరుపులు దాదాపు నాలుగు క్రోసుల దూరం మారుమ్రోగుతూ అపమార్గాల సంచరించేవాళ్లను హడలగొట్టుతుంటాయి.

రాజసభలో అన్యాయం జరిగినపుడు కూడలిలో ఉన్న విగ్రహం నిశ్శబ్దంగా ఉండి కన్నీరు కారుస్తుంది. దానిని గమనించిన రాజులు తమ నిర్ణయాలను సరిదిద్దుకునేవారు.

ఈ రహస్యాలను తెలిసిన విజ్ఞులు ఆ పవిత్ర స్థలాల్లో శాస్త్రోక్తంగా బలులు, పూజలు నిర్వహిస్తారు.

ఇంద్రుడి వజ్రాయుధమున్న దేవాలయంలోని ప్రసిద్ధ ఢంకాను సర్వాలంకార శోభితమైన గజేంద్రునిపై ఉంచి అసంఖ్యాక దీపాలంకృతమైన దేవాలయంలోకి తరలిస్తారు. అక్కడ మంచుకొండలా తెల్లగా ప్రకాశిస్తున్న తెల్ల ఏనుగు ఐరావతం నిలబడి ఉంటుంది. పండుగ తొలి ఆఖరిదినాల్లో ఈ వేడుక అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్నది. అదుగో నింగిలో రెపరెపలాడుతున్నది కల్పవృక్ష గుడి చిహ్నమైన పవిత్ర పతాక.

రాజభవనపు లోగిళ్లు మొగసాలలు, మరకత మణిమయ, సువర్ణ శోభలతో, కెంపు స్తంభాల మెరపులతో ప్రకాశిస్తున్నవి. ముఖద్వారాల వద్ద మీనాకృతి గల అలంకారపు వస్తువులు తోరణాలుగా వేలాడుతుండగా, ఏనుగు దంతాల చివరలకు ముత్యాల సరాలు వరుసలుగా మెరుస్తున్నవి. సువర్ణ భాండాల నిండా స్వచ్ఛమైన నీరు నింపబడి ఉన్నాయి. సొగసులీనుతున్న పాలికయి భాండాలు, యువతీ రూపదీప స్తంభాలు, బంగారు ఛత్రాలు, వన్నెచిన్నెల విసనకర్రలు, చందనాది సుగంధ ద్రవ్యాల ముద్దలు– ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే! కోలాహలమే!

అక్కడ కొలువైన వారిలో రాజప్రముఖులు సలహాదారులు అయిదు గుంపులుగా, ఎనిమిది వరుసలలో ఉన్న సభికులు, రాకుమారులు, యువ వణిక్

ప్రముఖులు, అశ్వికులు, రథికులు, గజబల ప్రముఖులు, వీరందరూ పూంపుహార్ ప్రభువుకు అత్యంత విశ్వాసపాత్రులైన వారు– భగవానుని ప్రార్థిస్తున్నారు ఆ మహారాజుకు జయం కలగాలని! – ఒక వేయి ఎనిమిది మంది రాజులు తమ శిరస్సులపై, ఇంద్రుని కత్యంత ప్రీతిపాత్రమైనది తమిళ రాజ్యానికి జీవనది అయిన కావేరీ నది ఘట్టాల వెంబడి పెరిగిన మొక్కల పుప్పొడి సుగంధ పరిమళాలు చేరిన చల్లని, స్వచ్ఛమైన నీటితో నింపబడిన సువర్ణ కలశాలను పెట్టుకుని, ఆ పవిత్ర జలాలతో ఇంద్రుని విగ్రహానికి అభిషేకం చేస్తున్నారు. ఆదిదేవుడైన శివుడికి, షణ్ముఖుడు మురుగన్‌కు, అతడి ఎర్రటి కాంతితో వెలిగే అద్భుత శూలానికి, తెల్లగా శంఖంలా మెరిసే బలరాముడికి, నీలమేఘశ్యాముడైన విష్ణువుకు, ఆయా దేవాలయాల్లో ఘనంగా పూజలు చేస్తున్నారు. ఇంద్ర దేవాలయంలో సందడి సరేసరి. తెల్లటి ముత్యాల వరుసలతో తుళ్లిపడ్తున్న శ్వేత ఛత్రము సొగసులీనుతున్నది. బ్రహ్మ నాలుగు ముఖాల్నుంచి ఆవిర్భవించిన నాలుగు వేదాలూ ఘోషించిన విధంగా, శాస్త్రోక్తంగా యజ్ఞయాగాదుల్ని నిర్వహిస్తున్నారు. ఇంకోచోట నాలుగు శ్రేణుల దేవతలు, పద్ధెనిమిది రకాల చిల్లర దేవతలు, గ్రామదేవతలకు వారివారి అర్హతలకు అనుగుణంగా సాంప్రదాయకమైన పూజలు, బలులు, యాగాలు చేస్తున్నారు. నగరంలోపల జైన దేవాలయాలు, పవిత్ర ఆశ్రమాలు, నగరానికి పొలిమేరలలో సత్రాలు, ధర్మశాలలు భక్తులలో నిండి ఉన్నాయి. ఎక్కడ చూసినా ఆటపాటలూ, కోలాహలమే!

తనతో చేతులు కలపని శత్రురాజుల మదమణచిన ప్రభువుకు జేజేలు పలుకుతున్న ప్రజలు; నృత్యగానాలతో తమ హర్షాతిరేకాన్ని ప్రకటిస్తున్న జనులు, అతిలోక మనోహరమైన సంగీతాన్ని వీణలపై, వేణువులపై పలికిస్తున్న విద్వాంసులు, గాయనీ గాయకులు, నర్తకీమణులు, కవితా గానం చేస్తున్న కవిగాయకులు, భేరీభాంకార మృదంగ వాయిద్యపు మేలిధ్వనులు ఇవన్నీ నగరమంతా అపురూపమైన పండుగ వాతావరణాన్ని ప్రకటిస్తున్నవి.

ప్రియ సాంగత్య మధురిమల నాస్వాదిస్తున్న మాధవి– చంద్రవంక రూప చక్కదనంతో మెరుస్తున్న కర్ణాభరణాలు ఆమె చెక్కిలిపై కాంతులీనుతుండగా మాధవి, మల్లె, బొండుమల్లె, విరజాజులు, నీలికలువ, ఎర్రకలువ పూలతో కూర్చిన సొగసైన పూదండల పరిమళాలకు ఆకర్షితమై, ఆ పుష్ప మకరందా

స్వాదనా కాంక్షతో గుమికూడిన తేనెటీగలు అటూ ఇటూ ఎగుర్తుండగా, పొటియిల్ కొండల నుండి వీచిన చల్లని గాలి అక్కడి వాతావరణాన్ని కడు రమ్యంగా మార్చగా– ఆమె మధురోహలలో తేలిపోతున్నది. కోవలన్ తన మిత్రులైన గాయక బృందంతో కలిసి ఆ అద్భుత పరిమళాల నాస్వాదిస్తూ తేనెటీగల బృందంలా తిరుగాడ్తున్నాడు. దూరతీరాల్నుంచి అడవిపూల పరిమళాలను మోసుకువచ్చిన చల్లని గాలులు అక్కడి ప్రేమవనపు పుష్ప సుగంధాలతో కలిసి వింతైన, అద్భుతమైన నూతన సువాసనలతో మనోహరమై మనసును దోచుకుంటున్నవి. ఆ నగరపు రహదారి కూడళ్లలోని వీధులలో, విక్రయ కేంద్రాలలో ఎల్లప్పుడూ దొరికే చందన, సుగంధ ద్రవ్యాలు ప్రేమికుల నుత్తేజపరుస్తూ వారి పోకడలను తమలో తాము గుసగుసలాడు కొనుచున్నవి.

ఒక ప్రేమికుడంటున్నాడు– "రాహు సర్పానికి భయపడిన చంద్రుడు వినువీధులను విడిచి, నల్లని మేఘాలు కురులు కాగా, తనలోని తెల్లని కుందేలు నీ పాపటగా, రెండు అద్భుత మీనాలు నీ నేత్రాలుగా, రమ్యమైన సంపెంగ (కుమిలిపూవు) పూవు నాసికగా, నీ రూపాన ప్రత్యక్షమైనాడా, మాధవీ!"

మరొకడన్నాడు– "తన శరీరాన్ని వెదకుతూ భువిపైకి వచ్చి, నింగి నుండి నేలకు దిగిన చంద్రబింబాధరముల జాలువారిన మకరంద బిందువులను తాగి పునరుజ్జీవుడైన మీనకేతుడు కాముడు తెచ్చిన విద్యుల్లతవా నీవు?"

మూడవ వాడన్నాడు– "తనపై వసించు లక్ష్మీదేవికై వెదకుతూ సంపెంగ పుష్పాని కిరుపక్కలా విశాలమైన నీలి కలువలుగా అమరిన మనోహర పద్మానివా? లేక, ఈ విశాల ప్రపంచానికి ప్రభువైన మన మహారాజు నివసించే ఈ పట్టణంలోకి అడుగుపెట్టిన లక్ష్మీదేవి అష్టైశ్వర్యాలతో తులతూగమని ప్రభువును ఆశీర్వదిస్తున్న దానికి చిహ్నంగా విరిసిన అగ్నిపుష్పాలు, మల్లెల తోరణానివా?"

మరొకడన్నాడు– "అసంఖ్యాకమైన జీవులను తన విశాలమైన నోటితో ఆరగించే యముడు, మన ప్రభువు ధర్మనిరతితో పైకెత్తే రాజదండానికి జంకి, సమ్మోహనకరమైన చిరునవ్వుతో, సలలిత, సుకుమార, వీణాస్వన నాదమైన స్వరముతో, అద్భుతమైన రూపముతో అలరారే లావణ్యవతిగా రూపొంది ఈ నగరాన అవతరించినాడా?"

ఆ అపురూప మన్మథ సామ్రాజ్యాన, అనంగుడైన కాముడి సైన్యంలా, నవయోవనవతులైన లలనామణులు తమ శరీరానికి, వక్షోజాలకు చందనాన్ని అలుముకున్నారు. విశాల భుజములు గల వారిభర్తలు ఇండ్లకు చేరుకుని అలకనభినయిస్తున్న తమ భార్యలను కౌగిలిలోకి తీసుకుని అనునయిస్తున్నారు. అరుంధతిలా పతివ్రతలైన తమ భార్యలను శృంగారకేళిలో ఓలలాడ్చగా, వారు బయటకి వచ్చినపుడు నీలిపద్మాల్లాంటి వారి నయనాలు ఉద్వేగభరితమై, ఎర్ర కలువల్లా కాంతులీనుచుండగా, వారిని గమనించిన ఇతరులు ఇలా అనుకుంటున్నారు– "ఈ శృంగార ప్రపంచంలో దీనికి వేరే మందేమున్నది? పండుగ రోజులలో ఇటువంటి దృశ్యాలే ఎక్కడ చూసినా".

మధుర మకరందాన్ని స్రవిస్తూ, తీయని పుప్పొడి తన నుండి వెడలిపోతుండగా గజగజ వణుకుతున్న నీలికలువలా కన్నగి ఎడమ కన్ను అదరసాగింది.

శృంగారోద్రేకంలో ఉప్పొంగిన ఎర్రకలువలా మాధవి కుడికన్ను కంపించి ఆనందాశ్రువులను రాల్చగా, తన భర్త ఎడబాటుతో తల్లడిల్లిన కన్నగి ఎడమకన్ను దుఃఖ భాష్పాలను వెదజల్లినది.

ఒకచోట ఆనందం, మరోచోట దుఃఖం ఆ ఇరువురు యువతుల మనసులను నింపగా దేవతల ప్రభువైన ఇంద్రుడి పండుగ రోజున ఆ ఇరువురికి వేర్వేరు మానసిక స్థితులు లభ్యం కాగా వారు కలత నిదురలో నిదురించినారు.

✣✣✣✣✣



# 6. సముద్ర స్నానం

కైలాస పర్వతపు రజత శిఖర కాంతులతో మిలమిల మెరిసే విశాలమై రమణీయమైన చేది పట్టణములో మకరందాన్ని చిప్పిల్లుతూ పరిమళాలను వెదజల్లుతున్న పూదోటలో విద్యాధర దేవతల నాయకుడొకడు విశాల నయని, మీనాక్షి, ప్రేమసామ్రాజ్యపు ప్రభువైన కాముని పండుగలా కనులకు ఆనందాన్నిచ్చే సొగసులాడి అయిన తన ప్రియురాలితో ఈ విధంగా పలికినాడు–

"ఈరోజు దక్షిణా పథంలోని 'పుకార్' పట్టణంలో ఇంద్రోత్సవం జరుగుతున్నది. అతి లాఘవంగా కదిలే దానవుల పీచమణచిన ముచుకుంతన్ రాజు విజయధ్వానాలను మ్రోగే కాలిమట్టెలను ధరించి మహాశక్తివంతమైన వ్యాఘ్రంలా కదుల్తుండగా ఆ దానవులు అమోఘమైన బాణవృష్టి కురిపించి రాజును అయోమయావస్థలోకి నెట్టినారు. అప్పుడు ఇంద్రుడు ఉజ్జ్వలంగా వెలుగుతున్న దేవతను పంపి రాక్షసమాయను నాశనం చేసి పరాక్రమశాలి, శూలపాణి అయిన ప్రభువుకు బాసటగా నిలబడ్డాడు.

అక్కడే మనం నగర రక్షక దేవతకు ఒసగే బలుల్ని చూడవచ్చు. ఇంద్రుడు ఆ రాజుకు ప్రసాదించిన పంచ సభాహర్మ్యాలను తిలకించవచ్చు. మహరాజు పూర్వీకులు వాటి నుండే దేవతల రాజధాని అమరావతిపై తమ చూడ్కులు నిలిపేవారు. దేవగాయకుడు నారదుని వీణ 'మహతి' నుండి వెలువడే మధుర స్వరాలు, నర్తకీమణులు ఆలాపించే వీనుల విందైన 'వరం' (Varam) పాట వేయి కన్నుల రాజైన ఇంద్రుని వీనులకు సోకి అమందానందాన్ని కలిగించేవి. తన జగన్మోహనమైన నృత్యరీతులతో ఊర్వశి నాట్యం చేస్తున్నపుడు దేవ వీణ తన శక్తిని కోల్పోగా ఊర్వశి భూలోకంలో జన్మించమని శాపమివ్వబడింది. ఆ ఊర్వశి వంశాన పుట్టినదీ మాధవి. పడగ విప్పిన నాగుపాములా ఆమె నడయాడ్తుంటే, నర్తిస్తుంటే చూడ కన్నులు చాలవు. ఓ బింబాధరీ! కెంపుల వంటి పెదాలున్న చిన్నదానా? సింహపు నడుములా సన్నని నడుమున్న ఆ చిన్నదాని నృత్యాన్ని కనులారా చూద్దాం, పద!" అన్నాడా విద్యాధరుడు.

అతడామెకు ఉన్నతమైన శిఖరాలున్న హిమాలయాన్ని, నీటితో నిండి పరవళ్లు దొక్కుతున్న గంగానదిని, భోగభాగ్యాలతో విలసిల్లే ఉజ్జయినీ నగరాన్ని,

వింధ్యాచల ప్రాంతపుటరణ్యాలను, వెంకటాచల పరిసర ప్రాంతాల్ని దాటి కావేరి నదీ జలాలతో పరిపుష్ఠమై పాడిపంటలతో, ఫలపుష్ప వనాలతో విలసిల్లుతున్న పుకార్ పట్టణాన్ని దర్శింపచేసాడు. అక్కడి ఆచారాన్ననుసరించి ముందుగా ఇంద్రుడి దేవాలయాన్ని దర్శించి పూజలు చేసి, నేత్రోత్సవంగా జరిగే ఇంద్రుడి పండుగ సమయాన, నూతన శోభలతో అలరారే 'పుకార్' పట్టణాన్ని చూపించాడు.

"నీవిక్కడ విష్ణునామ సంకీర్తనలను వినవచ్చును. చతుర్వర్ణాలకు సాంప్రదాయకమైన గానాలను, సమస్త జనులపై, ప్రదేశాలపై వెన్నెలలు కురిపిస్తూ ఆకాశవీధిలో సంచరించే అమృతాంశుడైన చంద్రుడిని వీక్షించవచ్చును. స్మశానంలో మహాకాలుడైన శివుడు లయకారకమైన **తాండవ నృత్యాన్ని (1)** చేస్తుంటే పక్కనే ఉమాదేవి కాలాన్ని గణించడం గమనించు. మహాశివుని ప్రచండ ఢమరుకా నాదాలకనుగుణంగా మహంకాళి నరిస్తుంటే అదుగో చూడు– దేవతల విజ్ఞప్తిని మన్నించిన పరమేశ్వరుడు తన ప్రచండ పంచశూలాస్త్రంతో త్రిపురాలను దహించి త్రిపురాంతకుడైన వైనాన్ని వీక్షించు. చతుర్ముఖుడైన బ్రహ్మకోసం శివుడు చేస్తున్న **మహాశ్వేత నృత్యాన్ని (2)** పరికించు.

కంసుని పన్నాగాన్ని భగ్నం చేసి **గజనృత్యం (3)** చేస్తున్న నీలిమేఘ వర్ణుడైన కృష్ణుడిని చూడు. బాణుని సంహరించిన అనంతరం చేస్తున్న **మల్లయుద్ధ నృత్యాన్ని (4)** చూడు.

సురాసురుడిని వధించి మురుగన్ చేస్తున్న **మహాఢక్కల నృత్యాన్ని (5)** కనులారా చూడు! పరాజితులై తమ ఆయుధాలను నేలపై ఉంచి వినమ్రులై శిరసులు వంచి నిలబడిన దానవుల ఎదుట పరాక్రమ వంతుడైన మురుగన్ చేస్తున్న **ఛత్ర నృత్యం (6)** వీక్షించు.

బాణుని నగర వీధుల్లో కలయ దిరుగుతున్నట్లున్న కృష్ణుని **కలశ నృత్యాన్ని(7)** కనులారా గాంచు. తన పురుష శరీరాన్ని కోల్పోయి, స్త్రీల వస్త్రాలను ధరించి **పేడి రూపాన కాముడు చేస్తున్న కమనీయ నాట్యాన్ని (8)** అవలోకించు. రాక్షసుల దుష్టకార్యాల్ని చూసి ఆగ్రహోదగ్నయై దుర్గాదేవి దుష్టులను దునుమాడుతున్నట్లున్న **కట్టెల నాట్యాన్ని (9)** కళ్లారా చూడు! అష్టైశ్వర్యాల కాదిదేవత, సర్వలక్షణ శోభితయైన లక్ష్మీదేవి చేస్తున్న **విగ్రహ నృత్యాన్ని (10)** విలోకించు. రాక్షసులు

తమ సమస్త ఆయుధాలను వర్జించి తలలు వంచి నిలుచున్న స్థితిని గమనించు. అదుగో ఇంద్రుడి సహధర్మచారిణి **శచీదేవి** ఉత్తర దిక్కున చేస్తున్న ఉజ్జ్వలభరితమైన **నృత్యాన్ని (11)** చూడు.

ఈ పదకొండు నృత్యాలు, వాటి కనుగుణమైన పాటలతో, దుస్తులతో, నాట్యముద్రలతో, హావభావాలతో వివిధ అభినయాలతో, భంగిమలతో నిపుణులైన వారితో ప్రదర్శింపబడుచున్నవి. ఈమే నేనింతకుముందు చెప్పిన మాధవి, ఊర్వశి వంశోద్భవురాలు"

ఆ విధంగా విద్యాధరుల నాయకుడు తన ప్రేయసితో నాట్య ప్రశంస చేసినాడు.

నృత్యగాన సంబరాలతో విందూ వినోదాలతో, ఇంద్రోత్సవం ఘనంగా ముగిసింది. దేవతలు మారువేషాలలో వచ్చి ఆ వేడుకలలో పాల్గొన్నారు.

ప్రణయ సంభాషణలలోని తీవ్రతకు అలిగి మొహం మాడ్చుకుని ముభావంగా ఉన్న కోవలన్‌ను సంతోషపెట్టడానికి మాధవి సింగారించుకో సాగింది. నల్లని అలల్లాంటి తన కురులకు పది సువాసనా తైలాలు, అయిదు సుగంధ ద్రవ్యాలు, ముప్పైరెండు రకాల మూలికలతో తయారు చేయబడిన ప్రశస్తమైన తైలాన్ని నీటిలో కలిపి తలంటుకున్నదామె. పూలరేకుల్లా మృదువైన శిరోజాలను ఆరబెట్టుకుంటూ ప్రతి పాయకూ కస్తూరి లేపనాన్ని అద్ది, చలువను, ఉత్తేజాన్ని తన ప్రియుడికి కలిగించి వాంఛలు రేకెత్తించేందుకు సిద్ధమవుతున్నది. అందమైన తన చిన్ని పాదాలకు గోరింట, పారాణి రాసుకుని కెంపుల రంగులో మెరుస్తుండగా కాలివేళ్లకు రత్నఖచిత స్వర్ణ అంగులీయకాల్ని తొడిగింది. నాజూకైన తన కాళ్లకు సాదా కడియాలు, చిరుమువ్వలున్న పట్టీలను తొడుగుకున్నది. గుండ్రటి నునుపైన జఘనాలపై జాలువార్తున్న స్వర్ణాభరణాలు, లతా పుష్పాలతో నిగనిగలాడ్తున్న నీలి వస్త్రపు పట్టీపై ముప్పై రెండు వరుసలున్న ప్రశస్త ముత్యాల సరాలు అందంగా అమర్చబడిన వడ్డాణాన్ని ఆమె తన నడుముకు బంధించు కున్నది. స్వచ్ఛమైన మణులున్న స్వర్ణ కంకణాలు, ప్రకాశవంతంగా మెరుస్తున్న హస్త భూషణాలు, బంగారు గాజులు ఆమె చేతులు, ముంజేతులపై ధగద్ధగాయ మానంగా కాంతులీనుతున్నాయి. నవరత్నాలు పొదిగిన బంగారు గాజులు,

శంఖము, పగడాలు, ప్రశస్తమైన లోహాలతో చేసిన గాజులను తన చేతులకు తొడుగుకున్నది. సుకుమారమై, లలితంగా ఉండే తన చేతివేళ్లు కనిపించకుండా, వాటికి నోరు తెరచుకుని ఉన్న మీనాకృతిలో చేయబడిన స్వర్ణాంగుళీయకాలను, ఎరుపు, నీలి ఆకుపచ్చ రంగులు మెరుస్తున్న కెంపులు, నీలాలు, పచ్చలు పొదగబడిన ఉంగరాలను ధరించినది. శంఖాకృతిలో సుకుమారంగా, నునుపుగా ఉన్న మెడలో సన్నటి మనోహరమై, మణులతో మెరుస్తున్న కంఠహారాన్ని ధరించింది. వివిధ వర్ణ, పుష్పశోభితమైన, సుగంధ పరిమళాలు వెదజల్లుతున్న పుష్పమాలికను కంఠసీమన అలంకరించుకున్నది. చెవులకు నీలాల మధ్యలో పొదగబడిన మణులతో కూడిన కర్ణాభరణాలను పెట్టుకున్నది. అందమైన శిరోజాల మధ్య పాపిటన పాపిట చేరు, తల వెనుక చంద్రవంక వంటి బంగరు నగలను, తొయ్యాకం, పుల్లాకం మంచినీటి సరస్సులలో లభించే దక్షిణ భ్రమణ మున్న ప్రశస్త శంఖములనమర్చుకున్నది.

మెరుపు తీగెలాంటి లావణ్యంతో, మృదు మధురమైన మాటలతో, కలకూజితాలతో తన ప్రియుడైన కోవలన్‌ను మురిపించి, అతడి అలకను మాన్చి, కోపాన్ని పటాపంచలు చేసి తన కౌగిలిలో చేర్చుకుని లాలించి మురిపించి ప్రసన్నుడిని గావించుకొని సరస శృంగార కేళిలో తన్మయుడిని గావించినది మాధవి.

అది పున్నమి రాత్రి. ఆ అద్భుత పురాతన నగర ప్రజలు సముద్ర తీరాన ఉప్పొంగుతున్న అలల మధ్య ఆటపాటలలో నిమగ్నమై ఉన్నారు. పక్కనే ఉన్న మనోహర పూలవనంలో సందడి చేసేందుకు పోయివద్దామని కోవలన్‌ను బతిమాలుకున్నది మాధవి.

పక్షుల కిలకిలా రావాలతో ఆ పూలతోట ప్రతిధ్వనిస్తున్నది. దాపులనే ఉన్న సరస్సులలో స్వర్ణతామరలు నీటి కలువలు దట్టంగా పరచుకుని ఉన్నాయి. సంధ్యా సమయాన్ని సూచిస్తూ కోడికూతలు, ఆవరిస్తున్న చీకటిని తొలగిస్తూ అందాల శుక్రుడు అంబరాన వెలుగుతున్నాడు.

వక్షంపై అపురూప మణిమాణిక్యాలతో పొదగబడిన స్వర్ణహారం, మత్తెక్కించే సువాసనలను విరజిమ్ముతున్న పూలదండ ధరించిన కోవలన్

అశ్వారూఢుడై సాగగా, వెనకనే తన రథంలో మాధవి అతడిని అనుసరించింది. అత్యంత విలువైన కోటిబేళ్ల వాణిజ్యసామాగ్రితో నిండిన భవనాలున్న వ్యాపార వీధిలో వాళ్లు వెళ్తున్నారు. ఎటు చూసినా ప్రకాశవంతమైన దీపాల వెలుగులు. ఆ కాంతులలో ధగధగ మెరుస్తున్న రంగురంగుల పుష్పాలు, వాటిని ధిక్కరించే సోయగాలతో సర్వాలంకారభూషితులైన లావణ్యవతులు, పూలరాశులు, పచ్చగడ్డి మోపులు, ధాన్యపు రాశులు. సాక్షాత్తూ లక్ష్మీదేవి నడయాడుతున్న ప్రదేశమది. జన సమ్మర్ధంతో క్రిక్కిరిసిన ఆ వీధి నుండి, సముద్ర వ్యాపారంలో కుబేరులైన వారుండే ప్రధాన వీధిలోకి ప్రవేశించారు కోవలన్, మాధవి. తీరానికి దగ్గర ఉన్న వీధుల్లో సముద్రపు అలల్లా అంతూ దరీ లేకుండా పోసి ఉన్న ధాన్యపు రాశులు. వివిధ వర్ణాల పతాకలు శోభాయమానంగా ఎగుర్తూ ఇలా ప్రకటిస్తున్న ట్లున్నాయి– "ఈ అనంతమైన తెల్లని ఇసుక రేణువులపై ఉన్న సమస్త సంపదలు వివిధ దేశాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన సాహసికులైన వ్యాపారులవి!"

ఆ ప్రదేశమంతా అద్దకం, చందనం, పుష్పాలు, సువాసనా తైలాలు, రకరకాల తినుబండారాలు అమ్మే వ్యాపారుల దుకాణపు దీపకాంతులతో జ్వాజ్వల్యమానంగా వెలుగులీనుతున్నది. అవి నగలు తయారు చేసే వారివి. ఇవి భక్ష్యాలమ్మేవారివి. పెద్దపెద్ద ప్రమిదలలో నూనెపోసి వెలిగించిన దీపాలు. అక్కడ చేపలమ్ముతున్న జాలరి యువతులు. దూరంగా దీపస్తంభాలు తమ ప్రకాశ వంతమైన వెలుగులతో నౌకలకు దారి చూపుతున్నవి. అటు మినుకు మినుకు మంటున్నట్లున్న దీపాలతో కదిలివస్తున్న చేపల పడవలు. విదేశీ వ్యాపారస్తుల మజిలీలలో దీపాలివిగో! అవి వారి భాషల్లానే ప్రత్యేకంగా ఉన్నాయి. అరుగో రక్షక భటులు, చేతుల్లో దీపాలతో! అన్ని దీపాల కాంతులూ వెన్నెలతో కలిసి ఆ ప్రదేశమంతా రాత్రి చీకటిని దూరంగా తరిమివేస్తున్నవి. సముద్ర తీరపు ప్రాంతం శంఖు వృక్షాలతో, పొదలతో ఉండి, తామరపూలతో దట్టంగా ఉండే మైదాన ప్రాంతపు సరోవరం కన్నా మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నదా వేళ. పిండారబోసినట్లున్న ఆ ఇసుకమైదానంపై చిన్నతెల్లని ఆవగింజ కూడ స్పష్టంగా కానవస్తున్నట్లున్నది. సన్నని మెరుపుతీగెలా మెరుస్తూ లావణ్యవతి మాధవి తన చెలికత్తెలతో అక్కడ క్రీడించాలనుకున్నది. ఆ తీరపు లోగిలి నిండా ఎక్కడ చూసినా రకరకాల వర్తకపు సరుకులతో నిండి ఉన్న పడవల వరుసలే!

ఆ సముద్ర తీరం పక్కన అందమైన ప్రదేశంలో విడిది చేసి ఉన్నారు రాజకుమారులు, అత్యంత ధనికులైన యువ వ్యాపారులు, వారి అనుచరులు, అందమైన స్త్రీలు, నాట్యకత్తెలు, గాయనీమణులు. తళతళ మెరుస్తున్న తెరల మాటున తళుకులీనుతున్న యవ్వనవతులు. వివిధ వర్ణ వస్త్రధారిణులై మనోహరమైన స్వరాలతో మరులు గురిపిస్తున్నారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే!

కావేరీ నదికి వరదలు వచ్చే తొలి శుభదినం నాడు అమరపురికి తన ఖ్యాతిని విస్తరింపచేసుక్ను కరికాలన్ మహాప్రభువు పండుగ దినాన్ని ప్రకటించగా చతుర్వర్ణాలకు చెందిన సమస్త ప్రజలు ఆనందోత్సాహాలతో, కోలాహలంగా పండుగ చేసుకుంటూ గుంపులు గుంపులుగా అక్కడ చేరి ఉన్నారు. అతి మెత్తని పుష్పంలాంటి మాధవి తన సుకుమారమైన హస్తాలతో వీణను వసంతమాలై నుంచి గ్రహించి, తన వెడల్పాటి కళ్లతో కోవలన్‌ను ఆహ్వానించగా ఇరువురూ చక్కటి వస్త్రాలు పరచిన శయ్యపై సుఖాసీనులైనారు. మరుగు కొరకు చుట్టూరా తెరలు. క్రింద తెల్లని ఇసుక. తనూల వృక్షపు కొమ్మలు పైకప్పుకాగా, పుష్పించిన శంకు వృక్షాలు తమ సువాసనలతో సముద్రపు చేపల గాలిని దూరంగా తరిమి వేస్తున్నాయి. నల్లని తుమ్మెదలు తెల్లని శంకు పుష్పాలలో బంధించబడి ఆ రాత్రంతా పుప్పొడి, మకరందాన్ని గ్రోలి, తెల్లవారినాక ఉదయభానుని ప్రశస్త కిరణాలకు విచ్చుకున్న పూల నుండి నిద్ర మేల్కొని బయటపడాతాయేమో!



# 7. ప్రేమగీతాలు

## 1

వీణపై కప్పి ఉన్న సుందరమైన వస్త్రాన్ని తొలగించి, తొలుదొల్త ఆ వీణా వాద్యానికి శిరస్సు వంచి నమస్కరించింది మాధవి. సుందరమైన పుష్పాలు చిత్రితమై, అత్యంత నాజూకుగా ఉండి కాటుక నలంకరించుకున్న విశాల నయనాలున్న వధూకన్యలా ఉన్న ఆ వీణను తన చేతుల్లోకి తీసుకున్నది. మంద్రంగా మోగే తంత్రులను సవరిస్తూ, బీటలను సరిచేసి, శుద్ధ ధ్వనులను వెలువరించేలా చేసి ఆ అద్భుత వీణపై శాస్త్రాలు అంగీకరించిన ఎనిమిది స్వరాలను పలికించిందామె. ప్రథమ పంచమ స్వరాలను అష్టమ శృతిలోనికి వచ్చేలా తంత్రులను స్థిరపరచి, ధ్వనులను తదేక ధ్యానంతో వింటూ, విశ్రమ స్థానాలను అవలోకించి శృతిలయలను అత్యంత జాగరూకతతో సమన్వయపరచి అలౌకిక సంగీతాన్ని జాలువారించసాగింది.

ఝుంకార నాదాన్ని వెలువరిస్తున్న తుమ్మెదలగుంపులా ఆమె సుకుమారమైన అంగుళిలు, ఆ వీణా తంత్రులపై అలవోకగా కదుల్తుంటే అద్భుత రాగాలు ప్రవహించసాగినాయి. సంగీత విశారదులు వర్ణించే అంగుళీ విన్యాసాలను ఆమె ప్రదర్శిస్తూ– తర్జని తాడనము, ఊర్ధ్వ అధో చలనము, మంద్రముగా మీటుట, ఒక తంత్రి నుంచి పీడనము గావించుట, తంత్రీ మర్దనము తంత్రీ శీఘ్రగమనము, తంత్రీ విన్యాసములతో– అద్భుత రాగాల్ని సృష్టించసాగింది.

తరువాత ఆ వీణను బారజాపిన కోవలన్ చేతుల్లో ఉంచి మృదు మధురంగా పలికింది– "నన్నేమి పాడమని తమ ఆజ్ఞ?"

జవాబుగా కోవలన్ తానూ ఒక పాటను అందుకుని మాధవి హృదయాన్ని ఆనందడోలికలలో ముంచెత్తినాడు. కావేరి నది గురించి, సముద్ర తీరపు రమ్య వనాల గురించి అతడు పాడుతుంటే ఆమె ఆనంద పరవశు రాలయ్యింది.

కోవలన్ నదితో సంభాషిస్తున్నాడు–

**2**

"మహారాజు యొక్క పుష్పాలంకృత శ్వేత ఛత్రమే ఆ చంద్రుడు!
రాజదండాన్ని పైకెత్తి అతడు 'కనకై'ను వివాహమాడ్తున్నాడు.
ఓ కావేరీ! దిగులు చెందకు!
కనకైను వివాహమాడ్తున్నాడని
ఓ మీననేత్రీ! కలవర పడకు!
యువతులకు సహనమే సర్వోత్కృష్ట సుగుణము.
కనుక ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!"

**3**

మహరాజు శ్వేతఛత్రంపై వాడిపోని పూలదండలు
రాజదండాన్ని పైకెత్తి అతడు 'కనకై'ను వివాహమాడ్తున్నాడు.
ఓ కావేరీ! దిగులు చెందకు!
'కనకై'ను వివాహమాడ్తున్నాడని
ఓ మత్స్యనయనీ! కలవరపడకు!
యువతులకు సహనమే సర్వోత్కృష్ట సుగుణము
కనుక ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా

**4**

రైతుల నాగళ్ల ధ్వనులు,
కాల్వల ప్రవాహ శబ్దాలు
ఎగసి పడ్తున్న నీటి చప్పుళ్లు,
జనుల జయజయధ్వానాలు
వరద నీటి అలల తొలి గలగలలు,
నీ ఉత్తుంగ ప్రవాహపు సుడిజడులు.

ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా
జనుల జయజయధ్వానాలు, మార్మోగే గీత గానాలు
ప్రవహించుము నిరవధికంగా, నిన్ను ప్రభు సైనికులు
నిరంతరాయంగా కీర్తించుచుండగా,
ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!

## 5

### (ఆమె నెచ్చెలి అతడితో సంభాషించుట)

“నీలి కలువ రేకుల్లాంటి నేత్రాలున్న మా చిన్నదానికి
వాళ్లు సముద్రదేవుడిని మరలమరల చూపించారు.
కాని ఇచ్చిన మాటల్ని నిలుపుకోలేదు–
మాకెలా తెలుస్తుంది ప్రభూ!
మేము అమాయకులం! ఆ మాటలు నమ్మతగ్గవేనా?
మా పుకార్ పట్టణంలో
ముత్యాలను, శంఖాలను చూసి
నీలికలువ మొగ్గ నిండారా విచ్చుకుంటుంది
వాటిని నక్షత్రాలుగా, చంద్ర కిరణాలుగా భ్రమించి.

## 6

సముద్ర తీరపు నదీ జల్లాల్లో
చేతుల్నిండా కానుకలతో ప్రేమికుల్లా
వాళ్లు వెనక నుంచి వచ్చి దోచుకున్నారు మమ్మల్ని!
మాకెలా తెలుస్తుంది ప్రభూ,
అంతలోనే అపరిచితులుగా మారి
మేము వాళ్లని మరీమరీ అర్థించేలా మార్చేసారు
మా పుకార్ పట్టణంలో
చంద్రకాంతికి విచ్చుకున్న నీలికలువ రేకులకు
అందమైన మా స్త్రీల నేత్రాలకు ఉన్న తేడాను
పరిభ్రమిస్తున్న భ్రమరాలే పసికట్టలేవు–

## 7

ఉవ్వెత్తున ఎగిసిపడ్తున్న అలల ధాటికి ఎగిరి
తీరాన పడి ప్రతిధ్వనిస్తున్న శంఖాల అధరాలు
మా కన్నియలు కట్టుకున్న ఇసుకగూళ్లను, ప్రభూ,
చెదరగొడ్తున్నాయి నిరంతరాయంగా!
మా పుకార్ పట్టణంలో–

చిరాకుపడిన చిన్నారులు
తమ మెడలోని పూలదండల నుంచి
నీలికలువలను లాగి ఆ శంఖాలపై విసిరికొట్టగా
సాయంకాలం, ఆ దారిపోయే తెరువరులు
వాటిని మిలమిల మెరుస్తున్న నయనాలుగా
భ్రమించి ఆగిమరీ చూస్తున్నారు.

### 8

### (అతడి చెలికాడు మాట్లాడుతున్నాడు)

తమాల వృక్షపు దట్టమైన పుష్పాల నుండి
రాలిన పుప్పొడి మేఘంలా వనాన్ని కమ్ముకున్నది.
అది ఇసుక తిన్నెలపై పడి ఉన్న దక్షిణావర్త శంఖాలు
చేసే శబ్దాల గుసగుసలను దాచిపెడుతున్నది.
ఆ పూర్ణచంద్రవదన, ఆ మీన నేత్రి హృదయవేదన
ఉప్పొంగి, అరుణిమ నలుముకున్న స్తనద్వయ
భారాన్ని ఏ మందు వరద తగ్గించగలదు?

### 9

### (అతడి సమాధానం)

పూల సువాసనతో నిండిన సముద్ర తీర వనంలో
ఓ కన్య ఎండిన లావాటి చేపల్ని చూస్తూ
ఆకలితో ఎగురుతున్న పక్షులను తరిమికొడుతున్నట్లు నటిస్తున్నది.
ఆమె చేతిలో తంగేటి పుల్ల,
దాని నంటిపెట్టుకుని ఝంకరిస్తున్న తుమ్మెదలు–
ఆమె దేవకన్య అని నాకు తెలీదు.
నిజంతెలిస్తే అటువేపు వెళ్లేవాడినే కాదు.

### 10

సముద్రతీరపు నదీజలాల్లో
మృత్యుదేవత విహరిస్తాడని నేనెన్నడూ అనుకోలేదు,

ప్రాణాంతకమైన బల్లేల వంటి
విశాల నయనాల కన్యరూపంలో!
ఒక చేతిలో వికసించిన పుష్పంతో ఆమె
విక్రయానికున్న ఎండు చేపల్ని పర్యవేక్షిస్తున్నది,
జాలరులు వలలు ఆరబెట్టుకునే ఇళ్ల ముంగిట్లో నిలబడి!
నిజం తెలిస్తే, అటువేపు వెళ్లేవాడినే కాదు.

## 11

### (ఏకాంతంగా– అతడు ఆమెతో)

కాముడు తన అత్యంత నిర్మాణ కౌశల్యంతో
మత్స్య, ధనూ, మేఘాలననుకరించి తీర్చిదిద్దిన
పూర్ణచంద్రబింబ వదనమా నేను చూస్తున్నది?
తనను వెంటాడే రాహుసర్పాన్ని ఆకాశాన చూసి భయపడి
జాలరులు నివసించే ఈ కుగ్రామంలోకి వచ్చిన
పూర్ణ చంద్రబింబ వదనమా నేను చూస్తున్నది!

## 12

నేను చూస్తున్నది
తీరపు శంఖ నాదాలకు ఉలికిపడి
అటు ఇటూ దూసుకువస్తున్న రుధిర కాంక్షా బల్లేల
వంటి నయనాలలో కనిపిస్తున్న మృత్యుదేవతా రూపమా?
తీరపు గ్రామంలో నివసించే
జాలరుల ముగ్ధమనోహర కన్య పోలికన
నడయాడ్తున్న మృత్యుదేవతా రూపమా
నేను చూస్తున్నది!

## 13

తెల్లటి ఎండు చేపలను తినడానికి వస్తున్న
పక్షుల్ని చెదరగొడుతూ, చూపరులను
విస్మయపరుస్తున్న ఆమె, దేవకన్య కాదా?

చల్లని సైకత తీరవనంలో
చేతిలో అడివి తీగె ధరించి,
తన శిరోజాలను అయిదు పాయలుగా తీర్చిదిద్ది
అక్కడ నడయాడుతున్న ఆమె, దేవకన్య కాదా?

**14**

**(అతడు తన చెలికానితో)**

పూల పరిమళాలు వనమంతా వ్యాపించి ఉన్నాయి.
ఇసుక తిన్నెల తాజా సువాసన గమ్మత్తుగా ఉన్నది.
ఆమె సుమధుర సంభాషణా స్వరం,
యవ్వనోద్రేకాన ఉప్పొంగుతున్న కుచద్వయం
ఆమె నిండుపున్నమి చంద్ర వదనం,
ఎక్కుపెట్టిన ధనుస్సుల్లాంటి రెండు కనుబొమలు
అనుకరించ వీలులేని మెరుపుతీగె వంటి నడుము
ఇవే, ఇవే నన్ను మరింత కలవరపెడ్తున్నవి.

**15**

తీరాన్ని తాకి విరుచుకుపడ్తున్న అలలు
మనోహర సైకత తీరం,
సుగంధ పరిమళాలను వెదజల్లే పుష్పగుచ్ఛాలు
దట్టమైన వనాలున్న సముద్ర తీరం
సువాసనలతో అలరారే ఆమె శిరోజాలు
రాకా చంద్రబింబంలా ప్రకాశించే ఆమె వదనం
తళతళలాడే చేపపిల్లల్లా ఆమె కన్నులు

ఇవే, ఇవే నన్ను మరింత కలవరపెడ్తున్నవి.

**16**

శంఖాలు వర్ధిల్లే సైకత తీరం
పరిమళాలు పరిఢవిల్లే అరణ్య సమీరం
విచ్చుకోని మొగ్గలున్న పుష్పలతికా సమూహం

ఆ దారి వెంబడే ఆమె ఒంటరిగా వస్తున్నది.
తెల్లని మల్లెమొగ్గల్లాంటి ఆమె పలువరుస
నిండు చందమామలాంటి ఆమె వదన సౌందర్యం.
మనసున మరులు గొలిపే స్తనద్వయం
ఇవే ఇవే నన్ను కలవర పెడ్తున్నవి.

## 17

### (విరహవేదనలో అతడు)

నీ సోదరులు సముద్రాన వేటకు వెళ్లి ప్రాణాలు హరిస్తారు.
నీవూ అంతే! నాలో ప్రవేశించి నా ఉసురు తీస్తున్నావు.
ఉప్పొంగిన స్తనభారానికి వంగి నీ తనూ మధ్యమేనాడో
కృశించిపోయినది. దానిని పోగొట్టుకోకు సుమా!

## 18

శీతల నేత్రాలున్న వలను విసిరి నీ తండ్రి చేపల ప్రాణాలు హరిస్తాడు.
నీ విశాల నయనాల వలలో నన్ను బంధించి తీస్తున్నావు నా ప్రాణాల్ని!
ముత్యాలతో అలంకరించబడిన నీ స్తన భారానికి వంగి
నీ సన్నని నడుము, తుఫాను మేఘాల మధ్య మెరుపుతీగెలా
మరింత సన్నబడ్తున్నది. దానిని పోగొట్టుకోకు సుమా!

## 19

నీ అగ్రజుడు వేగంగా పయనించే పడవలో పోయి
సముద్ర జీవుల ప్రాణాలు హరిస్తాడు. నీ కనుబొమల
ధనుస్సుతో బాణాలు సంధించి నీవు నా ప్రాణాలు తీస్తున్నావు.
ఇతరుల కష్టాలతో నీకేమి పనిలే? నీ కుచద్వయ
భారానికి నడుము మరింత నాజూకైనది. దానిని పోగొట్టుకోకు సుమా!

## 20

### (అతడు తన హృదయంతో సంభాషిస్తున్నాడు)

చేతిలో పగడపు కర్రతో
ఆ ఎర్రకళ్ల చిన్నది ముత్యాలను నూరుతున్నది.

తెల్లముత్యాలను నూరుతున్న ఆ ఎర్ర పిల్ల కళ్లు
అవి నీలికలువలు కావు... అవి క్రూర నేత్రాలు...

## 21

సముద్రపు అలలతో శుభ్రించబడ్తున్న
తమాల వృక్ష ఛాయన నడయాడ్తున్న హంసలా
ఆ ఎర్రకళ్లపిల్ల, తెల్లని హంసలా ఆ ఎర్రకళ్లపిల్ల
ఆ కనుల నిండా కాఠిన్యమే... మృత్యు నయనాలవి–

## 22

తేనెలూరే నాలుకలున్న ఊదా రంగు పూలు చేతిలో ఉంచుకుని
ఆ ఎర్రకళ్ల పిల్ల పక్షులను బెదరగొడ్తున్నది, ఎండు చేపల్ని
కాపలా కాస్తూ! ఎండు చేపల్ని ఎత్తుకుపోబోతున్న
పక్షులను అదిలిస్తూ ఆ ఎర్రకళ్ల చిన్నది. అవి
కనులు కావు, పదునైన బల్లేలు ఆ భయం గొలిపే కళ్లు.

## 23

### (బాటసారితో అతడు)

ఓ అందాల హంసా! ఆమెను కలువకుమా!
నీ నడక ఆమె నడకలా లేదు.
ఓ అందాల హంసా! ఆమెను కలువకుమా!
నీ నడక ఆమె నడకలా లేదు.
ఉప్పొంగే అలల నీటితో చుట్టబడిన ద్వీపాన్ని
కాల్చివేస్తూ ఆమె అటుయిటు తిరుగుతున్నది.
ఓ అందాల హంసా! ఆమెను అనుసరించకు!
నీ నడక ఆమె నకడలా లేదు.

## 24

### (విరామం)

బెదర్తున్న హరిణ నయనాల మాధవి
కోవలన్ పాడిన సముద్రతీర వన గేయాన్ని విన్నది.

ఆమె ఇలా అనుకున్నది. 'ఈ పాటలో వేరే
యువతి ప్రసక్తి ఉన్నది. ఇతడు నన్ను మరచి
పోతున్నాడు కాబోలు'–

అలా అనుకుంటూ ఆమె ఆ పాట విని సంతోషపడ్తున్నట్లు నటిస్తూ అతడి చేతిలోని వీణను తానందుకుని, తాను వేరే వ్యక్తిని వలచినట్లు అర్థం వచ్చేలా సముద్ర తీరపు గేయాన్ని ఆలపించసాగింది. సముద్రతీరపు దేవుడైన వరుణుడే ఆమె గాన మాధుర్యానికి విభ్రమం చెందాడు. ఆమె పాటకు, వీణా వాయిద్య మాధురి తోడు రాగా ఆ గానాన్ని విన్న వారందరూ సమ్మోహితులైనారు.

## 25

### (నదితో ఆమె సంభాషించుట)

అందమైన పుష్పాలను వస్త్రంగా ధరించగా
వందలాది భ్రమరాలు మూగి ఝుంకరిస్తున్నపుడు
నల్లని చేపకళ్లతో, ఓ కావేరీ! నీవు
అంచుల నిండుగా ప్రవహిస్తున్నావెందుకంటే
–'నీ భర్త బల్లెం ఏనాడూ మొక్కవోనిది!–
అని నా కవగతమయ్యింది. ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!

## 26

నీవు ప్రవహిస్తుంటే అలలు పూలదండల్లా ఊగుతున్నాయి.
నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తూ అనుసరిస్తున్నాయి.
పూల వనాల నుండి కోయిలలు గానం చేస్తున్నవి.
ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!
నీవు ప్రవహిస్తుంటే అలలు పూలదండల్లా ఊగుతున్నాయి.
నీరు అంచుల నిండుగా పొంగి పొరలుతున్నది
అది నీ భర్త బల్లెపు శక్తి అని
నా కవగతమయ్యింది. ఓ కావేరీ! వర్ధిల్లుము చీరంజీవిగా!

## 27

సారవంతమైన అతడి నేలను
తల్లి తన బిడ్డను సాకినట్లు సాకి వృద్ధి చెందించుము

ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!
ఏళ్ల తరబడి నీ ఆశీస్సులనందజేయుము
ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా
ప్రభు కరుణ వలన నీ ప్రవాహపు జడి తగ్గదు
ఆ సూర్యవంశజుడే ధర్మచక్రాన్ని చేబూని
జనులను రక్షించుచుండగా ఓ కావేరీ! వర్ధిల్లుము చిరంజీవిగా!

**28**

**(ఆమె చెలికత్తె అతడితో)**

ప్రతిరోజూ మన్మథుడిలా నీవు వచ్చి
'ఈ ముత్యాలను కొను' అనేవాడివి.
ఆమె పగడపు నోటిలో తెల్లటి ముత్యాల్లాంటి పలువరుస
పూర్ణ చంద్రబింబపు కాంతులీనే ఆమె వదనం
మా పుకార్ పట్టణంలో, వర్తకుడిలా గర్జించే సముద్రం
సుగంధ పరిమళ పుష్పగుచ్ఛాలకు మిలమిల మెరిసే ముత్యాలతో
బదులిస్తుంది సుమా!

**29**

జాలరులు నివసించే ఈ సముద్ర తీర గ్రామంలో
రహస్య ప్రేమికుల హస్తాల నుండి జారిపడిన
రంగురంగుల గాజులు రహస్యాన్ని బట్టబయలు చేస్తాయి.
అమాయకులమైన మాకీ విషయమెలా తెలుస్తుంది, ప్రభూ!
మా పుకార్ పట్టణంలో
ఝుంకరిస్తున్న తుమ్మెదను తనలో దాచుకున్న తెల్లకలువ
ఎత్తైన తమాల వృక్షపు పూల కొమ్మపై ఉన్న హంసను చూచి
తారాసేవిత చంద్రుడనుకుని వికసిస్తుంది సుమా!

**30**

మా సముద్ర తీర గ్రామంలో
మధుపాన మత్తులైన వారి పతనమందరికీ తెలిసినదే!
నీవు మా స్త్రీలకు కలుగజేస్తున్న

ఈ దీర్ఘవ్యాధికి మందున్నదో లేదో
మాకెలా తెలుస్తుంది ప్రభూ!
మా పుకార్ పట్టణంలో
అలలు ఇసుకగూళ్లను చెదరగొడ్తాయి.
బల్లేల్లాంటి విశాలమైన నయనాలు నీళ్లతో నిండగా
వదనంపై ఏర్పడ్డ గాయాలతో మా స్త్రీలు
దోసిళ్లతో ఇసుకను దూసి
సముద్రాన్ని నింపాలని ప్రయత్నిస్తారు.

**31**

**(ఆమె చెలికత్తె మాట్లాడుతున్నది)**

అతడు మచ్చుల పీతల జంటను చూసాడు.
సముద్ర తీర వనంలో పూలగుత్తుల మధ్యనున్న నన్నూ చూసాడు.
ఉప్పొంగే అలల తత్వమున్న ఈ జాలరి పెద్ద నైజం నా
కర్థం కాలేదు. ఇంద్రియ క్షోభకు గురై అతడు
మతిమాలి నాతో ఒక్కమాట మాట్లాడకుండా నిష్క్రమించాడు.
శిరోజాలను అయిదు పాయలుగా జడవేసుకున్న జవ్వనీ! విను!

**32**

**(ఆమె బాధతో అంటున్నది)**

మన గురించి ఆలోచించకుండానే అతడు వెళ్లిపోయాడా,
అతడూ, అతడి కరుణా, అతడి అశ్వచోదిత రథమూ?
మనల్ని వదిలేసిన వాడిని వెళ్లిపోనీ!
పూలగుత్తుల్ని అడివి తీగెతో కట్టి పట్టుకున్న నెచ్చెలీ!
ఓ హంసలారా! మనల్ని మరిచిన వాడిని మనమూ మరచిపోదాం!

**33**

ఈ దుఃఖభరిత సాయంకాలపు సమయాన!
నా కనులు దుఃఖించినంత నీవు దుఃఖించలేవు.
తియ్యటి తేనెలూరు నీలికలువా, విశ్రమించుమీనాటికి!
నీ కలలో కనిపించునేమో, ఆ దయలేని
ప్రేమికుడు సముద్ర తీరానికి వచ్చుచున్న జాడ!

**34**

స్వచ్ఛమైన జలాలున్న సముద్రమా!
పక్షుల్లా వేగవంతమైన అశ్వాలు లాగే
ప్రభువు రథపు చాళ్లను నీవు కడిగి వేస్తున్నావు.
నేనేం చేయగలను? ఓ స్వచ్ఛ జలసాగరమా!
ప్రభు రథపు చాళ్లను నీవు కడిగి వేస్తున్నావు.
శత్రువులతో చేయి కలుపుతున్నావన్న సంగతి గమనించావా?
మరి, నేనేమి చేయగలను?

**35**

పెను అలలై పొర్లుతున్న మహార్ణవమా!
నా ప్రియమైన ప్రేమికుడి దృఢమైన రథపు చాళ్లను
నీ అలల నీటితో కడిగి కనిపించకుండా చేస్తున్నావు.
ఓ రాజహంసా! సరససల్లాపాల్లో మునిగి ఉన్నావా!
ఓ చల్లని పుష్పవాటికా! ఓ శీతల తడి తీరమా!
మీరతనికి చెప్పరేల 'అది సరైన పనికాదని'–

**36**

ఓ కడలిరాయా! అలలతో పెట్రేగి నీవు
నా ప్రియుడి రథపు చాళ్లను కడిగి కానరాకుండా చేస్తున్నావు.
ఓ సముద్రపు జలాల్లారా! చిరంజీవులై వర్ధిల్లండి!
అలలతో చెలరేగి ఓ సముద్రమా! నా మనోహరుడి
రథచక్రపు ఆనవాళ్లను కానరాకుండా చేస్తున్నావు.
నీవు ఒప్పుకోకపోయినా మన ప్రేమకథ ముగిసింది.
ఓ సముద్రపు జలాల్లారా! చిరంజీవులై వర్ధిల్లండి!

**37**

**(ఆమె నెచ్చెలి ఆమెతో సంభాషిస్తున్నది)**

'కడలిరాయా! నీ అలలు స్వర్ణధాన్యపు వరిపొలాల
వరకు విస్తరించి, ప్రశస్తమైన నీటి ముత్యాల ఆభరణాలతో,
పగడపు వడ్డాణముతో సర్వాలంకార భూషితలైయున్నవి.

అవి సాగర తీర వనంలో తాజాగా గాయాల్ని రేపుతున్నవి.
ఆ వనం నిండా విరబూసిన తమాల పుష్పాలు
మీన కేతుని ఆశీస్సులతో ఆమెను గుర్తించకుండా
దాస్తున్నవి. ఇప్పుడామె తల్లి ప్రశ్నిస్తే నేనేం చేయగలను?

**38**

సముద్ర రాజా! నీ అలలు ప్రవాళపు అధరాలను,
తెరచి ముత్యాల పలువరుసను కనిపించేలా చేస్తూ,
జాలరులు తమ వలలను ఎండబెట్టే గుడిసెల
ప్రాంతం వరకు విస్తరించియున్నవి. వర్షాకాలంలో
పుష్పించే బూడిద గుమ్మడి బంగరు పుష్పాల్లా కాంతులీనే
ఆమె, విరహవేదనతో కుందుచున్నది. ఆమె తల్లి
దేవుని ప్రార్థించి ఆమె దురవస్థకు కారణమైన వ్యక్తి
గురించి తెలుసుకుంటే నేనేమి చేయగలను?

**39**

సాగరప్రభూ! దయ కలిగిన నీ అలల సమూహం
తీర వనంలోకి ప్రవేశించి తమపై గుమికూడిన
పుష్ప పరిమళాలతో అక్కడి చేపల వాసనను
తొలగదోస్తున్నవి. అన్నీ తెలిసినవారికి కూడ ఈమె
పడ్తున్న బాధను తొలిగించ శక్యం కాదు. ఒంటరిగా
ఆమె విరహోత్కంఠితయై ప్రియుని రాకకై ఎదురుతెన్నులు
చూస్తున్నది. ఆమె తల్లికి ఈమె పడ్తున్న రుగ్మత
గురించి తెలిస్తే, నేనేమి చేయగలను?

**40**

**(ఆమె తన నెచ్చెలితో మాట్లాడ్తున్నది)**

అది రాత్రి తొలిజాము. కాంతి కారకుడు రవి
అస్తమించినాడు. ఒంటరితనం వదిలించుకో వీలులేనిది
కన్నీళ్లు నిండి పొంగి పొరలుతూన్నవి

నిండైన పూలజడ వేసుకున్న చిన్నదానా!
ఈ సాయంకాలము అగ్నిగుండము కాగా, గాజులు జారి,
వెళ్లిపోయిన అతగాడి నేలపై పడి ఉన్నవెందుకు?

## 41

సూర్యుడు అస్తమించినాడు. చీకటి దట్టంగా
అలుముకున్నది. పూలు విచ్చుకున్నపుడు
నీటి చుక్కలు రాలినట్లు కాటుక కన్నుల నుండి కన్నీరు
దుఃఖ వర్షమై కారుచున్నది. ఓ పూర్ణచంద్రబింబ వదనా!
ఈ భరించరాని సాయంకాలము సూర్యుడిని మింగి
చంద్రుడిని కక్కగా, వెళ్లిపోయిన అతగాడి నేలపై
చీకటి కనిపించుచున్నదెందుకు?

## 42

పక్షుల పాటలాగిపోయినవి. దినకరుడు అదృశ్యమైనాడు.
భరించ శక్యం కాని దుఃఖాన విశాల నయనాలు విశేషంగా
కన్నీటిని వర్షిస్తున్నవి. జడనిండా పూలు తురిమిన
సుందరీ! ఈ భరించరాని సాయంకాలము, నా జీవితం
లోకి ఇంత నిర్దయగా ప్రవేశించి, వెళ్లిపోయిన అతగాడి
నీడ నేలపై కనిపించుచున్నదెందుకు?

## 43

**(ఆమె స్నేహితురాలి పలుకులు)**

సముద్రతీరపు నీటిపై నుంచి శంకువనంలోకి
ప్రవేశించిన అతడు మన పసితనపు ఆటలను
భగ్నం చేసి వెడలిపోయినాడు. మన ఆటలను భగ్నం
చేసి అతడు వెళ్లిపోయినా, ప్రేమించే నా హృదయాన్ని
వీడి వెళ్లలేదు.

## 44

సముద్రతీరపు నీటిపైనుంచి తీరపు వనంలోకి
ప్రవేశించి మనముందు నిలబడి అతడిలా అన్నాడు–

"నన్ను అనుగ్రహించండి" అతడు మనముందు నిలబడి
–నన్ను అనుగ్రహించండి' అన్న అతడు మన భీతహరిణేక్షణా
దృక్కులను మరచిపోలేదు.

**45**

ఎవరో అపరిచితుడు హంసల సయ్యాటను గమనించాడు.
అతడు మనల్ని నిన్నంతా గమనిస్తూనే ఉన్నాడు.
నిన్నంతా మనల్ని గమనిస్తూనే ఉన్న అతగాడు
మన వక్షోజాలపైన కెంపుచుక్కల్లా మనల్ని వదిలిపోలేదు.

**46**

**(ఆమె కొంగతో సంభాషిస్తున్నది)**

ఇటుల రావలదు, ఓ బకరాజమా! ఈ సముద్ర తీరవనం వేపు ఇటు
రావలదు. ఓ బకరాజమా! ఈ సముద్రతీర వనంవేపు రావలదు.
నా విరహ వేదనను పెను అలల సముద్రదేవునికి విన్నవించవలదు.
ఇటు రావలదు, ఓ బకరాజమా! ఈ సముద్ర తీర వనం వేపు రావలదు.

**47**

**(విరామం)**

*ప్రశస్తమైన ఆభరణాలు ధరించిన మాధవి*
*కాంతివంతమైన కలువ పూల రెక్కల్లాంటి*
*తన సుతిమెత్తని వేళ్లతో వీణా తంత్రులను మీటుతూ*
*సైవ్వాలిరాగాన్ని అద్భుతమైన పదాలతో ఆలపించింది.*
*తృతీయ స్వరాన్ని ప్రథమ స్వరంతో మేళవించి*
*శాస్త్రోక్తంగా కొత్త రాగాన్ని సృజించి పాడసాగింది.*

**48**

**(సాయంకాలముతో సంభాషిస్తున్నదామె)**

తియ్యని విలారి రాగంతో జాలరులు పాడుతున్నపుడు
పంచమ స్వరం తృతీయ స్వరంతో ముడిపడగా
ఆ సాయంకాలము నీవు నాతో కలిసి ఉన్నావు.

పంచమ తృతీయ స్వరాల మేళవింపులో
మనం కలిసి ఉన్నాము. దయలేని దోపిడి దొంగలా
నా జీవితాన్ని దోచుకున్నావు. నీ సాయంకాలమా!
చిరంజీవిగా వర్ధిల్లుము–

**49**

విడిపోయేప్పుడు వినవచ్చే వివిధ ఓదార్పు వాక్యాల
నీడలో వారిరువురు నిలబడి కన్నీరు కార్చినారు.
ఓ సాయంకాలమా! వారి జీవితాన్ని వృధా చేస్తున్నావు సుమా!
శత్రురాజుకు నీ వెటువంటి మిత్రుడివో తెలీదు కాని
మన ప్రభువును తన కోటలోనే బందీ చేసినట్లు
ఓ సాయంకాలమా! నీవు నా జీవితాన్ని వృధా చేసినావు!!

**50**

నా బాధ అధికమగుతున్నది. దినకరుడు అస్తమించినాడు.
నన్ను కలవరపెట్టే సాయంకాలమా! పగటి కనులను
మూయడానికి నీవు అరుదెంచినావు.
నీవు సంధ్యా సమయానివైతే, నా ప్రియుడు సూర్యుడైతే
ఈ ప్రపంచం వాస్తవంగా శిధిలమౌతున్నది.
ఓ సాయంకాలమా! చిరంజీవిగా వర్ధిల్లుము.

**51**

**(ఆమె నెచ్చెలి మాట్లాడుతున్నది)**

మమ్మల్ని ఆనందేతికారాలతో కలవరపరచే సాయం
కాలమీనాడు, చెలరేగు దావాగ్నిలా మమ్ము దహిస్తున్నది.
అతడి దయాపూరిత వాక్కులను మేము ప్రతినగా
భావించి మోసపోయినాము. సముద్రతీరపు వనంలోని
పూలవాటికలో అతడి మోసపూరిత వాక్కులను భరించా
ల్సిందేనా!' ఓ అనంత సాగర దేవతా! మేము నీ
పాద పద్మములకు ప్రణమిల్లుతున్నాము.

## 52

ఈ మాటలు విని కోవలన్ అనుకున్నాడు– "నేనే కదా సముద్ర తీరమును గురించి గానం చేసింది. ఈమె నర్మగర్భంగా అసత్యపు వాక్కులను పేర్చికూర్చి ఎవరినో మనసులో తలపోస్తూ ఇప్పుడు పాటపాడినది..."

ఆ విధంగా అతడి కర్మ పరిపక్వం చెందడంతో అతడు తన మనస్సును వీణాగానం వేపు మరల్చినాడు. పూర్ణచంద్రబింబం వంటి ఆమె వదనంపై నుంచి తన చేతుల్ని తీసివేస్తూ– 'చాలా సమయం గడచినది, ఇంటికి పోదాం'– అని పలికాడు.

ఆమె వెంటనే లేవలేదు. అయినా అతడు తన చెలికాండ్రతో అక్కడి నుండి నిష్క్రమించినాడు.

అతడు వెళ్లిన పిదప ఆమె తన చెలికత్తెలను నిశ్శబ్దంగా ఉండమని ఆజ్ఞాపించి, పుప్పొడి కమ్ముకున్న ఆ సముద్రతీర పూలవాటిక నుంచి తన రథంలో బయల్దేరి శూన్యహృదయంతో ఇంటికి చేరుకుని దైవాన్ని ఇలా ప్రార్థించింది.

–'మదగజారూఢుడై, అగ్ని ఖడ్గాన్ని ధరించిన కెంపియాన్ చోళరాజు ఈ జగత్తులోని రాజులందరిని పాదాక్రాంతుల గావించినాడు. అతడి పుష్పభరిత శ్వేత ఛత్రము తనయందు చక్రవాళ పర్వతాలను ఇముడ్చుకొనును గాక!'–

✤✤✤✤✤

**వీణలు నాలుగు రకాలు** : 1) 21 తంత్రులు కలది – **భేరివీణ**
2) 19 తంత్రులు కలది – **మకరవీణ**
3) 14 తంత్రులు కలది – **చకోటవీణ**
4) 7 తంత్రులు కలది – **చెంగొట్టువీణ.**

**శృతి :** శృతికి రెండవ స్వరము తోడు; మూడు, ఆరు శత్రువులు; నాలుగు–మిత్రుడు; అయిదు–శాఖ.

**ఆటలు :** రైతులు–కాపుల ఆట – **మారుతం (మరుదం)**
వేటగాళ్లు – **పాలై**
తీరవాసులు – **నేత్యల్**
కొండప్రాంతం – **కురింజి**
గోపాలకులు – **ముల్లై**

# 8. వసంతకాలం

అత్యంత ప్రసిద్ధుడైన మారన్ మహరాజు తన చెలికాడైన వసంతుడితో కలిసి శీతల జలాలచే పోషించబడే సారవంతమైన తమిళదేశపు నేలను, ఉత్తరాన వేంకటం కొండలు, దక్షిణాన కుమారి సముద్రం ఎల్లలుగా పాలిస్తున్నాడు. ఈ దేశంలో ఆకాశాన్ని చుంబించే భవనాలున్న మధురై, ఖ్యాతిగాంచిన ఉరంటాయి, కళకళలాడే వంసి, పుకార్ పట్టణాలు ప్రసిద్ధికెక్కాయి.

అగస్త్య మహాముని నివాస స్థానమైన పొటియల్ కొండల నుంచి వీచే దక్షిణగాలి వసంత ఋతువు ఆగమనాన్ని ప్రకటిస్తున్నది. 'మీనధ్వజుడైన యువరాజుకు జయమగుగాక! నూతన దుస్తులు ధరించి వేడుక జరుపుకొనరండి!' అంటూ ఆహ్వానిస్తున్నట్లున్న కోయిల స్వాగత గీతాలు తీర వనాలలో మార్మోగుతున్నాయి. కాముని రాకను ప్రకటించే ఢంకా వాయిద్యకారుడైన కోకిల తన ధర్మాన్ని నెరవేరుస్తున్నది.

పూలరేకుల్లాంటి విశాలనయనాలున్న మాధవి ప్రియునితో తగవు పడి ఒంటరిగా ఇంటికి వచ్చింది. ఆ సముద్ర తీరవనంలో విచ్చుకున్న పూల రెక్కలు అక్కడ జలాలపై పరచుకుని ఉన్నపుడే ఆమె కోవలన్‌తో పరుషోక్తులాడింది నర్మగర్భంగా. అతడు వెళ్ళిపోయాడు. ఇప్పుడామె విరహవేదనకు అంతేలేదు. ఉపశమనం కోసమై ఆమె తన మేడపైని గది, ఆకాశాన్ని చుంబిస్తున్నట్లుండే దానిలోనికి వెళ్లింది. అత్యంత విలువైన ఆభరణాలతో మేను నలంకరించుకుని, చందనాది లేపనాలను శరీరానికి పులుముకుని, కుంకుమ ధారిణియై, దక్షిణ సముద్రపు ముత్యాలను, దక్షిణాది అడవుల చందనాన్ని వసంతుడికి కానుకగా సమర్పిస్తూ పూజలు చేసింది.

పద్మాసనంలో కూర్చుని, వీణను మీటుతూ ఒక అద్భుతమైన గేయాన్ని గానం చేసిందామె. అదే పాటను వీణపై పలికిస్తూ, తంత్రులను సవరిస్తూ, చంపక, అరప్పు, కూటమ్, అతిర్పు రాగాలను అద్భుతంగా పలికించింది. పధ్నాలుగు శృతులను శాస్త్రప్రకారం పలికిస్తూ నాలుగుతో ప్రారంభించి మూడుతో ముగింపు పలికింది. రెండు, అయిదు, ఆరు, మూడు, నాలుగు తంత్రుల

మేళవింపుతో వచ్చే కొత్త స్వరాలను అధ్యయనం చేస్తూ మొదటి తంత్రి వేపు మరలి, తరువాత పంచమ, సప్తమ స్థానాలను అధిగమించింది. మూడు స్థాయీ భేదాలను ఖచ్చితంగా పాటిస్తూ చతుర్ధ, ప్రధమ స్థానాలకు అద్యంతములుగా రాగబంధన మొనర్చి అకనిలై, పురనిలై, అరుకియల్, పెరుకియల్ రాగాలు నాలిగింటిని సమర్ధవంతంగా పలికించింది. వాటి నుంచి ఉద్భవించిన తిరం రాగాన్ని ప్రారంభించిన మెరుపు తీగెలాంటి మాధవి పురానివై రాగాలాపన చేస్తూ మాధవీలతలా మెరిసింది.

విరిసిన పూలగుత్తుల విరహ వేదనకు చలించిన కాముడు సమస్త జగతిని తన రాజదండం, ఛత్రం క్రిందకు తీసుకువచ్చాడానాడు. ఎక్కడ చూసినా అతడి వైభోగమే.

తన ప్రియుడి ఆగమన వార్త వినాలని మాధవి హృదయం ఎంతగానో తపించగా, సంపెంగ, మల్లె, మాధవి, మొల్ల ఇత్యాది పుష్పాలను సువాసనా యుత వేళ్లతో బంధించి, ఎర్రకలువ రేకలను జోడించి, పూలమొగ్గలు, శంఖు పుష్పరేకలతో అతి మనోహరమైన పూలదండను తయారుచేసింది.

తన సుకుమారమైన చేతిలోకి జాజి మల్లెమొగ్గలను తీసుకుని ప్రశస్తమైన మొగ్గను ఏరి, ఎర్రటి మైనపు ద్రవంలో ముంచి ఇలా వ్రాయసాగింది మొగలిరేకులపై.

“సమస్త జీవరాశులను తమ ప్రియతములతో కలిపే యువరాజు వసంతుడేతెంచినాడు.వెండి వెన్నెలలను విరజిమ్మే నెలరాజు కూడా సాయం సమయంతో వర్ధిల్లే విరహ కాలమందు మరింత ప్రవర్ధమానమవుతున్నాడు. కొద్దిక్షణాలైనా, ఘడియలైనా ప్రేమ సమాగంలో గడిపే ప్రేమజంటలపైనా, ప్రియతముల ఎడబాటులో కుందుచున్న ఒంటరివారిపైనా కాముడు తన పుష్ప పరిమళ అమ్ములను సమానంగా ప్రయోగించి కలవరపెట్టుచున్నాడు. గ్రహించగలరు”–

అరవై నాలుగు కళలందు ఆరితేరిన ఆమెకీనాడెందులకో అన్ని విద్యలు మరపునకు రాగా, రాగాలు పలకని వీణగా ఆమె మూగవోయినది. రెక్కలు

వీడిన పూవులా ఆమె బిక్కవోయి తనను గాఢంగా ఆవహించిన దుఃఖోద్వేగంలో మాటలు రాని బొమ్మలా నిశ్చేష్ట అయినది. తనలో తానే మాట్లాడుకొంటూ, తన అమాయకత్వాన్ని వెళ్లబుస్తూ, ప్రియుని జ్ఞాపకాలు ఉవ్వెత్తున పొంగి రాగా తెల్లబోయిన వదనంతో నిట్టూరుస్తూ తన ప్రియ నెచ్చెలి వసంతమాలితో ఇలా పలికింది.

"చెలీ! ఇటురా! సత్వరమే వెళ్లి నా మనోహరుడు కోవలన్‌కు ఈ పూలదండ నిచ్చి మొగలి రేకులపై నేను లిఖించిన అభిప్రాయాలను వెల్లడించి ఇటు తీసుకురా!"

విశాల నయనాల వసంతమాలి ధాన్యపురాశులు విరబోసి ఉన్న ప్రాంతానికి వెళ్లి కోవలన్‌కు పూలదండ నివ్వబోతూ తన చెలి అభిప్రాయాన్ని వెల్లడించగా కోవలన్ సమాధానమిచ్చినాడు.

"నుదుటిపై కుంకుమ, వంకీల శిరోజాలు, వంగిన విల్లులాంటి కనుబొమలు, సంపెంగ నాసిక, మధుర బింబాధరాలు ఉన్న ఆ చంచల నయని తన చూపులతోనే ప్రేమను వ్యక్తపరచింది. నేను రమ్మన్నప్పుడు వచ్చి, పొమ్మన్నపుడు వెళ్లిపోయే సాత్వికురాలామె. మేఘాల వంటి శిరోజాల భారానికి కందిపోయే చంద్రవదన ఆమె. సమ్మోహనకరమైన చూపులతో కదిలే ఆ కళ్లు నీటిలో ఈదే చేపపిల్లలను తలపిస్తాయి. ఆమె చిరునవ్వు వెన్నెలలను రువ్వినపుడల్లా ముత్యాల పలువరస మెరపులా ప్రత్యక్షమవుతుంది ఆమె పగడపు అధరాల మధ్య. నన్ను చూడగానే ఆమె విశాల నయని, ఈటెల్లాంటి తీక్షణమైన కన్నులున్న తన నెచ్చెలిలా నటించేది. నాలో కలిగిన ఆశాభంగాన్ని, విరహ వేదనను గమనించి జాలి చెంది ఆ సాయంకాలము తనకు తానుగా వచ్చి నన్నలరించేది. చిలుక పలుకులు, రాయంచ నడక, నెమలి సోయగాలు ఆమె లావణ్యము ముందు దిగదుడుపయ్యేవి. ఆభరణాలను మోయలేని సన్నని నడుము, మోహనకరమైన చూపులు, అత్యంత నాజూకైన ఆమె శరీరం మెరపుతీగెలా కదుల్తుంటే ఆమె కాలి అందియల గలగల మ్రోతలకు, నడుముకున్న వడ్డాణం వయ్యారాలు పోతుంటే ఆమె అద్భుతంగా నాట్యమాడేది. కాని ఆ నాట్యంలో ఏ భావమూ కనుపించని నిర్లిప్తత. నా విరహ వేదన ఆమెను కదిలించినట్లు తోచదు. చేతిలో పూలదండ వయ్యారంగా ఊగుతుంటే ప్రకాశవంతమైన వదనంతో ఆమె

దెబ్బతిన్న సివంగిలా నర్తించేది. విచ్చుకున్న పూలరెక్కలున్న ఆమె శిరోజాలు అలల్లా ఊగుతుండగా, మెడలోని ముత్యాలహారం మృదువుగా కదుల్తుంటే స్తనభారంతో వంగిన నడుమును ఆమె శిరోజాలు తడిమే దృశ్యం నయన మనోహరంగా ఉండేది.

ఆమె నెచ్చెలి నాతో నిష్ఠూరాలాడేది. నేనిచ్చిన సమాధానంలోని నిజాయితీని, నిజాన్ని గ్రహించినా సరే ఆమె కోపాన్ని అభినయిస్తూ నన్ను వీడి పోతున్నట్లు నృత్యభంగిమలను ప్రదర్శించేది. దానిలోనే నాపై తనకున్న ప్రేమను, తన విరహ తాపాన్ని అభినయిస్తూ తనను తాను సమాధాన పరుచుకుంటున్న భావాల్ని వెలిబుచ్చేదా నాట్యమయూరి. తుమ్మెదలు గుమికూడిన పుష్పాలు అందాలు విరబోస్తుండగా సాయం సమయంలో ఆమె దారిన పోయే వారందరికీ తాను పడుతున్న అవస్థను చెబుతూ కన్నీరు కార్చేది. మరల మరల శోకిస్తూ, మూర్ఛనలు పడుతూ అందరితో బతిమాలించుకుని మరల స్వాంతన చెందినట్లు ఆమె వివిధ నాట్య భంగిమలను ప్రదర్శిస్తూ తన నాట్యాన్ని ముగించేది. వివిధాలంకార ఆభరణ భూషితయైన ఆమె సోయగాలు ఎన్నదగినవే; ఆమె నాట్యశాస్త్ర పరిజ్ఞానం మెచ్చదగినదే కాని ఆమె ఒక నాట్యకత్తె మాత్రమే! ప్రియురాలు కాదు"

ఆ పరుష వాక్కులు వినగానే వసంతమాలి దెబ్బతిన్న హరిణంలా బాధపడింది. వ్యధాభరిత హృదయంతో వెనుదిరిగి వెళ్లి, పూరెక్కలపై తన మనోగతాన్ని వెల్లడించి పంపిన పూదండను కోవలన్ తిరస్కరించిన విషయాన్ని చెప్పింది.

"అద్భుతమైన ఆభరణాలను ధరించిన చెలీ! మాధవీ! అతడీ సాయంకాలం ఇటు రాడేమో!"–

విశాలనయని, మృగనేత్రి మాధవి తనలో తానే అనుకున్నట్లు అన్నది– "రేపు ఉదయం తప్పక వస్తాడు"–

ఏదో వెలితి, ఒంటరితనం ఆమె హృదయాన్ని ఆవరించగా శూన్య దృక్కులతో, వివిధాలోచనల్తో తన పూలసజ్జపై పరుండి ఎంతో కాలం భారంగా గడవగా కలత నిదుర పోయింది.

అరుణ కాంతులు వెదజల్లే పద్మాలు, తీపి మామిడి చిగుళ్లు, అశోక పుష్పాలు వసంతుడి ఆగమనంతో వివిధ వర్ణశోభితములై విప్పారినవి. పదునైన ఈటెల్లాంటి విశాలమైన నేత్రాలున్న ఆ సుందరి మనస్సు కలవరంతో ఏమవుతుందో కదా!

“ప్రేమికులతో జగడాలాడే జవ్వనులారా! అనంగుడి ఆజ్ఞను తలదాల్చి పోట్లాటలను మాని ప్రేమసాగరంలో ఈదులాడండి” అని లేత మామిడి చిగుళ్లు తింటూ కోయిలలు గానం చేయసాగాయి.

“సముద్ర తీర వనంలో ఈ సుందరి పాడిన గానాన్ని విని గాయపడిన హృదయం గల ప్రేమికుడా! మొగలి పూల రేకులపై తన మనోభీష్టాన్ని వ్రాసి నీకు పంపిన పూలదండను నీవు స్వీకరిస్తే ఎంత బాగుండేది!”–

✤✤✤✤✤



# 9. స్వప్న వృత్తాంతం

సాయంకాలం. సూర్యుడస్తమించినాడు. ద్రాక్ష తీగెల్లాంటి నడుమున్న జవ్వనులు తమ గృహాలలో కామోద్దీపకాలైన మల్లెమొగ్గలను, లేత ధాన్యాన్ని విరజిమ్మినారు. గృహాలలో మణిస్ఫటిక దీపాలను వెలిగించి రాత్రి దుస్తులను ధరించి ప్రియరాత్రులను ఆహ్వానిస్తున్నారు.

చానాళ్లక్రితం మాలతి అనే ఇల్లాలు తన భర్త రెండవ భార్య కుమారుడికి పాలు తాగించింది. పాలు గొంతులోకి పోగా ఉక్కిరిబిక్కిరై ఆ బాలుడు మరణించాడు. మాలతి దుఃఖానికి అంతేలేదు.

"సద్బ్రాహ్మణుడైన నా భర్త, నా సవతి ఈ విషాదానికి నేనే కారణమని నిందిస్తారు. నిజాన్ని నమ్మరు"– అని దుఃఖించింది.

విగతజీవుడైన బాలుడిని తన చేతుల్లో పొదుముకుని అమరుల దేవాలయాలకు తీసుకువెళ్లింది. అక్కడ కల్పవృక్షము, ఐరావతము, ఇంద్రుడు, సూర్యుడు, పుకార్ పట్టణ రక్షక దేవుడు, మురుగన్, వజ్రాయుధము, పొలిమేర దేవుడు మసత్తన్, నిర్గ్రంధులు, చంద్రుడి దేవాలయాలలో ప్రార్థనలు చేసింది. "సమస్త దేవతలారా! నా మొరాలకించండి. నన్ను కరుణించండి"

అక్కడి నుండి పాషాండుని వసంత సత్తన్ దేవాలయానికి వెళ్లి మూలవిగ్రహం ముందు మోకరిల్లి ఆ దేవుడి కరుణా కటాక్ష వీక్షణాలకై ఎదురుతెన్నులు చూడసాగింది.

ఆ సమయంలో ఆమె ముందు అత్యంత లావణ్యవతి అయిన ఓ దేవత ప్రత్యక్షమై ఇలా పలికింది– "ఓ నిష్కళంక చరితా! నీవే తప్పూ చేయలేదు. తపస్సు చేయనిదే దేవుడు కరుణించడు. ఇది దైవవాక్కు. నీ చేతుల్లో ఉన్న నిర్జీవ బాలుడిని నాకివ్వు" అంటూ ఆ బాలుడిని తన చేతుల్లోకి తీసుకుని, ఆ కటిక చీకటిలో వల్లకాటి వేపు వడివడిగా నడవసాగింది ఆ దేవత, ఇటాకిని అనే యక్షిణి. అక్కడ పాతిపెట్టిన శవాల్ని భక్షించేది. ఆమె ఆ బాలుడిని మింగివేసేదే!

మాలతి రోదనలు విన్న సత్తన్ దేవుడు ప్రత్యక్షమై ఆ బాలుడిని కాపాడి, జీవాన్నిచ్చి– "తల్లీ! నీ బిడ్డడు క్షేమంగా ఉన్నాడు. ఇదుగో!" అని ఆమెకు అప్పగించి అంతర్ధానమైనాడు.

పెరిగి పెద్దవాడైన ఆ బాలుడు వేదవేదాంగ పారీణుడైనాడు. తల్లిదండ్రుల మరణానంతరం వారికి శాస్త్రోక్తంగా కర్మకాండలు జరిపి వారి ఋణం తీర్చుకున్నాడు. అతడి భార్య పేరు 'దేవంతి'. ఒకరోజు అతడామెతో ఇలా అన్నాడు– "పూలరేకుల వంటి కనులదానా! కాటుక అలుముకున్న కనులతో ఈ కాంతిని వీక్షించుము" అని అతడు ఆమెకు తన నిత్య యవ్వనాన్ని దివ్యరూపాన్ని తెలిపి "నా దేవాలయానికి రా!" అని పలికి వెళ్లిపోయినాడు.

ఆమె దేవాలయానికి వెళ్లి "నా భర్త పుణ్యతీర్థంలో స్నానం చేసి రావడానికి వెళ్లినాడు. అతడినిక్కడకు రప్పించి నా చెంత ఉండేట్లు చేయుము తండ్రీ!" అని ప్రార్థించేది నిత్యమూ! ఆ దేవంతికి స్నేహితురాలు కన్నగి. కన్నగి కున్న కష్టము తెలిసిన దేవంతి దేవుడిని పవిత్ర పత్రాలు, చెంగల్వ గడ్డి, ధాన్యము, పుష్పాదులతో పూజించి కన్నగి దగ్గరకు వెళ్లి– "స్నేహితురాలా! విచారించకు. నీ భర్త నీ వద్దకు రాగలడు" అని ఓదార్చింది.

కన్నగి అన్నది– "అతడు వచ్చినా నా హృదయక్షోభ తగ్గదు. ఎందుకంటే నాకు ఓ కల మరల మరల వస్తూ కలవరపెడ్తున్నది. నా భర్త నేను కలిసి ఏదో గొప్ప పట్టణానికి వెళ్లాము. అక్కడి ప్రజలు మాకు దుశ్శకునాల్ని తెలిపినారు. నాపై విషపు తేలు పాకినంత భయం వేసింది. 'కోవలన్‌కు ఏదో అపాయం సంభవిస్తున్నదన్న సూచన'– అది గ్రహించి నేను ఆ పట్టణాన్నేలే రాజు ముందు మోకరిల్లి శరణు వేడినాను. 'ఈ పట్టణానికి, నీకు ఏదో కీడు సంభవించనున్నది'– అని పలికినాను. ఆ దుస్థితి ఏమిటో నేను వివరించలేదు. నీకు చెబితే నవ్వుతావు. చేతుల్నిండా గాజులున్న మిత్రురాలా! అంత హాస్యాస్పదమైన స్వప్నమది"–

తాను వేసుకున్న నగలు మెరుస్తుండగా దేవంతి అన్నది– "బంగరు కంకణాలు ధరించిన యువతీ! నిన్ను నీ భర్త నిరాకరించలేదు. క్రితం జన్మలో అతడి తరపున నీవు చేసిన ప్రమాణాన్ని పూర్తి చేయలేదు. దాని వలన నీకు కీడు సంభవించవచ్చును. కావేరి నది సముద్రంలో సంగమించే ప్రదేశానికి వెళ్లు. అక్కడి తీరప్రాంతంలో నీలికలువలు విరిసే ప్రాంతానికి దగ్గరలో రెండు పవిత్ర సరస్సులున్నాయి. అవి సూర్య సరస్సు, చంద్ర సరస్సు. అక్కడ స్నానం చేసి కామదేవుడిని అర్చించినవారు తమ భర్తలతో ఇష్టోపభోగాలను అనుభవించ

గలరు. తరువాత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. అందుచేత మనము ఓ మంచిరోజున అక్కడకు వెళ్లి పవిత్ర స్నానాలను చేద్దాం!"

"కానీ నాకెందుకో గొప్పగా అనిపించలేదు ఆ కల" అని కన్నగి అంటూండగానే పరిచారిక వచ్చి చెప్పింది– "అడుగో కోవలన్ వస్తున్నాడు! ఈసారి మనతో ఎక్కువ కాలమే ఉంటాడని నాకనిపిస్తున్నది"–

లోనికి వచ్చిన కోవలన్ తన మీది బెంగతో శుష్కించి సన్నమైన కన్నగితో ఇలా అన్నాడు– "ఒక మోసగత్తె, వగలాడి వలలో పడి ఇన్నాళ్లూ నిన్ను నేను నిర్లక్ష్యం చేసాను. నా తల్లిదండ్రులు నాకిచ్చిన సంపదలన్నింటిని పోగొట్టు కున్నాను. ఇప్పుడు దరిద్రం నన్నావహించి సిగ్గుపడేలా చేస్తున్నది"

చిరునవ్వుతో కన్నగి అన్నది– "దీనికి దిగులెందుకు ప్రాణేశా! ఇవిగో నా కాలి అందియలు. వీటిని స్వీకరించు"

కోవలన్ అన్నాడు– "అనేక ఆభరణాలున్న ప్రియురాలా! ఈ స్వర్ణ మంజీరాలు పెట్టుబడిగా మరల వ్యాపారం ప్రారంభిస్తాను. నేను పోగొట్టుకున్న నగలు, సంపదలన్నిటిని తిరిగి మరల సంపాదిస్తాను. మనం ఈ నగరాన్ని విడిచి ప్రఖ్యాతి గాంచిన మధురై నగరానికి వెళ్లి కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం!"

అది అతడి పూర్వజన్మ కర్మఫలం. విధి వ్రాతననుసరించి అతడు చీకటిని తొలగదోస్తున్న వెలుతురు దారిలోకి నిష్క్రమించాడు తొలి వేకువజాముననే.

కన్నగి స్వప్న వృత్తాంతం మాధవి మాటలను శూన్య భాష్యాలుగా మార్చాయి. పూర్వజన్మ కర్మఫలం, విధి వ్రాతననుసరించి అతడు చీకటిని తొలగ దోస్తున్న వెలుతురు దారిలోకి నిష్క్రమించినాడు తొలి వేకువజాముననే, తన భార్యతో కలిసి.

✣✣✣✣✣

# 10. పల్లె దృశ్యాలు

ఇంకా ఆకాశనేత్రము కనువిప్పలేదు.

తెలతెలవారే ముందుండే మసక చీకటి.

పాలిపోతున్న చంద్రుడు తారా ప్రకాశిత ఆకాశపు తెర నుంచి అదృశ్యమైనాడు.

ఆ చీకటి ఘడియలలో కోవలన్, కన్నగితో కలిసి విధి ప్రేరితాన తమ ప్రసిద్ధికెక్కిన గృహాన్ని వీడి, గొర్రెపోట్టేలు, జడల బర్రె, హంసల చిత్రాలు ముద్రితమైన తలుపులున్న ప్రధాన ద్వారాన్ని దాటి వీధిలో అడుగిడినారు. అక్కడ నుండి మెరుస్తున్న సర్పంపై యోగముద్రలో నిద్రిస్తున్న మణివన్నన్ దేవాలయాన్ని ఇంద్ర నిర్మిత సప్త బౌద్ధ దేవాలయాలను దాటి ముందుకు సాగినారు.

యక్ష గంధర్వాది దేవతలు ఆకాశంలో విహరిస్తూ పంచశాఖావృత బోధి వృక్షపు నీడలో ఆసీనుడైన బుద్ధదేవుని పవిత్ర వాక్కులను పలుకుతున్నారా సమయాన. అక్కడ పూజలు చేసి, జైన గృహస్థులు మహారథయాత్రా సమయంలో విచ్చేయు మునుల కొరకు నిర్మించిన చంద్రశిలావరణాన్ని చేరుకున్నారు. అక్కడే స్వర్ణ పుష్పాలు విరిసిన అశోక వృక్షాలు, అయిదు రకాల యోగులు– చారణులు, సిద్ధులు, ఉపాధ్యాయులు, ఆర్యులు, సాధువులు గుమికూడే అయిదు కూడళ్లున్నాయి. దేవాలయపు పక్కన ఉన్న విశాల ఖాళీ ప్రదేశమది. అక్కడ మాంసాహారాన్ని వర్జించి, సత్యవ్రత దీక్షాపరులై, తమ పాపాలను ప్రక్షాళన చేసుకుని, ప్రకృతి ధర్మాలను అవగాహన చేసుకుని, ఇంద్రియాలను నిర్జించి సత్యమార్గాన్ని తెలుసుకున్న జ్ఞానులున్నారు.

అలా వాళ్లు పుకార్ నగరపు ప్రధాన వీధి, కొండలపై నుండి జాలువారి ప్రవహించిన దీర్ఘ నదిలా, జనంతో క్రిక్కిరిసి ఉన్నదానిని దాటి రాజోద్యానవనాన్ని చేరుకున్నారు. ఆ వనంలో ఫలపుష్పశోభితములైన తరూచ్ఛాయల నీడన ఓ మంచినీటి తటాకం, మలయ మారుతపు పొటియల్ వాయువీచికలతో సుగంధ పరిమళాలనిస్తూ ఆ దేశపు ప్రభువుకు అనంగుడైన కాముడిచ్చిన కానుకగా అలరారుతున్నది. అక్కడ నుంచి ఆ విశాలమైన దారి, తన కిరువేపులా సుందరమై

నీడనిచ్చే వృక్షాలతో కడు రమ్యంగా ఉండి అందమైన స్త్రీలు జలకాలాడే కావేరీ నది ముఖద్వారం వద్దనున్న స్నాన వాటికవేపు పోతున్నది. పశ్చిమంగా నడుస్తూ వాళ్లు కావేరీనది ఉత్తరపు గట్టు పక్కన ఉన్న పూలవనాన్ని దాటి, పది మైళ్లు నడచి అక్కడ విరగబూసిన పూలచెట్లున్న 'కవుంతి' జైన ఆశ్రమానికి చేరుకున్నారు. సన్నటి నడుము గల కన్నగి అలిసిపోయింది. కాళ్లీడుస్తున్నట్లు నడుస్తూ ఆయాసంగా గాలి పీలుస్తూ, సువాసనలు వెదజల్లుతున్న శిరోజాలు గల ఆమె చక్కని తన పలువరస కాంతివంతంగా మెరుస్తుండగా అడిగింది– "ప్రాచీన నగరమైన మధురై ఏదీ, ఇంకెంత దూరాన ఉన్నది?"

కోవలన్ జవాబిచ్చినాడు– "అయిదు పాయల సుగంధ శిరోజాలున్న అతివా! మనదేశానికది అయిదారు వందల ఆమడల దూరంలో ఉన్నది".

వారిద్దరూ కవుంతి సాధ్వికి పాదాభివందనం చేసినారు. కవుంతి అన్నది– "శుభ లక్షణాలు కలిగి, ఉన్నత కుటుంబోద్భవులై, చక్కని నడతతో, జైనముని పవిత్రాశీస్సులు పొందిన అదృష్టవంతుల్లా కానవవస్తున్న మీరు, ఇలా దారి తప్పిన వారిలా ఇంత దూరం రావడానికి కారణమేమిటి?"

కోవలన్ బదులిచ్చాడు– "తపస్వినీ! నీ ప్రశ్నకు బదులివ్వలేను. కాని మధురై నగరంలో నా అదృష్టాన్ని పరీక్షించుకొని కొత్త జీవితాన్ని ప్రారంభిద్దామనుకుని వెళ్తున్నాము".

ఆ సాధ్వి అన్నది– "చక్కని అందియలతో ఉన్న ఆమె చిన్ని సుకుమార పాదాలు గులకరాళ్ల గరుకుదనాన్ని భరించలేవు. ఈ దుర్గమారణ్య ప్రాంతం ఇటువంటి యువతులు సంచరించదగింది కాదు. ఆమెను చూడు! ఈ ప్రయాణం చేయ శక్తిగల దానిలా అగుపించదు. కాని నీకు విధి ఏమి వ్రాసిపెట్టిందో ఎవరు చెప్పగలరు. నన్నడిగితే మీరు ఈ ప్రయాణాన్ని విరమించుకొమ్మని చెబుతాను. కాని నాకు తెలుసు నీవు పట్టు విడవవని. నేనూ మధురై నగరానికి వచ్చి జైనముని ప్రవచనాలను, పూర్వ సాధువుల ధర్మమార్గాన్ని వినదలుచుకున్నాను. మీతో వస్తే మీకేమైనా అభ్యంతరమా?" అన్నదామె వినయంగా.

రెండు చేతులెత్తి నమస్కరిస్తూ కోవలన్ ఆమెను స్తుతించాడు– "అమ్మా! నీవే మా వెంట వుంటే నాకే అనవసరపు ఆందోళనలుండవు"–

కవుంతి అన్నది– "కోవలన్! దారిలో మనం అనేక ప్రయాసలకు, ఇబ్బందులకు గురవుతాము. ఎండ వేడిమిని తాళలేని ఈ సుకుమారితో మనం పూల వనాల మధ్యలో పోదలిస్తే, మొదలుతో సహా పీకి పడవేయగా ఆరిన సంపెంగ శాఖల అడుగున ఉన్న గుంటలలో కాళ్లు పడకుండా జాగ్రత్తగా నడవాలి సుమా!

వాటినెలాగోలా దాటి ముందుకు పోతే రాలి మగ్గిన పనసపండ్ల తొక్కలపైన జారిపడకుండా, ముందుకు పోవాలి. అలా కాకుండా పసుపు, అల్లపు తోటల మధ్య నడిచేప్పుడయితే ఎర్రటి పనసతొనల్లోని గింజలు తగిలి ఆమె పాదాలు కందకుండా జాగరూకత వహించాలి. విశాలమై, చేపకన్నుల వంటి కన్నులున్న చిన్నదాని మగడా! దున్నిన పొలాల మధ్యగా నడుద్దామంటే ఈ చిన్నది, అటూ యిటూ పరిగెత్తే పందికొక్కులు, అడవి పిల్లులు చేపలను వేటాడ్డం చూసి భయపడ్తుందేమో!

దాహం వేసి నిర్మల జలాలతో అలరారుతున్న సరస్సు నీటిని తాగబోయేప్పుడు జాగ్రత్త సుమా! చెరకు గడలకు అల్లుకున్న తేనెతుట్టెలు భారం కాగా అవి వంగి సరస్సు జలాలను తాకగా నీటి అంచుల వద్ద ఉన్న తేనెటీగలు మీ దోసిళ్ల కదలికలకు అదిరిపడ్తాయేమో!

నీళ్లలో ఉన్న రెల్లును కదిలిద్దామనుకుంటే నీలికలువలు విప్పారగా వాటి యందు దాగి ఉన్న నల్లతుమ్మెదలు ముదుల్లా పైకెగరగలవు సుమా! ప్రయాణపు బడలికలో కూడా నీ అడుగులు సరిచూసుకుని నడవగలవు.

కాలువ గట్లపై నడిచేప్పుడు అందమైన పీతలు, నత్తలు అటూ యిటూ కకావికలైపోతుండడం గమనిస్తావు. వాటిపై పాదాలు మోపి బాధ కలిగించరాదు. ఆ తరువాత మనకు కలిగే బాధ చెప్పలేనిది.

పొలాల గుండా, తోటల మధ్యగానే పోవాలి గాని మనకు వేరే దారిలేదు. నల్లని జుట్టు గలవాడా! ఈ లావణ్యవతితో నడిచేప్పుడు ఈ విషయాలు గుర్తుంచుకో!"

అలా పలికి కవుంతి సాధ్వి తన భిక్షాపాత్రను తీసుకుని, జోలెను తగిలించుకుని, నెమలీకల కట్టను చేతనుంచుకుని ఇలా ప్రార్థించింది– "పంచాక్షరీశ్వరుడు (అయిదు బీజాక్షరములు– అ,సి,ఆ,ఉ,చా) మాకు రక్షగా ఉండును గాక!"–

సచ్చరితురాలైన కవుంతి సాధ్వి తోడురాగా కోవలన్, కన్నగిలు తమ ప్రయాణం కొనసాగించినారు. శని గ్రహానికి ఆగ్రహం వచ్చి ప్రజ్వరిల్లినపుడు, శుక్రుడు తన వ్యాప్తి చెందిన కాంతులతో దక్షిణానికి మరలినపుడు కొడగు కొండలపై మబ్బులుబ్బి ఉరుములు, మెరుపులు, పిడుగుల మధ్య వర్షాలు కుండపోతగా కురవగా ఈ కొండలలో పుట్టిన కావేరీ నది తొలి వరదలుధృతమై నదీ తీరాలను ఒరుసుకుంటూ పరవళ్లు తొక్కుతూ పెన్నిధిని చేరి సంబరపడే శబ్దాలు తప్ప వేరే ధ్వనులు వినరావక్కడ. చేదబావి శబ్దాలు, మోటబావుల ధ్వనులూ, ఎసరు పొంగిన మోతలూ ఆ వరద పరవళ్ల హోరు ముందు మిన్నకుంటాయి.

సరస్సులలోని తామరతూళ్ల సమూహాలు పంటచేల వరిపొలాల్ని ముద్దాడుతున్నట్లున్నాయి. వీరాధివీరులైన రాజులిద్దరు తమ సైనిక బలాల్ని మొహరించినట్లు చెరకు తోటలు, నీటికోళ్లూ, కొంగలు, ఎర్రపాదాల బాతులు, హంసలు, ఆకుపచ్చ కాళ్ల హెరాన్లు, అడవికోళ్లు, కొర్మరాంట్లు, స్నైపు పక్షులు, అనేక రకాల నీటి పక్షులు, వాటి శబ్దాలతో సరస్సులు మార్మోగుతున్నాయి. నల్లని గేదెలు, దున్నపోతులు మెత్తటి మట్టితో కూడిన బురదనీళ్లలోకి చేరి సౌఖ్యంగా ఈదులాడుతున్నాయి. తడవని తమ వెంద్రుకల్ని, వీపుల్ని తడిచేలా మునుగుతూ, ఎర్రబడిన కళ్లతో దిక్కులు చూస్తూ పక్కనున్న రెల్లుగడ్డి పరకలకు వీపునానించి తోముకుంటున్నాయి. కొమ్ములతో వరిగడ్డి పనలను విరజిమ్మినపుడు వాటి నుండి ధాన్యం రాలుతుండగా అవి విప్పారిన ఛత్రాల్లా వెలుగుతున్నవి.

దూరంగా రైతుల, రైతు కూలీల మాటలు వినబడుతున్నాయి. ఎర్ర చేపల్లాంటి కళ్లున్న స్త్రీలు పొలాల్లో పనిచేస్తూ, తాగిన మధువిచ్చిన ఉత్సాహంతో హుషారుగా పాడుతున్న గీతాలు వాయువీచికల సంగీతంతో అలల్లా వ్యాపిస్తున్నవి. కాళ్లకు కడియాలు, చేతులకు కంకణాలు మెరుస్తుండగా వాళ్ల దేహాల్ని కప్పిన కోకల కంటిన బురద ఎండలో తళతళలాడుతున్నది. అలవోకగా వారి పెదాల నుంచి జారిన బూతుపదాలు, జానపదాల హొయల్లతో కలిసి కొత్త అలంకారాల నిస్తున్నవి. వాళ్లు తమ కొప్పుల్లో తురుముకున్న పూలను తీసివేసి, వరికంకుల్ని నెమలి పింఛాల్లా అమర్చుకుని విరగబడి నవ్వుతుంటే, నాగళ్లు, అరకల పక్కన నిలబడి రైతులు పాడుతున్న మెచ్చుకోలు పాటలు వీనుల విందుగా ఉన్నవి. వరికంకుల, నీలి కలువల, పచ్చగడ్డి పుష్పగుచ్ఛాలతో రైతులు భూమిని సర్వాలంకార శోభితంగా చేస్తున్న తీరు కనిపిస్తున్నది.

ఎద్దుల్ని, దున్నపోతుల్ని తోలుతూ, పరచిన ఎండు వరి పనలను తొక్కిస్తున్నపుడు వాళ్లు గానం చేస్తున్న ముకవాయి పాటలు, వరిగడ్డి కట్టలకు, ధాన్యపురాశికి మధ్య గంతులేస్తూ రైతుకూలీలు మోగిస్తున్న ఢక్కామోతలు, నేర్పరులైన నాట్యకారులు చేసే నాట్యాల్లో వినిపించే కినాయి ఢంకాల శబ్దాల్లా ఉన్నాయి. ఒకదాని తరువాత ఒకటి ఈ దృశ్యాన్ని, గీతాల్ని, సంగీతాల్ని ఈ ప్రయాణీకులు కావేరీ నది ఒడ్డునే నడుస్తూ అనుభవించి ఆనందించి అలసటను పోగొట్టుకున్నారు.

వ్యాఘ్రధ్వజ రథుడైన చోళరాజు విజయాన్ని పురస్కరించుకుని అగ్నిహోత్రాలు సమర్పిస్తున్న బ్రాహ్మణుల ఎత్తైన గృహాల నుండి వెలువడుతున్న ధూమాలను వాళ్లు చూసారు. నీటితో నిండిన మేఘాలచే ఆవరింపబడిన కొండ శిఖరాల్లా ఆ యిళ్లు కానవస్తున్నాయి. ఉప్పొంగిన జలాల్తో ప్రవహించే కావేరీ నదీ పుత్రులైన రైతులు తమ కృషీ ఫలితాన్ని జనులకందించి రాజుకు పరోక్షంగా సాయం చేస్తుండడాన్ని వాళ్లు గమనించారు. చెరకు గానుగలున్న చోటు నుంచి వెలువడ్తున్న తియ్యని వాయువులు బంగారపు రాశుల్లా మెరుస్తూ ఇంకా తూర్పారబట్టని ధాన్యపు కుప్పల మీదుగా ప్రవహించడం గమనించారు వాళ్లు. పాతకాలపు గ్రామాలు మబ్బులు కమ్మిన కొండల్లా ఉండగా, గ్రామాల మధ్యనున్న పొలాలు చక్కని లోయల్లా ఉండడాన్ని చూస్తూ రోజుకు ఆమడ చొప్పున ప్రయాణం సాగించారు.

అలా ప్రయాణిస్తూ వాళ్లు కొన్నిరోజులకు ఓ సాయంకాల సమయానికి నది చుట్టూరా అల్లుకున్న 'అరంగం' గ్రామాన్ని చేరుకున్నారు. దగ్గర్లో ఒక దైవ సన్నిధానం పూలమొక్కలతో, వృక్షాలతో వంగిన వెదురు పొదలతో సుందరంగా కనిపించింది. అక్కడ ఒక ముని ధర్మం, సత్యం, మూడు విలువల అతిశయత్రయం (సహజ, కర్మక్షయ, భౌతిక) గురించి మహాజైనుని గురించి చెబుతూ అతడు 'పుకార్' పట్టణంలోని చంద్రశిలా వేదిక ప్రస్తావన తేగానే కవుంతి సాధ్వి ఆ మునిని గుర్తుపట్టి అతడి పాదాలపై బడి నమస్కరించింది. కోవలన్, కన్నగిలు అలాగే చేస్తూ– "మా పూర్వజన్మ పాపాలు పరిహరించబడును గాక!" అని మొక్కుకున్నారు. కోరిక, ద్వేషాలకు అతీతుడైన ఆ ముని వారి రాకకు కారణం గ్రహించి ఇలా పలికాడు– "ఓ సాధ్వీ! కవుంతీ! కర్మను తప్పించుకో వీలులేదు.

దేన్నైతే వదిలేయాలో, ఏదైతే చేయకూడదో దాన్నే చేసేట్లు చేస్తుంది. నేలలో నాటిన విత్తనం మొలకెత్తి మొక్కగా పెరిగి ఎల ఫలిస్తుందో అలాగే కర్మ పరిపక్వం చెందినపుడు మన నడకను ఆపడం సాధ్యం కాదు. గాలిలో దీపం పెట్టి వదిలేస్తే ఆరిపోతుంది కదా! ప్రాణం కూడా అంతే!

సర్వవ్యాప్తుడైన ఆ ధార్మికుడు, కరుణామయుడు, ఇంద్రియాతీతుడు, ధర్మతత్త్వ పారంగతుడు, నిశ్చలుడు, విజ్ఞాని, త్రికాలజ్ఞుడు, అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు, సిద్ధుడు, భగవానుడు, పురాణుడు, మోక్షాధి నాయకుడు, పరంజ్యోతి, సర్వగుణ సంపన్నుడు, సాత్త్వికుడు, చారణ కారణుడు, ఉన్నతోన్నతుడు, సర్వాత్ముడు, ఆచార్యుడు, సద్గుణుడు, యశస్వి, మహా యోగీశ్వరుడు, శంకరుడు, ఈశ్వరుడు, స్వయంభువు, జ్యోతి స్వరూపుడు, సృష్టికర్త, అష్టగుణుడు, అనఘుడు, ఆద్యంతములు లేనివాడు, సనాతనుడు, దివ్యుడు, చతుర్ముఖుడు, వేదాది నిగమాగమ వేద్యుడు, ముక్తి ప్రసాదకుడు, తనను శరణుజొచ్చిన వాళ్లకు పునర్జన్మ లేకుండ చేయగలవాడు, ఆతడిని నిత్యము దర్శించి ముక్తిని బడయమని" తపస్వి బోధించిన, ఆతనికి భక్తితో నమస్కరించి కవుంతీ సాధ్వి ఇట్లనియెను–

"కామక్రోధ మోహాలను విడిచిన జ్ఞాని మాటలను తప్ప వేరెవరి భాషణములను వినుటకు నా చెవులు అంగీకరించవు. వేయి నెనిమిది పేర్లతో వెలయు స్వామిని నుతించు నా నాలుక వేరు మాటలను పలుకబోదు. ఇంద్రియాతీతుడైన పాదయుగ్మము తప్ప అన్య పాదములు నా సమీపమున ఉన్నా నా కనులు వాటిని చూడరావు. కరుణామయుడైన అతడి దేహము తప్ప పరుల శరీరమును స్పృశించ నా కాయమంగీకరించనొల్లదు. అర్హోపదేశకుడైన అతనికి తప్ప వేరెవరికీ కేలుమోడ్చ నా చేతులు కదలిరావు. పూలపై నడచు అతడి పాదములు తప్ప వేరే పుష్పాలనూ అలంకరించ నా శిరస్సు ఒప్పుకోదు. అనంత ప్రేమాస్పదుడైన ఆ దేవుని పవిత్ర వచనములను తప్ప మరే మాటలను నా మనసు అంగీకరించబోదు"

అని పలికిన కవుంతి మాటలను విన్న జైనముని తన ఆసనము నుండి గాలిలోకి ఒక్క అడుగు పైకిలేచి ఆమెను ఆశీర్వదించినాడు– "కవుంతీ! నీకు పునర్జన్మము లేకుండును గాక!". అతడు వెళ్లిపోగా వారు మనకు 'ఇహర్లోక బంధాలు నశించును గాక!' అని ప్రార్థించినారు.

ఆ తరువాత ఆ ముగ్గురూ పడవలో కావేరీ నదిని దాటి ఆవలి తీరాన్ని చేరి పుష్పవన శోభితమై అలరారుతున్న అద్భుత దేవాలయ ప్రాంగణంలో సేదదీరినారు.

అక్కడి పూల తోటలో నుండగా ఒక వెలయాలు తన విటుడితో అటుగా వెళ్తూ కవుంతిని అడిగింది– "రతీ మన్మథుల్లా ఉన్న ఆ ఇద్దరెవరు? ఓ సాధ్వీ! బలవంతపు ఉపవాసాలతో దేహాన్ని శుష్కింప చేయడమెందుకు? వారెవరో తెలుపగలవా?"

కవుంతి సమాధానమిచ్చింది– "వారిద్దరూ నా పిల్లలు. తోటి మానవులే కదా! వారిని వదిలేయి. దూరాభార ప్రయాణంతో అలిసి ఉన్నారు"

వాళ్లు కర్కశంగా అన్నారు– "వీళ్లు ఒకే తల్లి బిడ్డల్లా కనుపించడం లేదు, సాధ్వీ! చూడముచ్చటైన జంటలా ఉన్నారు!" వాళ్ల క్రూరమైన చూపులను చూసి కన్నగి గజగజా వణికింది. మహా తపశ్శాలియైన సాధ్వి కవుంతి వాళ్లవేపు చూసి ఇలా శపించింది– "పుష్పగుచ్ఛంలాంటి నా బాలికను వక్రదృష్టితో చూసిన వారు ఘోరాటవిలో నక్కలైపోవుదురుగాక!"

మరుక్షణమే ఆ దుష్ట జంట అదృశ్యమై, దూరాన నక్కల ఊళ దీర్ఘంగా విన్పించింది. కన్నగి, కోవలన్‌లు భయభ్రాంతులై సాధ్విని ప్రార్థించారు– "అమ్మా! దుష్టమార్గాన సంచరించేవాళ్లు వక్రోక్తులు మాట్లాడడం సహజమే! అది వారి అజ్ఞానం. ఓ తపస్వీ! వారికి ఎప్పుడు శాప విమోచనం లభిస్తుంది?"

సాధ్వి సమాధానమిచ్చింది– "పన్నెండు నెలల పాటు వాళ్లు ఉరయ్యూరు కోట వెలుపలి అడవులలో నానా యిడుములు పడినాక తిరిగి యథారూపులౌతారు"

పౌరుషంగల ఒక కోడిపుంజు, వింజామరల వంటి చెవులు గల మదగజాన్నే తరిమికొట్టిన ప్రదేశంలో నిర్మించబడిన ఉరయ్యూరు కోటలోకి ప్రవేశించినారు ఆ ముగ్గురు బాటసారులూ.

## పుకార్ కాండము సమాప్తం



కన్నగి

## రెండవ పుస్తకం

# మధురా కాండము

11. అటవీ దృశ్యాలు ........................................ 68
12. వేటగాళ్ల ఆటపాటలు ................................ 74
13. నగరపు పొలిమేరలు .................................. 82
14. నగర సందర్శనం ...................................... 87
15. ఆశ్రయం ................................................ 93
16. హత్యా ప్రదేశము ...................................... 98
17. గోపికా నృత్యం ...................................... 103
18. దుఃఖ గుచ్ఛం ........................................ 110
19. కన్నగి .................................................. 112
20. న్యాయపోరాటం ...................................... 114
21. ఆగ్రహజ్వాల .......................................... 118
22. అగ్నికీలలు ............................................ 121
23. వివరణ .................................................. 124

# 11. అటవీ దృశ్యాలు

ఒకదానిపై ఒకటి వరుసగా అమర్చబడిన మూడు చంద్రబింబాల్లా మెరుస్తున్న మూడు శ్వేతఛత్రాల (మూడు గొడుగులు- చంద్రాదిత్యము, నిత్యవినోదము, సకల భూషణము) క్రింద కొలువై సూర్యకాంతితో జ్వాజ్వల్య ప్రకాశమానుడగు, ఆదిదేవుడైన 'అర్హతు'ని ఆ మహాతపస్విని 'కవుంతి' ప్రార్థించినది. పూలభారంతో వంగిన అనేక అశోక వృక్షాలున్న ఆ వనంలో ఉన్న నిర్గ్రంథుని దేవాలయపు ఆవరణలోని మునులకు ఆమె మహాముని పలుకులను విన్నవించి, కోవలన్, కన్నగిలతో ఆ దినం అక్కడనే విశ్రాంతి తీసుకున్నది.

వేకువజాముననే లేచి వారు ఉరయ్యూరును విడిచి దక్షిణదిశగా ప్రయాణం సాగించి సూర్యోదయ సమయానికి లేతచెట్లున్న వనంలో ఒక బ్రాహ్మణుడిని చూసారు. అతడు పాండ్యరాజును ఇలా కీర్తిస్తున్నాడు- "సర్వ కాలాలయందు ఈ ప్రపంచాన్ని పరిరక్షించే పాండ్య ప్రభువుకు జయమగును గాక! దక్షిణా పథాన్ని పాలించే తెన్నవాన్ ప్రభువు తన రాజ్యాన్ని గంగా నదీ, హిమాలయ పర్వత ప్రాంత సానువుల వరకు విస్తరించునుగాక!

పరులి నది, కుమారికొండ ప్రాంతాల్ని ఆక్రమించుకున్న శత్రువు పీచమణచేందుకు అతడు విసిరిన బల్లెం శక్తిని చూసిన ఇతర వైరివీరులు భయభ్రాంతులై సామంతులుగా ఉండగా శాంతిభద్రతలు నెలకొనును గాక! చంద్రవంశ సంభూతుడై, తన ఎదపై వేయి అరుణనేత్రాలున్న ఇంద్రుడి మాలను ధరించిన మహరాజుకు విజయమగును గాక!

మహేంద్రుడి కిరీటపు కాంతిని కొల్లగొట్టాడని గర్జిస్తూ మేఘాలు పాండ్యరాజ్యంలో వర్షించడం ఆపినప్పుడు ఆ మేఘాలను తన రాజ్యంలో బంధించి సకాల వర్షాలతో తన రాజ్యాన్ని ధనధాన్య సమృద్ధిగా చేసిన రాజుకు జయమగును గాక!" అని స్తోత్రాలు వల్లిస్తున్న బ్రాహ్మణుడిని కోవలన్ ప్రశ్నించాడు- "మీదేవూరు? మీరేం చేస్తుంటారు?"

ఆ బ్రాహ్మణుడు ఇలా సమాధానమిచ్చినాడు- "పాండ్యరాజ్య వైభవాన్ని విని, తద్దానిని నా కనులతో చూద్దామని నేనీ దేశం వచ్చాను. ఇక్కడి మహా

విష్ణు రూపాన్ని కనులారా దర్శించి తరిద్దామని వచ్చాను. వేయి పడగల ఆదిశేషుని తల్పంపై శయనించి, తన వక్షస్థలాన లక్ష్మీదేవి ప్రకాశిస్తుండగా, కావేరీ నదీ జల తరంగాలచే ముద్దాడబడుతున్న ద్వీపాన, నీలి మేఘావృతమైన స్వర్ణ పర్వత శిఖరాలున్న దేశంలో అరుణరాగరంజిత నేత్రుడై విష్ణుదేవుడు తన కరకమలము లందు శత్రువినాశక చక్రమును, క్షీరవర్ణ శంఖమును దాల్చి బంగారు పసుపు ఛాయ కలిగిన వస్త్రములను ధరించి, మెడలో కౌస్తుభమణిహారం, సతత హరిత పుష్పమాల మెరయుచుండ, జలపాతాలతో అలరారు వెంకటాద్రిపై నల్లమబ్బువలె ఉండగా, మెరుపు తీగెలు, ఇంద్రధనుస్సులతో కూడి, ఇరుపక్కల సూర్యచంద్రులు తమకాంతులతో దేదీప్యమొనర్చు ఆ వృషభాచలమున వెలసిన భక్త జన మనోభీష్టసిద్ధుడైన భగవానుని సందర్శించ వచ్చియున్నాను. నేను కుటకు (కొడగు) కొండలలోని మంకతు ప్రాంత వాసిని. పాండ్యదేశ సౌభాగ్యాన్ని కనులారా గాంచి, రాజును ఆశీర్వదించుటకై ఇక్కడకు వచ్చాను”–

కోవలన్ అడిగాడు– “ఓ సద్బ్రాహ్మణుడా! మధురకు వెళ్లే దారెటో దయచేసి చెప్పగలవా?”

ఆ బ్రాహ్మణుడు అన్నాడు– “నీవు వచ్చినది ఈ అటవీప్రాంతం తన సొబగులను వర్జించే ఆకురాలు సమయంలో. అదిప్పుడు బీడుభూమిలా కళదప్పి ఉంటుంది. మంత్రుల తప్పుడు సలహాలు విని సామ్రాజ్యాన్ని పోగొట్టుకున్న రాజులా సూర్యప్రభువు, వసంత మంత్రి నిష్క్రమణతో, వేడెక్కి లోకాన్ని కాల్చివేసే కాలమిది. నీవు కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, రాళ్లురప్పలుండే దుర్గమ మార్గాన, సుకుమారియైన నీ భార్యతో ప్రయాణం చేయవలసి ఉంటుంది. ఆ దారిన పోగాపోగా చివరకు ఒక మహాసరస్సు తీరాన ఉండే కొటుంపాయి ఊరిని దాటినాక త్రిశూలంలా ఉండే మూడు దారులు కనిపిస్తాయి. కుడిత్రోవలో విస్తరించిన కదంబ (కడిమిచెట్టు) వృక్షం, ఎండిన కారుమామిడి, శిరీష, తుమ్మ, వెదురుపొదలు, కాలి నల్లబడిన గోగుజనుము కాండాలు, దప్పిక గొని నీటికై అల్లాడుతూ అరుస్తున్న దుప్పులూ, లేళ్ల సమూహాలు సంచరించే అడవిలో, వేటగాళ్లు నివసించే ప్రాంతమది.

ఆ తరువాత నీకు కనిపించేది పండియన్ గుట్టల ప్రాంతం. అడవి బియ్యపు వరి మొక్కలు, పగిలి విడిన కణుపులున్న చెరుకుగడలు, కొర్రలు,

యవధాన్యపుచేలు, పసుపు, వెల్లుల్లి పొలాలు, తమలపాకు తీగెలు, అరటి, పోక, కొబ్బరి, మామిడి పనస తోటలు విస్తారంగా ఉండే ప్రదేశం. ఆ కొండకు కుడివేపుగా పోయినట్లయితే నీవు ప్రసిద్ధ మధురా నగరాన్ని చేరుకుంటావు"–

అలా కాకుండా నీవు ఎడమవేపున్న త్రోవను పోయినావనుకో, పారుతున్న నీళ్ల సందడి, సరస్సుల నుండి లోతట్టు ప్రాంతానికి పోతున్న నీటికాలువల అలజడి, చక్కటిపూల వనాలు, అనేక దార్లు కనిపించే అటవీ ప్రాంతం చేరుకుంటావు. ఆ తరువాత వచ్చేది విష్ణు పర్వతం. అక్కడ మనలను సమ్మోహనపరిచే గుహ ఉన్నది. దానిని దాటితే అద్భుతమైన మూడు సరస్సుల ప్రాంతాన్ని చేరుకుంటావు. అవి పవిత్ర శరవణ, పావకరణి, ఇష్టసిద్ధి సరస్సులు. పవిత్ర శరవణ సరస్సులో స్నానం చేస్తే వేదజ్ఞానం, పావకరణిలో స్నానమాడితే పూర్వజన్మ జ్ఞానం, ఇష్టసిద్ధిలో స్నానం చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

ఆ గుహలో ప్రవేశించిన వాడివైతే అక్కడ వెలసిన దేవుని పూజించి, అతడి పాదపద్మములను నీ మనోపీఠికపై ఉంచుకుని ధ్యాన నిమగ్నుడవై ముమ్మారు ఆ కొండ చుట్టూరా ప్రదక్షిణాలు గావించు. అక్కడ భూమి నుంచి పొడుచుకు వచ్చినట్లున్న కిలంపరు గట్టునున్న పుష్పభరిత గోగువృక్షచ్ఛాయన బంగరు వన్నె మెరుపు తీగెలాంటి యువతి నల్లటి మబ్బుల వంటి అయిదు పాయలున్న శిరోజాలతో మెరుస్తూ ఉన్నది మీకు కనిపిస్తుంది. ఆమె అంటుంది– 'ఈ పర్వత పాదాన నివసించే 'వరోత్తమ' అనే అప్సరసను నేను. నేనొక ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పండి– ఈ జీవితాన్ని ఆనందప్రాయంగా చేసేదేది? మరుజన్మలో ఆనందాన్నిచ్చేదేది? ఏది శాశ్వతం? నా ప్రశ్నలకు సరైన సమాధానమిచ్చినవారికి నేను శాశ్వతంగా దాసినౌతాను. వారికి ఈ బిలద్వారం తెరవబడ్తుంది"–

ఆ తలుపు తెరచి చూడ లోపల అనేక ద్వారాలు, సొరంగ మార్గాలు కానవస్తాయి. ఆ మెరపు తీగెవంటి యువతి వెనుకనున్న ప్రాంగణంలో రెండు వాకిళ్లున్నాయి. ఏది శాశ్వతానందమో చెబితే మూడు కోర్కెలలో ఒకటి నెరవేర్తుంది. చెప్పకపోయినా వచ్చే కీడేమీ లేదు!

సరైన సమాధానం చెబితే ఆమె మిమ్మల్ని మూడు సరస్సులున్న ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ వదిలిపెడ్తుంది. అక్కడ మీ కిష్టమైన చెరువులో

మునిగి పంచాక్షరీ, అష్టాక్షరీ మంత్రాన్ని జపించినచో మహా తపస్వులకు లభ్యం కాని ఆశీస్సులను, ఫలాన్ని పొందగలవు. ఆ ఆశీస్సులు వలదని మరల ధ్యాన నిమగ్నుడవై స్వర్ణ పద్మపాదుడైన భగవానుని స్మరించితివేని గరుడపతాక అలరారుతున్న అద్భుత ధ్వజస్తంభాగ్రము నీకు కానవచ్చి ఆనందపరవశుడిని చేస్తుంది. అప్పుడు ఆ దేవుడు నిన్ను మన్నించి నీ పూర్వజన్మ పాపలబ్ద దుఃఖ నివృత్తి చేయును. అతడిని కీర్తిస్తూ ప్రఖ్యాతిచెందిన మధురా నగరానికి ఆనందంగా పోవచ్చును.

ఈ రెండుదార్లూ వద్దనుకుని మధ్యదారినే ముక్కుసూటిగా పోయినట్లయితే, అనేక అడవులు, గ్రామాలు దాటినాక ఒక క్రోధ దేవత ఉండే గ్రామాన్ని చేరుకుంటావు. ఆమె బాటసారులను భయపెట్టదు. అందమైన రూపంలో వచ్చి వారికే అపకారం చేయదు. కాని దారి మళ్లిస్తుంది. ఆమెను బతిమలాడ్తే మధురా నగరానికి వెళ్లే ప్రధాన దారిని ఆమె బహిర్గతం చేస్తుంది.

నీకిష్టమైన మార్గాన్ని ఎన్నుకో! నీకు విజయమగుగాక! ఇప్పుడు నేను విష్ణుదేవుని చరణారవిందములను పూజించనిచ్ఛగలవాడనైతిని. అతడు జగజ్జేత. త్రివిక్రముడు”

ఆ బ్రాహ్మణుడి మాటలను ఆలకించి కవుంతి ఇలా అన్నది– “చతుర్వేద పారంగతుడైన ఓ బ్రాహ్మణుడా! మాకు సత్యమార్గాన్ని చూపించ సమకట్టినావు. మేమా మాయా బిలంలోకి వెళ్లదలుచుకోలేదు. అలాగే ఇంద్రుడిచే రచింపబడిన పుస్తకాలూ అక్కరలేదు. అవి మనస్మృతుల్లో ఉన్నాయి. మేము పాతజన్మలో చేసిన కర్మఫలాన్నే కదా ఇప్పుడు అనుభవిస్తున్నది. మాకు గొప్ప కోర్కెలూ లేవు. అందుచేత ఆ చెరువుల్లో మునగాల్సిన అవసరమూ లేదు. మేమింకా చాలాదూరం ప్రయాణం చేయాల్సి ఉన్నది. మాకు దయ ఉంచి అనుమతి ఇవ్వగలరు. మహాత్మా! కృతజ్ఞతలు!”

కవుంతి ఆ విధంగా తన మధురమైన వాక్కులతో ఆ సద్బ్రాహ్మణుడి వద్ద వీడ్కోలు తీసుకున్నాక వారు దగ్గర్లో ఉన్న గ్రామంలో బస చేసినారు. కోవలన్ ఇంకా తన ఆలోచనలను వీడలేదు. తన గమ్యసాధనకై స్థిరంగా ఉన్నాడు.

మరుసటి రోజున వాళ్లు దారిన పోతూ ఉండగా మధ్యమార్గాన కవుంతి, కన్నగిలు అలసటచే ఓ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కోవలన్ పక్కనే ఉన్నదారిలో అడవిలోకి ప్రవేశించి చుట్టూరా పరికిస్తూ దూరంగా కనిపిస్తున్న చెరువు వద్దకు చేరుకున్నాడు. దాహంతో అలమటిస్తూ అతడు నీరు త్రాగబోయేంతలో ఆ దాపులలోనున్న వనకన్య అతడి అందచందాలకు ముగ్ధురాలై, అతడిని పొందలేని జన్మము వ్యర్థమనుకుని, మాధవి చెలికత్తె వసంతమాలి రూపాన్ని ధరించి అతడి పాదాలపై బడి కన్నీరు కారుస్తూ, చిరుగాలికి కదుల్తున్న లతలా కంపిస్తూ విలపించసాగింది. ఆమె ఇలా పలికింది– “కోవలన్ ప్రభూ! మాధవి నన్ను నీ వద్దకు పంపినది. పరిమళభరితమైన పూలదండలో తాను వ్రాసి పంపిన ఉత్తరానికి జవాబివ్వనందున ఆమె నాపై మండిపడింది. నీవేదో అబద్ధాలు చెప్పి కోవలన్ మనసును విరిచేసావు అని అరుస్తూ దుఃఖాతిశయాన మూర్ఛితురాలైనది. సేదదీరిన పిమ్మట ఆమె ఇలా పలికింది. ‘జ్ఞానులు, సాధుసంతులు, మునులు మంచికి చెడుకు తారతమ్యం తెలిసినవారు వాళ్లందరూ రాజనర్తకి జీవితాన్ని తెగనాడుతారు. అంటరానిదాన్నిగా తలపోసి వెనుదిరుగుతారు’ అంటుంటే ఆమె విశాలనయనాలు ఎర్రటి జీరలతో రక్తవర్ణాన్ని దాల్చగా అశ్రువులు ముత్యాల్లా రాలిపడినాయి. తన చేతుల్తో మెడలోని ముత్యాల హారాన్ని తెంపి విలపిస్తూ ఆమె నిద్రాహారాలు మానినది. మౌనంగా ఓ మూల కూర్చుని నిన్నే తలచుకుంటూ కాలం గడుపుతున్నది. నా స్నేహాన్ని కూడ మరచి నాతో మాట్లాడకున్నది. నీవు మధురై వేపు వెళ్తున్నావన్న సంగతి బాటసారుల వల్ల తెలుసుకుని తాను పంపగా నేను ఓ వర్తకబిడారులో వేగంగా మీరున్న వేపు రాగలిగాను. ఎన్నో కష్టనష్టాలకోర్చి తమ పాదసన్నిధికి చేరుకున్న ఈ పేదరాలిని కనికరించగలరు. మంచికి చెడుకు తేడా తెలిసిన వాడివి నీవు. నీ ఆజ్ఞ ఏమిటి? అది శిరోధార్యం నాకు!”

కోవలన్ అనుకున్నాడు– ‘ఇది ఖచ్చితంగా ఈ అడవిలో ఉండే యక్షిణో, వనకన్యో, అప్సరసో కాని మానవకన్య కాదు. ఈ కథంతా కల్పితం. ఆ బ్రాహ్మణుడు చెప్పినదంతా యదార్థం. ఈ మాయల్ని పటాపంచలు చేసే మంత్రాన్ని జపిస్తాను’ అనుకుని కోవలన్ జింకపై స్వారీచేసే దేవతయగు దుర్గా మంత్రాన్ని జపించగానే భయపడి వణికిన ఆ వనకన్య ఇలా పలికింది– “ఆర్యా!

ఈ అడవిలో ఉండే వనకన్యను నేను. నిన్ను వంచనతో పొందగోరితిని. ఈ విషయాన్ని నీవు కవుంతి సాధ్వికి, నీ భార్యకు తెలియనీయకు. నన్ను క్షమించు" అన్ని అదృశ్యమైంది.

తామర దొన్నెలలో చల్లని నీరు తీసుకుని ఆతడు ఆ స్త్రీలున్న చోటికి వచ్చి వారి దాహాన్ని ఉపశమింపజేసినాడు. ఈ ఎండవేడిమిలో ప్రయాణం మరింత దుస్తరమని తలపోసి కొద్దిదూరం పోగా, అనంతంగా విస్తరించి ఉన్న ఆ బీడు భూములలో నడుస్తూ కురవకము, కదంబము, గోగు, మరువము, వేగి చెట్లు విరగబూసియున్న పూదోటలోకి ప్రవేశించినారు. అక్కడ త్రినేత్ర రూపిణి అయిన అయియాయి (దుర్గ) దేవాలయమున్నది. ఆ దారిలో ప్రయాణీకులెవ్వరునూ కానరాలేదు. వర్షాలు కురవని ఆ ప్రాంతంలో తమ విల్లమ్ములను నమ్ముకున్న బోయవాళ్లు, సాక్షాత్తు యముడిలా జీవాల ప్రాణాలు తీయగలవాళ్లు, అక్కడ నివసిస్తున్నారు. 'అయియాయి' దేవత వారిని తన కటాక్షవీక్షణాలతో కాపాడుతూ వారికి విజయాన్ని చేకూరుస్తూ ప్రతిగా వారిచే బలుల్ని, పూజల్ని అందు కుంటున్నది.

✣✣✣✣✣



# 12. వేటగాళ్ల ఆటపాటలు

వేసవి సూర్యుడు తన చండప్రచండ కిరణాలతో జగతిని మాడ్చేస్తున్నాడు. అనేక పాయల సుగంధ శిరోజాలున్న కన్నగి ప్రయాణ బడలికచేత కంపించ సాగింది. నడచీ నడచీ ఆమె సుకుమార లేతపాదాలు ఎర్రగా కందినాయి. ఆ నెప్పుల ఉపశమనానికై వారు ఆ దేవాలయంలో ఒక మూల ఎవరికీ కనిపించ కుండా కూర్చున్నారు.

అకస్మాత్తుగా ఆ ప్రదేశమంతా, విలుకాండ్ల వంశానికి చెందిన మారవన్ కుటుంబము తమ మొక్కుబడులు తీర్చుకోడానికి అక్కడకు రాగా పూనకమొచ్చిన శాలినీ పూజారిణి పెడ్తున్న కేకలతో, ఉరుముల్లాంటి అరుపులతో మార్మోగింది. తలపై నిలబడ్డ వెంద్రుకలతో, మెడ నటునిటు తిప్పుతూ, ఒక్కొక్క అడుగు వెనక్కి ముందుకు వేస్తూ లయబద్ధంగా నడుస్తున్నదామె.

'అయినాన్లు'గా పిలవబడే ఆ వేటగాళ్లు చుట్టూ వలయంలా నిలబడగా పూనకావేశాన ఆ స్త్రీ ఇలా భవిష్యద్వాణిని పలికింది– "మీరు మొక్కుబడులు చెల్లించడంలో ఆలస్యం చేసారు. అందుకని మీ పగవాళ్ల పశుసంపదలు సమృద్ధిగా వృద్ధి చెందుతున్నాయి. అయినాన్ల సంతలు కళావిహీనాలైనాయి. మారవన్ల కుటుంబాలిప్పుడు బాటసార్లను దారిదోపిడీ చేయడం మానివేసారు. సజ్జనుల్లా వాళ్లిప్పుడు పిరికివాళ్లైనారు.

దుప్పివాహిని, అమ్మతల్లి, దుర్గమ్మకు మీరు బలులివ్వకపోతే అరిష్టం తప్పదు. మీ విల్లంబులు, మీ శక్తియుక్తులు నిరుపయోగమవుతాయి. అపజయం ప్రాప్తిస్తుంది. ఓ ఘనత వహించిన దారిదోపిడీ దొంగల్లారా! తాటికల్లును తాగి సుఖంగా బతకాలనుకుంటే బలుల్ని సమర్పించండి!"

ఆరోజుల్లో 'అయినాన్లు' స్వచ్ఛందంగా తలలు నరుక్కుని తల్లికి బలిగా సమర్పణమవడం, అంత్యకాలంలో చచ్చినాక చితాగ్నిలో భస్మం కావడం కన్నా ఘనంగా భావించేవారు. వారు తమ కుటుంబంలో అందమైన కన్యను అలంకరించి, శిరస్సుకు పట్టీగా పాముచర్మాన్ని చుట్టి, శిరోజాలను జటాజూటంగా చుట్టి, అడవి పంది కోరలను చంద్రవంకలా గుచ్చి, వ్యాఘ్ర దంతాలతో చేసిన హారాన్ని ఆమె మెడలో వేసి, నడుముకు పులిచర్మాన్ని కట్టి, చేతిలో ప్రశస్తమైన

విల్లునుంచి మెలితిరిగిన కొమ్ములున్న దుప్పి వాహనంపై కూర్చుండబెట్టి పూజలు చేసేవారు. అయినాను స్త్రీలు ఆమెకు బొమ్మలు, చిలకలు, అడవి పిట్టలు, నెమళ్లు, ఆటబంతులు, చెట్లవేళ్లు కానుకలుగా సమర్పించి ప్రార్థనలు చేసేవారు. అంతేకాక ఆమెను అనుసరిస్తూ లేపనాలు, పొడులు, చందనాది ద్రవ్యాలు, సువాసనల నూనెలు, పప్పులు, అడవిబెల్లం, అన్నం, నువ్వుల ఉండలు, ధూపదీప నైవేద్యాలతో ఊరేగించేవారు. అలా ఆ కన్యకను అనంగుని దేవాలయానికి తీసుకువెళ్లి తమ విజయాలకు కానుకగా భేరీభాంకార నినాదాలతో కొమ్ముబూర, వేణువు, మహాఘంటాది వాయిద్యాలను మోగిస్తూ సందడి చేసేవారు.

అప్పుడా కన్యక వాహనం దిగి అనంగుడికి సాగిలపడి మొక్కి ప్రార్థనలు చేసేది.

దైవఘటనో ఏమో, ఆరోజున పూజారిణి ఏవో మంత్రాలు చదువుతూ ఆ తతంగాన్ని భయభయంగా చూస్తున్న కన్నగి వేపు తన చూపుడు వేలును నిలిపింది.

"ఇదుగో! ఈ కొంగు యువతిని చూడండి! దక్షిణ తమిళ సౌందర్య ప్రతీక! కుడగు ప్రాంత జవ్వని. తన పూర్వజన్మ తపోఫలితంగా జన్మించిన నారీమణి. అద్భుతమైన మణిలా తన కీర్తిప్రతిష్ఠలతో జగత్తును వెలుగుతో నింపుతుంది"

పూనకంలో ఆ పూజారిణి ఏదేదో అంటున్నదని అనుకుంటూ కన్నగి తన భర్త విశాల బాహువుల వెనక దాక్కున్నది.

"ఆ దేవత చంద్రవంకను శిరస్సుపై దాల్చినది.
పాపిటలో కనుమూయని మూడోనేత్రం.
వెండిలా మెరుస్తున్న పలువరుస, పగడాల అధరాలు.
గరళకంఠుని మెడలా ఆమె కంఠం
భయంకరమైన సర్పాన్ని వింటినారిగా అమర్చి
మేరు పర్వతాన్ని విల్లుగా వంచినదా తల్లి.
రొమ్ములపై లేపనంలా కాలకూట విషం
గాజులు నిండిన చేతిలో మెరుస్తున్న త్రిశూలం

గజ చర్మధారిణియై వ్యాఘ్రచర్మాన్ని కటివలయంగా
అనంగరూపంతో, ఎడమకాలికి మెరిసే కాలి అందియ,
కుడికాలికి విజయ మంజీరాలతో, ఖడ్గధారిణియై
కొరవాయి దేవత ద్విదేహధారియైన మహిషాసురుని
తలపై పాదమూన్చి నిలబడి ఉన్నది.
అమరి, కుమారి, గౌరి, సమరి,
త్రిశూలధారిణి, నీలిని, వెన్నుని సోదరీమణి,
కాళి, అయియాయి, ఈశ్వరి,
జింకవాహిని, ప్రచండ ఖడ్గధారిణి, దుర్గ
లక్ష్మి, సరస్వతి, సమస్త రత్నభూషిణి,
కన్యక, కుమారీరూప దుర్గాదేవతా!
బ్రహ్మ విష్ణు దేవతా వందితా!
మమ్ములను కరుణించ వచ్చినావా! మాతా!"

ఆ విధంగా పూజారిణి తన్మయత్వంతో దేవీస్తోత్రం చేసినది. మరవన్లు ఆ ప్రార్థనను భక్తిశ్రద్ధలతో గమనించి మొక్కిరి.

## 2

## దేవాలయ ఆవరణ

ఆ దుర్గ నెలవున్న అందాల తోటలో
అర్ధనారీశ్వరుని అర్ధభాగము ఆమె
ముక్కంటిదేవుని ముద్దుల పడతి
ఆ తోటలో గలవు అనేక వృక్షాలు
పొన్నలు గన్నేరు చందన దేవదారు
మధురఫలాలున్న మామిడి వృక్షాలు
అందాల తోటలో వెలసినది ఆ తల్లి.

## 3

ఆ దుర్గ నెలవున్న ఆ పూలతోటలో
శిరసుపై నగగా చంద్రవంకను దాల్చి
దుర్గ తాకొలువైన దేవాలయ మందు

పసిడిపూలను రాల్చె ఆ కడిమిచెట్టు
ఎరుపు రేకలు విరిసె బూరుగువృక్షాలు
పరాగ గానుగ పరిమళాలున్న
అందాల తోటలో వెలసినది ఆ తల్లి.

**4**

ఆ దుర్గ నెలవున్న ఆ పూలతోటలో
తిరుమలేశునికామె చిన్నారి సోదరి
కదంబ, తమాల, పొన్నలు, గోగులు
విరివిగా విరిసిన ఆ పూలతోటలో
భృంగ సమూహాల ఝుంకార గీతాలు
వేణుగానమల్లె వేడ్కగా వినిపించ
అందాల తోటలో వెలసినది ఆ తల్లి.

**కురవ బాలికల నృత్యం**

కొరవాయమ్మ నగలను తనమేని దాల్చగ
ఎంతపున్నెము చేసినో ఈ ఎలనాగ!
అన్ని జాతులలోన ఎన్నికైన జాతి
వేటగాళ్లున్నట్టి మాకెవరు సాటి?
పసిడి నగలు దాల్చి మెరిసే ఈ కన్యను
కన్న దంపతులున్న మా కులమె మిన్న!

అయియాయి నగలను తన మేని దాల్చగ
ఎంత తపము చేసెనో ఈ ఎలనాగ!
పడగ విప్పిన నాగు యవ్వనపు సొబగు
పదహారు కళలున్న నెలరాజు వెలుగు
బాణవర్షము కురిపించు వేటగాళ్లున్నట్టి
మేటి వంశజులైన మేలుదంపతులు
ఇట్టి కన్నెను కన్న మా కులమె మిన్న!

జింక వాహినియైన దుర్గ నగల్ ధరింప
ఎన్ని నోములు నోచినో ఈ ఎలనాగ!

వెదురు విల్లులు పూని ఎదురులేనట్టి
వేటగాళ్లున్న మాకెవరు సాటి!
మేటి వంశజులైన మేలుదంపతులు
ఇట్టి కన్నెను కన్న మా కులమె మిన్న!

## దేవతాస్తుతి

గజ, వ్యాఘ్ర చర్మాలను మేనుపై దాల్చి
నీవొకప్పుడు నిలబడినావు
అడవి దున్న శిరాన అవలీలగాను!
వేదవేదాంగాల కావల నున్నట్టి
దేవతలు తలదాల్చు దివ్యజ్ఞానము
నిండుగా నుండగా నిలబడితివీనాడు.

వంపు కొమ్ములున్నట్టి హరిణిపై ఒకనాడు
ఖడ్గధారిణివై కదన భూమిలోన
మహిషాసురుని నీవు మర్దించినావు.
హరిహరబ్రహ్మల హృదయ పద్మాల
కమనీయకాంతులు కురిపించినావు.
పరంజ్యోతిగ వెలుగు అపరంజి నీవు.

సింహ వాహనమెక్కి శంఖచక్రాల దాల్చి
చంద్రనిప్పులు కురియు అరుణనేత్రాల
ఒకనాడు నీవిక్కడ ఒద్దికతో నిలిచితివి.
జటాజూటమునందు జలగంగ దాల్చిన
ఫాలాక్షునకీనాడు అర్ధభాగానివై
శృతులు, వేదాలందు స్తుతియించబడితీవు.

## విజయనృత్యం

రేలపూల తోటి తులసి రెమ్మలచుట్టి
చిక్కనౌ పూమాల చక్కగా ధరియించి
కుమారి రూపాన కమనీయ వేషాన

రాక్షసులకు భయము, దేవతలకు ముదము
కూర్చేటి మా తల్లి కరుణించరావమ్మ!

## నృత్యహేల

స్వర్ణమంజీరాలు, పసిడి వడ్డాణాలు
వెండి కంకణాలు గణగణ మ్రోగగ
ఖడ్గ నృత్యము చేసే కనులార మా తల్లి!
కత్తిసాము చేసి ఖండించె రక్కసుల
ఖడ్గనృత్యము చేసె కనులార మా తల్లి!
పొగడపూల వర్ణాన మిగుల వెలిగే తల్లిని
పొగడిరి దేవతలు పూలవానలు జల్లి!

## గోగ్రహణం

పగతుర పశువుల పట్టుకోనెంచి
పటుతర ధైర్యాన పయనించు యోధుడు
ఖడ్గ ధారియైన కొరవాయి దేవతను
భక్తితో పూజించి బలులు తానిచ్చిన
ఖడ్గధారిణియైన కొరవాయి దుర్గ
ఆశీర్వదించును ఆ వీరపుత్రుడిని.
అడవి కాకి అరుపులే అశుభశకునాలై
పగతుర గ్రామమ్ము భయముతో వణుకును.

పైకము ఇవ్వనిదే పోయను కల్లని
తాటికల్లమ్మే తరుణి తగవాడ తనతో
విల్లమ్ములు చేబూని వేటకాడానాడు
పక్షుల శకునాల పరికించి చూచుచు
పగతుర పశువులను పట్టితెచ్చుటకై
తల్లిని తలుచుకు తాబయలుదేర
వింటి ధ్వజాన తావిడిదిచేసేను దుర్గ.

అయినాను బాలికా! అందాల దేవికా!
పరికించి చూడీ పసుల మందలను

వీరుడేగినాడు విజయంతో విచ్చేసి
తోటలను దొడ్లను పసులతో నింపాడు
లోహకార్ల గాయకుల లోగిళ్లు నిండగా!

నెమలీక వర్ణాలు నెగరేయు నీ నగవు!
మందహాస వదన! ఈ మందలను జూడు
ఓటమితో పగవాళ్లు గోస పెట్టుచునుండ
గెలుపు కేకలతో గొప్పలు ముచ్చట్ల
కొలువు తీరిరి వీరు కల్లమ్మ వాళ్లింట్ల!

కాటుక కళ్లతో కవ్వించు నెరజాణ!
ఓడిపోయిన ఊరు ఓంద్ర పెట్టుచునేడ్వ
కొట్టుకొచ్చిన జీవాలు కొట్టాల జేర్చగా
ముసిముసి నవ్వుల మురిసె ముదుసలులు

**బలి తతంగం**

తాపసుల కష్టాల వాలఖిల్యుల వెతల
తీర్చేటి మాయమ్మ! మొక్కెదము నీకు!
నీ పాద పద్మాల కురిపించి రుధిరము
మా శిరసులే నీకు మేమర్పించు బోనము
చంపేటి తెగువున్న నీ పాదదాసులం!

నీలివర్ణపు తల్లి! నీకు మొక్కెదము
దేవతలు ఇంద్రుడు దాసులే నీకు
తవ పాదపద్మాలు తడిచె మా రక్తాన!
నీకు మేమిచ్చు నిజమైన కానుక
మా మాంస రక్తాలు మాకు నీవిచ్చినవే!
మా గెలుపు ఘోషలు అంకితము నీకే!

అడవిలో వేటాడు వ్యాఘ్రాల తీరుగా
అయినసులు వస్తారు అర్ధరాత్రి వేళ!
తుడుములు, డక్కలు కొమ్ముబూరల్లు
ఉరుములు పిడుగులుగ ఊరిపై గర్జించ

పగతురను పడదోసి పసులను గైకొని
విజయగర్వాన ఇంటి దారినిబట్టి
తమ రక్తధారలతో తడిపేరు పాదాలు
తమ కంఠ నాళాలు ధారలౌ రక్తాన!
కరుణించి మమ్మల్ని కాపాడు మా అమ్మ!

### బలి–ఫలితం

ఓ శంకరీ! అంతరీ! నీలీ! దుర్గా!
కొప్పునందు నెలవంకను, అగ్నినేత్ర సర్పాన్ని ధరించిన దానా!
ఘనమైన విల్లమ్ములు చేబట్టిన అయినన్ల బలుల్ని స్వీకరించు!
ఈ దారినపోయే బాటసారులు అసంఖ్యాకమై రాగా
అయినన్లు దోపిడీ వృత్తిచే భాగ్యవంతులగుదురు గాక!

అమృతాన్ని సేవించి అమరులైనారు దేవతలు
కాని, కాలకూటాన్ని సేవించి హరాయించుకున్న దేవా!
కరుణతో మమ్మల్ని కాపాడవయ్యా! దయాదాక్షిణ్యాలు లేని
అయినన్లు పగవాళ్ల ఊళ్లను దోచుకుంటారు!
కొమ్ముబూరల్ల, ఢక్కల చప్పుళ్ల వాళ్లాడేటి
విజయనృత్యాలకు ముగింపులే లేక మురిసిపోయెదము గాక!

మద్ది వృక్షాల నేలకూల్చిన వాడా!
మామ పంపిన శకటాసురుని మర్దించిన వాడా!
మాపై దయ ఉంచి మన్నించుమయ్యా
దయాదాక్షిణ్యాలు లేని అయినన్ల బోయలు
బాటసార్లను నిలువు దోపిడి చేసి పలికే
జయజయధ్వానాలకు అలుపు లేకుండును గాక!

✤✤✤✤✤

వేద విదుడైన శివుని తర్వాత జనించిన
అగస్త్య మహాముని నివసించే పొటియల్ కొండలకు
అధిపతియైన పాండ్యరాజు వేప పూలదండను
ధరించి పగవాళ్ల అడవులను జయించి
గోవులను రక్షించు కొనును గాక!

✤✤✤✤✤

# 13. నగర పొలిమేరలు

కొర్రవాయి గుడి దగ్గర జాతర ముగిసిన తరువాత–

కోవలన్ స్వచ్ఛమైన హృదయం గల కవుంతి పాదాలపై బడి ప్రార్థించాడు– "ఈ బాలిక పాదాలు ఎండ వేడిమిని భరించలేదు. పలుకురాళ్లు తగిలి గాయపడ్తుందేమోనని నేను భయపడ్తున్నాను.

ప్రశస్తమైన రాజదండము చేత ధరించిన పాండ్యుని రాజ్యంలో
తన కీర్తి దిగంతాలకు వ్యాపించిన ఆ మహారాజు పాలనలో–
భల్లూకాలు చీమల పుట్టకు హాని చేయవు.
మెరిసే చారలున్న పులి జింకల గుంపును వేటాడదు.
పాములు, మొసళ్లు పగబట్టి తరమవు.
పిడుగులు పడినా మనకేమీ హాని కలగదు.
అందుచేత పట్టపగలు ఎండలో పోయేకన్నా
రాత్రి వెన్నెలదారుల్లో ఈ అడవిని దాటుదాం!'–

క్రూరుడైన రాజు స్థానాన మంచిరాజు వచ్చేంత వరకు ప్రజలు ఎదురు చూసినట్లు సూర్యుడస్తమించగా పాండ్య వంశ మూలపురుషుడు చంద్రుడు తారా సమేతంగా విచ్చేసి వెన్నెలలు కురిపిస్తుండగా వాళ్లు బయల్దేరారు.

"తారల గుచ్ఛంలాంటి ముత్యాలహారమో, చందన లేపనమో నీ అందమైన రొమ్ములపై అమరలేదు. నీలికలువల పుప్పొడి నీ శిరోజాలపై బడి మెరయుట లేదు. నీ తనూలతిక అందాల పూలరేకుల స్పర్శ ననుభవించుట లేదు. ములంగు పర్వతాలలో పుట్టి, మధురలో ఉధృతమై, కవుల జిహ్వాలందు కమనీయమై వీచే దక్షిణ పవనాలు నిన్నలరిస్తుంటే, చంద్రుడు తన శీతాంశు కిరణాలచే నిన్ను ముంచెత్తుతున్నాడు", ఈ మాటలు నేలతల్లి కన్నగి గురించి పలికినట్లుగా అనిపించింది. నడచి నడచి అలసిపోయిన కన్నగి కటిక నేలపై అలానే నిద్రపోయింది.

కోవలన్ అన్నాడు– "నీ అలసట తీరినాక మరల అడవిలో నడుద్దాం. పులుల గాండ్రింపులు, గుడ్లగూబల అరుపులు, ఎలుగుబంట్ల బొబ్బలను లెక్కచేయక మనం ఈ మార్గాన నడచిపోదాము"

గాజులతో నిండిన తన సుకుమార హస్తాలను కోవలన్ భుజాలపై వేసి, పవిత్రమైన కవుంతి మాటలను ఆలకిస్తూ కన్నగి రాగా వారు ఆ రాత్రి అడవిని దాటుతున్నారు. వెదురు పొదలలో అగ్గిపుట్టి, ఆ పొగ వలన అడవి నల్లగా కనిపించ, అక్కడి అడవికోళ్లు ఒకదాని తరువాత ఒకటి కూస్తూ తూర్పున సూర్యుని రాకను ప్రకటించే సమయానికి వారొక గ్రామాన్ని చేరుకున్నారు.

ఆ పల్లెలోని బ్రాహ్మణులు వేదములను వదిలి పాటలు పాడడంలో ప్రవీణులైనారు. కవుంతితో కన్నగిని గ్రామపు పొలిమేరలందు వదిలి కోవలన్ సంధ్యా కార్యక్రమాలు నిర్వర్తించేందుకు అనువైన నీరున్న ప్రదేశాన్ని వెదుకుతూ ముందుకు వెళ్లాడు. అడవిలో తాము పడ్డ కష్టాలు తలచుకుంటూ కొలిమిలో తిత్తిలా తనను తాను భావించుకుని ఒక నిట్టూర్పు విడిచాడు. అతని బాహ్య రూపంలోనూ ఒకింత మార్పు వచ్చింది.

అల్లంత దూరాన ఓ బ్రాహ్మణ యువకుడు తన వేపే వస్తున్న కోవలన్‌ను గుర్తించలేదు. పక్కనే ఉన్న మాధవీలతను చూస్తూ ఇలా అన్నాడు– “ఓ మాధవీ! ఎండవేడిమిని భరించలేక నీవు నీ పూలను రాల్చి వడిలిపోతివి. నీ పూలలాగే విశాల నయనాలున్న మాధవి అక్కడ కోవలన్‌పై విరహంతో నిద్రా హారాలు మాని దుఃఖంలో మునిగి వడిలిపోయినది.”

కౌశికుని నోట తన పేరు వినగానే కోవలన్, ఆశ్చర్యచకితుడై అతడిని సమీపించి అడిగాడు– “ఏమిటి నీవంటున్నది?”

అతడన్నాడు– “నేను కోవలన్‌ను కనుగొన్నాను” అంటూ కౌశికుడు తానిక్కడకు వచ్చిన కారణం తెలిపాడు.

“కోవలన్! నాగమణిని పోగొట్టుకున్న సర్పం వలె నీవు నీ ఊరిని, నీ తల్లిదండ్రులను వదిలి వెళ్లిపోయావు. నీ స్నేహితులు, బంధువులు జీవచ్ఛవాలైనారు. నిన్ను వెదకడానికి నీ తల్లిదండ్రులు సేవకులను అన్ని దిక్కులకు పంపినారు. వనవాసానికి వెళ్లిన రాముడిలా పితృవాక్య పరిపాలనకై రాజ్యాన్ని ఒక గాజుపూసగా భావించి వదిలి వెళ్తుంటే శోకించిన అయోధ్యలా పుకార్ పట్టణం బాధపడింది.

వసంతమాలి నుంచి ఇదంతా విన్న మాధవి దుఃఖభరితురాలై మంచాన బడింది. ఆమె పడ్తున్న వేదన గురించి విన్న నేను ఆమెను పలుకరించడానికి వెళ్లాను. ఆమె నా కాళ్లపై పడి తరుణోపాయము చూపమని ప్రార్థించినది. పుష్పాల్లాంటి సుకుమారమైన హస్తాలతో ఆమె మొగిలిరేకుపై నీకో లేఖ వ్రాసింది. ఆ లేఖను నాకిస్తూ ఆమె ఇలా అన్నది– 'నా కనుపాపల కన్నా ఆత్మీయుడైన నా ప్రియుడికి ఈ లేఖ నివ్వు'–

ఈ లేఖను తీసుకుని నిన్ను వెదకుతూ అనేక గ్రామాలు తిరిగాను" అంటూ కౌశికుడు పూలవలె సుకుమారమైన హస్తాలతో లిఖించిన మొగిలిరేకును కోవలన్ చేతిలో ఉంచాడు. మాధవి శిరోజాల పరిమళాన్ని జ్ఞప్తికి తెచ్చిన ఆ లేఖ కోవలన్‌లో గత స్మృతులను, తాము గడిపిన మధుర క్షణాలను కళ్లముందు కదలాడేలా చేసింది. ఎంతో కష్టమ్మీద తనను తాను నిభాయించుకుంటూ కోవలన్ ఆ లేఖను చదివాడు– "ప్రభూ! నీ పాదాలపైబడి క్షమాపణ కోరుకుంటున్నాను. మమ్మల్నందర్నీ ముఖ్యంగా నీ తల్లిదండ్రుల్ని వదలి ఉదయాన్నే ఉన్నత కుల సంజాత అయిన నీ భార్యతో కలిసి ఎందుకు వెళ్లిపోయావో మాకర్థం కాకున్నది. దీనికి నేనేమైనా కారణమా? నన్ను నేను నిందించుకోని క్షణమే లేదు. నన్ను ఈ మానసిక క్షోభ నుంచి విముక్తిరాలిని చేయి. నిజానికి విలువనిచ్చే నీవు నాకు పూజనీయుడవు"–

ఆ లేఖను చదివి కోవలన్ అనుకున్నాడు– "ఈమెలో ఇసుమంతైనా దోషం లేదు. అంతా నా పూర్వజన్మ కర్మ!"–

అతడిలో దుఃఖ భారం తగ్గింది. లేఖను కౌశికుడికి తిరిగి యిస్తూ కోవలన్ అన్నాడు– "ఈ లేఖలోని అంశాలు నాలోని దుఃఖాన్ని తగ్గించాయి. నా తల్లిదండ్రులకు నా ప్రణామాలను తెలియజేయగలవు. నీవు వారిద్దరి వద్దకు వెళ్లి వారికి దుఃఖోపశమనాన్ని కలుగజేయి"–

కౌశికుడికి వీడ్కోలు చెప్పి కోవలన్, సాధ్వి కవుంతి, కన్నగిలున్న చోటుకు వచ్చినాడు. అక్కడ వాళ్లకు అంతారి నృత్యాన్ని పొగుడుతూ గానం చేస్తున్న కళాకారుల బృందం కలిసింది. ఏడు తీగెలున్న వీణెకున్న తంత్రులను సవరించి శృతిని అవరోహణలో ఏడు స్థాయిలకు ఆరోహణలో అయిదు స్థాయిలకు సరి చేస్తూ మంద్ర మధ్య తారాస్థాయిలలో రాగాల పలికించి– పవన వేగాన పయనించే జింక వాహిని దుర్గకు ప్రీతి కలిగేలా స్వరాల్ని పలికిస్తూ ఆ కళాకారులనడిగాడు– "ఇక్కడకు మధురై ఎంత దూరం?"

వాళ్లన్నారు– "అదుగో ఆ దక్షిణపు గాలుల్ని స్పృశించు. ఎర్రచందనం, కుంకుమ పువ్వు, పసుపు సుగంధాలతో కూడి, చందనం, కస్తూరిల పరిమళాలు కలిసిన వాయువుల నాఘ్రాణించు. తాను వస్తున్న దారిలో విరగబూసిన ఎర్ర కలువల పుప్పొడిని, చంపక, మాధవి, మల్లె, బొండు మల్లెల సువాసనల్ని తనతో తీసుకువస్తున్న గాలుల్ని స్పర్శించు. ఆ గాలులు తమతో తెచ్చే వంటగదుల నుండి వెలువడే ఘుమఘుమల్ని, రాజవీధుల్లోని భోజన శాలల్నుంచీ వ్యాపిస్తున్న అప్పాల, రొట్టెల మధురిమల్ని, యవ్వనులైన స్త్రీ పురుషులు ముచ్చట్లాడుకుంటున్న ఇంటి ఆవరణలలోని శృంగార తైలపు సుగంధాల్ని, హోమాగ్ని గుండాల నుండి వెలువడ్తున్న నేతి సువాసనల్ని, ఇతరములైన పరిమళాల్ని ఆస్వాదించు.

ఇంద్రుడిచ్చిన పూలదండ తన రొమ్ముపై కదలాడుచుండ విజయుడైన పాండ్యుని రాజభవనాల నుంచి వెలువడ్తున్న చక్కని పరిమళాలను గమనించు. కవులచే సదా ప్రస్తుతించబడు పొటియిల్ కొండల నుంచి వెలువడే మలయ మారుతాలకు విభిన్నంగా ఉండవచ్చును కాని అవి చరిత్ర ప్రసిద్ధికెక్కిన ఆ పురాతన నగరం గురించి చెప్పకనే చెబుతున్నాయి గమనించు. నీవు ఒంటరిగా వెళ్లినా దారితప్పవులే"–

వారి దగ్గర సెలవు తీసుకుని ఆ ముగ్గురు బాటసారులూ తమ రాత్రి ప్రయాణాలను కొనసాగించారు. ప్రభాత వేళ వారికి రాచ భవనపు శివాలయంలో మోగుతున్న గంటలు ఆహ్వానం పలుకుతున్నట్లుగా మోగాయి. ఇతర వాయిద్యాల మోతల మధ్య చతుర్వేద పండితులైన బ్రాహ్మణులు గానం చేస్తున్న స్తోత్రాలు, నామ పారాయణాలు, దేవతాస్తుతులు వీనుల విందుగా వినిపించసాగాయి. యుద్ధరంగాన పరాజయమెరుగని పాండ్యరాజును పొగడ్తున్న వందిమాగధ స్తోత్రాలు, ఖడ్గ పాణులైన సాయుధ భటుల కవాతు శబ్దాలు, యుద్ధపు టేనుగుల ఘీంకారాలు, అశ్వాల సకిలింపులు, ఉదయపువేళ గాయకులు మేలుకొలుపులు పాడుతుండగా వినిపించే మద్దెల, కంజీర వంటి సహకార వాయిద్యాల ధ్వనులు అవి మధుర నుంచి వస్తూ– మహోధృత సముద్ర తరంగాల హోరును మించి– బాటసారులు పడ్డ కష్టాలను తొలగించు శీతల లేపనాల్లా, అతి మధురంగా వినిపించసాగాయి. కురవకము, ఖర్జూర, రేల, బూరుగు, వెంగై, మద్ది, గంబొజి, ఎర్రచందనం, మారుతం, మల్లె, సీమరేగు, చంపకం, మొల్లలు ఇత్యాది పుష్పాలు మిక్కుటముగా వికసించిన వచ్చట. మాధవి, స్వర్ణమల్లె, అడవిమల్లె, వెదురు, కురువింద, వకుళ, తిలక, పాటలీ, సురపున్నాగ, పారిజాత, కుటజ, మాలతి, కుంజ, మాధవీ పుష్పాలు,

లతలు ప్రకృతి కన్య నడుముకు అమర్చిన పూల వడ్డాణంలా భాసిస్తున్నవి. అడుగున వెడల్పుగా, పైకి మొనదేలి అద్భుతంగా వికసించిన పూలు, పూలచెట్ల శిఖరాన చిన్నిచిన్ని ద్వీపాలై ప్రకృతి కన్య వక్షోజాలలా భ్రాంతి గొలుపుతున్నవి. నదీ తీరాన పెరిగే వెంగై పూలనుంచి రాలిపడిన అరుణ వర్ణపు రెక్కలు ఆ కన్య కెంపు అధరాల్లా, నీటి అలలచే ఒడ్డుకు చేరిన మల్లెల సమూహాలు ముత్యాల్లాంటి ఆమె పలువరుసలా, అటు యిటూ కదలాడుతూ మిలమిల మెరుస్తున్న చేపలు, ఆ కన్య విశాల నయనాల్లా, వంపుల్తో, చారలతో, కదలని ఇసుక తిన్నెలు నల్లని ఆమె శిరోజాల్లా ఉన్న ఆ ప్రకృతికన్య ఈ లోకపు జనులందరినీ రక్షిస్తున్నది. కవుల నాలుకలపై సదా కదలాడుతున్నది. 'వైయియి' అను నామాన సంతాన దేవతగా పాండ్యరాజ పతాకతో ప్రసిద్ధికెక్కినది. కన్నగికి రాబోయే ఆపదను ముందే పసిగట్టినట్లు, పరిమళభరిత పుష్పాలను వస్త్రంగా ధరించిన ఆ సంతాన దేవత వరదలా వస్తున్న తన కన్నీటిని ఆపు ప్రయత్నంలో కన్నీరు నిండి చెలమలైన ఆమె నేత్రాలలా– ఆ చుట్టుపక్కలంతా నిండిన నీరే కానవస్తున్నది.

కన్నగి అన్నది– “ఈ నది నిండా ఉన్నది నీరు కాదు, సుగంధ పుష్పాలు సుమా!' కోవలన్ తన భార్య హంస నడకను ప్రశంసిస్తూ ఉండగానే వారు పడవలున్న చోటుకు చేరుకున్నారు. కాని వారు పెద్దపెద్ద నావలు, చుక్కానులు అశ్వ, గజ, సింహ తలలతో అలరారుతున్నవి ఉన్న రేవు వేపు కాక దగ్గరలో ఉన్న బల్లకట్టు నెక్కి ఆవలితీరం చేరినారు.

ఆ ముగ్గురు బాటసారులూ నది దక్షిణ తీరాన్ని చేరి, – నగరం చుట్టూ ప్రదక్షిణం చేస్తే నగర దేవతలు కరుణిస్తారు– అని భావించి అగడ్త పక్కనే నడుస్తున్నపుడు కన్నగి, కోవలన్‌లకు రాబోయే ఆపదలు తెలిసినట్లు పొదుగాటి కాడలున్న నీలికలువ, తెల్ల కలువ, తామరలు దుఃఖంతో వణుకుతూ కళ్లనీళ్లు పెట్టుకున్నట్లు కనిపించాయి. పాండ్యరాజు తన శత్రువుల నోడించి వశం చేసుకున్న రాజ లాంఛనాలు కోట గోడలపై నుండి కనిపిస్తూ 'ఇటు రావద్దు' అని హెచ్చరిస్తున్నట్లు కనిపించినాయి.

పక్షులతో నిండిన పొలాల్ని, తోటల్ని దాటుకుంటూ నగరపు దరిదాపుల్లోకి వచ్చేసరికి చుట్టూరా నీళ్లతో నిండిన ఏర్లు, కొబ్బరి, అరటి, తమలపాకు, వెదురు వనాలు అక్కడ నివసిస్తున్న ధర్మావలంబకులైన మునులు మాత్రమే కన్పించారు.

❖❖❖❖❖

# 14. నగర సందర్శనం

నగరానికి చుట్టుపక్కల ఎటుచూసినా నీటి మడుగులు, ఆకుపచ్చని పొలాలు, అప్పుడే నిద్రలేచిన పక్షుల కిలకిలారావాలు. ఉదయవేళ అందర్నీ అలరించే భానుడిని ఆహ్వానిస్తూ సరస్సులోని ఎర్ర తామరలు అందంగా విచ్చు కుంటున్నాయి. ఖడ్గధారియైన పాండ్యుని వీరత్వానికి భయంతో వణికే పగతుర శిరస్సులా, చీకటి వణుకుతూ నిష్క్రమించినది. భేరీభాంకారాల చప్పుళ్లు, ముక్కంటి దేవాలయం నుంచి వెలువడ్తున్న శంఖ ధ్వనులు, గరుడ ధ్వజుడైన విష్ణుదేవుని గుడి గంటల చప్పుడులు, హలధారియైన బలరాముడి దేవాలయపు ఘంటికా నాదాలు, కుక్కుట ధ్వజుడైన మురుగన్ గుడిలోని ప్రార్థనలు, ధర్మాన్ని బోధించే జైన దేవాలయపు లోగిల్లో, విజయ రూపుడైన మహారాజు భవనంలో నుంచి వెలువడుతున్న వివిధ నాదాలు దేశ ప్రజలను పులకాంకితులను చేస్తున్నాయి.

భక్తిభావంతో కోవలన్ అక్కడే ఉన్న సాధ్వి కవుంతి వద్దకు వెళ్లి ఇలా ప్రార్థించాడు– "అమ్మా! ఇన్నాళ్లూ నేను దారితప్పి చరించాను. పూలతీగెలా సుకుమారియైన ఈ బాలికను అంతులేని కష్టాల పాల్జేసాను. తపస్వినీ! నేనువ్యాపారస్తుల వీధికి వెళ్లి నా స్థితి విన్నవించుకుని నాకంటూ ఏదో ఒక వ్యాపార మార్గాన్ని చూసుకుని వచ్చేంత వరకు ఈమెను నీ సంరక్షణలో ఉంచుతాను. తమకు భారమనిపిస్తే మన్నించి తెలుపగలరు"

కవుంతి అన్నది– "పూర్వజన్మ కర్మఫలమింకా పూర్తికాలేదు కనుక నీ విన్ని కష్టాలు పడ్తున్నావు. జ్ఞానులు ఎంతో గట్టిగా చెబుతారు– 'పాపకార్యాలు మాను. లేకుంటే ఫలితమనుభవించక తప్పదు' ఈ మాటలన్నీ వింటారు కాని హృదయంలో గట్టిగా పెట్టుకోరు. ఏదైనా చెడు జరిగినప్పుడు దుఃఖంతో హతాశులౌతారు. అజ్ఞానం వలన మాయ వలన వారు ఈ విధంగా పరితపిస్తారు. జ్ఞానులు తమ కర్మ పరిపక్వానికి వచ్చినప్పుడు చింతించరు. సంయోగ వియోగాలలో ప్రేమ పొందే ఒడిదుడుకులతో హృదయం క్షోభిస్తుంది. అనంగుడైన కాముని బాణాలకు లోనై కామినులతో కొందరు తమ జీవితాల్ని వసంతోత్సవంగా గడుపుతారు. కాని అవే బాణాలు బ్రహ్మచర్య నిష్ఠాగరిష్ఠులను బాధించవు. ఈ

ప్రపంచంలో స్త్రీజన పొందు, భోజన విందులే జీవితాశయంగా చరించేవారు అంతిమంగా అనేక కష్టాల పాలవుతారు. జ్ఞానులు వర్జించినవవే! ప్రేమ వలలో చిక్కుకుని నిరాశలో మునిగిన వారెందరో! అన్ని కాలాల్లో సంభవించేదదే! ఈ దుఃఖగాధ ఎంతో పాతది.

సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమైన రాముడికే వనవాస క్లేశాలు తప్పలేదు. తన భార్య జానకితో అంతులేని కష్టాలు పడినాడతడు.

నలదమయంతుల కథ నీకు తెలుసు. జూదంలో సర్వం పోగొట్టుకుని అడవుల్లో భార్యతో సహా తిరుగుతూ, ఏ మచ్చాలేని ఆమెను నట్టడివిలో వదిలేసి వెళ్లిపోయాడు నలుడు.

ఇది కర్మ కాకపోతే మరేమిటి? దీనిలో దమయంతి తప్పేమున్నది? నీవు అటువంటి వాడివి కాదు. మీరిద్దరూ విడదీయలేని జంట. వెళ్లు! మధురై నగరంలో మీరుండటానికి వీలైన వసతి చూసుకుని తిరిగిరా!" అన్నదా సాధ్వి కవుంతి.

కోవలన్ అగడ్త దాటి ఏనుగులు వెళ్లే దారి గుండా కోటను కాపలా కాస్తున్న యవన భటుల కంట కనపడకుండా లోనికి ప్రవేశించాడు. ఆ భటులు యమకింకరుల్లా ఖడ్గ పాణులై శత్రువులకు వణుకు పుట్టించేంత భయంకరా కారులు. కోటద్వారం దాటి లోపలకు వెళ్లగానే మిరుమిట్లు గొలుపుతూ మధురై నగరం. సహస్రాక్షుడైన ఇంద్రుడి ధనాగారమా! అన్నట్లున్న ఆ నగర వీధులలో పడమటి గాలికి రెపరెపలాడుతున్న పతాకలు.

అందమైన స్త్రీలు తమ ప్రియులతో ఎత్తైన మారుతమ్ చెట్లున్న తోటల్లోకి సరససల్లాపాలాడుకుంటూ పోతున్నారు. ఎల్లప్పుడూ నీటితో నిండి ఉండే వైయాయి నదీ ఒడ్డున, పూలరేకులు విరజిమ్మబడిన తెల్లటి ఇసుక తిన్నెలున్న చోటు, పడవలలో, దోనెలలో, బల్లకట్టులపై వాళ్లు హాయిగా విహరిస్తున్నారు.

ఆ పురాతన నగరపు పూలవాటికలలో స్వర్ణ చ్ఛాయగల స్వైరిణులు శీతల సుగంధాలను విరజిమ్మే మల్లెలను కొప్పులో తురుముకుని, వెడల్పాటి కళ్లలా విచ్చుకున్న కలువలను, నీలి తామరలను, బొంతమల్లెలను, మొల్లలను

ధరించి వన్నెల వెన్నెలలను కురిపిస్తున్నారు. ఎర్రకలువల పుప్పొడి మెడలోని ముత్యాల హారాలపై పడి మెరుస్తుండగా, వారు తమ శరీరాలపై దక్షిణ మలయ పర్వతాల నుంచి తెచ్చిన చందనపు లేపనాన్ని అలుముకుని సుగంధ పరిమళాలను వ్యాపింపజేస్తున్నారు. సూర్యాస్తమయ సమయానికి, చంద్రుని వెన్నెలలతో ప్రకాశవంతమైన లోగిళ్లలో వాల్చిన పూలపాన్పులపై తమ ప్రియుళ్లతో సమాగమానికి సమాయత్తులౌతున్నారు.

వర్షాకాలమందు ఆ స్త్రీలు చక్కని ఎర్రటి పట్టు వస్త్రాలను ధరించి కొప్పులో అడవి మల్లెలను, ఎర్ర కాంతాల్ పూలను (గొబ్బిపూలు), సుగంధ పరిమళాల వెదజల్లు కురింజి పూలను ధరించి, కుంకుమ పూల లేపనాన్ని వంటిపై వక్షోజాలపై అద్దుకుని అరుణ వర్ణంతో వెలిగిపోతుంటారు. ఉత్తరగాలితో ఏతెంచిన మేఘరాజు మధురై నగరాన్ని కెంపు వర్ణంగా మార్చి, వజ్రాయుధుడై పర్వతాల రెక్కలు నరికిన ఇంద్రుడికి తన ప్రభావాన్ని చూపే వర్షాకాలమిది.

శరత్కాలమందు శీతల పవనాలకు భీతిల్లిన హరిణ నేత్రులు కుంపటి సెగల వేడితో వంటిని వెచ్చబరుచుకుంటూ, చందనాన్ని తమ రొమ్ములపై అద్దుకున్న ప్రియుల కౌగిలిలో రక్షణ పొందుతున్నారు. వాస్తుశిల్పులు ప్రత్యేక శ్రద్ధతో నిర్మించిన ఎత్తైన భవనాలందు నివసించు యవ్వనులు, చల్లని మబ్బులు ముద్దాడుతున్న గవాక్షపు తలుపులను మూసి తమను వెచ్చగా ఉంచుకుంటున్నారు.

తొలి మంచు కురిసే హేమంత కాలమందు సూర్యుడు దక్షిణాపథాని కేగుచూ తెల్లమబ్బులను తరిమివేస్తున్నపుడు జవరాళ్లు తమ ప్రియుళ్లతో చంద్రకాంత శిలలు పరచిన ఆవరణలలో నీరెండ వెచ్చదనాన్ని ఆనందంగా అనుభవిస్తున్నారు.

మంచు దట్టంగా కురిసే శిశిర కాలమందు క్రూరనేత్రాల కాముని ధనుస్సును పూజించే పండుగను మధురై నగరంలో వైభవంగా జరుపుకునేప్పుడే, దక్షిణపు గాలిలో సముద్రాన్ని చీల్చుకుంటూ వచ్చే నావలు 'తొంటి' ప్రభువులు పాండ్యరాజుకు సమర్పించే కప్పముగా అగరు, పట్టు, చందనం, అత్తరులు, కర్పూరం, ఇత్యాది వెలలేని వస్తువులను తెచ్చి మధురై నగరాన్ని మరింత భాగ్యవంతం చేస్తాయి.

మలయమారుతాల్ని తెచ్చి మధురై నగరాన్ని శృంగార పురంగా తీర్చిదిద్దే వసంతకాలంలో మాధవీలతలు గుబుర్లుగా అల్లుకుంటాయి. వనాలన్నీ విరబూసిన పూలతో నందనవనంగా భాసిల్లుతాయి. పూలతీగెల్లాంటి పూబోడులు తమ ప్రియభర్తలతో కూడి సుఖశాంతుల నానందిస్తారు.

పశ్చిమ గాలుల్తో మధురై నగరానికి విచ్చేసిన వసంతరాజు నిష్క్రమించగానే, ఎండలు మండి, కొండలు కాగగా, ఏనుగులు తమ గున్నలతో అడవులలో చెట్లనీడకై ఆక్రందించ, అడవులన్నీ దావాగ్నితో మండుతున్నట్లున్న వేసవి కాలమది. రాజాంతఃపురాన రమణులు ప్రభువు అనుగ్రహ ప్రాప్తులై రథములు, రత్నతల్పములు, పల్లకిలు, శృంగార వాటికలు, వింజామరలు, స్వర్ణ మందసాలు, పిడిబాకులు బహుమతులుగా నొంది రాజు ననేక విధముల తృప్తినొందించి తాము సంతుష్టులగుతున్నారు. పరిచారికలిచ్చిన బంగరు పాత్రలలోని మధువు తాగి మత్తెక్కిన కనులతో తమ పరిమళభరిత పూలదండలపై ఝుమ్మని ముసిరిన తుమ్మెదలను తరిమి వేయ ప్రయత్నిస్తూ మత్తులో, అవి లేని చోటున వాటిని అదిలిస్తున్నారు.

ముత్యాల వంటి చిరునగవులు, కెంపు అధరాల మధ్య ప్రకాశించ, తమ ప్రియులతో ప్రణయ కలహాల కోపము నటించుచూ, నీలికలువలపై నెపము నెట్టి వాటిని నిందిస్తున్నారు. నల్లదామర రేకుల వంటి కనులు గల ఆ యువతులు సంభాషణలు శకలాలై గొంతులోనే ఆగిపోగా, అష్ట విధ గానరీతులు అష్టవంకరలు పోగా అందరికీ నవ్వు తెప్పించుచూ అర్ధనిమీలిత నేత్రులైనారు. ఎర్రకలువ రేకుల్లా ఎర్రబడిన వారి విశాల నయనాలు వారి ఆగ్రహాన్ని ప్రకటిస్తుండగా, విల్లులా వంగిన కనుబొమలు వారి కోపాన్ని సూచిస్తున్నవి. తిలకము దిద్దిన నుదుటిపై స్వేదబిందువులు చుక్కల్లా మెరుస్తున్నవి. ఉన్నత కుటుంబీకులైన వారి ప్రియులు తమ ప్రియురాళ్ల కోపం చల్లారేంత వరకు ఓపిక వహిస్తున్నారు. ఈ వీధులన్నీ ప్రసిద్ధికెక్కిన వేశ్యావాటికలు. మధురై ప్రభువుకు ఆనంద జనకాలు.

కోవలన్ ఇరువేపులా ఎత్తైన సౌధాలున్న రాజవీధిని నడుస్తున్నాడు. రాచ నర్తకీమణులుండే ప్రాంతమది. రాజులు, రాజవంశీకులు వారిని రహస్యంగా కలిసే అక్కడి రమణులకు శిక్షలుండవు. స్వైరిణులు మితిమీరి ప్రవర్తిస్తే నెత్తిపై ఏడు ఎర్రటి కాలిన ఇటుకలుంచి ఊరేగించే శిక్షలు వీరికుండవు. ఈ రాజనర్తకీ

మణులు గణికలు చతుష్షష్టికళలలో ఆరితేరినవారు. వారికి వెట్టియల్, పొటువియల్ (చైత్ర, జాతీయ) నాట్యరీతుల భేదాలు తెలియును. వివిధ నృత్యరీతులు, సంగీత గాన స్వరాలయాది విభిన్న తీరులు, వాయిద్య విశేషముల గురించి క్షుణ్ణముగా తెలిసినవారా యువతీ లలామలు. నాలుగు రకాల అభినయ పద్ధతులు (ముద్రలు–నిలుచుట, కదలిక, హస్తక్రియ, ఉనికి); సప్తస్వరాలు, వరమ్, పల్లని, చరణాలు, ఇవన్నీ తెలిసి గానమాలాపించుటలో అష్టమ స్థాయిని అందుకున్న వారికిచ్చు ఒక వేయి ఎనిమిది దీనారాలు బహుమతి పొందినవారు వాళ్లు. తమతమ కళలను ప్రదర్శిస్తున్నపుడు– వారి చూపుల వలలో చిక్కుకుని జ్ఞానులమనుకునేవారు కూడా విలవిలలాడ్తారు. మునులు కూడ యువకులై పూల వెంబడి తిరుగు తుమ్మెదల్లా కాముని శరపరంపరకు లోనై తమని తాము నవ్వులపాలు చేసుకునే మన్మథావస్థను పొందుతారు. అరవై నాలుగు కళలలో ఆరితేరిన ఆ లావణ్యవతుల పలుకులు చిలుక పలుకుల్ని, వీణారాగాల్ని మైమరిపిస్తాయి.

అదుగో అది వ్యాపార కూడలి. అక్కడ వివిధ రకాల శకటాలు, తోపుడు బళ్లు, రథాలు, పల్లకీలు, కవచములు, వింజామరలు, రత్నఖచిత అంకుశములు, అరపట్టికలు, వంపుకర్రలు, తాళ్లు, అనేక రకాల మందులు, తోలు పటకాలు, కేడెములు, కళ్లెములు, నాడాలు, కోలలు, పాశములు, ముత్యాలు పొదిగిన ములుగర్రలు, సవరములు, దంతపు దువ్వెనలు, ధూపపాత్రలు, వివిధ వస్తు విశేషములు చేస్తున్న లోహకారులు, తాళ్లు పేనువారు, పూలదండలు కట్టువారు, దంతపు పనివారు, అగరు, చందనాది సుగంధ ద్రవ్యములనమ్మువారు. ధనవంతులైన వ్యాపారస్తులు రాజుకే అసూయ కలిగించునంత ధనము కలిగిన వారు, రాజ సంరక్షణలో శత్రు, చోర భయము లేక తమ తమ వ్యాపారాలను నిర్వహించుకుంటున్నారు.

అది వజ్రాల, రత్నాల విఫణి. అక్కడ ప్రశస్తమైన వజ్రాలు– కాకపాదము, చుక్కలు, రంధ్రాలు గీతలు లేనివి నాలుగు వర్ణాలున్నవి లభిస్తాయి.ముదురాకుపచ్చ మరకతాలు, ఎర్రతామరలుగా పిలువబడే కెంపులు, నీలాలు, ముత్యాలు, స్ఫటికాలు, స్వర్ణాభరణాలలో మెరుస్తున్న పుష్పరాగాలు, గోమేధికాలు, తేనె, సూర్యకాంతి కలబోసినట్లుండే వైడూర్యాలు –ఈ విధాలైన మణిమాణిక్యాలు, ప్రశస్తమైన తెలుపు ఎరుపు ముత్యాలు, రంధ్రాలు లేని పగడాలు లభిస్తాయాచోట.

అక్కడ నుంచి కోవలన్ స్వర్ణకారుల వీధిలోకి వెళ్లాడు. వాళ్లు తమ దగ్గర ఉన్న నాలుగు రకాల స్వర్ణ భేదాలను వివరిస్తున్నారు– సహజ స్వర్ణం (జాతరూపము), చిలుక రెక్కల రంగు (శుక పక్షము), హాటకము, జాంబూనదము – అని పిలుస్తూ వాళ్లు కొనుగోలుదారులనాకర్షిస్తున్నారు.

ఈ వీధిలో వస్త్ర వ్యాపారులున్నారు. నూలు, పట్టు, ఉన్నితో చేయబడిన వస్త్రాలు బేళ్లుగా, కుప్పలుగా పోసి ఉన్నాయి. అది ధాన్యపు బజారు. చేతిలో త్రాసులు, తక్కెడలు, కుంభాలు, మానికలతో వ్యాపారస్తులటూయిటూ తిరుగుతున్నారు. అన్ని కాలాలందు ధాన్యం, మిరియాలు లభిస్తాయక్కడ.

ఆ తరువాత కోవలన్ నాలుగు వర్ణాల ప్రజలు నివసించే వీధులలో తిరిగాడు. మూడు నాలుగు దార్లు కలిసే కూడళ్లలో కాసేపు ఆగాడు. వ్యాపార స్థలాలు, సంతలు, చిన్నచిన్న వీధులు, సందులు గొందులు కలయ తిరిగి ఆ నగరంపై ఒక అభిప్రాయానికి వచ్చాడు. దట్టంగా తీగెలు అలుముకున్న చెట్టు పందిరి నీడలో నిలబడి పాండ్యుని ప్రసిద్ధ నగరమైన మధురైను చూస్తుంటే అతడి హృదయం ఆనందంతో ఉప్పొంగింది. కాసేపు ఆ నీడలో నిలబడి అలసటను పోగొట్టుకుని అతడు అక్కడ నుంచి నిష్క్రమించినాడు.

✣✣✣✣✣



# 15. ఆశ్రయం

ధర్మ పరిపాలనాదక్షుడు, ప్రజాహితవ్రతుడు,
పసిడి పంటలనిచ్చు భూమిపతి,
ఛత్ర ఛామర, రాజదండ హస్త శూలపాణియైన
పాండ్యరాజు పాలనలో మధురై వదలిపోవ ప్రజలిష్టపడరు.

నగర సందర్శనానంతరం కోవలన్ ధర్మవ్రతులైన మునులున్న వనంలోకి వచ్చినాడు. అక్కడ కవుంతి సాధ్వని కలిసి మధురై గొప్పదనాన్ని, రాజు యొక్క వీరత్వాన్ని ప్రశంసిస్తుండగా, అక్కడకు తలైసెంగణమను గ్రామ నివాసియైన 'మాదలుడు' అనబడు సద్బ్రాహ్మణుడు, చతుర్వేద పారంగతుడు, వివేకి, సచ్ఛీలుడు వచ్చినాడు. అగస్త్య మహాముని కత్యంత ప్రీతిపాత్రమైన పోటియల్ –మలయ పర్వతమును సందర్శించి, కుమారి తీర్థాన స్నానమాడి స్వస్థలమునకు వెళ్తూ ఆ వనంలో విశ్రాంతికై కాసేపు ఆగినాడు. కోవలన్ అతడిని చూసి భక్తిప్రపత్తులతో నమస్కరించగా అతడన్నాడు–

"మామిడి మొలకవంటి మాధవి ఆడపిల్లకు జన్మనిచ్చినప్పుడు మైల స్నానాలనంతరం అక్కడి వృద్ధ వనితలు ఆ పసిపాపకు నామకరణం చేయదలచి నప్పుడు వాళ్ల మధురమైన పలుకుల నాలకించి నీవన్నావు.

'ఒక అర్ధరాత్రి మా పూర్వీకుడొకడు ప్రయాణిస్తున్న నావ ఉధృత సముద్ర తరంగాల ధాటికి వ్రయ్యలు కాగా, నీటబడ్డ అతడు తన శాయశక్తులా ఈదుతూ తీరాన్ని చేర ప్రయత్నిస్తున్నపుడు ఒక దేవత ప్రత్యక్షమై ఇలా అన్నది– 'భయపడకు. నాపేరు మణిమేఖల. ఇంద్రుడి ఆజ్ఞపై నేనిక్కడ నివసిస్తున్నాను. నీకు సహాయం చేస్తాను'–

అని పలికి ఆమె అతడిని ఆకాశమార్గాన తీరానికి చేర్చి అదృశ్యమైనది. మా ఇలవేల్పు ఆమె – కనుక నా కుమార్తెకు 'మణిమేఖల' అని పేరు పెడదాం'– అని పలికి అంతులేని బంగారాన్ని కానుకగా ఇచ్చినావు.

ఒకరోజున సమస్త విద్యాపారంగతుడైన గూని బ్రాహ్మణుడొకడు నీవిచ్చు కానుకల కోసం వస్తున్నపుడు ఒక మదించిన ఏనుగు తననదలిస్తున్న మావటీడును

లెక్క చేయకుండా తన తొండంతో ఆ బ్రాహ్మణుడిని చుట్టి పైకెత్తగా అతడు భయవిహ్వాలుడై హాహారావములు చేయుచున్నపుడు నీవు ఆ ఏనుగు కాళ్ల సందునుండి తొండముపై కెగబాకి, దాని దంతాలపై నుంచి వీపుపైన దూకి నల్లని కొండపైనున్న విద్యాధరుడిలా ఆ ఏనుగు కోపాన్ని ఉపశమింపజేసి ఆ బ్రాహ్మణుడిని కాపాడినావు.

ఇంకోసారి ఓ బ్రాహ్మణుడి భార్య ముంగిసను చంపగా, చలించిన ఆతడు, భార్యను విడిచి ఉత్తర దిక్కుకు పోవ నిశ్చయించగా ఆమె అతడిననుసరించ బోగా– 'నేను నీ చేతి కూడు ముట్టబోను. సంస్కృత శ్లోకము వ్రాయబడి ఉన్న–

**'అపరీక్ష న కర్తవ్యం కర్తవ్యం సుపరీక్షితమ్**
**పశ్చాద్భవతి సంతాపః బ్రాహ్మణీ నకులం యధా॥**

–ఈ తాళపత్రమును ఎవరికైనా జ్ఞానికి చూపించు. నీకు ప్రాయశ్చిత్తం కలుగుతుంది' అన్నాడతడు. ఆమె దుఃఖంతో అనేకచోట్ల తిరుగుతూ నీవున్న ప్రదేశానికి రాగా నీవు ఆ తాళపత్రంలోని శ్లోకాన్ని చదివి, ఆ విధంగా ప్రాయశ్చిత్త కార్యక్రమాల్ని చేసి ఆ బ్రాహ్మణ కుటుంబానికి తగిలిన హత్యా పాతకాన్ని రూపుమాపి, ఆమె భర్తను వెదకిబట్టి అనేక కానుకలిచ్చి ఆ కుటుంబాన్ని నిలబెట్టినావు.

మరోసారి ఒకడు శీలవతియైన ఒక స్త్రీ గురించి నిందారోపణలు చేయగా, అబద్ధపు సాక్ష్యములనిచ్చి ఇతరులను బాధ పెట్టువారిని చంపి తినే రాక్షసి ఆ వ్యక్తిని వలలో పట్టి బంధించగా ఆతడి తల్లి వలవల ఏడ్చుచుండ, నీవు దయతో ఆ రాక్షసి వద్దకు వెళ్లి– 'ఆతడి మారుగా నన్ను భుజింపుమని' వేడినావు. కాని ఆ రాక్షసి చెడ్డవారిని వదిలి మంచివారిని భక్షించుట నాకు వీలుకానిది అని ఆ చెడ్డవ్యక్తిని భక్షించెను. అనాథలైన ఆతడి కుటుంబానికి అంతులేని ధనమిచ్చి వారాకలిదప్పులతో నశించకుండా కాపాడినావు.

ఓ కోవలన్! గోపాలా! నీవు చేసిన మంచి పనులు సంఖ్యకందనివి. కాని నీ పూర్వజన్మ పాపములే నిన్నూ, లక్ష్మీసమానురాలైన నీ భార్యను బాధ పెడ్తున్నవి'–

కోవలన్ సమాధానమిచ్చినాడు– “నాకు ఓ కల వచ్చినది. ధర్మరక్షకులైన పాండ్యుని రాజ్యంలో ఒక కపటి వలన నా భార్య దుఃఖిస్తూ కనిపించినది. ఎవరో అపరిచితులు నా దుస్తులను ఊడబెరికి నన్ను పెద్ద కొమ్ములున్న దున్నపోతుపై ఉంచినారు. తరువాత అపురూపమైన ఆభరణాలను ధరించిన ఓ యువతి నా పునర్జన్మ బంధాలను తెంపి నాకు ముక్తి ప్రదాయిని అయినది. మణిమేఖలను మాధవి బౌద్ధ సన్యాసులకప్పగించగా ప్రేమదేవుడైన కాముడు తన పూలబాణాలను గాలిలో పారవేసి, ఆగకుండా దుఃఖించడాన్ని నేను కలగన్నాను. అర్ధరాత్రి వచ్చిన ఈ స్వప్నానికర్థమేమిటో తెలుసుకోవాలని నేను త్వరగా బయల్దేరి మీ సన్నిధికి వచ్చినాను”

వెంటనే సాధ్వి కవుంతి, సద్బ్రాహ్మణుడు మాదలుడు ఒక్క గొంతుతో ఇలా అన్నారు–

“ఈ ఆశ్రమ ప్రాంతాలు ధర్మనిష్ఠా గరిష్ఠపరులైన మునులు మాత్రమే ఉండదగినవి. వెంటనే మధురకు వెళ్లి నీ గురించి ఎరిగిన ధనిక వ్యాపారస్తులను కలిసినచో వారు నిన్ను తప్పక ఆహ్వానించగలరు. చీకటి పడకమునుపే మధురైకు వెళ్లి కార్యసాధకుడివికా!”

అతడు వెళ్లినాక అక్కడకు ‘మాదరి’ అనే గొల్ల స్త్రీ వచ్చి కవుంతికి పాదాభివందనం చేసింది. ఆమె నగరపు వెలుపల వెలసిన యక్షిణి దేవతకు పాయస నైవేద్యము పెట్టి, ప్రార్థించి అటుగా వచ్చినది. ఆమెను చూసి సాధ్వి కవుంతి ఇలా తలపోసింది.

“గోపకాంతల జీవనము కష్టాలతో కూడినది కాదు. ఈమె వృద్ధురాలు, శీలవతి, గుణవంతురాలు, దయాగుణం కలది. కన్నగిని ఈమె ఆశ్రయంలో ఉంచడంలో నాకేమీ దోషం కనిపించడం లేదు” అనుకుని ‘మాదరి’తో అన్నది–

“మాదరీ! విను. ఈమె భర్త తండ్రి గురించి తెలిసినవారెవరైనా వస్తే వాళ్ల అదృష్టం పండినట్లే. ఈ విశాలమైన కళ్లున్న యువతికి నీ వద్ద ఆశ్రయమివ్వు. ఆమె భర్త మధురై నగరంలో వ్యాపారస్తుల వీధిలో వసతిని వెదుక్కుంటూ వెళ్లినాడు. అతడు వచ్చేంత వరకు నేనీమెను నీ సంరక్షణలో ఉంచుతున్నాను. ఈమెకు తలారా స్నానం చేయించి మంచి బట్టలు కట్టు. కళ్లకు కాటుక పెట్టి, ఎర్రగందు

మీనాల్లాంటి ఆ వెడల్పాటి కన్నులు మరింత వెలిగేట్టు చూడు. ఆమె శిరోజాలను చక్కగా దువ్వి పూలతో అలంకరించు. ఆమెకు తల్లివి, సంరక్షకురాలివి, చెలికత్తెవి అన్నీ నీవే! ఎండకన్నెరుగని సుకుమారి ఈమె. నేలపై కాలిడనిది. పూలతీగెలాంటి ఈమె ఎండలో వడిలిన మొక్కలా ఉన్నదీనాడు. తన భర్త పడ్తున్న కష్టాలను తనవిగా భావించి తన అలసటను బాధను లెక్కచేయకున్నది. భర్తే దైవంగా భావిస్తూ జీవిస్తున్న పత్ని ఈమె నీకు తెలుసు. శీలవతులున్న చోట సకాల వర్షాలు కురుస్తాయని, భోగభాగ్యాలతో పాడి పంటలతో విలసిల్లు నేలనేలే రాజుకు సర్వదా విజయం లభిస్తుందని"–

మునులు నీకప్పగించిన బాధ్యత చిన్నదైనా దాని ఫలితం అనేక రెట్లుగా ఆనందాన్నిస్తుంది. కావేరీ నదీ తీరాన, పుగార్ పట్టణంలోని అశోక వృక్షపు ఛాయలనున్న చంద్రకాంత శిలావేదికపై సర్వాభరణ భూషితుడై, ఇంద్రధనుస్సు వర్ణాల పూలూ, పుష్పమాలలూ ప్రకాశిస్తుండగా దివ్యతేజస్సున్న దైవరూపుడి విగ్రహమున్నది. అతడి ఒక చేయి మర్కటహస్తంలా నల్లని వేళ్లను కలిగి ఉన్నది.

ఇదేమి విచిత్రమని అక్కడివారు మునిని అడగగా అతడన్నాడు– "ఒకప్పుడు 'ఎట్టి సాయలన్' అనే వ్యాపారస్తుడు ఆకలిగొన్న వారికి నిత్యం అన్నదానం చేస్తూండేవాడు. ఒకరోజు ఓ తపస్వి వారింటికిరాగా, ఇంటి యజమానిరాలు అతడికి భిక్షనిస్తూ– 'నీ పాపములు పరిహరించబడునుగాక!' అన్నది. అదే సమయంలో ఓ చిన్ని కోతి పక్కనే ఉన్న చెట్టుపై నుంచి జారి ఆ ముని పాదాలపై పడి ముని ఆరగిస్తున్న ఆహార పానీయాల్లో సగాన్ని తిని ఆకలి తీరిన ఆనందంతో అతడివేపు చూసింది. ఆ ముని గృహస్తురాలి వేపు చూసి అన్నాడు– 'ఈ వానరాన్ని నీ కుమారుల్లో ఒకడిగా భావించు'

ఆ తరువాత కొన్నాళ్లకు ఆ వానరం మరణించింది. ఆ యజమానురాలు దానం చేసినప్పుడల్లా కోతిని స్మరించి 'నీ పాపములు పరిహరించబడును గాక!' అనేది.

ఆ పుణ్యఫలితంగా ఆ వానరం కాశీలో ఉత్తర గౌతమునికి ఏకైక కుమారుడిగా జన్మించింది. అందానికి అందం, రూపానికి రూపమున్న అతడు సుగుణశీలి, జ్ఞాని, దానశీలిగా పేరుపొంది ముప్పైరెండవ ఏట మరణించి

దివ్యరూపాన్ని పొంది– ఇక్కడ వెలసినాడు. అందుకే మర్కట హస్తమున్నది ఆ విగ్రహానికి.

ఈమెను సంరక్షించు! నీకు శుభము కలుగుగాక!”

– అని సాధ్వి కవుంతి కన్నగిని మాదరి సంరక్షణకు అప్పగించినది. నిండు యవ్వనవతి, చక్కని వక్షోజ సంపద గలిగినది, వంచిన వెదురు విల్లు లాంటి భుజాలు గలిగినది, వివేకవతి అయిన కన్నగిని తీసుకుని మాదరి తన పల్లెకు బయల్దేరింది. దూడలకై మోరలెత్తి అరుస్తున్న ఆవులు, పిల్లలను చంకలోనిడుకుని గోపాలకులు, గొడ్డళ్లు, కొంకి కర్రలు, చిక్కములు చేబూని ఆవులను తోలుకుంటూ వస్తుండగా గొల్ల యువతులు తమ అందియలు, మట్టెలు మెరుస్తుండగా నగరం వేపు పోవు సమయాన కన్నగిని వెంట నిడుకుని ‘మాదరి’ నగరానికి రక్షణగా ఉన్న అడవి, అగడ్తకున్న కంచె ద్వారాన్ని దాటి అక్కడ ఉన్న యంత్ర ధనువులును, మర్కటరూప యంత్ర నాళికలను, వడిసెలలును, శత్రువులపై మరగిన నూనెను పోయడానికివాడే పాత్రలను, రాగిని కరిగించు పాత్రలు, ఇనుమును కరిగించి ఆయుధాలుగా తీర్చు కొలుములు, రాళ్లబుట్టలు, చిక్కాలు, వలలు, అంతలాయి పక్షిరూపాన ఉన్న మాటులు, ఈటెలు, వంకీలు, కోలలు, కొర్రులు, గొలుసులు, ఇనుప శూలాలు, సూదులు, గొట్టములు, గానుగ మ్రాకులు, పక్షుల ముక్కులు, పంది ముక్కులున్న యంత్రాలు, వెదురు కర్రలు, వివిధ రకాల రకాల బాణాలు, విల్లమ్ములు, కుంతలంబులు, చిత్రహింసల బెట్టు సూదులు, కళ్లు పీకే పనిముట్లు, బడితెలు, తలుపులకు వేసే గడియెలు, శతృవులపై విసరడానికి పనికివచ్చే రకరకాల ఆయుధాలు ఇవన్నీ ఆ కోటను శత్రువుల నుంచి రక్షించడానికై సదా సన్నద్ధంగా ఉన్న యంత్రసామాగ్రిని చూసినారు.

*****



# 16. హత్యా ప్రదేశము

ఆ యాదవస్త్రీ 'మాదరి', కన్నగిని తన సంరక్షణలో ఉంచుకోడానికి ఇష్టపడి, మజ్జిగను అమ్మే గొల్లయువతుల గుడిసెలలో కాక, ఎత్తైన ప్రదేశంలో ఉండి ఎర్రమట్టితో కట్టి, చెట్లనీడలో ఉన్న కుటీరంలో ఆశ్రయమిచ్చింది. ప్రకాశవంతమైన రంగురంగుల గాజులున్న చేతుల్లో గలగలలాడుతున్న గోపికా యువతులు కన్నగికి తలంటుతూ ఆమె శిరోజాల లావణ్యాన్ని చూసి ఇలా పొగిడారు–

"ఇంత అందగత్తెవు, నీవు, మధురై స్త్రీలు అసూయతో ఉడికేలా చేయగలవు. సహజమైన నీ సౌందర్యము ముందు ఏడువారాల నగలు ధరించిన లావణ్యవతులు సైతం ఓడిపోక తప్పదు"

మాదరి అన్నది– "ఈమె నా కూతురు 'అయ్యయి'. నీకు సపర్యలు చేస్తుంది. అందమైన కురులున్న దానా! నీవు మాకు నిలువెత్తు పసిడితో సమానం. ఈ ఇల్లు నీదనుకో! సాధ్వి కవుంతి నీకు అరణ్యమార్గాన అలసట లేకుండా తోడున్నది. ఇది మంచి చోటు. ఇంకా నీవు నీ భర్త గురించి ఆందోళన చెందుతున్నావా? అతడు జైన కుటుంబీకుడు గనుక అతనికి ఆహారాన్ని వారి పద్ధతిలో తయారుచేసి ఇద్దాం. కొత్త పాత్రలను, వంట సామాగ్రిని ఆమెకు ఇవ్వండి" –అని గోపకాంతలను ఆజ్ఞాపించినది.

గోపికలు మాదరి ఆజ్ఞను శిరసావహించి కొత్త పాత్రలను, పండిన పనస కాయలను, చారల దోసకాయలు, ఆకుపచ్చని దానిమ్మకాయలు, మామిడి కాయలు, మధురమైన అరటిపండ్లు, మంచిబియ్యం, ఆవుపాలు తెచ్చి కన్నగి కిచ్చినారు.

కత్తిపీటతో కూరలు తరుగుతుంటే సుకుమారమైన ఆమె చేతులు కంది ఎర్రగా మారాయి. నుదుటి నుంచి చెమట వర్షంలా కారింది. పొయ్యి పొగకు కళ్లెర్రబడి నీళ్లు కారాయి. అయ్యయి సాయంతో ఆమె గడ్డిమంటలో పసందైన ఆహారాన్ని తయారుచేసి భర్త రాకకై ఎదురుచూసింది. అతడు వచ్చాక తాటి ఆకుల చాపపై కూర్చుండబెట్టి, అలసిన అతని పాదాలను తన సుకుమార హస్తాలతో నీళ్లతో కడిగింది. చక్కని అరిటాకును పరచి దానిపై ఆహారాన్ని వడ్డించి "ప్రభూ! ఆరగించు" అన్నది.

అన్నం తినేముందు వారు పాటిస్తున్న ఆచారాల్ని గమనించిన తల్లీకూతుళ్లు ఇలా అనుకున్నారు– 'ఈ అందాల యువతి భర్త సాక్షాత్తు కృష్ణుడే! కోవలుడని పేరున్న గోపాలుడితడు. తల్లి యశోద ముద్దుల కొడుకితడు. ఈమె యమునా తీరాన నీలమేఘశ్యాముడితో విహరించిన గోపికయే! ఈ జంటను చూడ మనకు కన్నులు చాలవు'–

భోజనం ముగించి విశ్రాంతి తీసుకుంటున్న భర్తకు కన్నగి తమలపాకుల తాంబూల మందించింది. అతడు చిరునవ్వుతో అన్నాడు– "చెలీ! ఇటురా! నీ సుకుమార పాదాలింకా అడవిదారుల వెంబడి, గులకరాళ్లలో నడువగల శక్తిని కలిగియున్నవా?" అడవిలో ఆమె బడిన బాధను తలుచుకుంటూ అతడన్నాడు– "మన తల్లిదండ్రులెంత దుఃఖిస్తున్నారో! ఇది కలా! లేక పరిపక్వము చెందిన కర్మఫలమా! ఎంత మతిమాలినవాడిని నేను. ఆలోచనాదూరుడనై ప్రవర్తించాను. నీతిబాహ్యులైనవారితో విచ్చలవిడిగా సంచరించి, నాకున్న మంచిపేరును నాశనం చేసుకున్నాను. తల్లిదండ్రుల మాటలను పెడచెవినపెట్టి, నిన్ను నానా కష్టాలపాలు చేసాను. నీవు వయసులో చిన్నదానివే కాని తెలివిగలదానివి. నిన్ను నాతో రమ్మనడంలో నేనేమీ తప్పు చేయలేదు కదా? మన నగరాన్ని విడిచి మధురైకు వెళదాం రమ్మనగానే, క్షణం ఆలోచించకుండా నన్ననుసరించి వచ్చావు. అనేక కష్టాలు పడుతున్నావు"–

కన్నగి సమాధానమిచ్చింది– "నీవు నాతో లేకపోవడం వలన నేను మునులకు, సాధుసంతులకు, సద్బ్రాహ్మణులకు, అతిథులకు సరైన ఆతిథ్యమివ్వలేక పోయాను. పరమ పూజ్యురాలైన నీ తల్లి, రాజుచే సన్మానించబడిన నీ తండ్రి నన్ను చూడటానికి వచ్చినప్పుడల్లా చాలా దుఃఖపడేవారు. హృదయంలో ప్రేమతో, పెదాలపై దయగల మాటలతో వారు నన్ను ఓదార్చేవారు. నేనెంతో నిగ్రహించు కున్నప్పటికీ నా పెదాలపై అతకని చిరునవ్వును చూసి మరింత దుఃఖించేవారు. సన్మార్గులు దూరంగా ఉండే పనులను నీవు చేసావు. నేనేమీ తప్పు చేయలేదు కనుకనే నిన్ననుసరించాను"–

కోవలన్ అన్నాడు– "నాతో రావడానికి నీవు 'నా' అన్న వారందరినీ– తల్లిదండ్రులు, బంధువులు, సేవకులు, స్నేహితులు– వదులుకుని వచ్చావు. నిన్ను నడిపించినవి వినయం, విశ్వాసం, సత్ప్రవర్తన, శీలం అనే నాలుగు సుగుణాలు. నీవు నాతో రావడం చేత నా కష్టాలు తొలగినట్లుగా భావించాను.

బంగారు తీగె వంటి శరీరమున్నదానా! వంకీల శిరోజాలతో ప్రపంచాన్ని కాంతిమయం చేసే వర్చస్సు గల దేవీ! నీ సుకుమార పాదమంజీరాలలో ఒకదానిని అమ్మి ధనం తీసుకుని వస్తాను. దిగులుపడకు!"

చెలికత్తెలు లేకుండా ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ పరాయి పంచన చేరిన తన భార్యను చూసి కోవలన్ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ఆ తరువాత అతడు గొల్లలుండే ఇళ్లను దాటి, పశువుల మందలను దాటి వీధిలోకి అడుగుపెట్టాడు. ఎదురుగా మూపురమున్న ఎద్దు కన్పించింది. అది అశుభమని అతడికి తెలీదు. ఆ తరువాత పూలపుప్పొడితో నిండిన కూడలి దాటి వెళ్తుండగా రాజసందర్శనానికై వెళ్తూ తగిన దుస్తులు ధరించి తన వెనక వందమంది యువ కంసాలులు అనుసరిస్తుండగా ఒక స్వర్ణకారుడు చేతిలో పట్టకారు పట్టుకుని నడుస్తున్నాడు. అతడిని పాండ్యరాజు ఆస్థానపు స్వర్ణకారుడిగా భావించిన కోవలన్ అతడిని సమీపించి అడిగాడు– "నా దగ్గర రాణి పాదాలకు శోభనిచ్చే పాదమంజీర మున్నది. దాని విలువ నిర్ణయించగలరా?"

యమదూత లాంటి ఆ స్వర్ణకారుడు అతివినయంగా జవాబిచ్చినాడు– "ఈ సేవకుడు అటువంటి పనులను చేయలేడు కాని మహరాజు, మహరాణీలకు కిరీటాలు, ఆభరణాలు తయారుచేయడంలో నేర్పరి" అన్నాడు చేతులు జోడిస్తూ.

కోవలన్ తన చేతిలోని వస్త్రపు మూటను విప్పి కాలి అందియను ఆ మోసగాడైన స్వర్ణకారుడి చేతికిచ్చినాడు. అతడు దానిని నిశితంగా పరీక్షించి, కెంపులు, వజ్రాలు పొదిగిన ఆ కాలి అందియను మెచ్చుకుంటూ అన్నాడు– "ఇది మహరాణి పాదాలకు తక్క అన్యులు ధరించనొప్పదు. నేను ఈ విషయాన్ని రాజుకు విన్నవించి వస్తాను. అంతవరకు ఇదుగో, నా ఈ చిన్ని గుడిసెలో తమరు కూర్చుండగలరు". కోవలన్ వెళ్లి అక్కడ ఉన్న చిన్నగదిలో కూర్చున్నాడు.

ఆ దుర్మార్గుడైన స్వర్ణకారుడిలా ఆలోచించాడు– "మహరాణి పాద మంజీరాన్ని కాజేసి ఈ పరదేశిని దొంగగా రాజు ముందు నిలబెడ్తాను. నా అదృష్టం కలిసివచ్చి ఇతగాడు కాలి అందియతో నా కంటబడినాడు. ఇదే మంచి సమయం! మహరాజు ఇప్పుడు మధురై నగరపు నాట్యకత్తెల నాట్య గాన విలాసాల్ని చూసి హృదయం ఉప్పొంగినవాడై ఉంటాడు. రాణి అసూయతో అంతఃపురానికి నిష్క్రమించినట్లున్నది. అడుగో రాజు సభ చాలించి తానూ రాణివాసపు దారి పడ్తున్నాడు"–

అనుకుంటూ ఆ స్వర్ణకారుడు రాజుకెదురేగి పాదాలపై బడి ప్రణమిల్లి అన్నాడు– "మహాప్రభూ! చేతిలో గునపమో, తవ్వుకోలో లేకుండానే గజదొంగ కావలి భటులపై మత్తుజల్లి వాళ్ల కళ్లుగప్పి తాను దొంగిలించిన కాలి అందియను నా కమ్మడానికి వచ్చినాడు. అతడిని నా గదిలో కూర్చుండబెట్టి ఈ విషయం తమకు విన్నవించడానికై వచ్చాను"–

ఆ క్షణమే పాండ్యరాజు కర్మ పరిపక్వానికి వచ్చింది కాబోలు అంతటి ధర్మప్రభువూ, వేపపూల దండను ధరించి న్యాయనిర్దేశం చేసే మహరాజు, ఎటువంటి విచారణ లేకుండానే భటులను పిలిచి ఇలా ఆజ్ఞాపించాడు– "మహరాణి యొక్క కాలి అందియను ఆ గజదొంగ దగ్గర చూసారా, వెంటనే అతడిని చంపి కాలి అందియను తీసుకురండి!"

రాజాజ్ఞ వినగానే స్వర్ణకారుడి ముఖం వెలిగింది. "నేననుకున్నది విజయ వంతంగా పూర్తవుతున్నది" అనుకున్నాడు.

కోవలన్ ఇప్పుడు విధి వలలో పూర్తిగా చిక్కుకున్నాడు. స్వర్ణకారుడతడితో అన్నాడు– "విజయవీరుడైన మహరాజు పంపగా వచ్చిన భటులు వీరు. పాద మంజీరాన్ని చూడ వచ్చినారు"

స్వర్ణకారుడు కోవలన్ నుంచి కాలి అందియను తీసుకుని దానిని పరీక్ష చేస్తూ, చేసిన స్వర్ణకారుడి నేర్పును మెచ్చుకున్నాడు. రాజభటులన్నారు– "ఇతడు మంచివాడులా ఉన్నాడు. చంపదగిన నేరమేమీ చేసినట్లు లేదు"

భటులతో స్వర్ణకారుడు గుసగుసలాడినాడు– "మాయలు, మంత్రాలు, మందులు, శకునాలు, మోసం, ప్రదేశం, సమయం, పనిముట్లు –ఇవి దొంగలు తమ పనిని నిర్విఘ్నంగా చేసేందుకు వాడే అష్ట సూత్రాలు–

గజదొంగ మందుకు వశమయ్యావా ఆనక రాజు శిక్షిస్తాడు.
గజదొంగ మంత్రాలు వల్లెవేస్తే మీరు అదృశ్యమైపోతారు.
దేవుళ్లనే ప్రత్యక్షం చేయగలవాళ్లు దొంగసొత్తుతో మాయం కాగలరు.
ఇక గజదొంగను పట్టుకునే అవకాశం, సమయం మీకెక్కడిది?
మంచి శకునం చూడకుండా వాళ్లేపనీ మొదలెట్టరు!
మొదలెట్టారా, ఇంద్రుడి రొమ్ముపైన హారాన్నే మాయం చేయగలరు.
వాళ్లు ఏ వస్తువునైనా దొంగిలించాలనుకుంటే ఆపగలిగినవారెవ్వరు?

వాళ్లు దొంగతనానికి ఓ ముహూర్తం పెట్టుకుంటే దేవుళ్లే ఆపలేరు!
తమ పనిముట్లతో దొంగతనం చేస్తే కనిపెట్టడం ఎవరితరం?
పగలు, రాత్రి వాళ్లకు తేడాలేదు.
దొంగతనాల గురించి వాళ్లు మాట్లాడడం మొదలెడ్తే
ఎవరివల్లా కాదు వాళ్ల నైపుణ్యాన్ని కాదనే ధైర్యం.

ఒకరోజున ఒక గజదొంగ స్త్రీవేషం ధరించి రాజభవనంలో చొరబడినాడట. చీకటిలో, దీపాల నీడలో వెళ్లి యువరాజు మెడలోని వజ్రాల హారాన్ని గ్రహించాడు. ఇంతలో యువరాజుకు మెలకువ వచ్చి కత్తి దూయగా అతడూ తిరుగు దెబ్బలు తీసాడట. ఇక లాభం లేదని యువరాజు అతడిని పట్టుకోబోగా స్తంభం చాటుకు వెళ్లి క్షణంలో అదృశ్యమయ్యాడు. ఇంతవరకూ దొంగ ఆచూకీ దొరకలేదు. గజదొంగకు సరిసమానుడైన వాడింకెవడుంటాడు"–

అక్కడే ఉన్న శూలధారియైన మరో యువకుడు ఇలా అన్నాడు– "ఒక చీకటి వర్షాకాలపు రాత్రి గ్రామమంతా నిద్రపోతోంది. భయంకరమైన పులి అడవిలో వేటకు పోతున్నట్లు ఓ దొంగ, నల్లటి దుస్తులు ధరించి చేతిలో కన్నాలు వేసేందుకు పనికివచ్చే గునపంతో ఆ గ్రామంలోకి వచ్చాడు. నేను కత్తి దూసేప్పటికి అతడు నా కత్తిని నెట్టి మరుక్షణంలో నా కళ్లముందే అదృశ్య మయ్యాడు. ఈ దొంగల నేర్పు మెచ్చదగింది. రాజాజ్ఞను ధిక్కరిస్తే మనం ప్రమాదంలో పడతాము. మిత్రులారా! ఏం చేయాలో నిర్ణయించండి!"

ఆ రాజభటుల్లో ఒక దుందుడుకు సైనికుడు తన కత్తితో కోవలన్‌ను రెండుగా నరికాడు. అతడి గాయం నుండి వెలువడిన రక్తం వెల్లువలా ప్రవహించి అక్కడి నేలను ఎర్రగా తడిపింది. బాధతో విలవిలలాడుతూ నేలపై మెలికలు తిరుగుతూ మరణించిన కోవలన్ లానే రాజదండమూ వంపు తిరిగింది. కర్మ ఫలం పూర్తికాగా కోవలన్ నేలకూలినాడు.

కన్నగి భర్తకు జరిగిన అన్యాయాన్ని, కర్మ విధానాన్ని తెలిసిన పాండ్యరాజు రాజదండం తొలిసారిగా వంపు తిరిగింది. మంచీ, చెడుపనులు వివిధంగా ఫలితాల్నిస్తాయి. సౌశీల్యము నీ జీవితాన్ని సదా కాపాడును గాక!

✤✤✤✤✤

# 17. గోపికానృత్యం

"హిమాలయ పర్వతపు నుదుటిపై పాండ్యరాజు తన మత్స్య చిహ్నాన్ని చెక్కినాడు. దానికి దిగువన చోళుల వ్యాఘ్రము, చేరుల విల్లు కానవస్తున్నాయి. జంబూద్వీపపు శీతల వనాల్లో నివసించే రాజులందరూ, చోళ చేర రాజులతో సహా పాండ్యుని చక్రవర్తిగా అంగీకరించి వినమ్రులైనారు. రాజ భవనం నుంచి ప్రభాత భేరి ధ్వని బిగ్గరగా వినవస్తున్నది. అతడి శ్వేతఛత్రం పూలగుత్తులతో అలంకరించబడి ఉన్నది.

ఇది మనం వెన్న తీసే సమయం-
అని తల్లి మాదరి పలుకు వినగానే అయ్యయి
సిద్ధంగా వచ్చింది. కవ్వం తాడు చేతితో పట్టుకుని.

**2**

ఈ కుండలోని పాలింకా తోడుకోలేదు
పెద్ద మూపురమున్న గిత్తల కళ్లలో ఎందుకో కన్నీళ్లు?
ఏ కీడు రానున్నదో!

**3**

చిక్కంలో వేలాడే కుండలలోని వెన్న కరగలేదు.
దూడలు గంతులు వేయకుండా దుఃఖిస్తున్నవెందుకో!
ఏ కీడు రానున్నదో!

**4**

నాలుగు చనుమొనల పొదుగులున్న ఆలమంద
వణుకుతూ అరుస్తుంటే వాటి మెడ గంటలు జారిపోతున్నాయి.
ఏ కీడు రానున్నదో!

**5**

"కుండలోని పాలు తోడుకోలేదు. అందమైన గిత్తల కళ్లలో ఎందుకో కన్నీళ్లు. చిక్కంలోని కుండల్లో వెన్న కరగలేదు. దూడలు గంతులు మాని దుః ఖిస్తున్నాయి. ఆలమంద వణుకుతుంటే వాటి మెడలోని గంటలు జారిపడ్తున్నాయి.

ఏదో కీడు రానున్నదని" పలుకుతున్న కుమార్తెతో మాదరి అన్నది– "భయపడకు. గోగణపు దుఃఖాన్ని తొలగించడానికి మనం వర్తుల గోపికానృత్యాన్ని ఈ భూమి పుత్రికలలో మణి వంటి కన్నగి ముందు ప్రదర్శిద్దాం. ముఖ్యంగా మాయవన్ కృష్ణుడి, బలరాముడి బాల్యాన్ని తెలిపే గాథల్ని చేపకన్నులున్న మన గొల్లవనితలు ఆటపాటలతో తెలియజెప్పడాన్ని చూసి ఆనందిద్దాం!"

**6**

తేనెలొలికే పూల చెండును తురుముకున్న చిన్నది
వెరపు లేకుండా నల్లఎద్దుపైకి ఎగిరేవాడిని ప్రేమిస్తున్నది.

**7**

భుజాలకు బంగరు నగలున్న సుందర యువతి
నుదుట ఎర్రమచ్చలున్న ఎద్దునోడించినవాడికి చెందినది.

**8**

కొప్పులో మల్లెలు ముడుచుకున్న ఇంతి
పోట్లగిత్త పొగరు నణచినవాడిదైనది.

**9**

సన్నని తీగెలాంటి భుజాలున్న వెలది
తెల్ల మచ్చల గిత్త నాపినవాడి స్వంతమైనది.

**10**

మెత్తటి స్తనాలున్న ఈ నెరజాణ
పసిడి మచ్చల పశువును పట్టుకున్నవాడిది.

**11**

తలలో రేలపూల నలంకరించుకున్న లావణ్యవతి
విజయ వృషభాన్నెక్కి ఊరేగే యువకుడి ఒడి చేరినది.

**3**

అప్పుడే రెక్కలు విచ్చిన పూవులాంటి చిన్నది
స్వచ్ఛమైన తెల్లటి ఎద్దున్నవాడి స్వంతమైనది.

## 13–14

మాదరి తన కుమార్తెతో అంటున్నది–
"ఈ ఏడుగురు కన్యలు ఏడు గిత్తలను పెంచినారు.
సప్తస్వరాల స,రి,గ,మ,ప,ద,ని–లే వాటి పేర్లు.
వీళ్లందరూ నిలబడతారు వర్తులంగా ఇప్పుడు.
స–అంటే మాయవన్; ప–బలరాముడు,
రి–రాధాసుందరి పిన్నయి; మిగతావాళ్లు
గ,మ,ద,ని –ఆ అందాల గోపకన్యలు.

## 15

పిన్నయి, 'ని' మయవన్ పక్కన
మ,ద బలరాముడి చెంతన
పిన్నయికి ఎడమవేపు 'గ' ఉండగా
'ని'కి కుడివేపు 'ద' చేరెనుగా!

## 16

తులసి మాలను వేసె మాయవన్ మెడలోన,
పిన్నయి తానెంతో సిగ్గు మొగ్గగా మారి!
'మూడులోకాల్ని ఆక్రమించిన త్రివిక్రముడు
మన పిన్నయి అందాలకు లొంగిపోయినాడు.
చేతుల్నిండా గాజులతో చెలరేగిన కన్నెజూసి
తన హృదయంలో దాగున్న లక్ష్మినే మరచాడు'– హా!హా!
హా!హా! అంటూ నవ్వింది మాదరి.

## 17

వలయాకరపు నృత్యం కొరకు
చేతులు కలిపిరి వాళ్లంతా!
చక్కని తాళం, తప్పని లయతో
'స' అన్నది పక్కనున్న 'రి'తో!
'మల్లెలు విరిసే రాగాన్ని మయవన్ కోసం పాడుదాం!
అల్లీబిల్లిగ పెరిగిన నిమ్మ చెట్లు నవలీలగా పెకలించినవాడతడు!

**18**

‘స’ పాడింది మంద్రస్వరాన
‘ప’ మధ్యమంగా, ‘రి’ ఉచ్చైః స్వరాన
‘ద’ మంద్రంగా పాడింది పిన్నయి ననునయిస్తూ-

**19**

క్రపును కేలనెత్తి వెలగకాయలు రాలగొట్టెను
నెచ్చెలీ! అతడి వంటి బలశాలి ఇంకెవరున్నారు?
అతడీవేళ మన ఆవుల మధ్యకొస్తే
ఆ మధుర మురళీ నాదాన్ని ఆస్వాదించకుందుమా!

**20**

పామును తాడుగా మలచి, ఓ ప్రియనేస్తమా!
సముద్రాన్ని మథించిన ధీరుడతడు.
అతడీవేళ మన ఆవుల మధ్యకొస్తే
ఆ వెదురు వేణునాదాన్ని వినకుందుమా!

**21**

చిత్తడి నేలల్లో పెరిగిన కురుంద చెట్టూ చేమల్ని
సత్తువగల చేతుల్తో చక్కగ పెరికిన వాడతడు.
అతడీ వేళ మన ఆవుల మధ్యకొస్తే
మల్లెలు విరిసే వేణునాదాన్ని వినకుందుమా!

**22**

పిన్నయి అందచందాల్ని వర్ణిద్దామీ వేళ,
యమునా తీరాన రాధాకృష్ణుల రాసలీల!
వంగితే నడుముకాస్త విరిగిపోవుననిపించే
లావణ్యవతి వస్త్రాలను లాఘవంగా దొంగిలించ
అతని కొంటె చేష్టలకు ఆగ్రహం పొందినట్టి
అందాల యువతి మోము వర్ణించుట ఎవరి తరము?

---

*(వేణువును వెదురుతోనే గాక- రేలకాయ, కలువ, మొల్లతీగలతో*
*ఆ కాలంలో తయారుచేసేవారు)*

**24**

యమునా నదీ నీళ్లలోన సంయమమున స్నానమాడు
లలితాంగి నగలతో, లాలిత్యపు సొగసు దోచ,
అతడి చిలిపి చేష్టలకు ఆగ్రహం చెందినట్టి
అందాల కన్నె వదనము వర్ణించుట ఎవరితరము?

**25**

నగలూ వస్త్రాలు కానక నగుబాటు కాలేక
తన చేతులే దుస్తులుగా తనువును దాచుకుని
అతడి ప్రేమ దృక్కులతో అణువణువూ తడవగా
అందాల పడతి ముఖము వర్ణించుట ఎవరి తరము?

**26**

సూర్యుడిని దాచినాడు తన సుదర్శన చక్రంతో
ఆ నీలమేఘశ్యాముడు రాధకు ఎడమ పక్క ఉండగా
వెన్నెలలా వెలిగే బలరాముడు ఏతెంచె నామె కుడివేపు
దేవముని నారదుడు మహతిపై పలికించె తొలిరాగమపుడు.

**27**

రంగురంగుల గాజులు తొడిగిన రాధతో
పుప్పొడి పరచిన నేలపై నాట్యమాడిరి రామకృష్ణులు.
గోపికల నృత్యహేల, గోవిందుని రాసలీల
పూలదండ ఎగిరిపడెను పూజింపగ హరి పాదము.

గోపకాంతలావిధంగా అపూర్వ వర్తులాకార నృత్యాన్ని చేస్తూన్నపుడు, వారి ఆభరణాలు, పూల చెండ్లు వారి పాదాల కదలికల కనుగుణంగా కదుల్తూ చూచువారిని సంభ్రమ విభ్రమాలలో ముంచెత్తినాయి. అప్పుడు 'మాదరి' వాళ్లతో ఇలా అన్నది– "మనం అందరం ఇప్పుడు బృందగానంతో ఆ గరుడవాహనుని ప్రార్థిద్దాం. అతడి గుణగణాల్ని గానరూపాన పొగడుదాం!"

**29**

పొటియల్ కొండల నుంచి వచ్చిన చందన లేపనంతో,
పూలదండలతో పాండ్యన్ ప్రభువు ఉరమలంకరించబడింది.

ఇంద్రుడిచ్చిన వజ్రాలహారం, సముద్రపు ముత్యాలహారం
ధరించినవాడే గోకుల విహారి అంశతో జనించినవాడు.

**30**

హిమాలయ శిఖరపు నుదుటన వ్యాఘ్ర పతాకను
చిత్రించిన చోళ ప్రభువు వాలవన్
దుర్భేధ్యమైన కోట ఉన్న 'పుకార్'కు ప్రభువు
యుద్ధరంగాన స్వర్ణ చక్రధారి అంశతో జనించినవాడు.

**31**

సముద్రాన పయనించి కదంబ వృక్షాన్ని కూల్చినట్టి
చేర దేశపు రాజు వంసినగరపు ప్రభువు.
'వంసి' నగరాన్నేలినవాడే, హిమాలయ శిఖరాన్ని
విరిచి సముద్రాన్ని మధించిన వాడి అంశతో జనించినవాడు.

**32**

నీలి సముద్రపు మేని వర్ణం గలవాడా! ఒకనాడు
నీవు వాసుకి సర్పాన్ని తరిత్రాడుగా, మంధర శిఖరాన్ని
కవ్వంగా సముద్ర మంధనం చేసావు నీచేతుల్తో!
ఆ చేతుల్నేనా యశోద కవ్వపు తాటితో కట్టిపడేసింది!
ఓ కమలనాభుడా! నీ లీలా విశేషాలనెన్న నెవరి తరము?

**33**

అతడత్యున్నతుడని అమరులు స్తుతిస్తారు నిన్ను.
సమస్త లోకాలను నీ నోటిలో ఇముడ్చుకున్నావు.
ఆ నోటితోనేనా దొంగిలించిన వెన్న తిన్నది?
ఓ తులసి మాలధారీ! నీ లీలావిశేషాల నెన్ననెవరితరము?

**34**

త్రివిక్రముడవని దేవతలు పొగడుతారు నిన్ను.
ఎర్రని పాదపద్మాలతో ఎల్లలోకాలను కాంతిమయం చేసావు.

ఆ పాదాలేనా నిన్ను పాండవుల తరపున రాయబారానికి నడిపినది?
ఓ నరసింహా! దుష్టసంహారా! నీ మాయలనెన్న నెవరితరము?

**35**

రెండు అడుగులతో ముల్లోకాల్ని ఆక్రమించినవాడా!
సోదరుడితో కలిసి కీకారణ్యాల సంచరించినవాడా!
పురాతన లంకా నగరాన్ని పూర్తిగా ధ్వంసమొనర్చినవాడా!
నీ కథా శ్రవణంబు చేయని ఈ శ్రవణేంద్రియముల కునికిలేదు.

**36**

కెంపుల వంటి పాదాలు, కళ్లు, అధరాలున్న
మాయవన్ కృష్ణుడు, నల్లనయ్య, సమస్త ప్రపంచాన్నీ
తన నాభోద్భవ పద్మంలో బంధించినవాడు
అతడిని చూడ నోచుకోని నేత్రాలు నేత్రాలు కావు.

**37**

కంసుడి దుశ్చేష్టలను కనుమరుగు చేసి,
పాండవులకు దూతగా హస్తినకు పోయి
నాలుగు దిక్కులందు ధర్మమ్ము నిలిపిన
నారాయణుడి నామమాడని పలకని నాలుక నాలుకే కాదు.

**38**

ఈ వర్తుల గోపికానృత్యము మా ఆలమందల దుఃఖాల్ని హరియించును గాక! హరి స్వరూపుడైన మా పాండ్యరాజు భేరీభాంకార ధ్వనులు ఎల్లలోకములందు ప్రతిధ్వనించును గాక! ఉరుములు, పిడుగులు కురిపించే వజ్రాయుధ ధారి ఇంద్రుడి కిరీటాన్ని విభాగించిన పాండ్యరాజు యొక్క విజయ భేరీనాదం శత్రువుల గుండెల్లో భయ కంపనాల్ని కలిగించును గాక!

✤✤✤✤✤

# 18. దుఃఖ గుచ్ఛం

నృత్యగానాలు ముగిసాయి. 'మాదరి' గొల్లల పెద్దవ్వ స్నానం చేయడానికి నదికి వెళ్లింది. పొంగి ప్రవహిస్తున్న వైయై నదీతీరాన నెటుమల్ పాదాలకు పూలు, సుగంధ ధూపాలు, చందన లేపనాలు, పూలదండల నర్పించి పూజలు చేస్తున్న సమయంలో నగరంలో జరిగిన సంఘటన విన్న ఓ గొల్లపడుచు పల్లెకు వేగంగా తిరిగి వచ్చినది. కాని ఆమె కన్నగితో ఏమీ మాట్లాడలేదు.

మనసులో ఏదో సందేహం పీడిస్తుండగా కన్నగి ఆమెను ప్రార్థించింది–

"అమ్మా! నాతో మాట్లాడు! నా భర్త ఇంకా తిరిగిరాలేదు. నాకేదో ఆందోళనగా ఉన్నది. కొలిమిలో వినవచ్చే తోలుతిత్తుల శబ్దాలకన్నా నా గుండె చప్పుడు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బిగ్గరగా వినవస్తున్నాయి. ఎందుకు నీవిలా మారు మాటడకుండా ఉన్నావు? ఏం విన్నావో చెప్పవా? పగటిపూట కూడా నేను భయంతో వణికిపోతాను. నా ప్రియతముడిని చూడనప్పుడు నా హృదయం బద్దలవుతుంది. అంతకుముందే నీవు అక్కడ ఏం జరిగిందో చెప్పు సుమా! నీకు ఆయురారోగ్యాలు కలుగుగాక! మిత్రమా! నాకు సాయం చేయి. నా భర్త ఇంకా తిరిగి రాలేదెందుకని? ఏదో సంశయం, ఏదో సందేహం, ఏదో కీడు నా మనసును పీడిస్తున్నది. అక్కడ నగరంలో నీవేమైనా విన్నావా? నాకు చెప్పడానికి సందేహిస్తున్నావా? నీవు చిరకాలం వర్ధిల్లుదువుగాక! మిత్రమా! నాకు జవాబివ్వు"

ఆ గోపవనిత సమాధానమిచ్చింది– "రాజభవనం నుంచి విలువైన స్వర్ణ మంజీరాన్ని దొంగిలించినవాడితడే! ఎంతో నేర్పుగా కాలి అందియ తస్కరించాడు' అంటూ రాజభటులు, కాళ్లకు ఇనుప కడియాలున్న రాజభటులు నీ భర్తను చంపివేసారు"

ఆ మాటలు వినగానే కన్నగి దుఃఖావేశంతో మూర్ఛిల్లింది. వెన్నెల కాంతులతో ప్రకాశిస్తున్న చంద్రబింబం మబ్బులావరించగా నేలపై కూలినట్లు ఆమె నేలపై స్పృహతప్పి పడిపోయింది. కాసేపటికి తెప్పరిల్లి, ఆగ్రహంతో కనులెర్రబడగా, ఆమె తన భర్తకోసం గుండెలవిసేలా దుఃఖించింది.

"అయ్యో! ఏమిటీ విధి వ్రాత! ప్రియతమా! ఏమైనావు?" అంటూ మరల మరల మూర్ఛిల్లి మరల స్పృహలోకి వస్తూ అనంతంగా శోకించసాగింది.

"తమ భర్తలు చితిమంటలలో అదృశ్యమైనపుడు దురదృష్ట జాతకులైన స్త్రీలు చేసే బాధాకర ప్రమాణాలను ప్రతిజ్ఞలను నేను చేయాలా, దోషమంతా అన్యాయంగా నా భర్తను చంపిన రాజుదైనప్పుడు?

తమ భర్తలు పూలగుచ్ఛాల మధ్య కప్పబడి శాశ్వతంగా దూరమైనప్పుడు, పవిత్ర నదుల్లో స్నానంచేస్తూ శోకించేవారిలా శోకించాలా నేను, తప్పంతా ఈ రాజ్యాన్నేలే రాజుదైనప్పుడు?

ఓ ధర్మదేవతా! ఈ దుష్కార్యం వలన ప్రభువు చేతిలోని రాజదండం వికృతమై వక్రరూపాన్ని దాల్చిందీనాడు.

తమ భర్తలు మరణించగా విధవలై విచారిస్తున్న దురదృష్ట జాతకులైన స్త్రీలలా నేను ఈ జీవితపు సౌభాగ్యాన్ని ఒక రాజు తొందరపాటు నిర్ణయం వలన కోల్పోయాను.

ఓ గోపికా స్త్రీలారా! నావేపు చూడండి.

వలయనృత్యంతో అలసిపోయిన గోప కన్యలారా నా మాటలు వినండి! ఓ చండ ప్రచండ భానుడా? నా భర్త దొంగా?"

సూర్యుడు పలికాడు– "ఓ మీనాక్షీ! నీ భర్త దొంగకాదు. తప్పుచేసిన ఈ నగరం అగ్నికీలల కాహుతి కాబోతున్నది".

❖❖❖❖❖



# 19. కన్నగి

అన్నిటినీ అవలోకించే సూర్యభగవానుడు పలికాడు. మరుక్షణమే కన్నగి అక్కడ నుంచి బయల్దేరింది. తన రెండవ పాదమంజీరాన్ని చేతబట్టుకుని ఇలా పలికింది– “శీలవంతులైన స్త్రీలు నివసించే మీ పట్టణాన్ని పరిపాలిస్తున్న రాజు న్యాయపాలన చేయడం లేదు. ఓ మధురానగర మహిళలారా! నా మాటలు వినండి. ఇంతకు ముందు పడిన కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న నాకు ఇప్పుడు కోలుకోలేని దెబ్బతగిలింది. నా మొరాలకించండి! నా భర్త దొంగకాడు. నా కాలి అందియకు సరైన పైకమివ్వలేక నా భర్తను చంపినారు. ఇంకెప్పుడైనా నేను నా భర్తను చూడగలనా? అతని పెదవుల వెంట నిజాన్ని చెప్పించగలనా? కనీసం నేనైనా నిజాన్ని మీ ముందు వెల్లడి చేయకబోతే మీరనరా– ‘ఈమే అతడికి కీడు తెచ్చిందని!’ నా మాట వినండి!”

మధురై నగరంలో తిరుగుతూ కన్నీళ్లతో ఆమె అంటున్న మాటలకు ప్రజల హృదయాలు చలించాయి. వాళ్లన్నారు– “ఈమెకు తీరని అన్యాయం జరిగింది. ప్రభువు రాజదండము వంకరపోయింది. ఇదెలా సాధ్యం? పాండ్యరాజు కీర్తిప్రతిష్ఠలకు గ్రహణం పట్టింది. చంద్రకాంతి మెరిసే ఛత్రము, అరివీర భయంకరమైన శూలము నేడు వెలవెలా పోయాయి. ఇదెలా సాధ్యం? విజయ ఛత్రం క్రింద ప్రజలను చల్లగా పాలిస్తున్న ప్రభువు నేల ఈనాడు వేడెక్కింది. ఇదెలా సాధ్యం? మన ముందు ఈనాడు ఒక దేవతా స్వరూపిణి బంగరు పాద మంజీరంతో దుఃఖిస్తూ నిలబడింది. ఇదెలా జరిగింది? ఆమె అందమైన కళ్లు ఎర్రబడి దుఃఖాశ్రువులను కురిపిస్తుండగా ఆమె శోకానికి అంతేలేదు కదా! ఇదెలా జరిగింది?” అలా మధురై నగర ప్రజలు ఆమె దుఃఖాన్ని తమ దుఃఖంగా భావించి శోకించసాగినారు. ఆ గందరగోళం మధ్యనే కొందరు ఆమె భర్త పార్థివదేహాన్ని, రక్తపు మడుగులో ఉన్నదానిని చూపించారు. బంగరు తీగెలాంటి ఆమె అతడిని చూసింది. కాని అతడు ఆమెను చూడలేదు, చూడలేడు కూడా! అది సూర్యుడు తన ప్రతాపాన్ని తగ్గించి పడమటి కొండల మధ్య అదృశ్యమయ్యే సమయం. చీకటి పడుతున్న ఆవేళ కన్నగి దుఃఖిస్తుంటే ఆపడానికి ఎవరి తరమూ కాలేదు. ఆమె దుఃఖపు కేకలతో ఆ పట్టణం ప్రతిధ్వనించింది.

ఆ ఉదయమే కదా అతడిని పూలదండతో అలంకరించి పట్టణానికి పంపింది. అతడి శిరోజాలను దువ్వి సువాసన నూనెలనద్దింది. సాయంకాలాని

కల్లా అతడిని రక్తపు మడుగులో చూడవలసి వచ్చింది. ఆమె విలపిస్తూ అతడినిలా ప్రశ్నిస్తున్నది– "నన్నీ దుఃఖపు స్థితిలో చూసి ఏమనుకుంటున్నావు ప్రియతమా? ఈ దుమ్మూ ధూళిలో, రక్తపు మడుగులో నీ బంగరు దేహాన్ని ఉంచుకున్నావు, ఇది సరైనదేనా? వాళ్లనరా, ఇది నీ కర్మ ఫలితమని! అదే ఆ రాజుతో ఈ పని చేయించిందని! నన్ను ఒంటరిగా ఈ దుఃఖ సముద్రాన వదిలేసి నీ మానాన నీవు నిష్క్రమించడం న్యాయమేనా? నీ దేహంపై పూలగుచ్ఛాలు నిండుగా కప్పినపుడు వాళ్లనరా, ఇది నీ కర్మఫలితమని? అదే ఆ రాజు చేత ఈ పని చేయించిందని!

నీ గాయం నుండి రక్తం ఏరులై పారుతుండగా నీవీ దుమ్ములో పడి ఉండడాన్ని చూసిన నా బలహీనమై, నీళ్లు నిండిన కళ్లను చూసి వాళ్లనరా, ఇది నీ కర్మఫలితమని? అదే ఆ రాజు చేత ఈ పని చేయించిందని! ఈ అన్యాయాన్ని ఇలానే సమర్థిస్తారా? ఈ రాజు చేసిన అధర్మాన్ని ఎలుగెత్తి ప్రశ్నించరా?

ఈ నగరంలో స్త్రీలే లేరా? ఉంటే ఇటువంటి అన్యాయం జరిగితే రాజును ప్రశ్నించరా? ఇదే గతి తమ భర్తలకు పడితే ఊరుకుంటారా? అన్యాయాన్ని ప్రశ్నించే స్త్రీలే ఈ నగరంలో లేరా? తమ పిల్లల్ని సన్మార్గంలో పెంచే తల్లిదండ్రులే లేరా? ఇదే తమ పిల్లలకు జరిగితే ఇలాగే సహిస్తారా? దేవుడున్నాడా ఈ నగరంలో? ఇంత అన్యాయానికి పాల్పడిన ఈ నగరపు రాజును శిక్షించడానికి ఏ దేవుడూ దిగిరాడా? ఉన్నాడా దేవుడు, ఉంటే ఎక్కడ?"

అలా కన్నగి తన నెత్తీ, నోరూ, రొమ్ములు బాదుకుంటూ మూర్ఛపోయి నప్పుడు  అతడి ఆత్మ పైకిలేచి– 'ఈ పూర్ణచంద్రవదన మోము పాలిపోయినదని'– ఆమె కన్నీళ్లను తుడిచినట్లనిపించింది. అతడి పాదాల వద్ద కుప్పకూలిన ఆమెను చూసి అతడి ఆత్మ, ఇతర దైవరూపాలతో కలిసి స్వర్గానికేగుతూ– 'పూల రేకుల వంటి ప్రకాశవంతమైన కనులుగలదానా! ఇక్కడనే సుఖశాంతులతో జీవించు' అన్నది.

కన్నగి అరచింది– "ఇది స్వప్నమా లేక దర్శనమా? నన్ను మాయ చేసిన ఆత్మరూపమా? నేనెక్కడని వెదకను? నాలోని ఆగ్రహం ఉపశమించేంత వరకు నా భర్తను నా చేతుల్లోకి తీసుకోను. రాజును నిలదీసి సమాధానం కోరతాను".

స్వప్నాన్ని గుర్తుతెచ్చుకుంటూ, కన్నీళ్లు తుడుచుకుని కన్నగి లేచి నిలబడింది. అడుగులు తడబడుతుండగా చేప పిల్లల్లాంటి కళ్ల నుండి కన్నీళ్లు వర్షిస్తుండగా ఆమె రాజభవనం వేపు నడిచింది.

✤✤✤✤✤

# 20. న్యాయపోరాటం

–'మిత్రమా! నేను చూసాను స్వప్నంలో
ఛత్రం, రాజదండం నేలకు ఒరిగిపోవడాన్ని,
రాజ ప్రాసాదపు ముంగిట ధర్మగంట
తానంతట అదే కదిలి కంపించి మోగడాన్ని.
మిత్రమా! నేను చూసాను అష్టదిక్కులు కంపించడాన్ని.
రాత్రి చీకట్లు సూర్యుడిని కబళించడాన్ని.
నిశీధిలో ఇంద్ర ధనుస్సు మెరవడాన్ని.
జ్వలిస్తున్న ఉల్క పగలే జారిపడడాన్ని'–

**అపశకునాలు**

–"శ్వేత ఛత్రం, రాజదండం తలక్రిందులైనాయి.
ధర్మఘంట కంపించి ఎదలో దడ పుట్టించినది.
ఇంద్రచాపము రాత్రిపూట, ఉల్కాపాతము పగటివేళనా?
ఏదో కీడు ముంచుకొస్తున్నది. ప్రభువుకిది తెలియవలసినదే!"–

మహారాణి అలా పలికి బయలుదేరగా
సర్వాభరణ భూషితులై చెలికత్తెలు అనుసరించారామెను.
కొందరు అద్దాల్ని, కొందరు ఆభరణాల్ని,
కొందరు నూతన వస్త్రాల్ని, కొందరు పట్టు ఉడుపుల్ని,
కొందరు తమలపాకు, సుగంధ ద్రవ్యాలున్న పెట్టెల్ని,
కొందరు చిత్రవర్ణాల్ని, కొందరు లేపనాల్ని,
కొందరు కస్తూరిని, కొందరు పూలదండల్ని,
కొందరు విసనకర్రల్ని, కొందరు గొడుగుల్ని
కొందరు అగరు పరిమళ ద్రవ్యాల్ని పట్టుకొని
గూనివాళ్లు, మరుగుజ్జులు, మూగవాళ్లు, పనివాళ్లు
చెలికత్తెలు మహారాణి ఆశ్రితజనం కదిలారు ముందుకు.

చక్కని సువాసనలు విరజిమ్ముతున్న పూలను సిగలో ముడుచుకున్న పరిచారికలు రాజును స్తుతిస్తూ పాటలు పాడినారు.

"నాలుగు దిక్కులా సముద్రంతో పరివేష్ఠితమైన ఈ భూమండలాన్ని పరిపాలించే పాండ్య మహారాజు, మహారాణి చిరకాలం జీవింతురు గాక!"

ఆమె వేస్తున్న ప్రతి అడుగుకూ వందిమాగధులు కైవారములు చేస్తుండగా మహరాణి, సింహాసనమున కూర్చుండి లక్ష్మీవల్లభుడిలా ప్రకాశిస్తున్న తన భర్తతో తనకు వచ్చిన స్వప్నాన్ని తెలియబరిచింది. అదే సమయంలో ఒక ఆర్తనాదం గాలిని చీల్చుకుని రాజమందిరంలోకి ప్రవేశించింది.

"ఓ ద్వారపాలకుడా! దారి ఇవ్వు!
ఈ నగరాన్నేలే రాజు న్యాయాన్ని మరచినాడు.
న్యాయాన్యాయ, ధర్మాధర్మ విచక్షణ పోగొట్టుకున్నాడు.
వెళ్లి విన్నవించు. బంగరు అందియను
చేతబూనిన ఓ స్త్రీ, తన భర్తను అన్యాయంగా
కోల్పోయి రాజభవన ద్వారం వద్ద వేచివుందని!
ద్వార పాలకుడా! వెళ్లి నీరాజుకు చెప్పు!

ద్వారపాలకుడు వచ్చి రాజుతో పలికాడు–
"కొరగాయి ప్రభువుకు జయమగు గాక!
దక్షిణ పర్వతాధిపతికి విజయమగును గాక!
సెలియన్ చక్రవర్తి చిరకాలం జీవించునుగాక!
తెన్నవన్, మచ్చలేని పంచవన్‌కు మంగళమగుగాక!
ఈమె విజయశూలాన్ని ధరించిన కొర్రవాయి దేవత కాదు.
మహిషపు తలపై కాలుబెట్టి శూలంతో
రక్తపు ధారలెగసేలా మర్దించిన దుర్గా కాదు!
నటరాజుచే ప్రళయ తాండవమొనరించిన
ఏడుగురు కన్యలలో కడగొట్టు 'అనంగు' కాదు!
భీకరరారణ్యంలో నివసించే 'కాళి' కాదు.
దారకుడి రొమ్ము చీల్చిన 'దుర్గ' కాదు–
తన భర్తను కోల్పోయి దుఃఖంతో ఆగ్రహంతో
ఊగిపోతూ, తన చేతిలో బంగరు పాద

మంజీరాన్ని పట్టుకున్న ఒక స్త్రీ
తమ దర్శనాన్ని అభిలషిస్తున్నది"–

రాజు సమాధానమిచ్చాడు– "ఆమెను ప్రవేశబెట్టు". ద్వారపాలకుడు కన్నగిని లోనికి తీసుకువచ్చాడు. రాజు అన్నాడు– "కళ్లనిండా నీళ్లు నిండిన లత వంటి ఓ అమ్మాయీ, ఎవరు నీవు?"–

కన్నగి పలికింది– "నిర్లక్ష్యపు రాజా! నేను చెప్పేది ఆలకించు. ప్రసిద్ధి కెక్కిన పుకార్ పట్టణపు వాసిని నేను. మా దేశపు పూర్వ రాజు ఒకడు గాయపడిన పావురానికి సేవచేసి పేరు గాంచినాడు. రాజు రథ చక్రాల కిందపడి చనిపోయిన దూడను చూసి దుఃఖంతో ధర్మగంటను మోగించిన ఆవు కన్నీళ్లలో పడి భస్మమయ్యాడో రాజు. ఓ మెరిసే కాలి అందియలున్న ప్రభూ! పుకార్ పట్టణంలోని వణిజ ప్రముఖుడైన మగట్టువన్ కుమారుడు 'కోవలన్' భార్యను నేను. కర్మ ఫలితమనుభవించడానికి నీ నగరం చేరి వ్యాపార నిమిత్తం నా నగ అయిన స్వర్ణ మంజీరాన్ని ఇక్కడ అమ్మచూపినవాడు నా భర్త, నీ అన్యాయపు ఆజ్ఞచే హత్య చేయబడినాడు. ఆతడి భార్య 'కన్నగి'ని నేను"–

రాజు అన్నాడు– "ఓ దివ్యయువతీ! దొంగను చంపుటలో అన్యాయ మేమున్నది? అది రాజధర్మమే కదా?"

కన్నగి అన్నది– "అక్కడే నీ న్యాయం దెబ్బతిన్నది. నా స్వర్ణమంజీరంలో మణులు, కెంపులున్నాయి అది నీకు తెలుసా?"

రాజు అన్నాడు– "ఓ మధురగాత్రీ! నీవన్నది నిజమే! మా స్వర్ణ మంజీరంలో ముత్యాలున్నవి. ఏదీ నీ మంజీరం. నాకు చూపించు!"

కన్నగి తన కాలి అందియను విరగగొట్టగానే లోన ఉన్న మణి రాజువద్ద పడింది. దాన్ని అతడు చూసిన మరుక్షణమే ఛత్రం నేలకూలింది. రాజదండం వంపు తిరిగింది.

వేదనతో రాజు అన్నాడు– "నేనెటువంటి ధర్మప్రభువును? ఒక స్వర్ణకారుడి మాటలను విని నిర్దోషిని చంపించానే! నేనే దొంగనిప్పుడు. ఈ

దక్షిణ దేశపు ప్రజల్ని రక్షించలేని ఈ ధర్మపీఠమెందుకు? ఈ సింహాసనం, ఈ ధర్మఘంట, ఈ శ్వేతఛత్రం, ఈ రాజదండం నాకెందుకు? నా బతుకు మట్టిలో కలిసిపోవును గాక!" అంటూ రాజు అక్కడికక్కడే నేలకూలినాడు. మహారాణికి ఏమి చేయాలో పాలుపోక వణుకుతూ పలికింది– "భర్తలేని భార్యకు ఈ లోకంతో పనిలేదు" అంటూ ఆమె తన భర్త పాదాలను తాకి తానూ ప్రాణాలు విడిచింది.

**1**

తప్పుచేసిన వారికి ధర్మదేవతే మృత్యురూపమవుతుంది.
ఇది పెద్దలన్నమాట ఎప్పటికీ చద్దిమూట.
మహారాణీ! ఇది నా కర్మఫలితం!
చేసిన తప్పుకు చెల్లిస్తున్నా ప్రాయశ్చిత్తం!

**2**

నీలికలువ రేకుల్లాంటి ఆమె కనుల నుండి కన్నీళ్లు వర్షిస్తున్నాయి.
కాలి అందియ నొకదానిని చేతబుచ్చుకుని 'కాళి'లా ఉన్నదామె!
జీవచైతన్యాన్ని కోల్పోయి, శిరోజాలు చిట్టడివిలా కప్పబడిన
ఆమె ఉగ్రరూపాన్ని చూడగానే ప్రాణాలు వదిలాడు పాండ్యరాజు.

**3**

విరబోసుకున్న శిరోజాలతో, చేతిలో అందియతో
దుఃఖంతో కృశించి, దుమ్ముకొట్టుకున్న దేహంతో–
ఉగ్రరూపిణి దుర్గలా ఉన్న కన్నగి మాటలు వింటూనే
వదిలిపెట్టాడు తన ప్రాణాల్ని వైయయి ప్రభువు.

✤✤✤✤✤



# 21. ఆగ్రహజ్వాల

"మహారాణీ! కర్మకు బానిసను నేను. అమాయకురాలినైన నాకు మీ వలన అన్యాయం జరిగింది. ఇతరులకు ఉదయాన హాని చేసినవారు సాయం కాలానికల్లా తమకు కీడు జరగడాన్ని కళ్లారా చూస్తారు" అన్నది కన్నగి దుః ఖావేశంతో–

**సప్త కన్యలు (శీలవతులు)**

**1**

అలల్లా ప్రవహిస్తున్న శిరోజాలున్న ఓ స్త్రీ కొందరు గడుగ్గాయల నుంచి మధ్యాహ్న సమయంలో తన వంటయిల్లు, తుమ్మచెట్లు సాక్షులుగా శీలాన్ని కాపాడుకున్నది.

**2**

పొన్ని నదీ తీరాన ఆడుకుంటూ ఇసుక బొమ్మను చేసిన కన్యతో ఆమె స్నేహితులు 'ఇతడే నీ భర్త' అన్నారట. ఆమె బొమ్మనారాధిస్తూ అక్కడి నుంచి కదల్లేదు. సముద్రపు అలలు ఆమె చుట్టూరా పొంగి కూడా ఆ సైకత శిల్పాన్ని తాకలేదు.

**3**

ప్రసిద్ధికెక్కిన చోళ ప్రభువు కరికాలన్ కుమార్తె అతిమంతి కావేరి వరదల్లో కొట్టుకుపోతున్న తన భర్త వంసిక్కన్‌ను కాపాడుకోడానికి తానూ వరద నీళ్లలోకి దూకింది. కొండగుట్టల్లాటి విశాలమైన భుజాలు కలవాడా! అని పిలుస్తూ ఆమె సముద్రంలోకి పోతుంటే, సముద్రుడే వచ్చి ఆమె భర్తను ఆమె కప్పగించినాడు.

**4**

తన భర్త రాకకై ఎదురుచూస్తూ సైకత తీరాన ఓ స్త్రీ తానే రాయిగా మారిపోయింది, సముద్రం నుంచి తిరిగి వస్తున్న పడవలను చూస్తూ. తన భర్త తీరాన అడుగుపెట్టగానే యధారూపానికి వచ్చిందామె.

**5**

తళతళ మెరిసే ఈటె కన్నులున్న ఓ స్త్రీ తన సవతి కుమారుడు బావిలో పడగా, తన కుమారుడిని కూడా బావిలో పడవేసి, తానూ బావిలో దూకి ఇద్దరినీ రక్షించుకున్నది.

## 6

కొత్తవాడు తనను కాంక్షతో చూస్తున్నాడని ఒక లావణ్యవతి తన పూర్ణ చంద్రవదనాన్ని కోతి ముఖంగా మార్చుకున్నది. తన భర్త రాగానే కెంపు వడ్డాణంగల ఆ పూబోడి తన కోతి ముఖాన్ని పూర్వ చంద్ర వదనగా మార్చుకున్నది.

## 7

ఒక రోజున తన తల్లిదండ్రుల సంభాషణ విన్నదా కన్య– “ఆడవాళ్లు ఒక్కోసారి చిన్నపిల్లల్లా మాట్లాడ్తారు. నేను మన పరిచారికతో అన్నాను– నాకు కూతురు పుట్టి, నీకు కొడుకు పుడితే వారిద్దరికి వివాహం చేస్తానని. అలానే జరిగింది కాని చూస్తూ చూస్తూ పనిమనిషి కొడుక్కి నా ప్రియకుమార్తెనెలా ఇవ్వడం?” అని ఆమె తల్లి, తండ్రితో అంటున్నది. ఆ మాటలు వినగానే ఆ అందాల కన్య తనకు భర్తగా నిర్ణయించబడిన యువకుని పెళ్లాడి అతడితో ఇంటికి వచ్చింది.

అటువంటి శీలవతులు, సచ్చరిత్ర కలిగిన స్త్రీలున్న నగరంలో నేను జన్మించాను. నా ఆగ్రహ జ్వాలలలో ఈ మధురానగరం భస్మీపటలమగును గాక!” అంటూ ఆమె రాజభవనాన్ని వీడి బయటకు వచ్చింది.

నాలుగు దేవాలయాల మధురై నగర ప్రజలారా! మునులారా! ఆకాశ దేవతలారా! వినండి! నేనీ నగరాన్ని శపిస్తున్నాను! నేను అమితంగా ప్రేమించిన వ్యక్తిని ఈ రాజు చంపించినాడు. ఏ కళంకం లేని నాకు కష్టాన్ని తెచ్చినాడు” అంటూ ఆమె తన ఎడమ వక్షోజాన్ని పెరికి నగరం నలువీధులా తిరుగుతూ ఆ రక్తమోడుతున్న వక్షోజాన్ని రాజవీధిలోకి విసిరేసింది.

వెంటనే కన్నగి ముందర అగ్నిదేవుడు బ్రాహ్మణ రూపాన ప్రత్యక్షమైనాడు. నీలిదేహం, ఎర్రటి జుట్టు, తెల్లని పాలవంటి దంతాలు– దుర్నిరీక్షమైన అతడు కన్నగితో అన్నాడు– “ఓ శీలవతీ! నీకు అన్యాయం జరిగిన రోజున ఈ నగరాన్ని కాల్చి బూడిద జేయమని నాకెన్నడో చెప్పారు. వీరిలో ఎవరికి నేను హాని చేయకూడదో ఆజ్ఞాపించు”–

ఆగ్రహంతో ఎర్రబడిన, బంగరు తీగెలా మెరుస్తున్న కన్నగి అగ్నిదేవునితో అన్నది– సచ్ఛరిత్రులైన బ్రాహ్మణులను, మంచివారిని, గోవులను, శీలవతులను, వృద్ధులను, పసివారిని వదిలివేయి. దుర్మార్గులను భస్మం చేయి!"

అగ్ని ధూమాలతో మధురానగరం ఉక్కిరిబిక్కిరయ్యింది. ప్రశస్తమైన రథాన తిరిగే పాండ్యరాజు మధురై నగరం ప్రచండాగ్ని కీలల భస్మమైంది.

పేరుగాంచిన పాండ్యరాజు, అతడి భార్యలు, భవనాలు, ఆయుధాగారాలు, రథ గజ తురగాలు, దేవతలు, దేవాలయాలున్న మధురై నగరం యావత్తూ ఒక శీలవతి సృష్టించిన అగ్నిలో కానరాకుండా అదృశ్యమయ్యింది.

❖❖❖❖❖



# 22. అగ్నికీలలు

హవ్యవాహనుడు, దేవతల వార్తాహరుడు అయిన అగ్ని జ్వాలా వదనం విచ్చుకున్నది. మధురై నగర రక్షక దేవతల గుడి తలుపులు మూసుకున్నాయి. తనపై పడిన కళంకాన్ని తొలగించుకునేందుకు పాండ్యరాజు 'సెలియన్' తన ప్రాణాలనే అర్పించినాడు. తన సింహాసనం వద్దనే అసువులు బాసి తల్లి భూదేవికి తన పరిపాలన న్యాయమైనదిగా తెలిపినాడు. మచ్చలేని మహారాణి అతడితో సహగమనం చేసింది. ఇది తెలియక రాచపూజారి, బ్రాహ్మణ న్యాయాధిపతులు, మంత్రులు, జ్యోతిష్కుడు, కోశాధికారి, వ్రాయసగాళ్లు, రాజాజ్ఞాలేఖకులు, సేవకులు, పరిచారికలు, చిత్తరువులోని బొమ్మల్లా చైతన్యముడిగి నిలబడినారు. మావటీలు, అశ్వికులు, రథికులు, పదాతిదళ సైనికులు, ఖడ్గధారులు గందరగోళంలో పడినారు. రాజ ప్రాసాదపు విజయద్వారం నుంచి ప్రళయ భీకరంగా మండుతూ వస్తున్న అగ్నిజ్వాలల్ని అదుపులో ఉంచడానికి వారు అటూ యిటూ పరిగెత్తసాగారు.

భూలోక దేవతలైన బ్రాహ్మణుల కులదేవత ముత్యాలహారంతో ప్రకాశిస్తున్నవాడు త్రేతాగ్నుల నర్చిస్తూ మూడు హోమగుండాల్ని వెలిగించి బ్రహ్మరూపును తలపిస్తున్నాడు.

క్షత్రియుల కులదేవత పగడాల హారంతో వెలుగుతూ, చతుస్సముద్ర వలయిత భూభాగాన్ని పరిపాలిస్తూ తన చేతిలోని విజయఢంకాను మోగిస్తున్నాడు. తలపై ఛత్ర, చామరాదులు ధ్వజ, పతాకాలు, అంకుశాన్ని, ఇనుప సంకెళ్లను, విజయశూలాన్ని ధరించి న్యాయ పరిరక్షణ చేస్తూ ధర్మావలంబకుడిగా ప్రజాపాలన చేస్తూ, శత్రు రాజులనోడించి యావత్ దేశాలన్నిటిని ఒక్కతాటిపై చేర్చి తన న్యాయబద్ధమైన రాజదండంతో దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావిస్తూ సాక్షాత్తూ విష్ణువు నెటియన్‌లా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ అందరిచే కీర్తించబడు తున్నాడు.

వణిజ ప్రముఖుల కులదేవత స్వర్ణచ్ఛాయగల మేనితో మెరిసిపోతూ సర్వాభరణ భూషితుడై, ఒక్క రాజోచిత విజయశూలము, కిరీటము తప్ప మిగతావన్నీ ధరించి మిక్కిలిగా వెలుగొందుతున్నాడు. చేతిలో త్రాసు, తూనిక

రాళ్లు ధరించి, వ్యవసాయానికి అధిదేవతగా నాగలిని చేత దాల్చి, తన జటాజుటంపై నెలవంక నలంకరించుకున్న శివుడిలా కనిపించినాడు.

రైతుల, రైతుకూలీల కులదేవత మధురై ప్రజా సమూహమిచ్చిన బలుల్ని స్వీకరిస్తూ నీలమణిలా ప్రకాశిస్తూ, నృత్యగానాల్లో ప్రసిద్ధుడై, ప్రశస్త వస్త్రాలలో మెరిసిపోతున్నాడు.

ఆ నలుగురు కులదేవతలూ ఇలా అనుకున్నారు– "మనకు తెలుసు ఏనాడైతే రాజు ధర్మం తప్పుతాడో, ఆ రోజే మధురా నగరం అగ్నికీలలకు ఆహుతి అవుతుందని. ఇది న్యాయమే! మనం ఈ నగరాన్ని విడిచి వెళ్లిపోదాం"

కన్నగి ఆగ్రహంతో తన వక్షోజాన్ని పెరికి రాచవీధిలో పడవేయక మునుపే ఆ నలుగురు దేవతలు నగరాన్ని విడిచి వెళ్లిపోయారు.

వ్యాపారస్తుల వీధిలో కలకలం, రథాల వీధిలో తొక్కిసలాట, నాలుగు వర్ణాల వీధుల్లో గందరగోళం. ఖాండవ దహనం నాటి కార్చిచ్చు మధురై నగరాన్ని కాల్చివేస్తూ, సచ్ఛీలుర గృహాలకు ఏ ముప్పు రాకుండా, దుష్టుల సర్వ సంపదలను భస్మం చేస్తూ భయంకరంగా ముందుకు వ్యాపిస్తున్నది. ఆవులు దూడలు, సురక్షితమైన కొట్టాలకు చేరగా, ఏనుగులు తమ గున్నలతో కోట గోడలను దాటి అడవుల్లోకి పారిపోయాయి.

ప్రేమ మధుపానపు మత్తులో ఉన్న యువతీ యువకులు, చందనాది లేపనాలతో శీతల దేహాలున్న తరుణీమణులు, కాటుక కన్నులతో కమనీయంగా కానవస్తున్న లలితాంగులు, పూల మొగ్గలు దండలుగా తమ కొప్పులనలంకరించు కున్న కోమలులు, సువాసనా పరిమళాలను వెదజల్లుతున్న పూమాలలు ధరించిన పూబోడులు, తమ వక్షోజాలపై కుంకుమ పరాగాలను, ముత్యాల హారాలను ధరించి మురిసిపోతున్న ముదితలు తమ మెత్తటి తల్పాలపై నుంచి లేచినారు. చిన్నపిల్లలు తప్పటడుగులు వేస్తూ, నెరసిన జుట్టున్న పెద్దవాళ్ల వద్దకు పరుగు లిడ్తున్నారు. అందరూ తన జ్వాలా నాలుకలతో ఆకాశాన్నంటుకుంటున్న ఆ అగ్నిదేవుని భక్తిశ్రద్ధలతో ప్రార్థించి ఇలా అనుకున్నారు.

"కాలి అందియ వలన తన భర్తను కోల్పోయి దుఃఖితురాలైన ఈ స్త్రీ, తన కాలి అందియతో విజయాన్ని మరల సాధించినది. ఆమె వక్షోజం గావించిన ఈ సంక్షోభం తప్పా? ఒప్పా?"

అరవై నాలుగు కళలలో ఆరితేరిన వేశ్యావాడలలో మృదంగ ధ్వనులు, వేణుగానాలు, వీణాతంత్రుల స్వనాలు, వివిధ రాగాలలో వినిపించసాగాయి. అగ్ని కీలలలో తమ నాటకరంగాన్ని కోల్పోయిన వారన్నారు– "ఎక్కడి నుంచి వచ్చినదీ స్త్రీ? ఎవరి కుమార్తె? తన పాదమంజీరం వలన భర్తను కోల్పోయి, ఒక ప్రభువు ప్రాణాన్నే బలిగోరి నగరాన్ని భస్మం చేసిన ఈమె శీలమహిమ ఎన్నగా ఎవరికి సాధ్యం?

ఆ సాయంకాలం ఆ మధురానగరంలో వేదమంత్రాల ఘోష లేదు. అగ్నిహోత్రాలు వెలిగించిన వారు లేరు. దేవతలకు మొక్కినవారు లేరు. ఇంటిలో దీపాలు వెలుగలేదు. భేరీభాంకార నాదాలు లేవు. రాత్రిపూట ప్రశాంతత లేదు.

ఆ భయంకర అగ్ని వేడిని భరించలేక మధురై నగర దేవత భర్తను కోల్పోయి దుఃఖితురాలై ఆగ్రహంతో కనులెర్రబడిన 'కన్నగి' ముందు ప్రత్యక్షమైంది. కొలిమిలోని తోలు తిత్తిలా ఉస్సురస్సుమంటూ వీధులన్నీ కలయదిరగగా అలిసిపోయిన పాదాలు తడబడుతుండగా మూర్ఛిల్లిన 'కన్నగి'కి, దర్శనమిచ్చింది మధురానగర దేవత.

ఆగ్రహంతో తన వక్షోజాన్ని పెరికి మధురై నగరాన్ని అగ్నికీలలకాహుతి చేసి, లక్ష్మి, సరస్వతి, మహిషాసురమర్దని, కాళీ దేవతల విజయానికి సరి సమానమైన కీర్తి పొందిన, 'కన్నగి' ముందు ప్రత్యక్షమైనది మధురానగర దేవత.

✣✣✣✣✣



# 23. వివరణ

పొటియల్ పర్వతాల్ని, కొరకయి, కుమారి రేవు పట్టణాల్ని పాలించే రాజు కులదేవత మధురా నగర రక్షక దేవత. అతడి రాజ్యం హిమాలయ పర్వత ప్రాంతాలకు కూడా విస్తరించింది. తలపై చంద్రవంక, జటాజూటధారిణి, నీలికలువ కన్నులు కలిగిన అద్భుత వదన సౌందర్యంతో, పగడాల అధరాలతో మెరిసే పలువరుసతో నున్న ఆమె ఎడమవేపు శరీరం నీలంగా, కుడిభాగం స్వర్ణచ్ఛాయతో మెరుస్తున్నది. ఎడమచేతిలో స్వర్ణకమలం, కుడిచేతిలో భయంకర ఖడ్గాన్ని ధరించిన ఆమె కుడికాలికి వీరోచితమైన కాలి అందియ, ఎడమకాలికి మెరుస్తున్న మణులున్న పాద మంజీరాలతో శోభిస్తున్నది. అంతటి మహాదేవత కూడా శీలవతి, గుణవతియైనప్పటికీ తన భర్తను అన్యాయంగా కోల్పోయి దుఃఖితురాలై ఆగ్రహావేశాలతో తన ఎడమ వక్షోజాన్ని పెకలించి రాజవీధిలో పడవేసి అగ్నికీలలతో మధురా నగరాన్ని భస్మీపటలం గావించిన వీరపత్ని ఎదుటకు రాలేక, ఆమె వెనక నిలబడి ఇలా అన్నది–

"కన్నగీ! నా మాట వినవా!" అంతులేని బాధతో కళదప్పిన తన వదనాన్ని కుడివేపుకు మరల్చి కన్నగి అన్నది– "ఎవరమ్మానీవు? నన్నెందుకు అనుసరిస్తున్నావు? నా దుఃఖపులోతును కొలవగలవా నీవు?"

మధురై నగర దేవత బదులిచ్చింది– "మేలైన నగలు ధరించినదానా! నీ దుఃఖపు గాఢత నాకు తెలియును. ఈ విశాల మధురై నగర రక్షక దేవతను నేను. నీతో మాట్లాడవచ్చాను. నీ భర్తకు ఏమి, ఎందుకలా జరిగిందో నేను చెప్పదలిచాను. బంగారు గాజులు ధరించినదానా! ఉన్నత కుటుంబ సంజాతకురాలా! స్నేహపూర్వకమైన నా పలుకుల నాలకించు! నా హృదయాన్ని కలతబెడ్తున్న క్షోభనర్థం చేసుకో! నా గుండెకోతను విను. ఈ నగర ప్రభువు తన పూర్వజన్మ క్లేశాలను అనుభవిస్తున్నాడు. నీ భర్తకు చేసిన అన్యాయం ద్వారా అతడు వినాశనాన్ని కొనితెచ్చుకున్నాడు.

వేదాలు పలికే సంభాషణలను నా చెవులు ఆలకించాయి కాని, ధర్మఘంట నాదాల్ని కాదు. పాండ్యన్ రాజు చేతిలో పరాజయం పొంది కప్పం

చెల్లించే రాజులు కొందరు పలికే శాపనార్థాలకు న్యాయదండం చలించలేదు, వంపు తిరగలేదు. అతడు తన ప్రజలను న్యాయబద్ధంగానే పాలించినాడు.

అందమైన స్త్రీలు తమ మోహపూరితమైన దృక్కులతో అతడి హృదయాన్ని చంచలంగా చేసి, హేతువును పక్కదారి పట్టించి, యువగజమును అదుపుకు తేలేని మావటి వాడిలా, రాజును ఏమార్చినా, కళంకిత రహితమైన రాజవంశ వారసుడైన ఈ ప్రభువు ధర్మం తప్పలేదు.

వజ్రాయుధాన్ని ధరించి లోకాలనేలే ఇంద్రుని కిరీటాన్ని రెండు భాగాలుగా చేసి ఈ లోకానికి చక్రవర్తిగా ప్రశంసలనందుకున్న పాండ్యుని చరిత్ర నీకు తెలియదా?

ఒకరోజు మారువేషంలో సంచారం చేస్తూ తలుపులు లేని పూరిగుడిసె ముందు ఆగి లోన భార్యాభర్తలు మాట్లాడుకుంటున్న మాటలను వింటున్నాడు. భార్య అంటున్నది తన భర్త 'కిరంటయి'తో– "నన్ను ఈ పూరిగుడిసెలో ఎటువంటి కంచెలేని ఆవరణలో వదిలి నీవు దూరదేశాలకు వెళ్తూ– రాజు ఇచ్చే రక్షణకన్నా మించిన కంచె లేదన్నావు. మరి ఈనాడు ఆ రక్షణ మనల్ని విస్మరించిందా?" ఆ మాటలు రాజు హృదయంలోకి ఎర్రగా కాలుతున్న అగ్ని శలాకల్లా దూసుకుపోగా అతడు ఉద్వేగంతో వణికిపోతూ, రాజదండాన్ని పట్టుకున్న హస్తాన్ని నరికినాడు. అటువంటి న్యాయమూర్తులున్న రాజవంశమిది.

మరొకరాజు తన శక్తివంతమైన శూలంతో పగతురను నిర్జించి తన సైనికులకు భోగభాగ్యాలను సమకూర్చి, రాజ్యాన సుఖశాంతులు నెలకొల్పి ప్రజలకు విందు ఏర్పాటు చేసినాడు. ఆ విందుకు పుకార్ పట్టణం నుంచి పరాశరుడనే వేద విజ్ఞుడైన బ్రాహ్మణుడు వచ్చినాడు. ఆ పుకార్ నగర ప్రభువు విజయఖడ్గాన్ని, న్యాయదండాన్ని చేబట్టినాడు. ఆకలిగొన్న గ్రద్దకు తన మాంసాన్ని ఆహారంగా వేసి, పావురాన్ని రక్షించినవాడు; అన్యాయం జరిగిన గోవుకు న్యాయం చేసినవాడు; తమిళ బ్రాహ్మణ కవికి స్వర్గాన్ని తెచ్చి ఇస్తానన్నవాడు.

పొటియాల్ కొండలను దాటి, అడవులు, మైదానాలు పట్టణాలు, ఊళ్లను దాటి వచ్చాడతడు. చతుర్వేద సారాన్ని గ్రహించి, పంచ హోమాల్ని, షడ్విధుల్ని నిర్వర్తిస్తూ, త్రేతాగ్నులను అర్చించే ద్విజులు ఏకోపాసనతో తమ దైవాన్ని, ఆ

పరంజ్యోతిని చేరుకునే తపనతో ఉన్న వారి వద్ద శుశ్రూష చేసి పూర్వాచార పద్ధతిలో విద్యనభ్యసించిన వాడతడు. అనేక విద్వత్సభలలో ప్రత్యర్థులనోడించి పుంభావ సరస్వతిగా గణుతికెక్కినవాడు. ఆ విధంగా సంపాదించిన ధనం, కానుకలతో దారిలో 'తంకాల్' అనే గ్రామంలో బోధివృక్షం నీడలో విశ్రమించినాడు. అతడి పక్కనే కమండలం, అక్షయపాత్ర, దండం, శ్వేతఛత్రం, సమిధలు, చిన్నమూట, పావుకోళ్లు ఉన్నాయి. అతడా తరూఛాయన విశ్రమిస్తూ అన్నాడు– "తన రాజఛత్రం నీడనిస్తుండగా దిగ్విజయ యాత్ర గావించిన ప్రభువుకు విజయమగు గాక! సముద్రంలో ఈది కదంబ వృక్షాన్ని చీల్చిన ప్రభువుకు జయమగుగాక! హిమాలయ పర్వత సానువులపై తన ధనుస్సు చిహ్నాన్ని ముద్రించిన మహరాజుకు జయమగుగాక! 'పొరునయి' నదీ రక్షకుడైన 'పొరైయాన్' చక్రవర్తి కీర్తి చిరస్థాయిగా నిలుచును గాక! 'మంతరన్' చేర ప్రభువు చిరకాలం జీవించును గాక!"

అతడి చుట్టూరా అనేకమంది చిన్న పిల్లలు మూగినారు. వంకీల జుట్టున్నవాళ్లు, శిఖలున్నవాళ్లు, ఎర్రటి పగడాల పెదవులున్న వాళ్లు ఆడుకుంటూ వచ్చి పరాశరముని వద్ద ఆగినారు. అతడన్నాడు– "బ్రాహ్మణ పిల్లలారా! మీరు నాతోపాటు వేదమంత్రాల నుచ్చరిస్తే మీకు నా వద్ద ఉన్న బంగారం, మణులనిస్తాను".

వేదవేదాంగ వేద్యుడైన విప్రోత్తముడైన 'వర్తిగన్' కుమారుడు అలమర్‌సెల్వన్ చిదిమితే పాలుగారుతున్న బుగ్గలు గలవాడు, ఎర్రని పెదాలపై తల్లిపాల గుర్తులున్నవాడు, తడబాటు లేకుండా వేదమంత్రాలను పరాశరుడితో బాటుగా స్వరాక్షర దోషాలు లేకుండా ఉచ్చరిస్తూ గానం చేసాడు. అతడి వాగ్ధాటికి సంతసించిన పరాశరుడు పవిత్ర ముత్యాలహారాన్ని, వెలలేని మణులను, కరకంకణాలను, చెవుల కుండలాలను బహుకరించి తన ఇంటివేపు బయలు దేరినాడు.

తన కుమారుడి వలన వర్తిగన్ ధనవంతుడు గావడాన్ని సహించలేని కొందరు రాజభటులు– "ఈ బ్రాహ్మణుడు ప్రభువు సంపదలను కైంకర్యం చేసుకున్నాడని నేరమారోపించి చెరసాలలో పెట్టినారు. వర్తిగన్ భార్య 'కార్తిక'

దుఃఖితురాలై నేలమీద పొర్లిపొర్లి ఏడవసాగింది. తన భక్తురాలికి జరిగిన అన్యాయాన్ని గమనించిన కాళిక తన ఆలయపు తలుపులు బిగించి భక్తులకు తన దర్శనప్రాప్తి లేకుండా చేసింది. భయంకర శూలపాణి అయిన ఆ దేశపురాజు ఈ విషయం విని– "ఎక్కడన్నా ఎవరికైనా నా దేశంలో అన్యాయం జరిగిందా? దుర్గమ్మతల్లికి మన సేవలలో లోపమేమైనా జరిగిందా?" అని విచారించి రమ్మని సేవకులను పంపగా, వారు విషయం కనుక్కుని వర్తిగన్ వృత్తాంతాన్ని రాజుకు విన్నవించారు. రాజు వెంటనే వర్తిగన్‌ను విడుదల చేసి, తన తప్పు మన్నించమని వేడుకుని, తన అధికారుల తప్పుకు బాధ్యత వహించి, తంకాల్, వయలూర్ ప్రాంతాన్ని అతడికి దానంగా ఇచ్చి, 'కార్తీక' కోపాన్ని ఉపశమింపజేయమని వేడుకున్నాడు. అప్పుడు పెద్దశబ్దంతో దుర్గమ్మగుడి తలుపులు తెరచుకోగా, ఆ శబ్దాలు రాజవీధుల్లో ప్రతిధ్వనించాయి.

ఏనుగుపై కూర్చుని ఢంకా మ్రోగిస్తూ ఈ ప్రకటన చేయమని రాజు తన సేవకుడిని పంపినాడు– "ఖైదీలను విడుదల చేయండి. పన్నులు సక్రమంగా కట్టండి. నిధి నిక్షేపాలు దొరికినవారు వాటిననుభవించండి"–

అటువంటి మంచి రాజుకూడ ఒక్కోసారి ధర్మదూరుడు కావచ్చును. ఇదివరకే జోస్యం చెప్పబడింది– 'మధురానగరం మంటల్లో కాలిపోతుందని, తమిళుల నాలుగవ మాసమైన ఆషాఢ మాసమందు పౌర్ణమి తరువాత ఎనిమిదవ రోజున, శుక్రవారం నాడు, కృత్తిక, మేషరాశులు లగ్నస్థానాల్లో ఉన్న రోజున రాజుకు, మధురై నగరానికి కీడు సంభవిస్తుందని'–

మెరిసే గాజులు తొడుక్కున్న యువతీ! విను! కళింగ దేశాన్ని పాలించిన వసు, కుమార రాజులు ఒకరికొకరు శత్రువులై ఒకరు సింగపురాన్ని, మరొకరు కపిల పురాన్ని పాలించసాగారు. ఇద్దరూ దాయాది సంతానమే. పెచ్చుపెరిగిన వైషమ్యాలతో ఇద్దరూ యుద్ధానికి దిగారు. సింగపురం చుట్టూరా సారవంతమైన పొలాలున్నాయి. కపిలపురం చిక్కటి వెదురు అడవుల మధ్య ఉన్నది. భాగ్యవంతులైన వారి మధ్య యుద్ధం చెలరేగినప్పటినుంచీ యుద్ధ రంగానికి పదిహేను క్రోసుల దూరంలోకి పోవడానికి ఎవరికీ ధైర్యం చాలేది కాదు.

ఒకరోజు 'సంగమన్' అనే వ్యాపారస్తుడు వ్యాపార నిమిత్తం తన భార్యతో కలిసి సింగపురం వచ్చి సంతలో సరుకు అమ్మసాగినాడు. ఓ కన్నగీ! నీ భర్త

కోవలన్ గత జన్మలో భరతుడనే రాజభటుడు. వసు ప్రభువు కింద ఊడిగం చేస్తున్నాడు. 'సంగమన్'ను శత్రురాజ్యపు గూఢచారిగా పొరబడి తన రాజు కళ్లెదుటే అతడి తల నరికినాడు. భర్త చనిపోయాక ఎటువంటి ఆశ్రయము లేక సంగమన్ భార్య 'నీలి' రోదిస్తూ వీధి వీధి తిరుగుతూ– "ఓ రాజా! ఇదేమి న్యాయం! ఓ వణిక్ ప్రముఖులారా ఇదేనా ధర్మం? ఓ ప్రజలారా మీరే చెప్పండి! ఓ పుర ప్రముఖులారా! నాకు న్యాయం చేయండి!" అని విలపించింది. పధ్నాలుగు దినాలు అన్నపానీయాలు మాని కృశించినదై ఇలా శాపమిచ్చింది– "నా భర్తను ఎవరైతే పొట్టన పెట్టుకున్నారో అతడికీ ఇలాంటి చావే సంభవించును గాక!" అలా కొండపై నుంచి దూకి ఆత్మార్పణ చేసుకుని తన భర్తను పరలోకంలో కలవడానికి నిష్క్రమించింది.

గత జన్మ పాపాలు ఈ జన్మలో చుట్టుకుంటాయి. ఏ ప్రాయశ్చిత్తమూ దానిని మార్చలేదు. కన్నగీ! పధ్నాలుగు రోజుల తరువాత నీవు నీ కోవలన్ దివ్యరూపాన్ని చూడగలవు. అతడి మానవరూపం నీకు కనబడదు"

అలా కన్నగికి పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరించి ఆ మధురై నగర దేవత అగ్ని మంటలను చల్లార్చింది.

కన్నగి అన్నది– "నా భర్తను కనులారా చూసేంత వరకూ నేను విశ్రమించబోను!"

తన బంగరు గాజులను కొరవాయి దుర్గ గుడిలో పగులగొడ్తూ దుఃఖించిందామె– "నా భర్తతో కలిసి తూర్పు ద్వారాన ఈ నగరంలో అడుగుపెట్టాను. ఇప్పుడు పశ్చిమ ద్వారం గుండా ఒంటరిగా నిష్క్రమిస్తాను" అనుకున్నది కన్నగి.

వరదలతో ఉప్పొంగుతున్న వైయై నదీ కరకట్టపై పగలూ, రేయన్న స్మృతి లేకుండా ఆమె అలా తిరుగుతూనే ఉన్నది. దుఃఖంతో బరువెక్కిన హృదయంతో గుంటలో పడినా, గుట్టలనెక్కినా, జారినా, తూలినా పట్టువదలక ఆమె శూలపాణి నెటువల్ (మురుగన్) దేవుడికి ప్రీతిపాత్రమైన కొండ నెక్కసాగింది. పొడుగాటి, భయంకరమైన ఆ శూలం సముద్రపు పేవులను వెలికి దీసి, రాక్షసులను పారద్రోలి, పర్వత హృదయాన్ని పగులగొట్టిన విజయ

శూలమది. ఆ కొండనెక్కి పుష్పించిన వెంగై (కినొ) వృక్షపు నీడలో నిలబడి దుఃఖిస్తూ అరచింది కన్నగి– “నేను పాపిని! నా పాపానికి నిష్కృతిలేదు!”

అలా పదునాలుగు రోజులు గడిచాయి. దేవతల రాజు ఇంద్రుడు పధ్నాల్గవ రోజును ఆమె పేరిట పవిత్రదినంగా చేయ సంకల్పించి ఆమెపై పూల వర్షాన్ని కురిపించి ఆమెను కీర్తించాడు. ఆమె కొరకై పంపిన దివ్యరథంలో తనకోసం వేచి చూస్తున్న కోవలన్‌తో కలిసి ఆమె దివికేగినది.

తన పతినే దైవంగా కొలిచిన ఆ సతిని
దేవతలు సైతం శ్లాఘించారు, గౌరవించారు.
భూలోకపు స్త్రీలలో మణిదీపం లాంటి
కన్నగి, దేవతగా, స్వర్గలోకపు స్త్రీలకు అతిథిగా వెళ్లింది.

✣✣✣✣✣

ఈ విధంగా మధురా కాండము సమాప్తమైనది. ఈ పుస్తకంలో ప్రసిద్ధికెక్కిన ముగ్గురు రాజుల వర్ణనలు, వారి గుణశీలాలు, భోగభాగ్యాలు, విజయ విహారాల ప్రశంస, పాండ్య వంశీకుల ప్రసక్తి, మధురై నగర గొప్పదనం, అక్కడి పండుగలు, ఉత్సవాల వర్ణన, దేవతల రాక, ప్రజల సుఖసంతోషాలు, ఆహార పదార్థాల సమృద్ధి, వైయై నదీ పరివాహక ప్రాంతపు సారవంతమైన పంట పొలాలు, క్రమం తప్పక వర్షాలు కురిపించే మేఘాలు, నాట్య విభాగ వర్ణనలు, ఆటపాటలు, పాండ్యరాజు నెడుంజెళియన్ అవక్ర పరాక్రమాలు, అతడి అన్యాయ నిర్ణయం, దాని పర్యవసానంగా మహరాజు, మహరాణిల మరణం ఇవన్నీ రేఖామాత్రంగా వివరించబడినాయి.

✣✣✣✣✣





**కన్నగి - కోవలన్**

# మూడవ పుస్తకం

# వంసి (వంజి) కాండము


**24.** గిరిజనుల నృత్యం ........................................ **132**

**25.** శిలాన్వేషణ ........................................ **138**

**26.** శిల తరలింపు ........................................ **143**

**27.** ప్రక్షాళన ........................................ **150**

**28.** విగ్రహ ప్రతిష్ఠ ........................................ **154**

**29.** స్తుతి ........................................ **161**

**30.** వరప్రసాదం ........................................ **169**

# 24. గిరిజనుల నృత్యం

మేమీ కొండల్లోకి మెరుపుల్లా వచ్చినాము,
చిన్నపిట్టల్ని బెదరగొడ్తాం, చిలుకల్ని భయపెడ్తాం!
జలపాతాల్లో దూకి నీటి జలధుల్లో ఆటలాడుతాం!
అల ఆడుతూ పాడుతుంటే అగుపించింది మాకో స్త్రీ.

మేము అడిగామామెను–
"వల్లి'లా సొగసుగా ఉన్న బుల్లీ, ఎవరమ్మా నీవు?
ఈ 'వెంగై' చెట్టునీడన రొమ్ము కోల్పోయి దుఃఖిస్తున్నావు!
నిన్ను చూసి మా గుండెలు తరుక్కుపోతున్నాయి"

ఆమె ఇలా పలికింది కన్నీళ్లతో–
"నేను నా భర్తను కోల్పోయిన రోజునే
మధురానగర రాజరికం, సౌభాగ్యం అంతరించిపోయాయి"

ఆ పలుకులు విన్న గిరిజనులు
రంగురంగుల మట్టి గాజులున్న చేతులెత్తి నమస్కరించారు.
దేవతలు ఆ స్త్రీపై పూలవర్షం కురిపించారు.

మేం అందరం ఆశ్చర్యంతో చూస్తుండగానే
దేవతలు ఆమె భర్తతో పాటు ఆమెనూ తీసుకుని వెళ్లిపోయారు.
అటువంటి దేవతను అంతకుముందు మేమేనాడూ దర్శించలేదు.
పూరిపాకల్లో, చిన్న గుడిసెల్లో నివసించే జనులారా!
ప్రకాశవంతంగా మెరిసే జలపాతాలున్న
కొండ చరియల్లో పెరిగే వెంగై వృక్షాల పూలు
వెదజల్లుతున్న పరిమళాలు కొండా కోనల నిండా వ్యాపిస్తున్నవి.
ఓ చిన్ని గుడిసెలలో నివసించే ప్రజలారా!
మహాఢక్కను మోగించండి! కురింజిరాగాన్ని ఆలపించండి!
అగరు ధూమాల్ని, కర్పూరాల్ని వెలిగించండి!
పూలవర్షాన్ని కురిపించండి!
తన వక్షోజాన్ని పెరికి మధురైనగరాన్ని మట్టిపాలు చేసిన

దేవతను పూజించి ఆశీస్సులను పొందుదాం!
వనగిరుల నిండా సంపదలు తులతూగాలని ప్రార్థిద్దాం!

**2**

ఆమె స్నేహితురాలు అంటున్నది–
అక్కడేం చూస్తావు అందాల నగలున్నదానా!
ఈ జలపాతం చూడెలా మెరుస్తుందో హరివిల్లులా!
రా! జలకాలాడుదాం! హాయిగా మనందరం.
కాటుక, కస్తూరి, సింధూరం, రంగురంగుల జలమందిరం!

**3**

జలక్రీడలాడుదాం! రా చెలీ, ఎందుకా బిగువు?
భయపడవద్దని చెప్పలేదా, తాను వెళ్తూ మన ప్రభువు!
కొండలపై జాలువారే ఈ చక్కటి జలపాతం,
పొగమంచులో దాగున్న గిరిశిఖర వన సంజాతం!

**4**

సుళ్లు తిరుగుతూ కొండరాళ్లను చుట్టుముట్టాయా నీళ్లు
వాటి అదృష్టానికి చెలీ, అసూయ పడబోకు
ఆ నీళ్లతో కాక మరింకెవరితో ఆటలాడగలవు నీవు!
సుళ్లు తిరుగుతూ కొండరాళ్లను చుట్టుముట్టాయా నీళ్లు!

**5**

ఆ నీళ్లను చూసి అసూయ పడాల్సిన దేమున్నది?
సుడులు తిరిగే ఆ నీళ్లలో స్వర్ణమెంతో దాగి ఉన్నది.
ఆ నీళ్లతో కాక మరింకెవరితో ఆటలాడగలవు?
సుడులు తిరిగే ఆ నీళ్లలో సువర్ణమే దాగున్నది.

**6**

ఆ నీళ్లను చూసి అసూయ పడాల్సిన దేమున్నది?
సుడులు తిరిగే ఆ నీళ్లలో గిరుల పూలరేకలున్నవి.
ఆ నీళ్లతో కాక మరింకెవరితో ఆటలాడగలవు?
సుడులు తిరిగే ఆ నీళ్లలో గిరుల పూలరేకలున్నవి.

**7**

మధురబాషిణీ! స్వచ్ఛమైన జలాల్లో
మన కాటుక కళ్లు ఎర్రబడేంతవరకు స్నానమాడినాము.
నెచ్చెలీ! మనమిప్పుడు మామిడిచెట్టు రూపునున్న
రాక్షసుడిని మర్దించిన మహా శూలపాణిని పొగడుదాం!

**8**

సెంటిల్, సెంకొాతు, వెంగున్రు, ఇరకం వనాల ప్రభువు
విసిరిన శూలం తగిలి, విరుచుకుపడి చచ్చాడు
మామిడి చెట్టురూపంలో ఉన్న మాయలమారి రాక్షసుడు.
భూమిని చుట్టుముట్టిన సముద్రంలో కతడిని నెట్టినవాడే మన ప్రభువు!

**9**

ఆరు ముఖాలు, పండ్రెండు చేతులున్న పరాక్రమశాలి
దేవేంద్రుడిచే కీర్తించబడిన దేవతామూర్తి
నెమలి వాహనమెక్కి రాక్షసుల నెదిరించి
తన ప్రచండశూలంతో వాళ్లను తరిమితరిమి కొట్టినాడు.

**10**

శరవణంలోని కలువల సరస్సు వద్ద
ఆరుగురు అమ్మల పాలు తాగి పెరిగినవాడా!
నీ చేతిలోని ప్రచండ శూలమే కదా
కుడగు కొండ రాక్షసుడి గుండె చీల్చినది!

**11**

**(ఆమె అంటున్నది)**

చారల గాజులున్న చక్కని చినదానా! నాకు నవ్వాగకున్నది!
ఊళ్లో గుసగుసలింకా నా తల్లి వినలేదు కాబోలు
కదంబుడు పూనాడనుకుని పూజారిని పిలిపించి
రాత్రంతా నాతో నృత్యంచేయించ బూనింది కాని, ఆ జబ్బు వచ్చింది
మిరియాల కొండ వాసిపై నేను మనసు పడినందుకు కాదా!

**12**

తళతళమెరిసే గాజులున్న తరుణీలలామా!
నాకు నవ్వాగకున్నది! కుడగు పర్వతాన్ని కూల్చిన ప్రభువు
ఇక్కడికి వస్తే అతడికంటే అమాయకుడు ఇంకెవడుంటాడు?
నా జబ్బు పోగొట్టేందుకు వచ్చిన పూజారికేం తెలుసు,
అది నేను మిరియాల కొండవాసిపై మనసు పడినందుకని!

**13**

గలగల మ్రోగే గాజులున్న పడతీ! నాకు నవ్వాగకున్నది!
గరళాన్ని మింగి మఱ్ఱిచెట్టు కింద కూర్చున్న స్వామి కొడుకు
ఇక్కడికి వస్తే అతడు ఆ పూజారి కన్నా అమాయకుడు.
ఆ జబ్బు వచ్చింది మిరియాలకొండ వాసిపై మనసు పడినందుకు కాదా!

**14**

చక్కని నగలున్న సౌందర్య రాశీ! నాకు నవ్వాగకున్నది!
వర్షాకాలం విరగబూసే కదంబ పూలదండ గైకొని మన ప్రభువు
ఇక్కడికి వస్తే అతడు ఆ పూజారికన్నా అమాయకుడు.
ఆ జబ్బు వచ్చింది మిరియాలకొండ వాసిపై మనసు పడినందుకు కాదా!

**15**

**(ఆమె చెలి అంటున్నది)**

మఱ్ఱిచెట్టు క్రిందనున్న మహాశివుని కుమారుడు
నెమలి వాహనమెక్కి తన భార్యతో ఇటువస్తే
వారిని దర్శించి పూజారి పూనకంతో ఆడి పాడుతున్నపుడు
మిరియాలకొండ వాసితో పెండ్లి చేయమని ఆ దేవునికి మొక్కుదాం!

**16**

కైలాసగిరివాసి కన్న కుమారుడా! అశోకపూల రంగున్న
కెంపు పాదాలున్న నీవు, గిరిపుత్రిక నెలవంకను
తలపై దాల్చిన నెమలి వర్ణపు చిన్నది 'వల్లి'తో నీవు వస్తే
మిరియాలకొండ వాసితో పెండ్లి చేయమని నీకు మొక్కుతాను.

**17**

పార్వతీ తనయుడా! వల్లి ప్రియసఖుడా!
తలపై నెలవంక దాల్చిన వల్లి ఈ గిరిజనుల పుత్రిక.
తమ పాద పద్మాలకు ప్రణమిల్లుతున్నాము.
మిరియాలకొండ వాసితో పెండ్లి చేయమని మీకు మొక్కుతున్నాము.

**18**

షణ్ముఖుడా! నీకు, మా గిరికన్యకు వేలవేల వందనాలు!
మిరియాలకొండ వాసి ఇతడు తమ పాదాల నంటినాడు.
ప్రజలందరి సమక్షాన మాకు పెండ్లి చేసి
ఆశీర్వదించి మమ్ములను ఆదరించుము ప్రభూ!

**19**

**(ఆమె చెలి అంటున్నది)**

పరిమళభరిత పూలదండను ధరించిన ఆ వ్యక్తి
దాపులనే దాగుండి మా పాటలను వింటున్నాడు.
అతడు వెళ్లిపోతున్నపుడు అతడి పాదాల నంటి
నెచ్చెలీ, నేనేమన్నానో సావధానంగా విను!

**20**

నీవు మా గ్రామానికి వచ్చావు నీకు నచ్చిన ఈ కన్నెకోసం
కదంబపూలమాలతో, కరాన పెద్ద ఈటెతో! కాని,
ఏదీ నెమలి వాహనం? ఎక్కడ గిరిపుత్రిక వల్లి?
అమాయకులైన ఈ గిరిజనం, నిన్ను దేవుడంటే నమ్మరు కదా!

**21**

మన ఊళ్లో గుసగుసలను మాట్లాడే సరికి నేను,
పగిలిన హృదయంతో అతడు పలుకకుండా వెళ్లిపోయాడు.
అతడు నిన్ను ఖచ్చితంగా వివాహమాడతాడు!
మనం ఇప్పుడు మధురైనగరాన్ని మంటల్లో కాల్చిన
మహాపత్నికి మొక్కి మన కోర్కెను నివేదిద్దాం!

**22**

రా! గానం చేద్దాం! నీ కోరిక నెరవేరును గాక!
తన వక్షోజాన్ని అగ్నిచక్రంగా మార్చి ఎత్తైన ఇళ్లున్న
మధురైనగరాన్ని, న్యాయం కుంటుపడిన రోజున
మహాగ్నికీలలలో మాడ్చి మసి చేసిన మహా ఇల్లాలును,
నీకు మిరియాల కొండవాసితో పెండ్లి చేయమని ప్రార్థిద్దాం!

**23**

భావ్యగంతమైన ఈ నేలపైనున్న శీలవతులారా!
నాగు పడగవంటి నవ లావణ్యమున్న ఈ తల్లిని కీర్తిద్దాం!
దేవతలు ఆమె భర్తతో ఆమెను చేర్చి ఆనందపరచినారు.
నాగుపడగ వంటి నవలావణ్యమున్న ఆమెకు నమస్కరించినారు.

**24**

పరిమళభరిత వెంగై (కినొ) చెట్టు నీడనున్న ఆ స్త్రీమూర్తిని
దేవతలెంతో వేడుకగా పూజించి అభిమానించినారు.
పరిమళభరిత వెంగై చెట్టు నీడనున్న ఆ స్త్రీమూర్తి
తన భర్తతో స్వర్గానికేగినది. ఇక తిరిగి రాదు.

**25**

ఇక తిరిగిరాని ఆ మహాతల్లిని మనసారా స్తుతిద్దాం!
మన ఊరికి మంచి జరుగుతుంది.
మనకు అన్ని సంపదలు సిద్ధిస్తాయి. శుభం జరుగుతుంది.
బంగరు గాజులున్న ఈ కన్యకు తనకు నచ్చిన వాడితో పెండ్లిచేద్దాం!

**26**

మనం వలయాకార నృత్యం చేస్తూ గానం చేస్తుండగానే
మిరియాల కొండ వాసి వచ్చినాడు, నిన్ను పరిణయమాడినాడు.
మహాపత్ని ఆశీస్సులతో మన కొల్లికొండలనేలే
పశ్చిమదేశ ప్రభువు, హిమాలయ శిఖరాన ధనుస్సును
ముద్రించినవాడు అతడు, అతడి ప్రజలు సుఖశాంతులతో
సకల సౌభాగ్య సంపదలతో చిరకాలం వర్ధిల్లెదరు గాక!

❖❖❖❖❖

# 25. శిలాన్వేషణ

చేర వంశపు రాజుల్లో సాటిలేని వాడు
మహాఖడ్గధారి సెంగుట్టువన్ ప్రభువు
సముద్రంచే ఆవరించబడి ఉన్న కదంబ వృక్షాన్ని
తన కత్తితో ఛేదించి దేవతలనే ఆశ్చర్యపరచాడు.
హిమాలయ శిఖరాలపై ధనుస్సు చిహ్నాన్ని చెక్కించినాడు.
ఒకరోజు తన రాణి ఇల్లంగొ వెణ్మాలతో
తన రజత భవనంలోని జలధార వద్ద కూర్చుని ఉండగా
దూరాన మబ్బులు దోబూచులాడుతున్న పర్వత శిఖరాన ఉన్న
చెట్లతోపులోని జలపాతాల మృదంగ ధ్వని నాలకించినాడు.

అప్సరసల మధ్య నడయాడుతున్న ఇంద్రుడిలా
తన వెంట దాసదాసీజనం రాగా
శూలాన్ని చేబట్టి అతడు తన పట్టపుటేనుగు నధిరోహించి
ఆరువందల ముప్పై ఆమడల దూరంలో ఉన్న ఆ చోటుకు
స్వర్ణవర్ణ పుష్పాలున్న చెట్లదారుల్లో
విశాలమైన నదీ ఒడ్డున ఉన్న మార్గాలలో
ద్వీపాలను, క్రీడావాటికలను దాటుతూ ప్రయాణించినాడు.

### సెంగుట్టువన్

విష్ణుదేవుని హృదయంపై అమరిన పూలదండలా
ఎత్తైన పర్వతాల నుంచి వేగంగా జాలువారిన
పెరియార్ నదీ ప్రవాహ జలాల్లో
కొట్టుకువచ్చిన బూరుగు, వెంగై, రేల పూలగుత్తుల సువాసనలు
కాంభోజి, ఎర్రమద్ది, చందనం శాఖల పరిమళాలతో,
వాటిని ఆఘ్రాణిస్తూ గుమికూడిన
తుమ్మెదల సముదాయంతో రమణీయంగా ఉన్న ఆ నదీతీరపు ఇసుక
తిన్నెల వద్ద ఆ రాజు విడిది చేసినాడు.

గిరిజనులతో ఆటపాటలతో, వేద విదులైన బ్రాహ్మణులు రక్తశూలధారిని స్తుతిస్తూ పఠిస్తున్న వేదమంత్రాలతో, వడ్లు దంచేప్పుడు పాడే వల్లయి పాటలతో, పొలాలను కావలికాసే రైతుల కేకలతో, తేనెపట్టులు తెంపుతున్నవారి అరుపులతో, మృదంగ ధ్వనుల్లా వినిపిస్తున్న జలపాతపు హోరుతో, పులులను చూసి ఏనుగులు చేస్తున్న ఘీంకారాలతో, మంచె మీద కూర్చుని పక్షులను అదిలిస్తున్న వారి ఘోషతో, ఏనుగులను తమ ఉచ్చుల్లో పడేట్లు చేయడానికి ప్రయత్నిస్తున్న మావటివాళ్ల సందడితో, రాచపరివారపు హడావుడితో ఆ ప్రదేశమంతా అత్యంత కోలాహలంగా ఉన్నది.

పరాజితులైన రాజులు 'వంసి' ప్రభువు వద్దకు వచ్చి కప్పము చెల్లించు నపుడు ఎదురుచూసే వారిలా, గిరిజనులు ముందుగానే ఆ చోటుకు వచ్చియున్నారు. వారి తలలపై ఏనుగుదంతాలు, అగరుకట్టెలు, జింక చర్మాలు, తేనెకుండలు, చందన కట్టెలు, సింధూరపు గడ్డలు, రంగురాళ్లు, అంజన ద్రవ్యాలు, యాలకులు, మిరియాలు, అరారుతగడ్డలు, సజ్జలు, కొబ్బరికాయలు, మామిడిపండ్లు, ఆకుల దండలు, పనసకాయలు, చెరకుగడలు, పూలతీగెలు, అల్లము, ఉల్లి, పోకగుత్తులు, అరటిపండ్లు, పులిపిల్లలు, సింహపు పిల్లలు, ఏనుగు గున్నలు, కోతికూనలు, చిన్ని ఎలుగుబంట్లు, జింకలు, లేడిపిల్లలు, కస్తూరి మృగాలు, ముంగిసలు, నెమళ్లు, పునుగుపిల్లలు, చిలుకలు, అడవికోళ్లు– వాటిని రాజుకిచ్చి కైమోడ్చి ఇలా అన్నారు–

"గత ఏడు తరాలుగా మేము తమ సేవకులం. తమ కీర్తి చిరస్థాయిగా నిలుచును గాక! అడవిలో వేంగై చెట్టు నీడన, పెకలింపబడిన ఒక రొమ్ముగల స్త్రీ దుఃఖిస్తూ నిలబడి ఉండడాన్ని మేము చూసినాము. దొరా! ఆమెను దేవతలు కొనియాడినారు. ఆనక ఆమె తన భర్తతో దివ్యరథాన స్వర్గానికేగినది. ఆమెది ఏ ఊరో ఎవరి బిడ్డో మేమెరుగము. ఇటువంటి విచిత్రాన్ని మేము కనలేదు. వినలేదు. తమరు తమ వంశము చిరకాలము సుఖశాంతుల నుండెదరు గాక!"

ఇవన్నీ వింటున్న తమిళకవి 'శాత్తనార్' శూలపాణియైన మహారాజుతో అన్నాడు– "ప్రభూ! ఆ దురదృష్ట జాతకురాలైన స్త్రీకి, ఆమె భర్తకు జరిగిన అన్యాయం నాకు తెలుసు. ఆమె కాలి అందియను వ్యాపార నిమిత్తం ఆమె భర్త మధురానగరంలో అమ్మబోగా ఒక దుష్ట స్వర్ణకారుని కుట్ర వలన అతడు

చంపివేయబడినాడు. శక్తివంతమైన సైన్య సమూహమున్న మహారాజు ముందు ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ తన చేతిలోని స్వర్ణ మంజీరాన్ని పైకెత్తి చూపుతూ న్యాయమడిగిన సంగతి మీకు విన్నవిస్తాను. ఆగ్రహాగ్ని రగలగా ఆమె తన ఎడమ రొమ్మును పెరికి నగర వీధుల్లో విసరగా అది జ్వాలాచక్రమై మధురై నగరాన్ని భస్మీపటలం గావించిన విషయాన్ని తమకు వివరించగలను. తన కాలి అందియను కోపంగా మహారాణి ముందుకు విసిరివేస్తూ– 'రాణీ! చూడు! లక్ష్మీసంపన్నుడైన పాండ్యరాజు తన సింహాసనంపైననే మూర్ఛిల్లి మరణించినాడు' –ఇంకా ఆ స్త్రీ మాటలు పూర్తిగా వినకుండానే ఆ మహారాణి తన భర్త పాదములను స్పృశించి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. 'నా బ్రతుకూ చావూ నా భర్తతోనే' అంటూ.

ఆ స్త్రీ తన ఇంటికి వెళ్లక తనకు జరిగిన అన్యాయాన్ని విన్నవించడానికి తమ రాజ్యంలోకి ఇంత దూరం వచ్చినట్లున్నది. ప్రభూ! తమరి కీర్తి తరతరాలకు శాశ్వతంగా నిలుచును గాక!"

పాండ్యరాజు తొందరపడి చేసిన తప్పును తెలుసుకున్న చేర ప్రభువు బాధతో అన్నాడు– "పాండ్యరాజు చేసిన అన్యాయపు నిర్ణయాన్ని కిరీటధారులైన రాజులెవ్వరూ సమర్థించరు. అది తోటి రాజుల చెవులకు చేరకముందే అతడు ప్రాణత్యాగం చేసి తన న్యాయదండాన్ని సరిదిద్దుకున్నాడు. విధి చేతిలో ఎవరైనా ఓడక తప్పదు. వానలు కురియనప్పుడు కరువు విరుచుకుపడ్తుంది. జనులకు అన్యాయం జరిగినప్పుడు భూమిని భయం చుట్టుముడ్తుంది. నియంతృత్వ పోకడలు మాని ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలించడం రాజధర్మం. రాజుల కిరీటం, సింహాసనం సుఖాలతో కూడినవి కావు. ఉన్నత వంశాన జన్మించడం వలన కష్టాలనూ ఎదుర్కొనక తప్పదు"–

అని కవితో పలికి మహారాజు తన రాణితో అన్నాడు– "ఒక పతివ్రతా స్త్రీ తన భర్త చనిపోయిన మరుక్షణమే ప్రాణాలు వదిలినది. ఇంకోస్త్రీ తనకు జరిగిన అన్యాయానికి కినిసి ఆగ్రహంతో మన రాజ్యానికి వచ్చినది. వీరిరువురిలో ఎవరు గొప్పవారనుకుంటున్నావు, మహారాణీ?"

రాణి పలికినది– "తన భర్త మరణించగానే తానూ ప్రాణాలు విడిచిన రాణికి స్వర్గలోక ప్రాప్తి కలుగునుగాక! మన రాజ్యమునకు వచ్చిన స్త్రీని మనం గౌరవిద్దాం!"

రాణి పలుకులు సమంజసమని భావించిన మహారాజు తన మంత్రులను రావించగా వాళ్లు ఇలా అన్నారు– "పొటియిల్ కొండల నుంచి గాని, హిమాలయ పర్వతాన మన వింటి చిహ్నము ముద్రించబడిన కొండల నుండి గాని ప్రశస్త శిలను తెప్పించి ఆమె విగ్రహాన్ని చెక్కిద్దాం. రెండు పర్వతాలూ పవిత్రమైనవే! ఒకటి కావేరీ జలాలతో, రెండవది గంగా జలాలతో"

మహారాజు అన్నాడు– "మనకు దగ్గరలో ఉన్న పొటియిల్ కొండ శిలలను తెప్పించి విగ్రహాన్ని రూపొందించడం ఖడ్గధారులై, జగత్ ప్రసిద్ధికెక్కిన మా కుటుంబానికి మరింత కీర్తి తెచ్చేది కాదు. యజ్ఞోపవీతధారులై, తడి దుస్తులతో, జడ ముడులతో, త్రేతాగ్నుల నర్చించే బ్రాహ్మణులు నివసించే హిమాలయాల నుంచే శిలను తెప్పించెదము గాక! పర్వతరాజు నుంచి మనకో శిల ఇవ్వడానికి ఎవరైనా అడ్డువస్తే వాళ్లు తప్పు చేసినట్లే! చంద్రధరుడైన శివునికి ఉమనిచ్చి వివాహం చేస్తుంటే అడ్డు వచ్చినంత దోషమది. అప్పుడు మనం సర్వసైన్య సమేతంగా వెళ్లి ఉత్తరదేశపు రాజులనోడించి మందార మాలతో మన వెంగై పూలమాలను ఆ దేవదేవునికి సమర్పించి కార్యసాధకులమౌదాము. సన్నాహాలు చేయండి!" అని ఆజ్ఞాపించాడు.

తన గజ సైన్యాన్ని, కాకలు తీరిన యోధుల్ని సమ్మానించి, చేర రాజులకు మహారాజ బిరుదాన్నిచ్చిన నాటి రాజఛత్రాన్ని బయలుకు దీసి, తన సైన్యాన్ని యుద్ధపు దుస్తులతో, తాటి ఆకు కవచాల్తో సంసిద్ధపరచి– "వంసి నగరపు స్వర్ణ వాకిట నిలిచి విల్లోపూల దండలతో మన కరకు ఖడ్గాలను జతపరచి యుద్ధానికి బయల్దేరుదాం! సైనికులారా! సమాయత్తం కండి!" అన్నాడు చేర మహారాజు.

అప్పుడు 'విల్లవన్ కోదయి' అను మంత్రి ఈ విధంగా పలికాడు– "ప్రభూ! తమ జయకీర్తి శాశ్వతముగా నిలుచుగాక! రక్తసిక్తమైన కొంకణ రణరంగాన తమ శత్రువులు పరాజయం పాలై వారి వ్యాఘ్ర, మీన చిహ్న పతాకలను వదిలి పారిపోయినారు. కొంకణులు, కాళింగులు, క్రూర కరునాటివారు, వంగ, గంగ దేశాలవారు, కదియన్లు, ఉత్తరదేశపు ఆర్యులు గజారూఢులై శూలము ధరించి వస్తున్న నీ ఉగ్రరూపాన్ని చూసి కకావికలై పారిపోయిన దృశ్యమింకా నా కనులముందే కదుల్తున్నది. గంగానదిలో పవిత్ర స్నాన మాడడానికి తమ మాతృమూర్తి వెళ్లినపుడు మిమ్మల్ని చుట్టుముట్టిన

వేయిమంది ఆర్యులకు ఒంటిచేత్తో సమాధానమిచ్చినపుడు సాక్షాత్తు మృత్యువే స్థాణువాయెను గదా! ఈ ప్రపంచాన్ని మొత్తం తమిళ పరిపాలనలోకి తీసుకు రావాలని నీవు సంకల్పిస్తే అడ్డుకొనగలవారెవరు? ముందుగా ఉత్తర దేశపు రాజులకు వర్తమానం పంపుదాం! 'హిమాలయ పర్వత సానువుల నుంచి ప్రశస్త శిలను తెచ్చి దేవతా విగ్రహాన్ని చేయించుటకు ప్రభువులు నిశ్చయించినారు' అని లేఖ వ్రాయించి మట్టిపలక మీద దక్షిణ చక్రవర్తుల చిహ్నాలైన విల్లు, వ్యాఘ్రం, మీనముల రాజముద్రను వేసి ఉత్తర దేశ ప్రభువులకు పంపుదాం!" అన్నాడతడు.

మంత్రి అలుంబివేలు ఇలా పలికాడు– "అనేక దేశాల గూఢచారులు మన నగరంలో ఉన్నారు. మన నిర్ణయాన్ని రాజనగర వీధుల్లో దండోరా వేయిద్దాం. మనకు వార్తాహరులను పంపే శ్రమ తగ్గుతుంది"

పరాక్రమశాలియైన చేర ప్రభువు 'వంజి' నగరాన్ని చేరుకోగానే పట్టపు టేనుగు మీద ప్రతీహారి నుంచి నగరపు నాలుగు వీధుల్లో చాటింపు వేయించాడు– "మహరాజుకు జయమగుగాక! హిమాలయ పర్వతాల నుంచి ప్రశస్తమైన శిలను తెచ్చి పత్ని విగ్రహాన్ని చేయించ పూనుకున్నారు. కావున ఓ ఉత్తర దేశపు రాజులారా! ప్రభువుకు కప్పం చెల్లించి దారిని సుగమం చేయండి. సముద్రంలోని కదంబ వృక్షాన్ని కత్తితో నరికి, తన అవక్ర పరాక్రమంతో పగవాళ్లను జయించి హిమాలయ పర్వత నుదుటిపై తన 'విల్లు' గుర్తును ముద్రించిన సాహస వీరుడితడు. ఎదిరించి ప్రాణాలు పోగొట్టుకోవడం కన్నా, మీ భార్యలను విడిచి సన్యాస దీక్ష పూనండి! అత్యంత శూరులున్న సైన్యంతో బయల్దేరుతున్న మహరాజుకు జయమగుగాక!"

✣✣✣✣✣



# 26. శిల తరలింపు

భేరీ భాంకార ప్రశస్త ఘోషల మధ్య ప్రభువు తన వంశ పరంపరాగతమైన సింహాసనాన్ని అధిష్ఠించినాడు. ఆస్థాన పూజారి, ఆస్థాన జ్యోతిష్కుడు మంత్రులు, సేనాధిపతులు, యావన్మంది సభికులున్న సభలో వాళ్లు రాజును ఆశీర్వదించినారు. "రాజాధిరాజుకు జయమగునుగాక!"

సమస్త రాజ ఛత్రాలకన్నా ఉన్నతమైన శ్వేతఛత్రము గల ప్రభువు నిండు సభలో ఇలా ప్రకటించాడు– "హిమాలయ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చిన మునిజనులు తమ ఉత్తర దేశపు రాజుల గురించి చెప్పిన గొప్పలు మనకు అవమానకరమైనవి. నా ఎదురులేని ఖడ్గము ఆ ఉత్తర నృపతుల మదమణచి వారి తలలపై ఈ బృహత్ శిలను మోయించి తీసుకురాకపోతే దాని ప్రభావము నెవ్వరంగీకరింతురు? కాళ్లకు వీరకడియాలు దాల్చి రోషాలు పోయేటి రాజులను కాళ్ల బేరానికి తీసుకురాకపోతినా నా రాజదండము వక్రగతిన ప్రజలను పీడించదా?" అని గర్జించాడు.

రాజపురోహితుడు ఆశీర్వచనములు పలికి ఇలా అన్నాడు– "ప్రభూ యుద్ధ రంగమున నిన్నెదిరించి నిలువగలవారెవ్వరు? అత్తి, వేప మాలలు ధరించు చోళ, పాండ్యుల గురించి మునులా మాటలన్నారే గాని తమ గురించి కాదు ప్రభూ! హిమాలయాలు సరిహద్దుగా రాజ్యము విస్తరించిన రాజశార్దూలా! నీ ఆగ్రహాన్ని తట్టుకోగల రాజెవ్వడు? శాంతించి మమ్ములను కరుణించు తండ్రీ!"

గ్రహస్థితులు, నక్షత్రరాశుల చలన ప్రభావము లెరిగిన ఆస్థాన జ్యోతిష్కుడిలా పలికినాడు– "మహారాజా! తమకు జయమగుగాక! ఈ భువిపైని రాజులెల్లరు తమ పాదపద్మాలపై పడి శరణు వేడెడి చక్కటి ముహూర్త సమయమిది. తమరు తలచిన పని దిగ్విజయంగా పూర్తి కాగలదు"

ఆ మాటలు విన్న అవక్ర పరాక్రముడైన చేర భూపతి తన ఖడ్గము, ఛత్రములను ఉత్తర దిశగా విజయమార్గాన నడిపించినాడు. వందిమాగధులు కైవారములు చేయ, యుద్ధఢంకాల భేరీభాంకారాల మోతతో నగరం దద్దరిల్లింది. భూమిని తన పడగలపై మోసే ఆదిశేషుడి శిరస్సు కాస్త వంగింది. మణిదీపాలు

వెలిగి చీకటి తొలిగింది. రాజలాంఛనాలు, విజయ పతాకలు కనువిందు చేస్తుండగా సైన్యం, అయిదుగురు మంత్రుల సమూహము, ఎనిమిది రకాల సైన్యాధిపతులు, రాజపురోహితుడు, విప్రులు, లేఖకులు, గణకులు, గజ, తురగ, రథ, పదాతిదళ ప్రముఖులు జయజయ రావములు సలిపిరి.

"సర్వం సహా భూమండల చక్రవర్తికి జయమగుగాక!"

పట్టపుటేనుగు అంబారీలో వీరఖడ్గమును, శ్వేత ఛత్రమును పూలదండల మధ్య ఉంచి, ఏనుగుకు అన్నపు ముద్దలను తినిపించి కోట గోడల వద్దకు తీసుకు వచ్చినారు. తాటిపూలమాలతో అత్రుపాల పుష్పాలను కూర్చిన దండను ధరించి ఏతెంచిన ప్రభువు యుద్ధానికి సంసిద్ధంగా ఉన్న సైనికులతో విందు భోజనాలు చేసినాడు. వంజి నగరపు వాడిపోని అత్రుపాల పుష్పాల కిరీటాన్ని దాల్చినాడు. ఉదయభేరీ వాయిద్యాల హోరు ఇతర రాజులకిది కప్పము చెల్లించాల్సిన సమయమని గుర్తుచేస్తుండగా జటాజూటాన నెలవంక గల శివుని పాదుకలను తన తలపై ఉంచుకుని, ఎవరికీ తలవంచని వాడు శివునికి నమస్కరించి, ప్రదక్షిణాలు చేసినాడు. అగ్నిహోత్రాల నుంచి వెలువడ్తున్న పరిమళ వాయువులతో విప్రులు పఠిస్తున్న వేదమంత్రాలతో ఆ ఆలయ ప్రాంగణం పవిత్రంగా వెలుగొందుచుండగా మహారాజు తన పట్టపుటేనుగు నధిరోహించినాడు. విష్ణుదేవాలయపు పూజారులు ప్రభువును ఆశీర్వదించినారు– "కుట్టువన్ దేవుడు తమకు విజయాన్ని సిద్ధింపజేయునుగాక!"

గంగాధరుడి పాదుకలను తన తలపై ధరించి ఉన్న రాజు వాటిని తన భుజాలపైకి మార్చి భక్తిభావాన దేవతలకు ప్రణమిల్లినాడు.

నాట్యాంగనలు తమ ఆటపాటలతో అలరిస్తూ ఇలా పొగిడినారు– "ఓ విజయశీలా! ఏనుగు అంబారీపై శ్వేతఛత్ర నీడన కదనానికి కదుల్తున్నవాడా! తాటి, తుమ్మిపూల దండలతో ప్రకాశిస్తున్న పట్టపుటేనుగుపై కాంతులీనుతున్న తమ వైభవాన్ని గాంచిన మా నేత్రాలు ధన్యమై, మా చేతుల నుండి గాజులు వాటికవే నేలపైకి జారుచున్నవి"–

వందిమాగధులు, వైతాళికులు స్తోత్రపాఠములను విజయ గీతములను ఆలపించుచుండగా ఖడ్గధారులైన పదాతిదళ సైనికులు, అశ్వికులు, గజబలం

చేయెత్తి జయజయ ధ్వానాలు చేస్తూ మహారాజు యొక్క ఖడ్గకౌశల్యాన్ని ప్రస్తుతించినారు.

రాక్షసులనోడించటానికి బయల్దేరిన ఇంద్రుడిలా రాజు యుద్ధానికి బయల్దేరినాడు. ఆ సమస్త సేనావాహిని వంజి నగరము నుంచి సముద్రతీరము వరకు వ్యాపించినట్లు కానవచ్చినది. సైన్య పదఘట్టనలకు కొండలు వంగి మైదానాలు కంపించగా, తన అశ్వ, రథ, గజ, పదాతి దళాల్ని నీలిపర్వత పాదాల వద్ద విడిది చేసేందుకు ఆజ్ఞనిచ్చాడు మహారాజు. తన పట్టపుటేనుగు దిగి రాజగుడారంలోకి వెళ్లినాడు.

ఇంద్రుడిలా విఖ్యాతుడైన రాజును చూడాలనే కుతూహలంతో ఆకాశ మార్గాన పయనించే మెరుపు దేహాలున్న మునులు, సిద్ధచారణులు ఆగి ఆతని వీక్షించ ఆతడు వారికి దండప్రణామంబులు చేసినాడు– "ఓ వంజి నగర ప్రభూ! విను! జటాజూటధారియైన శివుని కరుణ వలన మేమిప్పుడు మలయపర్వతాల వేపు పోవుచున్నవారము. నీవు హిమాలయములకు వెళ్లుచున్నావు. అక్కడి సద్బ్రాహ్మణులకు రక్షసేసి ఆశీస్సులు గొనుమని" వారు పలికి ఆశీర్వదించి వెడలినారు.

ఆ తరువాత కొంకణ దేశపు నర్తకులు వచ్చి రాజుకు నమస్కరించి ఇలా అన్నారు– "చతుస్సముద్ర వలయిత భూమీశుండవైన నీకు జయమగుగాక!"

తరువాత రంగురంగు దుస్తులు ధరించి శత్రు భయంకరులుగా పేర్గాంచిన కరనాటక దేశస్థులు, నిగనిగలాడే వంకీల శిరోజాలున్న బాలికలు పూలదండలు తేగా రాజునకిచ్చి నమస్కరించినారు. ఆ కన్యలు వక్షాన పూలహారాలు ధరించి చేపల వంటి కళ్లు విస్మయ ంగా కదుల్తుండగా ఇలా గానం చేసారు.

> "కోయిలలు కుహుకుహుమని గానం చేస్తున్నవి.
> తుమ్మెదలు వీణాధ్వనులను అనుకరిస్తున్నవి.
> పూలు విప్పారే వసంతకాలం వచ్చినది.
> మా ప్రియుడింకా రాలేదు, ఎందుకనో ప్రభూ!"

వారి తర్వాత 'కుడగు' ప్రాంతం నుంచి రంగురంగుల గాజులు తొడిగిన మీననేత్రులైన నాట్యగత్తెలు వచ్చి శీతాకాలానికి అనువైన పాటలు పాడినారు.

“అందమైన గాజులున్న చినదానా!
అలంకరించుకో నీ ఏడువారాల నగలను!
మబ్బులు మూగి గర్జిస్తున్నాయి ఉరుములతో!
తన పని ముగించుకుని నీ ప్రియుడిటే వస్తున్నాడు”

వందిమాగధులు, పాటగాళ్లు కైవారాలు సలిపారు– “భయంకర కరవాలము బూనిన ప్రభువుకు విజయమగుగాక! అతడి సర్వం సహా భృత్యులూ, ప్రజలూ సకల సౌభాగ్యాలతో విలసిల్లెదరుగాక!”

శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించే ప్రచండ శూలధారి చేర ప్రభువు తనను కీర్తించిన వారికి తగిన బహుమతులనిచ్చి పంపినాడు. అతడు విశ్రాంతి తీసుకొనుచుండగా కావలిభటుడు వచ్చి విన్నవించినాడు– “ప్రశస్తమైన విల్లు ధ్వజము గాగలిగి, న్యాయదండమును చేబూనిన రాజుకు జయము, జయము! నూటరెండు మంది నర్తకీమణులు, రెండు వందల ఎనిమిది మంది గాయకులు, వందమంది విదూషకులు, తొంభై ఆరుగురు శాస్త్రకోవిదులు, వంద రథాలు, అయిదు వందల ఏనుగులు, పదివేల ప్రశస్తమైన గుర్రాలు, ఇరవై వేల బళ్లు రకరకాల వస్తువులతో నిండినది ఉత్తరదేశపు పేరు తెలియని ప్రాంతాల నుంచి వేయిమంది ప్రతీహారులతో ‘సంజయుడు’ అనేవాడి నాయకత్వాన తమ దర్శనార్థం వేచి ఉన్నారు, ప్రభూ” అని పలికినాడు. రాజు సమాధానమిచ్చినాడు– “అతడిని దాసదాసీజన సమేమతంగా లోనికి ప్రవేశపెట్టు”

సంజయుడు రాచశిబిరంలోకి అడుగుపెట్టి మహరాజుకు నమస్కరించి, అనేక విధాల పొగిడి, తనతో వచ్చిన ముఖ్యులను, నూట రెండుమంది నర్తకీ మణులను రాజు ముందుంచి అన్నాడు– “ఓ న్యాయమూర్తీ! నీతో శత్రుత్వం లేని శాతకర్ణి మహరాజు పంపిన కానుకలివి. వారి సందేశం– ‘చేర ప్రభువు విగ్రహ ప్రతిష్ఠాపన కొరకు హిమాలయ పర్వతాలకు వెళ్తున్నారని తెలిసినది. మహరాజుకు ఇష్టమైతే మేమే ఓ ప్రశస్తమైన శిలను అక్కడ నుంచి తీసుకువచ్చి గంగాజలాలతో సంప్రోక్షణ చేసి చేరరాజుకు సమర్పించగలము. ఈ సర్వంసహా భూ ప్రపంచాన్నేల గలిగిన శక్తివంతుడైన రాజుకు జయమగుగాక!”

సముద్రమంత విస్తరించిన సేనావాహిని కలిగి, శత్రురాజులను నిశ్శేషం చేయగలిగిన శక్తిగలవాడైన చేరరాజు సమాధానమిచ్చినాడు– “బలకుమారుడి

పుత్రులైన కనక, విజయులు, మరికొందరు ఉత్తరదేశ ప్రభువులు ఒక విందులో తమిళ ప్రభువుల శక్తిసామర్థ్యాల గురించి నోరు పారవేసుకున్నారు. మృత్యుదేవత హస్తాల్లా ఈ భయంకర సేనావాహిని వారికి బుద్ధిచెప్పగలదు. గౌరవనీయులైన శాతకర్ణి ప్రభువుకు తెలియజేయి– పవిత్ర గంగానది దాటడానికి కావలసిన నావలు, పడవల నసంఖ్యాకంగా సిద్ధం చేసి ఉంచమని" అని పలికి సంజయుడికి సెలవు నిచ్చినాడు.

సంజయుడు వెళ్లిపోయినాక, ప్రస్తుత పాండ్య దేశపు రక్షకుడు పంపిన వేయిమంది ప్రతీహారులు చందన కట్టెలను, సముద్ర ముత్యాల హారాలను తెచ్చి సమర్పించినారు.

తరువాత రాజు ఉత్తరదేశపు రాజులకు శ్రీముఖాలను పంపి తన ప్రయాణం వివిధ మజిలీలతో కొనసాగించి దారిలోని వివిధ ప్రదేశాల నాయకులు తనకు జేజేలు పలుకుచుండగా గంగానదీ తీరాన్ని చేరుకుని, శాతకర్ణి రాజు సిద్ధంగా ఉంచిన పడవలపై పవిత్ర నదిని దాటి నదీ ఉత్తర ఒడ్డుకు చేరుకుని అక్కడ శిబిరాల నేర్పరచి యుద్ధానికి సర్వసన్నద్ధమైనాడు.

ఉత్తరుడు, విచిత్రుడు, రుద్రుడు, భైరవుడు, చిత్రుడు, సింహుడు, ధనుర్ధారుడు, సివేతుడు వంటి ఉత్తర దేశపు రాజులను కూడగట్టి కనక, విజయులు అతడితో కయ్యానికి దిగి– "ఈ దక్షిణదేశపు రాజు పోరాట పటిమ ఏమిటో చూద్దాం" అనుకున్నారు.

ఆకలిగొన్న సింహము ఏనుగుల మందపై లంఘించినట్లు సెంగుట్టవన్ ప్రభువు తన శత్రువులను చూసి ఆనందంగా యుద్ధానికి బయల్దేరినాడు. అడవి పూలదండను దాల్చిన చేర రాజు తన సైన్యాన్ని ఉత్సాహపరచి శత్రువులపైకి పురికొల్పగా సైనికులు చేతిలోని ధ్వజపతాకలు ఒక పెద్ద పందిరిగా సూర్యకాంతిని అడ్డుకున్నవి. యుద్ధభేరీల మోతకు భూమి కంపించగా, చర్మముతో చేసిన ఢంకాలు, శ్వేతశంఖాలు, భేరీలు, బాకాలు, లోహతాళముల ధ్వనులకు, మహాఢంకా చప్పుడుకు ఆకాశమే వణికి మృత్యువులా నోరు తెరిచినట్లై, బలిపీఠాన నరకబడు జీవులను మింగ సిద్ధముగా నున్నట్లగుపించినది. ధనుర్ధారులు, ఈటెగాళ్లు, చర్మపుడాలును పట్టుకున్న పదాతిదళ సైనికులు, రథికులు,

మదగజాలనదిలిస్తున్న మావటీళ్లు, అశ్వికుల పదఘట్టనలకు అదిరిన నేల నుంచి పైకెగసిన దుమ్మూ ధూళితో యుద్ధరంగం నిండిపోయి చూసేవాళ్లను అంధులను గావించింది. యుద్ధపుటేనుగుల మెడలలోని గజగంటలు, సైనిక యోధులు పూరిస్తున్న శంఖారావాలు ఆ సైన్య సమూహము కదులుతున్న చప్పుడు ముందు వెలవెలా బోయాయి.

రెండు సైన్యాలు ఢీకొన్నచోట రణరంగం రక్తపంకిలమైనది. శిరస్సులు, భుజాలు తెగిపడి అన్ని దిక్కులకు చెల్లాచెదురైనాయి. విలుకాండ్ల శరాఘాతాలకు, ఖడ్గధారుల ప్రహారాలకు తలలు విడివడిన మొండేలు, నిప్పుకళ్లున్న పిశాచాల సంగీతానికి నృత్యం చేస్తున్నట్లు కొట్టుకోసాగినాయి. వాటి నుంచి విరజిమ్మిన రక్తం తాగుతూ, మాంసాన్ని తింటూ పిశాచాలు ఆనందింపసాగినాయి.

ఆర్య ప్రభువుల రథికులు, అత్యంత సాహసికులు వాళ్లవాళ్ల రథాలతో సహా శవాల గుట్టలైనారు. యుద్ధపుటేనుగులు, అశ్వాలు చేర రాజు కాలి కడియపు శబ్దాలకు కకావికలైనాయి. తాటి ఆకుల కిరీటాన ఎండిన తెల్ల పూల చెండుతో ఆర్యరాజులకు సాక్షాత్తూ మృత్యుదేవతలా కనిపించి, దున్నపోతు నెక్కిన యముడు ఒక్క దినాన సమస్త ప్రాణులను హరించినట్లు, శత్రు సైన్యాన్ని నాశనం చేసినాడు.

సాహసికులై, శూలాయుధధారులైన కనక, విజయులు, తమ యాభై ఇద్దరు రథికులతో కలిసి తమిళరాజుల నాక్షేపించినవారు నేడు సెంగుట్టవన్ ఆగ్రహాగ్నిలో శలభాల్లా కాలిపోయినారు. చావు నుంచి తప్పించుకోడానికి వారిలో కొందరు తమ జుట్టును జడలుగా వేసుకుని స్త్రీలుగా, మరికొందరు కాషాయ వస్త్రాలను ధరించి మునులుగా, కొందరు ముఖాలకు బూడిదను పులుముకుని సాధువులుగా, కొందరు నెమలీకలు తలపై నిడుకుని సన్యాసులుగా, నర్తకులుగా, వైణికులుగా మారువేషాలతో పారిపోయినారు.

సెంగుట్టవన్ పరాక్రమించి ఏనుగులను ఎద్దుల్ని నరికినట్లు శత్రువులను నరికి చంపినాడు. శత్రు సైనికులను కర్రకంకులను కోసినట్లు కోసినాడు. తన శూలంతో యుద్ధ రంగాన్ని నాగలితో పొలాన్ని దున్నినట్లు దున్నుతుంటే పిశాచాలు ఆనంద నృత్యం చేసాయి. గాజులు గలగలలాడుతున్న దీర్ఘ బాహువులతో అవి రాలిపడిన టెంకాయల నెత్తినట్లు శత్రురాజుల శిరస్సులతో బంతులాడినవి.

యుద్ధ రథమ్ముందు అవి పిశాచనృత్యం చేస్తూ, ఈ యుద్ధాన్ని పాలసముద్ర మంథన సమయాన జరిగిన దేవాసుర మహాసంగ్రామంతో, నీలమేఘశ్యాముడైన రాముడు లంకలో రావణుడితో చేసిన పోరాటంతో సరిపోలుస్తూ ఆ పిశాచాలు వల్లకాటిలో నృత్యం చేసాయి. కిరీటాలున్న శిరాలు పొయ్యిలుగా, పగిలిన కపాలాలు పాత్రలుగా, భుజపు ఎముకలు గరిటెలుగా, అవి తమతోటి పిశాచాలతో విందులు గుడిచినాయి. నాలుకలు చప్పరిస్తూ అవి పరాక్రమవంతుడైన రాజుకు 'విజయోస్తు' అని ముక్తకంఠంతో నినదించాయి.

విజయుడైన సెంగుట్టవన్ ఇలా అన్నాడు– "వేదధర్మాలను పాటించి ప్రజలను సరిగా పాలించే ప్రభువులకు మా సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయి" అని దూతలతో రాజులకు వర్తమానం పంపించినాడు.

ఆ విధంగా ప్రజారక్షకుడైన సెంగుట్టవన్ రాజు తన మంత్రి విల్లవన్ కోదయితో కూడిన విజయసైన్యంతో స్వర్ణ శిఖరాలతో ప్రకాశిస్తున్న హిమాలయ పర్వతాల వద్దకు, పత్ని దేవతా ప్రతిమను తెచ్చుటకై వెళ్లినాడు.

✤✤✤✤✤



# 27. ప్రక్షాళన

హిమలయపు శిల నుంచి పత్నీదేవి విగ్రహాన్ని చెక్కించి, పూజించిన చోట సకాల వర్షములు కురిసి, సకల సౌభాగ్యములు కలుగునన్న వాక్యములు లిఖించి ఆ పవిత్ర విగ్రహాన్ని, యుద్ధానికి కారణమై తన ఖడ్గధాటికి శిరసు వంచిన కనక, విజయుల శిరములపై ఉంచి మోయించుచూ, సెంగుట్టువన్ చక్రవర్తి, భయంకర శూలపాణి, మెరుస్తున్న వీరోచిత కాలికడియం కలవాడు, వెనకటి కాలంలో పద్దెనిమిదేళ్లు పట్టిన దేవాసుర యుద్ధం, పద్దెనిమిది నెలలు పట్టిన రామ రావణ యుద్ధం, పద్దెనిమిది రోజులు పట్టిన మహాభారత యుద్ధం చేసినంత విధ్వంసాన్ని, పద్దెనిమిది ఘడియలలో చేసినాడని ప్రజలు కీర్తించుచుండ, దక్షిణాపథ రాజులతో పోరు కన్న ప్రళయకాలపు మృత్యువే నయమన్న భీతి ఆర్యరాజులలో కలిగించి, తన సేనలతో పుణ్య గంగా తీరాన్ని చేరి, పత్నీదేవి విగ్రహాన్ని పవిత్ర గంగాజలాలతో సంప్రోక్షించి వేదాది శాస్త్రాలలో పేర్కొన్న క్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించినాడు.

ఆ తరువాత నదిని దాటి దక్షిణ తీరాన ఆర్యరాజులు తన కొరకు విశాల మైదానంలో ఏర్పరచిన విడిదిలో రాజోచిత మందిరాలు, మణి మండపములు, పూల పందిరులు, ఫలపుష్ప వాటికలు, కలువపూల తటాకములు, చైత్ర జాతీయ రంగస్థలములు, తదితర భవనములున్న చోట ఆగినాడు.

తన చేతిలో ప్రాణాలు విడిచి స్వర్గానికేగిన రాజులు, యుద్ధరంగాన తలలు భుజాలు వేరవుతున్నా కడపటి క్షణం వరకు పగవారితో యుద్ధం చేసిన పరాక్రమ శాలులు, ధనం కోసం రణానికి దిగినా వెన్నుచూపక పోరాడిన వీరులు, ముక్కలు ముక్కలుగా నరకబడిన శూలపాణులు, ఖడ్గహస్తులు, శాకినీ, ఢాకినీ పిశాచాలు విలయ నృత్యాలు చేస్తూ పొగిడిన ధీశాలులు; ప్రాణాలు యుద్ధ రంగాన విడిచి తమ భార్యలకు సహగమన స్థితిని కల్పించినవారు, వారికి శ్రద్ధాంజలి ఘటించినాడు.

యుద్ధరంగాన రక్తమోడుతూ, గాయాలతో ఉన్నవారు, అంగములు కోల్పోయి ఆర్తనాదాలు చేస్తున్నవారు, రొమ్ముపై కవచాలు తెగి, గాయాలతో గావుకేకలు పెడ్తున్నవారికి బాధోపశమనం గావించి, వారిని చూసి జాలిపడుతున్న

మృత్యుదేవతకు ముదము కూర్చినాడు. తన చేతిలో ప్రాణాలు కోల్పోయిన రాజుల కుమారులకు వారి వారి రాజ్యములనప్పగించి, ఎనలేని ఖ్యాతిని, కవులచే పొగడ్తలను పొందినాడు సెంగుట్టవన్ ప్రభువు.

మృతుల బంధువులకు, సైనికులకు బంగరు తుమ్మిపువ్వును బహుమతిగా ఇచ్చి గౌరవించినాడు. తాటి ఆకుల దండకు తెల్లని అత్రుపాల పుష్పాలను చేర్చి తనను తాను అలంకరించుకుని విజయాన్ని కైవసం చేసుకున్న మహావీరుడిగా సింహాసనంపై ఆసీనుడైనప్పుడు 'మాదలన్' అనే విప్రుడు రాజును దర్శించి దీవించి "మహారాజుకు జయమగును గాక! సముద్ర తీరాన మాధవి పాటతో మొదలైన ఈ కథ కనక, విజయుల శిరస్సులపై నిలిచినదిప్పుడు!" అనగా మహరాజు ప్రశ్నించాడు– "నీ పలుకులలో ఏదో గూఢార్ధమున్నది. వివరింపుము"–

మాదలుడు ఇలా చెప్పాడు– "ప్రసిద్ధ నాట్యకత్తె మాధవి తన ప్రియుడైన కోవలన్‌తో సముద్ర తీరానికేగినప్పుడు వారిమధ్య సరస సల్లాపాలు, జానపద గీతాలుగా మార వాటిలోని అంతరార్ధమును తప్పుగా అర్థం చేసుకున్న కోవలన్ ఆమెను వీడి వెళ్లిపోయినాడు. విధి కృతమును తప్పించుట కెవరితరము? అతడు తన భార్య కన్నగి వద్దకు పోగా అప్పటికే ఆస్థిపాస్థులు కోల్పోయిన కోవలన్ తన భార్య కాలి అందియను అమ్మి వ్యాపారము చేయ సంకల్పించి పాండ్యుల పట్టణమైన మధురై నగరానికి వచ్చినారు. కర్మ పరిపక్వము కాగా అక్కడ కోవలన్ చంపబడినాడు. తన పతికి జరిగిన అన్యాయానికి ఆగ్రహం చెందిన కన్నగి తన ఎడమ వక్షోజాన్ని పెరికి, మధురా నగరాన్ని అగ్నికీలలలో భస్మమొనరించి తమ రాజ్య సరిహద్దులకు చేరినది. ఇప్పుడామె ఉత్తరదేశపు రాజుల తలలపై విగ్రహ రూపాన ఉన్నది కదా! విధి లీలలను వర్ణించ సాధ్యమా?

ప్రభూ! సహనంతో నా మాటలు ఆలకించు. నేను అగస్త్య మహామునికి ప్రీతిపాత్రమైన పొటియిల్ కొండలకు ప్రదక్షిణం చేసి వచ్చాను. కుమారి అగ్రాన సముద్రస్నానం చేసాను. ఇంటికి వెళ్తూ మధ్యదారిలో పాండ్యుల మధురై నగరం దాపుల ఆగాను. కన్నగికి అంతకుముందు ఆశ్రయమిచ్చిన గొల్లవనిత మాదరి– నగరంలో జరిగిన సంగతి తెలుసుకుని గోపగోపికా జనంతో ఇలా అన్నది– 'గోపాలకులారా! కోవలన్ తప్పేమీ చేయలేదు. రాజు చేసిన తప్పు వలన మన

ఆశ్రయంలో ఉన్న కన్నగిని మనం పోగొట్టుకున్నాం. న్యాయమార్గం నుంచి రాజుయొక్క ఛత్రచామరములు, న్యాయదండం దూరంగా తొలగాయి. నాకు తీరని క్షోభను మిగిల్చాయి' అంటూ ఆమె అగ్నిలో దూకింది.

ఆ వార్త విన్న సాధ్వి కవుంతి దుఃఖించింది. 'కోవలన్ చంపబడినాడు. ధర్మ పరిపాలనకు పేరుబడిన పాండ్యరాజు సతీసమేతంగా ప్రానాలు వదిలాడు. మధురానగరం మంటలపాలైంది. కన్నగి కారడవులలోకి వెళ్లిపోయింది. నా సహచరుల కిటువంటి దుస్థితెందుకు వచ్చిందని' విలపిస్తూ ఆమె ప్రాయోపవేశంతో ప్రాణాలు విడిచింది.

ఇవన్నీ నేను విన్నవీ కన్నవీ! దుఃఖభారంతో నేను చోళుల రాజధాని పుగార్ నగరాన్ని చేరుకుని అక్కడున్న ప్రముఖులకు ఈ వార్త తెలిపాను. కోవలుని తండ్రి తన కొడుకు, కోడలికి జరిగిన దుస్థితిని తెలుసుకున్నవాడై తమ సంపదలను దానమిచ్చి, ఇంద్రుని సప్త విహారములలోకి ప్రవేశించి, ఏడు ప్రతిజ్ఞలను పాలించి, స్వర్గలోకాన దిరుగు మూడు వందల మునులవోలె ఈ ప్రపంచాన్ని వదిలి పునర్జన్మ లేని మోక్షమును పొందినాడు. అతడి భార్య తన కుమారుడి మరణవార్తకు తల్లడిల్లి ప్రాణాలు విడిచినది. కన్నగి తండ్రి కూడ తన ధన సంపదలను దానం చేసి అజీవకుని వద్ద దీక్ష తీసుకుని ప్రాయోపవేశ మార్గాన దివికేగినాడు. అతడి భార్య కూడ అతడిననుసరించినది.

ఈ విషయాలు విన్న మాధవి తన తల్లితో అన్నది– 'నేను ఈ గణికవృత్తిని త్యజిస్తున్నాను. నా కుమార్తె మణిమేఖలకు ఈ వృత్తిని అంటనివ్వను. ఆమె బాధ్యత నీది' అని పలికి తన శిరోజములను తొలగింపజేసి, పుణ్యదానములు చేసి బౌద్ధుల ఆరామంలో సన్యాసిగా మారినది.

నేను తెచ్చిన వార్తలు వినుట వలన గదా వారందరు మరణించినారన్న దుఃఖంతో నేను ఇక్కడకు వచ్చి గంగాజలాలలో మునిగి తద్దోష నివారణము గావించుకొంటిని. ఓ రాజా! నీకు జయమగు గాక!"

సెంగుట్టవన్ రాజు అడిగాడు– "పాండ్యుని మరణానంతరం ఆ రాజ్య పరిస్థితి ఏమిటి?"

మాదలుడన్నాడు– "ప్రభూ! ఒక్కరోజులో నీవు తొమ్మండుగురు రాజుల ఛత్రాలను నేలకూల్చి పాండ్యరాజ్య ప్రతిష్ఠను నిలబెట్టి నీ మరది కిలివలనన్ గౌరవాన్ని కాపాడినావు.

పళయన్ ప్రభువు కాపాడే వేపచెట్టును సమూలంగా పెకలించిన ప్రభూ! కొర్కయి ప్రభువు వీరసెలియన్ పాండ్య రాజ్య నూతన ప్రభువై వేయిమంది స్వర్ణకారులను కన్నగికి జరిగిన అన్యాయానికి ప్రతిగా బలియిచ్చినాడు. చంద్ర వంశానికి చెందిన ఆ వీరుడు మధురై నగరానికి ఏలిక. ఏక చక్ర రథానికి ఏడు అశ్వాలనమర్చి పయనించే సూర్యతేజుడతడు. మహాప్రభూ! తమకు జయమగు గాక!"

ఈ విషయాలన్నీ వింటుంటే కాలం గడిచి సూర్యాస్తమయ సమయమైనది. అరుణ కాంతులతో ఆ ప్రదేశమంతా ప్రకాశించసాగినది. అప్పుడే కానవస్తున్న సన్నని నెలవంక. ఆ సుందర దృష్యాన్ని పులకితాంగుడై చూస్తున్న రాజుతో ఆస్థాన జ్యోతిష్కుడిలా అన్నాడు– "మనం 'వంజి' నగరాన్ని విడిచివచ్చి ముప్పై రెండు మాసములయ్యింది! ప్రభూ! విజయోస్తు!"

తరువాత మహరాజు తన సైన్యం విడిది చేసిన ప్రాంతమంతా పరిశీలించి వచ్చి మాదలుడిని పిలిపించి అడిగాడు– "చోళుల రాజ్య పరిస్థితి ఏమిటి?"

మాదలుడు ప్రభువుకు మొక్కి అన్నాడు– "మూడు కోటలను నాశనము చేసిన శూలపాణి చోళప్రభువు న్యాయమార్గము తప్పడు. కుంటుతున్న పావురాన్ని రక్షించడానికి ఆకలిగొన్న గ్రద్దకు తన తొడ నుంచి మాంసం కోసి యిచ్చిన శిబి వంటి వదాన్యుడతడు. సారవంతమైన భూములన్నీ కావేరీ జలాలతో సాగుబడి చేయబడుతుండగా అతడికి, అతడి ప్రజలకు కష్టమావగింతయును లేదు ప్రభూ!" అని పలికిన మాదలుడికి యాభై తులాల బంగారము కానుకగా ఇచ్చి సత్కరించి పంపినాడు మహరాజు.

తన వద్ద బందీలై ఉన్న నూరుమంది ఉత్తరదేశపు రాజులను విడుదల చేసి వారివారి స్వస్థలాలకు పంపినాడు. మునుల వేషంలో పారిపోబోయిన రాజులను, అందచందాలకు ప్రసిద్ధికెక్కిన ఆర్య బృహన్నలా రూపులు– ఎర్రని

బుగ్గలు, నల్లని కురులు, మీననేత్రాలు, ప్రకాశవంతమైన లోలాకులు, వాలుగన్నులు, కెంపుటధరాలు, తెల్లని పలువరుస, వెదురు కాండాల వంటి నునుపైన చేతులు, చిన్ని వక్షోజాలు, మెరుపు తీగెలాంటి సన్నని నడుము, కాలి అందియలున్న చిన్ని పాదాలతో నొప్పు నాట్యకత్తెలు, తమిళ రాజుల శౌర్యాన్ని ఆక్షేపించి బందీలైన కనక విజయులను తన పరివారంతో దక్షిణాధీశులైన తన మిత్రులు చోళ, పాండ్యులకు చూడనంపినాడు.

గంగా తీరాన పద్మాల వద్ద సంచరించు తుమ్మెదల వీణాస్వన ఝుంకారములతో తెల్లవారగా తూర్పు కొండల వద్ద సూర్యుడు ఉదయించినాడు. సెంగుట్టువన్ ప్రభువు తుమ్మిపూల మాలను ధరించి సైనిక శిబిరాన్ని కలయజూసి తన దేశానికి తిరిగిపోవ నిశ్చయించినాడు.

అక్కడ రాజభవనంలో రాజపత్ని తన భర్త విజయవార్తను విని సంతోష పరవశురాలైనది. స్వర్ణఖచిత మణిమయ ద్వారాలు, ముత్యాల సౌరులు, పూల పందిరులు, హంసతూలికాతల్పం, వెలలేని మణులున్నా ఆ మెత్తటి పాన్పుపైన ఆమెకు నిద్రరాలేదు. తన భర్త రాకకోసం ఎదురుచూస్తున్నదామె.

ఆమెను అనునయిస్తూ దాసదాసీజనం గానం చేయసాగినారు– "దుఃఖాన్ని వీడుము తల్లీ! తమ ప్రాణసఖుడు త్వరలో రానున్నాడు"

మరుగుజ్జులు, గూని సేవకులు అన్నారు– "భర్తవియోగంతో వడలిన మోముపై నూతన అందాలు రానిమ్ము తల్లీ! ఏడు వారాల నగలు ధరించి మెరిసిపో!"

గిరిజనుల పాటలు గాలిలో తేలివచ్చాయి– "వేగంగా నడిచే కరిరాజుపై వచ్చే రాజరాజుకు స్వాగతం. పూలమాలలు ధరించి తన గృహానికి వచ్చేస్తున్న ప్రభువుకు సుస్వాగతం"

ఒక్క వడిసెల రాయి దెబ్బతో ఏనుగును పడగొట్టగలిగిన రైతులు, దూరంగా అరణ్య రక్షకులు వెదురు కర్రలతో తేనెపట్టును కొట్టి తేనెను పిండుకు తాగడాన్ని విస్మయంగా చూస్తూ, తమ పొలాల్లో పడ్డ ఏనుగులను గమనించడం లేదు. ఆ పొలాల నుంచి నాగలి పట్టిన రైతుల పాట వినవస్తున్నది.

"ఉత్తరదేశపు రాజుల కుత్తుకలు కోసి
వాళ్ల కోటలను నేలమట్టం చేసి

పొలాలను గాడిదలతో దున్నించి, జొన్నలు విత్తించి
మన ప్రభువు మరలి వస్తున్నాడు. ఓ వృషభాల్లారా!
రేపు మన ప్రభువు పుట్టిన రోజు! మీకు సెలవు!
ఖైదీలకు విడుదల! మనకు పండుగరోజు!"

ఆకాశంలో ఇంద్రధనుస్సు రంగుల్లా అన్నపూర్ణయి నది వద్ద మెట్లు మెరుస్తున్నాయి. కుంకుమ, గంధాల సుగంధ పరిమళాలతో, వర్ణాలతో రంగురంగుల పూలు రమణీయంగా ప్రకాశిస్తున్నాయి.

గోపాలకులు గానం చేస్తున్నారు. పిల్లనగ్రోవిని ఊదుతూ-

"హిమాలయాల నుంచి విలుకాడు ఆవులమందతో వస్తున్నాడు.
గోవులారా! మీరు వాటితో ఆడుకుందురుగాని!"

గోపాలురు తమ సిగలలో నల్లకలువలను ధరించగా
తుమ్మెదలు వారి చుట్టూ ఝుమ్మని నాదం చేస్తూ తిరుగుతున్నవి.
రాజుగారి పసులమందకు నీళ్లు త్రాగిస్తూ వారు పాడినారు.

బెస్తవారు, చేపలవేటగాళ్లు ప్రేమగీతాల నాలపిస్తున్నారు-
"మనరాజు తన సఖి చెంతకు చేరే సమయమిది.
సఖులారా! వారిద్దరి ప్రేమ వర్ధిల్లాలని పాడుదాం!"

సురపొన్న నీడన చేరిన బెస్త వనితలు రమ్యంగా పాడుతూ
ఇసుకను దోసిలితో పట్టి నీటితో కడుగగా
దోసిలి నిండా ముత్యాలు దోబూచులాడినవి.

మహారాణి ఈ గానాల్ని విని తన్మయురాలైనది.
విజయశంఖాలు ధ్వనిస్తుండగా, గజరాజుపైన
పూలఛత్రపు నీడలో కొలువై, మాధవీలత పూలరెమ్మల కిరీటధారియై
ప్రజలు, సేవకులు జయజయధ్వానాలు చేస్తుండగా
రథ, గజ, అశ్వ, పదాతి దళాల కవాతు మధ్య మహీపతి
'వంజి' నగరంలోకి ప్రవేశించినాడు.

❖❖❖❖❖

# 28. విగ్రహ ప్రతిష్ఠ

వెన్నెల కాంతులతో నేలను చల్లబరచు పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తున్న స్వర్ణఛత్రం, శత్రువీరులను గజగజ వణికించిన విజయఖడ్గంతో ప్రపంచాన్ని జయించిన ప్రభువు సెంగుట్టవన్ రాజధాని అయిన పురాతన 'వంజి' పట్టణాన్నిప్పుడు కలువలు విరిసి, భక్తజనులు ప్రార్థించే సాయంసమయము అలుముకున్నది. తెల్లని కాంతులతో వెలిగే దీపాల ముందు పూలు జల్లి బాలికలు, యువతులు ప్రార్థిస్తున్నారు– "మహరాజుకు జయమగుగాక!" అని.

ఇంటికి తిరిగివచ్చిన భర్తలకు విజయహారతులిస్తూ సైనికుల పడతులు తమ కాటుక దిద్దిన కళ్లతో సైగలు చేస్తూ ఉప్పొంగిన వక్షోజాలతో సమాగమానికి ఉవ్విళ్లూరుతున్నారు. కొందరువీరుల రొమ్ములపై ఏనుగు దంతాల గాయాలు, కొందరికి బాణాలు గుచ్చుకున్న మచ్చలు, కొందరికి కత్తిదెబ్బలు వాటిపై ఈనాడు పూలదండలు, స్వర్ణహారాలు, ముత్యాల దండలు మెరుస్తున్నాయి.

"మీనకేతుడి పూలబాణాల్లా నా ప్రియురాలు క్రీగంటి చూపుల్ని
శిరోజాల మబ్బుల చాటున దాగున్న తన చంద్ర వదనం నుంచి వదిలి
నన్ను పిలుస్తున్నది. ఈ సాయంకాలము నాకెంతో మనోహరమైనది"

అనుకుంటున్న ఓ సైనికుడి మోముపై చిరునవ్వు విరిసింది.

చేపల్లా తళతళలాడే కళ్లు, మిలమిలమెరిసిన పలువరుస ఆతడి హృదయాన్ని నొప్పి తెలియని బాణాలతో గుచ్చినట్లైనది. సుందర వదనలు తమ మోమున కస్తూరీ తిలకాలు దిద్దుకుని, భర్తల కౌగిళ్లలో నలిగినప్పుడు విడివడిన పూలదండల నుంచి భ్రమరాలు వెలువడి అద్దాల ముందు ఝుమ్మనుచున్నవి.

మందసాల నుంచి వీణలను తీసి, తీగెలను సవరించి
పలై రాగాన్ని ప్రథమ శృతిలో, కురుంజి రాగాన్ని ద్వితీయంగా
అద్వితీయంగా గానం చేస్తూండగా, సాయంకాలము కదిలి
వెన్నెలలతో శోభిస్తున్న రాత్రి, వేడుకగా ప్రవేశించింది.

ఆ పూర్ణచంద్రుడు 'వంజి' నగర ప్రజలకు
సామంతరాజుల ప్రణామాలందుకుంటున్న
సెంగుట్టవన్ ప్రభువులా కనిపించినాడు.

వెన్నెల కాంతులతో శోభిల్లుతున్న చంద్రశాలలు
పుష్పవాటికలు, మెత్తని నేల ఉన్న రంగస్థలాలు
పూల పానుపులు, మేడపైని విశాలమైన ఆవరణలు
వీటిలో విహరిస్తున్న ప్రేయసీ ప్రియులు
వారిపై ప్రేమదేవుడు విసుర్తున్న పూలబాణాలు
అంతా ప్రేమమయం, శృంగారమయమైన మన్మథ రాజ్యమే!

ఆ నగరం నడిబొడ్డున మేరుపర్వతంలా మెరుస్తున్న రాజప్రాసాదంలో
స్వర్ణమందిర అంతఃపురాన మహారాణి 'వెన్మల్' (వేణమ్మాల్)
తన చెలికత్తెలతో చంద్రదర్శనం చేసుకున్నది.
దీపాలు పట్టుకుని ఆమెతో నడిచిన పరిచారికలు,
వీణా మృదంగ వాయిద్యకారులు, గాయకులు,
చందన, కస్తూరీ లేపనాలను తీసుకువస్తున్న మరుగుజ్జులు
స్త్రీల ఉడుపులలో ఉండి సుగంధ ద్రవ్యాలు తెస్తున్న పేడివారు.
పూలపాన్పులు మోస్తున్న సేవికలు, సువాసనా ద్రవ్యాలు,
అద్దాలు, వస్త్రాలు, పాత్రలు తీసుకుని వెంటరాగా
మహారాణి, మహరాజులు మేడపైని ఆవరణలోకి ప్రవేశించినారు.

అక్కడకు చతుర్వేద పారంగతుడైన 'సక్కియాన్' అనే బ్రాహ్మణుడు న్యాటశాస్త్ర విశారదుడు అక్కడకు విచ్చేసి రాజు రాణి సముఖాన 'కొట్టిక్యైతమ్' అనబడు అర్ధనారీశ్వరుడైన శివుని ప్రళయతాండవ నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. తన పాదముల అందియలు ఘల్లుఘల్లుమనగా, చేతిలోని ఢమరుకపు శబ్దాలకు అనుగుణంగా లయ తప్పకుండా నాట్యం చేస్తూ తన ఎర్రబడిన క్రీగంటి చూపులతో వివిధ భావాలను వెలిబుస్తూ, జడలు గట్టిన శిరోజాలు అలలై ఊగుతుండగా శివరూపాన్ని తెలియబరిచాడు. అర్ధనారీశ్వరుని అర్ధభాగమైన ఉమారూప భాగంలో కాలి అందియ కదలలేదు, కరకంకణము మెదలలేదు. వడ్డాణము వణకలేదు. వక్షోజము కంపించలేదు. శిరస్సుపైని మణులు చెక్కుచెదరలేదు. ముడి వేసిన జడ వదులు కాలేదు. ఆ తాండవ నృత్యానంతరం అతడు ప్రభువును స్తుతించినాడు.

అదే సమయాన ప్రతీహారి ప్రవేశించి విప్రుడు మాదలుడు, నీలన్ మరియు ఇతరుల ప్రవేశానికై అనుజ్ఞను ఇమ్మని రాజును కోరగా రాజు సందర్శకుల గదిలోకి వచ్చినాడు. అప్పుడు 'నీలన్' ఇలా పలికాడు– "విజయ చిహ్నాలైన పూల కిరీటము, కడియము ధరించిన ప్రభూ! అభివాదములు! మేము ఆర్య ప్రభువులను బందీలుగా తీసుకునివెళ్లి, వజ్ర, అవంతి, మగధ రాజులు నిర్మించి ఇచ్చిన సభా మంటపము నందు ఆసీనుడైన సెంపియాన్ ప్రభువు ముందు నిలబెట్టగా అతడు– 'యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడి అననుకూల సమయంలో మామూలు ప్రజల వేషంలో పారిపోతున్న వాళ్లను పట్టి బందీలుగా తీసుకురావడమేమీ గొప్ప మెచ్చుకో తగ్గ విషయం కాదులే!' అన్నాడు.

ఆ తరువాత మేము మధురై నగరానికి వెళ్లి పాండ్యరాజును కలిసాం. అతడు ఆ బందీలను చూసి– 'మునులవేషంలో పారిపోయిన రాజులను బందీలుగా పట్టి తెచ్చుట వింతగా ఉన్నది. అంతకంటే వింత ఏమిటంటే సెంగుట్టవన్ ప్రభువు, ఆర్య ప్రభువులు ఏనుగుల మెడల మీద జయంతుడి దండముగా భావించే కొయ్యను తన శ్వేతఛత్రానికి కర్రగా వాడి, కుయిలాలువమ్ములో ఉమా మహేశ్వరులకు పూజలు చేయడం' అని పాండ్య ప్రభువు పలికాడ"నగానే– సెంగుట్టవన్ వికటాట్టహాసం చేసినాడు. అతడి ఎర్రటి కళ్లు మరింత ఎర్రబడినాయి. అది చూసి విజ్ఞుడైన మాదలుడు లేచి నిలబడి ఇలా అన్నాడు–

"ఓ రాజాధిరాజా! నీ కీర్తి చిరస్థాయిగా నిలుచునుగాక! మిరియాలు పండెడి ప్రసిద్ధ భూమిగా, ఏనుగులుండేటి చోటుగా ఉన్న వియలూరును విధ్వంసం చేసినావు. 'నెరివాయి' వద్ద తొమ్మిది మంది చోళరాజుల పొగరణగించి ప్రారద్రోలినావు. 'ఇడుంబిల్' అను గ్రామంలో విడిది చేసి పడవలలో వెళ్లి పగతురతో సముద్ర యుద్ధాన గెల్చి పేరు పొందినావు. గంగా నదీతీరాన ఆర్య రాజులను మట్టికరిపించినావు. విజయుడివి నీవు! మహా సైన్యానికి నాయకుడివి. రాజసింహమా! కోపాన్ని ఉపశమింపజేసుకుని చిరకాలము జీవింతువుగాక! అనపూర్ణయి నదీ తీరాన ఉన్న ఇసుక రేణువులన్ని అసంఖ్యాక దినాలు కీర్తితో జీవింతువుగాక! నా మాటలు సావధానంగా ఆలకించు. నీవు సింహాసనమధిష్టించి యాభై సంవత్సరాలు దాటింది. ఇన్నాళ్లూ యుద్ధపు హోమాల్నే చేసావు కాని, ఏనాడూ భగవత్ కృపకై త్యాగాలేమీ చేయలేదు. కుడిచేత్తో ఖడ్గాన్ని చేతబట్టి యుద్ధరంగాన అనేక విజయాలను సాధించిన వీరుడా! నీ వంశ ప్రతిష్ఠ సాటిలేనిది. నీ వంశీకుడొకడు సముద్రంలోని కదంబ వృక్షాన్ని సమూలంగా

పెరికివేసాడు. మరొకడు హిమాలయ పర్వత శిఖరంపై వింటి గుర్తును ముద్రించాడు. వేరొకడు బ్రాహ్మణ కవికి స్వర్గానికెళ్లేందుకు సాయపడినాడు. ఇంకొకడు మృత్యుదూతలు తన మాట వినేట్లు చేయగలిగినాడు. ఇంకొక చేర రాజు యవనుల నోడించి కీర్తి పొందినాడు. మరొక రాజు శత్రువును అతడి కోటలోనే ఓడించినాడు. మరొక చేర ప్రభువు అయిరాయి నదిలో, రెండు సముద్రాలలో స్నానమాడినాడు. ఇంకొక ప్రభువు కూడలి భూతాన్ని ఆహ్వానించి మధువు నిచ్చినాడు. అయినా వీరెవ్వరూ మృత్యువును తప్పించుకోలేకపోయినారు. ఈ జీవితం నీటిబుడగ వంటిది. దేహం అశాశ్వతం. తమిళులనాక్షేపించిన ఆర్యరాజుల గతిని నీవు స్వయంగా చూసినావు. భోగభాగ్యాలు అశాశ్వతాలని తెలియుటే మేలుకదా!

ఓ ధర్మప్రభూ!

యవ్వనం ఎల్లకాలం ఉండదని మనం ప్రజలకు చెప్పనవసరంలేదు. తెల్లవెంట్రుకలు వస్తున్న నీ ఉరమందు లక్ష్మీదేవి నివసించుటలేదా! దివ్యాత్మలు మానవ దేహాలలో జన్మించడం, మానవ ఆత్మలు జంతువులలో ప్రవేశించి జంతువులుగా జన్మించడం, జంతుదేహాల్ని వీడిన ఆత్మలు పిశాచాల యందు చేరడం తెలిసిన విషయాలే! ఈ జీవితమే ఒక నాటకరంగస్థలం. మనుషులు నటులు. ఎప్పుడూ ఒకే పాత్ర పోషించుట వల్ల కాదు, పూర్వజన్మ కర్మ ఫలితం జనన మరణాలను నిర్దేశిస్తుంది. ఇవి వృధా భాషణాలు కావు ప్రభూ! నీ కీర్తి ప్రతిష్ఠలతో నీ వంశగౌరవమింకింత ఇనుమడించును గాక! నీ నుంచి బహుమతుల నాశించి నేనీవిధంగా పలుకుటలేదు. ఒక మంచి ఆత్మ, మంచి దేహములో ఉన్నది సాధారణుల మార్గాన చరించడం నాకు నచ్చక నేనిలా మాట్లాడినాను. చతుర్వేద పండితులైన వారి సలహాలు గైకొని దేవతలు మెచ్చిన దారిన ప్రయాణించుట మేలైనది. మంచిపని చేయడానికి రేపటి వరకు ఆగనక్కరలేదు. ఎవరు ఎంత కాలం జీవిస్తారో ఎవరికెరుక? ప్రభూ! నిఖిల భూపతులు నీ పాదములపై బడి శరణు వేడ నీవూ నీ రాణితో చిరకాలము సుఖింతువుగాక!"

అతడి మాటలు రాజు చెవులలో జ్ఞానవిత్తనములను చల్లగా అవి సకాలమందు మొలకలెత్తినవి. సరైన ఫలాన్ని పొందుటకు నిశ్చయించుకున్న రాజు వేదవిదులైన విప్రులను రావించి మాదలుడు చెప్పిన విధంగా పుణ్య

కార్యములను చేయబూనినాడు. తాను బంధించి తెచ్చిన ఆర్య ప్రభువులను వంజి నగరానికావల సరస్సులు, పూలతోటలున్న 'వెలవిక్కొ' భవనమందుంచి వారిని రాచమర్యాదలతో చూడమని విల్లవన్ కొత్తయి మంత్రిని ఆదేశించి, క్రతువు ముగిసిన పిమ్మట వారిని వారివారి దేశాలకు పంపుటకు వలయు ఏర్పాట్లు చేసినాడు.

'అలుంపిల్వెల్'కు, గణకులకు, అధికారులకు చెరసాలలోని ఖైదీలను విడుదల చేయమని ఆజ్ఞాపించి, ప్రజలు పన్నులు చెల్లించనవసరం లేదని చాటింపు వేయించినాడు.

✤✤✤✤✤

"రాజు అధర్మమార్గాన నడిస్తే అక్కడి స్త్రీల శీలానికి విలువ ఉండదని" చోళరాజు గ్రహించేలా కన్నగి జీవితం ఒక పాఠమయ్యింది.

"న్యాయదండము వంపు తిరిగితే రాజు జీవించడు" అన్న సత్యాన్ని పాండ్యులు అర్థం చేసుకున్నారు.

"ప్రతిజ్ఞలు నెరవేరేంత వరకు రాజుల ఆగ్రహజ్వాల ఉపశమించదని" ఉత్తరదేశ ప్రభువులను ఓడించిన చేర ప్రభువు తెలుసుకున్నాడు.

అంతులేని కోపంతో కన్నగి తన ఎడమ రొమ్మును పెరికి, అగ్ని చక్రంగా మార్చి మధురైనగరాన్ని భస్మీపటలం గావించి, చేర దేశ సరిహద్దులలోని పర్వత ప్రాంతంలో బంగరు వెంగైపూల చెట్టునీడన నిలబడింది. బ్రాహ్మణులు, రాజ పురోహితులు, జ్యోతిష్కులు, శిల్పుల సాయంతో అక్కడ ఒక దేవాలయాన్ని వాస్తు శాస్త్ర పద్ధతిలో నిర్మించి దానిలో 'పత్ని'గా పేరుగాంచిన కన్నగి విగ్రహాన్ని హిమాలయ పర్వత శిల నుంచి చెక్కించి తెచ్చి, పవిత్ర గంగాజలాల్లో సంప్రోక్షణ గావించి, ఆదిదేవుళ్లైన ఉమామహేశ్వరులకు మొక్కి ఇక్కడకు తీసుకునివచ్చి దేవాలయ గర్భగుడిలో ప్రతిష్ఠించినారు. అనేక వెలలేని వస్త్రాభరణాలతో అలంకరించి పూలతో అర్చించి, దేవాలయ ముఖద్వారమున రక్షక దేవతల నుంచినారు. రాజసింహుడైన చేర ప్రభువు పత్ని దేవతకు మొక్కి ఆజ్ఞను జారీ చేసినాడు– "ప్రతి దినమూ పత్ని దేవతకు పూజలు, సంబరాలు జరుగును గాక! ఉత్సవములు, హోమములు, దానములు, పూజలు ప్రతి నిత్యమూ జరుగును గాక!"

✤✤✤✤✤

# 29. స్తుతి

కుమారి నుంచి హిమాలయాల వరకు ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించిన సెరలవన్ కుమారుడు సెంగుట్టవన్– అతడి తల్లి సూర్యవంశపు చోళరాజు పుత్రిక.

సెంగుట్టవన్ కొంగు వీరులనోడించి గంగా తీరం వరకు తరిమి 'వంజి'కి తిరిగి వచ్చి కోపం తగ్గనివాడుగా ఉన్నపుడు, ఉత్తరదేశం నుంచి వచ్చిన మునులు, అక్కడి రాజులు కొందరు ఒక రాకుమార్తె వివాహ సందర్భంగా జరిగిన విందులో తమిళ దేశప్రభువుల శౌర్యాన్ని తక్కువచేసి మాట్లాడిన విషయాన్ని చెప్పినారు. వారేలనో హిమాలయ శిఖరాలపై విల్లు, వ్యాఘ్రము, మత్స్యముల చిహ్నాలు ముద్రించి ఉండడాన్ని మరచి ప్రగల్భాలు పలుకుతూ– 'మనలాంటి కిరీటధారులైన వీరులు మరెక్కడా లేరు' అన్నారు.

కన్నగికి శిలను తెచ్చుటకై వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని సెంగుట్టవన్ ఉత్తరదేశంపై దండయాత్ర చేసి అక్కడి రాజుల నోడించి బందీలుగా పట్టుకున్నాడు. గంగా తీరాన విడిది చేసి స్తపతులతో హిమాలయ పర్వతాల నుంచి ప్రశస్తమైన శిలను ఏరి కన్నగి రూపాన్ని విగ్రహంగా మలిచి, గంగానదీ పవిత్ర జలాల్లో స్థాపన, సంప్రోక్షణలు చేసి దానిని కనక విజయులనే రాజుల తలలపై మోయించి వంజి నగరానికి తీసుకుని వచ్చినాడు. అప్పటికి గాని అతడి కోపం చల్లారలేదు. తన వక్షోజాన్ని విసిరి మధురై నగరాన్ని అగ్నికీలల్లో భస్మం చేసిన కన్నగికి పత్నీదేవి పేరిట ఆలయాన్ని నిర్మించగా రాజులు ప్రజలు ఆమెకు పూజలు చేసి కానుకలు సమర్పించినారు.

మాదలుడి వలన కన్నగి దుఃఖాన్ని పాండ్యరాజ దంపతుల మరణాన్ని తెలుసుకున్న కోవలన్ తండ్రి 'మగట్టువన్' సన్యాసిగా మారినాడు.

కన్నగి పెంపుడు తల్లి, స్నేహితురాలు, 'దేవంతి' దుఃఖంతో మధురై నగరానికి వెళ్లి అక్కడ మాదరి కుమార్తె 'అయ్యయి'ని కలిసి ఆమె తల్లి కన్నగి మరణవార్తను విని అగ్నిప్రవేశం చేసిందన్న సంగతి తెలుసుకున్నారు. వైయయి నదీ తీరాన నడుస్తూ వారు అయ్యయితో పాటు కొండను దర్శించి, సెంగుట్టవన్ రాజప్రాసాదానికి చేరుకున్నపుడు రాజుతో కన్నగి గురించి మాట్లాడినారు.

**2**

నేను ఆ దేవత స్నేహితురాలిని. దేవంతిని.
ముగ్గురు ప్రభువులు పూజించే ఆ పునీత పత్నీదేవత!
ఉత్తర హిమాలయాల్లో పుట్టి గంగాజలాల్లో స్నానమాడి
తన భుజాలకు బంగరు ఆభరణాలు ధరించిన దేవతకు,
చోళుల రాజ్యాన పుట్టిన ఆ కన్నగికి నేను నెచ్చెలిని!

**3**

నేను ఆ దేవత పెంపుడు తల్లిని.
తన భర్తను ఆకర్షించిన మాధవినామేమీ అనలేదు.
కోవలన్ తన వద్దకు రాగానే అతడిని అనుసరించింది.
నీటిచుక్క దొరకని ఘోరారణ్యంలో కష్టాలు పడింది.
నేను పుగార్ నగరవాసిని. కన్నగి పెంపుడు తల్లిని!

**4**

నేను ఆ దేవత ప్రియ మిత్రురాలిని.
తాను వెళ్లేప్పుడు కన్నతల్లితో, పెంపుడు తల్లితో
కనీసం నాతో ఒక్క ముక్కైనా చెప్పలేదా దేవత!
బాధ్యత గల భార్యగా భర్తననుసరించింది.
నేను పూంపుహార్ నగరవాసిని. కన్నగి మిత్రురాలిని.

**5**

**(కన్నగి విగ్రహం ముందు దేవంతి దుఃఖించుట)**

నేనే తపస్సు చేయలేదు.
నీవు కన్న కల స్వభావమేమిటో నాకు తెలియలేదు.
నేనేం తప్పు చేసాను? నీవు నీ రొమ్మును పెరికి
మధురై నగరంపై విసిరి దుఃఖిస్తున్న దృశ్యాన్ని తలుచుకుని
నీ తల్లి చనిపోయింది. నీ అత్తగారూ మరణించింది.
ఓ దేవతా! నీకు తెలుసా ఈ సంగతి?

## 6

**(పెంపుడు తల్లి దుఃఖించుట)**

స్వర్ణకారుడి మోసానికి బలైన కోవలన్ గురించి,
తాను చేసిన అన్యాయానికి తనువు చాలించిన రాజు గురించి
విన్న కోవలన్ తండ్రి మగట్టువన్ సన్యసించాడు.
మనైకన్ కూడా అతడి బాటనే వెళ్లినాడు.
ఓ తల్లీ! నా కూతురా! నీకు తెలుసా ఈ సంగతి?

## 7

**(మిత్రురాలి దుఃఖం)**

మాధవికి తన ప్రియుడి మరణం, నీ దుఃఖం తెలిసింది.
ప్రజల ఆగ్రహం తనపైనున్నదని గ్రహించింది.
సన్యాసినియై బౌద్ధ భిక్షుకిగా మారింది.
తన కుమార్తె మణిమేఖలను సన్యాసినిగా చేసింది.
ఓ మిత్రురాలా! నీకు తెలుసా ఈ సంగతి?

## 8

**(దేవంతి)**

ఈ కన్య అయ్యాయి నీకు ఆశ్రయమిచ్చిన మాదరి కూతురు.
నిన్ను కాపాడుకోలేనందుకామె దుఃఖించింది.
కవుంతి సాధ్వికేమి చెప్పాలో తెలీక
అగ్నిని కౌగలించుకున్నదా పెద్దమ్మ!
ఓ దేవతా! నీకు తెలుసా ఈ సంగతి?

## 9

**(సెంగుట్టవన్)**

ఏమిటది? ఏమిటిది? ఏమిటిది?
ఏమిటీ విచిత్రం? ఏమిటీ దివ్యదర్శనం?
స్వర్ణమంజీరాలతో, బంగరు గాజులతో
తాటంకములతో, మణిమయ ఆభరణాలతో
మెరపు తీగెలాంటి దేవత సాక్షాత్కారం!

## 10

**(కన్నగి)**

పాండ్యరాజు దోషము నశించినది.
అతడు దేవతల రాజుకు అతిథి ఇప్పుడు.
నేనాతడి కుమార్తెను నేను వెళ్లి 'వెన్వేలన్'
కొండపై ఆడుకుంటాను. మీరూ రండి అక్కడకు.

## 11

**(వంజి నగరపు బాలికలు)**

సన్నని తీగె వంటి నడుము గల వంజీ నగర కన్యలారా!
పాదాలకు పారాణితో తడబడుతూ నడుస్తున్నారా?
మధురై నగరంపై తన వక్షోజాన్ని విసిరి భస్మం చేసి,
తన కాలి అందియతో ఒక రాజు జీవితాన్ని తలకిందులు చేసిన
తెన్నవాన్ కుమార్తె గురించి గానం చేద్దాం!
ఆమె మన దేశానికి వచ్చింది. ప్రభువుచే స్తుతించబడింది.
'న్యాయదండం వంపు తిరిగితే పాండ్యరాజు మరణిస్తాడ'న్నది.
మనం ఆ పత్నిదేవతను స్తుతిద్దాం!
పాండ్య రాజ కుమార్తెను ప్రశంసిద్దాం!

## 12

**(బాలికల పాట)**

మనం ఆమె మన రాజకుమార్తె అని అన్నాం.
ఆమె వైయయి రాకుమారినని పలికింది.
వనవన్‌ను మనం స్తుతిద్దాం.
వైయయి రాజును దేవతలు పొగడగా ఆనందిద్దాం!

## 13

ఒక స్త్రీ కన్నీళ్లలో కాలి తన జీవితాన్ని కోల్పోయిన
పాండ్యరాజును పొగడుదాం!
అతడు తన కర్మఫలాన్ని అనుభవించినాడు.
మధురైను పాలించిన రాజుల వంశావళి మరల పునరుద్ధరించబడునుగాక!

**14**

ఉత్తరదేశపు రాజుల తలలపై విగ్రహాన్నుంచి
హిమాలయాల నుంచి 'వంజి' నగరానికి
తరలించిన మన రాజుకు జయమగుగాక!
అతని కీర్తి ఆచంద్రతారార్కము వెలుగును గాక!

**15**

మనం కావేరీ ప్రాంత ప్రభువును స్తుతిద్దాం!
పూబోడులారా! పుకార్‌ను ఘనంగా పొగడుదాం!

**17**

అమ్మనయి! ఎవరే చతుస్సంబోధీ వలయ భూపాలకుడు?
దేవతల ఎత్తైన దుర్గ సంరక్షకుడు, ఎవరమ్మా ఆ ప్రభువు?
అమ్మనయి! చోళప్రభువే ఆ వీరుడు, అతడే
ఆకాశం నుంచి వేలాడుతున్న త్రిదుర్గ ధ్వంసకుడు!
అమ్మనయి! మనం చోళుల నగరం పుకార్‌ను పొగడుదాం.

**18**

అమ్మనయి! ఎవరే ఆ విజయ ప్రభువు?
పావురాన్ని రక్షించ తన తొడ మాంసమిచ్చేందుకు
తులాభారం తూగిన మహాదూత ఎవ్వడు?
అమ్మనయి! అతడే ఒక గోవు కోసం
న్యాయాన్ని రక్షించెను. పావురం కోసం తన మాంసమునిచ్చెను.
అమ్మనయి! మనం ఆ ప్రభువు నగరం పుకార్‌ను పొగడుదాం!

**19**

అమ్మనయి! ఎవరే ఆ బలశాలి?
మంచుకొండలపై తన వ్యాఘ్ర చిహ్నాన్ని ముద్రించ
అష్టదిగ్గజాలు కన్నార్పక అట్టె నిలబడి చూసె నెవ్వడాతడు?
అమ్మనయి! హిమపర్వతాలపై వ్యాఘ్ర చిహ్నాన్ని ముద్రించి
అష్టదిక్కులను ఏకఛత్రపు ఛాయ నేలినవాడు ఆ ప్రభువు!
అమ్మనయి! మనం ఆ రాచనగరం పుకార్‌ను పొగడుదాం!

## 20

అమ్మనయి! ఎవరే ఆ మహారాజు?
అందమైన స్త్రీలందరు అరచేతిలో బంతులతో
ఆనందపారవశ్యాన తమ ఇళ్లలో గానమెందుకు చేసిరమ్మ?
అమ్మనయి! అందమైన స్త్రీలందరు అరచేతిలో బంతులను
తమ వక్షోజాలుగ భావించి ఆ రాజు పొందుకై అశ్రులు చాస్తున్నారు.
అమ్మనయి! మనం ఆ రాచపట్టణం పుకార్‌ను స్తుతిద్దాం!

## 21

**(బంతిపాట) (కందుకవరి)**

బంగరు తీగెలా మెరుస్తూ, స్వర్ణహారాన్ని ధరించిన కన్యామణీ!
మన మణిమయ వడ్డాణాల మెరుపు కాంతుల మధ్య
పరుగెత్తుతూ మనం బంతాట ఆడుదాం! పాడుదాం!
'దక్షిణదేశ ప్రభువు చిరకాలం జీవించును గాక!
తెన్నవాన్‌కు జయం!' అంటూ బంతిని విసుర్తూ-
'ఇంద్రమాలను తన రొమ్ముపై ధరించిన పాండ్యవీరునికి జయం!
జయోస్తు! విజయోస్తు! అని గానం చేద్దాం!'

## 22

మనం ముందుకు, వెనక్కు, అన్ని దిక్కులా పరిగెడదాం!
మెరుపు భూమిని తాకినట్లు బంతిని వేగంగా తాకుదాం!
'దక్షిణదేశ ప్రభువు చిరకాలం జీవించునుగాక!
తెన్నవాన్‌కు జయం!- అంటూ బంతిని విసుర్తూ-
'ఇంద్రమాలను తన వక్షాన ధరించిన పాండ్యవీరునికి జయం!
జయోస్తు! విజయోస్తు! అని గానం చేద్దాం!

## 23

మనం బంతిని విసురుదాం! మన చేతుల్లో నిలవదది!
నేలను విడిచి ఆకాశాన కెగరదది. మనం దానిని విసుర్తూ
'దక్షిణదేశ ప్రభువు చిరకాలం జీవించునుగాక!

తెన్నవాన్‌కు జయం! అంటూ బంతిని విసుర్తూ–
'ఇంద్రమాలను తన వక్షాన ధరించిన పాండ్యవీరునికి జయం!
జయోస్తు! విజయోస్తు! అని గానం చేద్దాం!

**24**

**(ఊయలపాట) (ఊకమ్)**

మనం 'అయ్యయి'ని ఊయలలో కూర్చోబెట్టి ఊపుదాం!
చేతులు చాచి లయగా అడుగులేస్తూ ఊపుదాం!
వంగిన తాటి ఆకుల్లాంటి కళ్లను అందంగా తిప్పుతూ మనం
కదంబవృక్షాన్ని పెల్లగించిన కదన శూరుడిని కీర్తిద్దాం!
మనం ఊయల లూగుతూ చెలీ, ప్రభు విల్లును పొగడుదాం!
వద్దా చెలీ! మనం ఊయల లూగవద్దా? పదండి! ఊయలలూగుదాం!

**25**

మన పొడుగాటి నల్లని శిరోజాలు ఎగిసిపడ్తుండగా
వద్దా చెలీ! మనం ఊయలలూగవద్దా? పదండి! ఊయలలూగుదాం!
చేర ప్రభువు 'పొరైయాన్' కీర్తిని పొగడుదాం!
పాండవ కౌరవ యుద్ధ సమయాన అంతులేని ఆహారాన్నంపిన
చేరప్రభువు పొరైయాన్ కీర్తిని పొగడుదాం!
వద్దా చెలీ! మనం ఊయలలూగవద్దా? పదండి! ఊయలలూగుదాం!
మనం ఊయలలూగుతూ కదంబ వృక్షాన్ని కదిలించిన వీరుడిని స్తుతిద్దాం!

**26**

మన సన్నని నడుమును వంచుతూ ఊయలలూగవద్దా చెలీ?
రాజులకే రాజైన మన మహరాజు కీర్తిని గానం చేస్తూ ఊగుదాం!
ఈ భూమికి రక్షకులు, విల్లు, వ్యాఘ్ర, మత్స్య ముద్రాంకితులు
విచిత్ర భాషా వర్తులైన యవనుల పొలాలనాక్రమించినవారు
కుమారి అగ్రపు రాతికొండల వరకు కొలువైనవారు,
మన రాజుల కీర్తిని ఘనంగా గానం చేస్తూ ఊయలలూగవద్దా, చెలీ?
మనం ఊయలలూగుతూ ఆ వీరుల కీర్తిని వేనోళ్ల పొగుడుదాం!

## 27

### (రోకలి దంపుడు పాట) (వళ్లైపట్టు)

చెరకు గడలు రోకళ్లుగ పుకార్ నగరస్త్రీలు
దంచుతారు ముత్యాలను గంగరావి చెట్టునీడ!
ముత్యాలను దంచుతూ మురిపెంగా పాడుతారు,
సెంపియాన్ శౌర్యాన్ని ప్రస్తుతిస్తూ ప్రతిరోజూ!

## 28

ఎర్రెర్రటి పగడాలను రోకళ్లుగ మధురస్త్రీలు,
దంచుతారు ముత్యాలను కవులెల్లరు నుతింపగ!
ముత్యాలను దంచుతూ మురిపెంగా పాడుతారు,
పాండ్యుని శౌర్యాన్ని ప్రస్తుతిస్తూ ప్రతిరోజూ!

## 29

ఏనుగు దంతాలను రోకళ్లుగ వంజి స్త్రీలు
దంచుతారు ముత్యాలను చందనపురోళ్లలోన!
ముత్యాలను దంచుతూ మురిపెంగా పాడుతారు,
చేర ప్రభువు శౌర్యాన్ని ప్రస్తుతిస్తూ ప్రతిరోజూ!

## 30

గొప్ప విల్లు కలిగిన పొరైయన్ పాదములకు
ప్రణమిల్లి మొక్కని రాజులతని మన్ననలను
రక్షణను పొందలేరు, ఏనాటికి పొందలేరు!
కన్నగికి తండ్రిగా, ఆ వీరపత్ని రక్షకుడిగ
ఆ దేవతకు గుడికట్టి ఆశీస్సులకోరగా
ఆ పత్నిదేవత ఆదరంగ పలికినది–
'శూరుడు సెంగుట్టవన్ చిరకాలం జీవించును గాక!'

❖❖❖❖❖

# 30. వరప్రసాదం

ఉత్తరదేశాన్ని జయించిన చేర ప్రభువు కన్నగి దివ్యరూపాన్ని చూసి మొక్కినాడు.

ఆ తరువాత దేవంతిని అడిగాడు– "నీవు మణిమేఖల గురించి విలపిస్తూ చెప్పావుగదా? ఎవరామె? ఎందుకామె సన్యసించింది?"

దేవంతి రాజును ఆశీర్వదించి చెప్పింది. పుగార్ నగరపు నాట్యగత్తెల కుటుంబాలలో అత్యంత సుందరమైనది, నల్లని శిరోజాలను అయిదు పేటలుగా జడ వేసుకుని సొగసుగా కనిపించునది, చల్లని కనుల చివరలు ఎర్రగా ఉండి మీనములను తలపించునది, కెంపు అధరాల మధ్య వెన్నెలలు విరజిమ్ము పలువరుస కలిగినది, వక్షోజ సంపద అప్పుడప్పుడే పెరుగుతున్నదీ, వెడల్పాటి ఉరము, గుండ్రటి భుజాలు, సన్నని నడుము వంగితే విరిగిపోవునేమోనన్న భ్రమను కలిగించునది, గుండ్రటి నునుపైన తొడలు కలిగినది, సుకుమారమైన పాదములు కలిగిన ఆ బాలిక అందరి నోళ్లలోను చర్చనీయాంశమైనది. కులీనులెవ్వరూ ఆమెను గణికగా భావింపలేదు. ఎందుకంటే ఆమె నాట్యాంగనగా శిక్షణను పొందలేదు.

మాధవి తల్లి చిత్రావతి 'నా మనమరాలికి నేనేమి చేయగలను?' అని అడుగగా మాధవి వెంటనే మణిమేఖలను పిలిచి ఆమె పూలతో నిండిన నల్లని శిరోజాలను కత్తిరించగా, ఆ దృశ్యాన్ని చూసిన మన్మధుడు కోపంతో తన పంచ పుష్ప బాణాలను, విల్లును నేలపై పడవేసినాడు. ఆ తరువాత మాధవి బౌద్ధ సన్యాసినిగా మారినది. రాజు, పురప్రజలు తమ నగరపు ప్రసిద్ధ మణి సముద్రము పాలాయెనని చింతించగా బౌద్ధసన్యాసి వారితో– 'అది ఆమె మనోభీష్టము. చిన్నవయసులోనే సన్యసించుటకు ఆమె నిశ్చయించుకున్నది'– అని తెలిపి వారిని సమాధానపరచినాడు"

అలా పలికిన దేవంతికి పూనకం వచ్చినది. ఆ పూనకస్థితిలో తన జడలను విదిల్చి, శిరోజాలూగుచుండగా, కనుబొమలు కంపించ, పెదాలను నొక్కిపట్టి, అప్పుడప్పుడూ చిరునవ్వులు వెలయిస్తూ, అసాధరణమైన భాషలో గలగల మాట్లాడుతుండగా ఆమె ముఖముపై స్వేదము ధారలుగా కార, కళ్లు

ఎర్రబడి, చేతులు ఊపుతూ ఆమె లేచి నిలబడింది. ఆ మగత స్థితిలోనే ఆమె కురుంజి పూలు పూసే కొండలకు ప్రభువైన చేర రాజునుద్దేశించి ఇలా పలికింది–

"ఇక్కడకు వచ్చిన అందమైన, అణకువగల, సత్ప్రవర్తన గల స్త్రీలలో రత్తన్‌సెట్టి దంపతుల కవల పిల్లలున్నారు. సెటక్కుటుంబి చిన్నకుమార్తె ఉన్నది. సెటక్కుటుంబి స్వర్ణమందిరంలోని శేషతల్పంపై శయనించిన విష్ణుమూర్తి భక్తుడు. మహంకాళీదేవి గుడి పక్కన ఆకాశాన్నంటే కొండ ఉన్నది. దాని ఎర్రటి శిఖరంపై విల్లుబద్దలా వంపున్న శిల ఉన్నది. చుట్టూ అనేక కొలనులు, నీటి ఊటలున్నాయి. వాటిలో ఆవగింజల వంటి తెల్లటి రాళ్లు, పగడాల వంటి ఎర్రరాళ్లున్నాయి. ఆ కొలనులో స్నానం చేసినవారికి పూర్వజన్మ జ్ఞానము వస్తుంది. నేను ఆ నీటిని తెచ్చి నీకు ఇచ్చాను. ఓ మాదలుడా? నీ సంచిలోని కమండలములో ఆ నీరున్నది కదా! ఆ నీటి ప్రభావము సూర్యచంద్రులున్నంత వరకు తగ్గిపోదు. నీవు ఆ నీటిని ఈ ముగ్గురు బాలికలపై జల్లుము. వారు తమ పూర్వజన్మల గురించి చెప్పగలరు. నేను పాషండుడను దేవుడను. ఈ స్త్రీపై పూని మీకీ విషయాన్ని తెలియబరుస్తున్నాను"–

సెంగుట్టవన్ ప్రభువు ఆశ్చర్యమునకు అంతేలేదు. అప్పుడు మాదలుడు ఇలా అన్నాడు–

"ప్రభూ! ఈ వృత్తాంతాన్ని విను. ఒకప్పుడు మాలతి అనే స్త్రీ తన సవతి బిడ్డకు పాలు తాగించింది. పాలు గొంతుకడ్డంబడి ఆ బాలుడు మరణించినాడు. ఆమె దుఃఖముతో మరణించుటకు సిద్ధపడగా పాషండుడు ఆమెపై దయతలచి ఆ బిడ్డ దేహాన ప్రవేశించి ఆమెకు ఆనందాన్ని కలిగించినాడు. ఆ బాలుడే యుక్తవయసులో దేవంతిని పెండ్లాడి ఎనిమిదేండ్లు కాపురము చేసి, తన దివ్య రూపమునామెకు చూపించి తన దేవాలయమునకు రమ్మని పలికి అదృశ్యమైనాడు. నేను మహాంకాళీ దేవాలయమున ఉన్నపుడు ఈ దేవుడు బ్రాహ్మణ రూపంలో వచ్చి నాకు ఈ సంచిని, కమండల పాత్రను ఇచ్చి భద్రపరచమని వెళ్లినాడు. ఇప్పుడు ఈ స్త్రీ నావేశించి కమండలములోని కోనేటి జలమును ఆ బాలికలపై జల్లమని ఆజ్ఞాపించుచున్నాడు. కావున ప్రభూ! ఆ విధంగా చేసి మనం నిజాన్ని తెలుసుకొందాము"

ఆ పవిత్ర జలాలను చల్లగానే ఆ బాలికలకు పూర్వజన్మ జ్ఞానము వచ్చినది. వారిలో ఒక బాలిక గతజన్మలో కన్నగి తల్లి ఇలా అన్నది– "నా

కూతురా! నీ భర్త నిన్ను విడిచినప్పుడు నేను నీపై జాలిపడినాను. అవేమీ పట్టించుకోకుండా నీవు మధురై నగరానికివెళ్లి పలు కష్టాలు పడినావు. నీవు తిరిగి వచ్చి మా దుఃఖాన్ని తొలగించవా?"

మరొక బాలిక రూపంలో ఉన్న కోవలన్ తల్లి అన్నది– "అర్ధరాత్రి నా కోడలితో నీవు వెళ్లి పోయినావు. నా దుఃఖాన్ని ఉపశమింప చేయడానికి నీవు తిరిగి రాలేవా! కుమారా!"

మూడవ బాలిక రూపంలో ఉన్న మాదరి అన్నది– "వరదనీటితో పొంగుతున్న వైయె నదికి నమస్కరించి నేను వచ్చేసరికి నీవు లేవు? తల్లీ! కన్నగీ! నీవిప్పుడెక్కడున్నావు?"

ఆ బాలికలు తమ లేత పెదవులతో పెద్దవాళ్లు మాట్లాడినట్లు మాట్లాడినారు. మళ్లీమళ్లీ దుఃఖిస్తూ కన్నగి, కోవలన్‌లను తలుస్తూ వెక్కివెక్కి ఏడ్చినారు. ఆ దృశ్యాన్ని చూసిన చేర ప్రభువు యజ్ఞోపవీతుడైన మాదలుడి వేపు పరికించగా మాదలుడిట్లా అన్నాడు– "ఓ రాజాధిరాజా! ఈ ముగ్గురు స్త్రీలు గతజన్మలో కోవలన్ పత్ని కన్నగికి ఆత్మీయులు. కోవలన్ ఒకనాడు పెద్దపెద్ద దంతాలున్న ఏనుగుతో పోరాడి ఓ బ్రాహ్మణుడిని రక్షించినాడు. అందుచేత అతడు స్వర్గానికి వెళ్లగలిగినాడు. ఆ ముగ్గురు స్త్రీలకు ఇంకా అర్హత లేనందున వారు కన్నగి, కోవలన్‌లతో మోక్షప్రాప్తి పొందక మరోజన్మ నెత్తినారు. కన్నగిపై ప్రేమ వలన వారు (అత్త, తల్లి) రత్తన్‌సెట్టికి కవలలుగా, సెటక్కుటుంబి చిన్నకుమార్తెగా మాదరి– వంజి దేశంలో జన్మించినారు. సత్కార్యాలు చేసినవారు స్వర్గానికి వెళ్లడం, ఇంకా బంధాలున్నవారు ఈ లోకంలో జన్మించడం సహజమే కదా! మంచీ చెడులకు వాటివాటి ఫలితాలున్నవి. పుట్టినవారు మరణిస్తారు. మరణించినవారు పునర్జన్మల నెత్తుతారు. ప్రభూ! నీవు శివానుగ్రహం చేత జన్మించినవాడివి. అందుకే రాజలోకంలో ప్రసిద్ధికెక్కినావు. అరచేతిలోని వస్తువును చూసినట్లు నీవు మునుల సత్కార్య ఫలితాలను గమనించి ఉన్నావు. సద్గుణశీలివైన ప్రభూ! నీకీర్తి చిరస్థాయిగా నిలిచి ఉండును గాక!"

మాదలుడి పలుకులు విన్న మహారాజు ఆనందపరవశుడై పత్ని దేవాలయమునకు ధన కనక వస్తు వాహనములు, భూరి విరాళములు, మాన్యములు సమర్పించినాడు. ఏ స్త్రీ తన ఎడమ వక్షోజాన్ని పెరికి మధురై నగరాన్ని భస్మీపటలం చేసి, కవులతో కీర్తించబడిందో ఆ దేవత గుడి దగ్గర

నిత్య పూజాదికములు, సంబురాలు జరపాలని ప్రభువు ఆజ్ఞాపించినాడు. దేవంతికి ఆలయ నిర్వహణ, పూలతో అర్చన పూజలు చేయవలసిన బాధ్యతలను అప్పగించినాడు.

చేర చక్రవర్తి ముమ్మారు ఆలయ ప్రదక్షిణ చేసి దేవత ముందు నిలబడి మొక్కినాడు. తరువాత పత్ని విగ్రహాన్ని హిమాలయ పర్వతాల వద్ద నుండి వంజి నగరానికి తమ తలలపై మోసుకువచ్చిన ఆర్యరాజులను విడుదల చేసినాడు. పశ్చిమదేశపు 'కొంగు' ప్రభువు, మాళ్వరాజు, లంకాధీశుడు గజబాహు, ఆర్యరాజులు ఆ దేవతకు మొక్కినారు. "మా దేశాలలో కూడ అడుగుబెట్టి మమ్మల్ని చల్లగా కావుము తల్లీ!" అని ప్రార్థించినారు.

ఆకాశవాణి పలికినది– "మీ కోరిక నెరవేరును గాక!"

అప్పుడు సెంగుట్టువన్ మరియు ఇతర రాజులు తమ తమ సైన్యాలతో సహా పత్నిదేవతకు మొక్కి మోక్షానుభూతిని పొందినారు.

✤✤✤✤✤

దేవంతికి మరల దివ్యావేశము రాగా నావేపు తిరిగి, ఆమె పలికినది– –"ఓ కవీ! ఇల్లంగో! వంజి రాజ్యసభలో నీవు నీ తండ్రి పక్కన కూర్చుని ఉండగా ఒక జ్యోతిష్కుడు నీవు సింహాసనాన్నధిరోహిస్తావని పలికినాడు. నీవు రాజ్యం నాకక్కరలేదని అగ్రజుడైన సెంగుట్టవన్‌కు ఆ బాధ్యతనప్పగించావు. ఆ తరువాత తూర్పువాకిలి గుండా నీవు మునుల సమాజమునకు వెళ్లి శాశ్వతానంద సామ్రాజ్యానికి చక్రవర్తివైనావు"–

కవి ఇల్లంగో అదిగళ్ అన్నాడు–

"ప్రజలారా! మీకిప్పుడు దేవతల పుత్రిక నా కథను తెలిపినది. సుఖదుఃఖాల భౌతిక మార్గాన్ని విడిచి నిత్యానంద సత్యమార్గాన్ని అనుసరించండి. భగవంతుని గురించిన జ్ఞానాన్ని సంపాదించుకొనండి. అసత్యమును పలుకవద్దు. పుకార్లను, చెడు వార్తలను వ్యాపింపజేయవద్దు. మాంసాహారాన్ని వర్జించండి. దుర్మార్గుల సాంగత్యాన్ని విడనాడండి. అహింసను పాటించండి. దయతో మెలగండి. తపస్సు చేయండి. తప్పుడు సాక్ష్యాలు పలుకవద్దు. సత్యాన్ని వక్రీకరించవద్దు. సజ్జనులతో కలిసి మెలిసి తిరగండి. దుర్మార్గులకు దూరంగా ఉండండి. పరభార్యా గమనము వద్దు. మరణశయ్యపై నున్నవారికి సేవ చేయండి. శీలసంపదను పెంపొందించుకొనండి. చెడును వర్జించండి. త్రాగుడు,

దొంగతనం, దుర్మార్గులకు, అబద్ధాలకు దూరంగా ఉండండి. యవ్వనం, ధనం, శరీరం ఇవి అశాశ్వతములు. బ్రతికి ఉండే రోజులు స్వల్పం. విధిని తప్పించుకోలేము. మోక్షానికి చేరుకునే సరైన మార్గాన్ని ఎంచుకొనండి. ఈ మాటలను పాటించండి. ప్రజలారా! ఇహలోక పరలోక సౌఖ్యాలను పొందండి!"

✤✤✤✤✤

## వంజి కాండము సమాప్తం.

ఈ పుస్తకంలో ముగ్గురు కిరీటధారుల గుణశీలాలు, విజయాలు, పశ్చిమ దేశపు చేర రాజు వీరత్వం, అతడు ధరించే పూలచెండు వర్ణన, వంజి నగర ప్రాముఖ్యత, ఉత్సవాల వైభవం, దేవతల రాక, ప్రజల ఆనందం, ఆహార విహారాల వర్ణన, ఆటపాటలు, యుద్ధ వర్ణన, చేరరాజు విజయం, ఇవీ ఇంకా మరెన్నో విషయాలు సెంగుట్టవన్ కీర్తిని వర్ణించేవి రేఖామాత్రంగా చెప్పబడినవి.

## ముగింపు

శిలప్పదికారం ఇక్కడితో ముగింపుకు వచ్చినది. నిజానికి మణిమేఖల వృత్తాంతంతో ఈ కథ ముగుస్తుంది. అద్దంలో కొండ కనిపించినట్లు ఈ జంట కావ్యాలు కుమారి అగ్రం నుంచి వెంకటాచలం వరకు విస్తరించి తూర్పు పడమర లందు సముద్రమే సరిహద్దులుగా గల విశాల దక్షిణాపథ ప్రాంతమీ తమిళదేశం గురించి వర్ణిస్తాయి. అయిదు రకాల ప్రాంతాలున్న ఈ దేశంలో దేవతలు, మానవులు వారివారి ధర్మాలను నిర్వర్తిస్తూ సచ్ఛీలత, సౌభాగ్యం, ప్రేమలతో మెలగుతారు. వీర, శృంగార రసాలు కలబోసిన పాటలు, వీణా వేణుగానాలు, సంగీతం, మంత్రోచ్ఛారణలు, నాటకాలు, నృత్యాలు, ఇవన్నీ ఆ దేశపు కీర్తి పతాకను మరింత ఉన్నతంగా ఎగురవేస్తాయి. తమిళ దేశపు ఖ్యాతిని ప్రపంచపు నలుచెరగులా వ్యాపింపజేసి అందరి మన్ననలను పొందుతున్నవి.

✤✤✤✤✤

## మహిమావ్యాప్తి

పాండ్య, కొంగు, లంక, చోళ దేశాలలో ఆనాటి రాజులు పత్నీ దేవతకు ఆలయాలు కట్టించి నిత్య పూజలు సలిపినారు. మారియమ్మ (వర్షదేవత)గా, పూజలందుకున్న దేవాలయాలు కాలక్రమేణా, కనకమహాలక్ష్మి, దుర్గాదేవి ఆలయాలుగా రూపు మార్చుకున్నవని కొందరి విశ్వాసం. (కొంగు రాజ్యం– కోయంబత్తూరు, సేలంలో కొంత ప్రాంతం)

✤✤✤✤✤

శ్రీయుతమగు తెలంగాణలో
ధీయుత శివరామప్రసాదనబడిన నేను
నేయుదు పెక్కుకథలన్ వి
ధేయుడనై వివిధ భాషాధౌరేయులకిలన్ !

కాలి అందియ చేతబట్టి
కాళియై మహోగ్రరూపాన కన్నగి జ్వలించ,
కాలి బూడిదయ్యె మధురై,
కాలునికతిథులై చనిరి కర్మకాలి పాండ్యుల్!

కన్నగి చరితను శ్రద్ధగా
కన్నవారికి విన్నవారికిన్ కలుగు సౌభాగ్యా
లెన్నెన్నో! పత్నీదేవతను
సన్నుతించఁ గనుపించునామె సర్వమంగళయై!



# ఇల్లంగొ అదిగళ్

క్రీస్తుశకం రెండవ శతాబ్దివాడైన ఇల్లంగొ అదిగళ్ జైన మతావలంబకుడైన రాజర్షి. తమిళ పంచకావ్యాలలో ఒకటైన శిలప్పదికార కర్త. చేర ప్రభువైన సెంగుట్టవన్ సోదరుడు. అతడిని చూసి ఒక జ్యోతిష్కుడు– 'మహరాజు లక్షణాలున్నాయని' పలుకగా తనకన్నా పెద్దవాడైన సోదరుడికి వ్యధ కలిగించకుండా తాను జైనమతాన్ని స్వీకరించి శిలప్పదికారం రచించి కవిరాజైనాడు. ఇల్లంగొ అదిగళ్, శాత్తనార్‌లు మంచి మిత్రులు. వారు తమ రచనలను ఒకరికొకరు చదివి వినిపించుకున్నారు. ఆ రకంగా గొప్ప కావ్యాలకు సృష్టికర్తలై ధన్యులైనారు.



# శీత్తలై శాత్తనార్ (సత్తనార్, చత్తనార్)

మణిమేఖల కావ్యాన్ని రచించిన శాత్తనార్ ధాన్యవ్యాపారి, పండితుడు, కవి. తమిళభాషలో 'చత్తు' అంటే వ్యాపారం. అతడిని మధురై కులవణిగన్ శాత్తనార్ అని పిలిచేవారు. శాత్తనార్ చేరరాజు సెంగుట్టవన్ సోదరుడైన జైన సన్యాసి ఇల్లంగొ అదిగళ్‌కు మంచి స్నేహితుడు. అతడిని శిలప్పదికారం రచించమని ప్రోత్సహించి తాను మణిమేఖల కావ్యాన్ని వ్రాసి, ఒకరి పుస్తకాన్ని మరొకరు అంకితమిచ్చుకున్నారని పండితుల అభిప్రాయం. తిరుక్కురల్‌లోని రెండు కవితలున్న మణిమేఖల తిరుక్కురల్ తరువాత బహుశా క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో రచింపబడిందని భావిస్తున్నారు. సంగం కవులలో ఒకడైన శాత్తనార్ బౌద్ధమతావలంబకుడు.

# తమిళ చరిత్ర

| | |
|---|---|
| 150000-100000 BC | - ఎఘ్యులియన్ హోమినిడ్లు |
| 3000 BC | - పాత రాతియుగపు ఆనవాళ్లు |
| 8000-3000 BC | - తొలి మృణ్మయపాత్రలు |
| 3000 - 1000 BC | - కొత్త రాతియుగం |
| 1000 - 300 BC | - బృహత్‌శిలాయుగం |
| 600 BC | - తమిళ బ్రాహ్మిలిపి |
| 300 BC | - గ్రీకుల మెగస్తనీసు మధురై దర్శించుట |
| 250 BC | - అశోకుని శిలాశాసనములలో చేర, పాండ్య, చోళుల, సత్యవ్రతుని రాజ్యాల ప్రసక్తి. |
| 200 BC | - సింహళరాజు 'ఎలార' పాలన |
| 200 BC - 200 AD | - తొలి సంగపు కవిత్వం |
| 150 BC | - కళింగ ఖారవేలుడి శాసనం |
| 13 AD | - ఆగస్టస్ సీజర్ వద్దకు వెళ్లిన పాండ్యరాయబారి. |
| 1-100 AD | - పెరిప్లస్ వర్ణించిన చేర, పాండ్య రాజ్యాలు- 'తమిరిశ' |
| 77-140 AD | - ప్లిని-పాండ్యరాజు-మధుర నగరాలు ప్రస్తావన |
| 130 AD | - చేరరాజు ఉదయజెరాల్ పాలన |
| 175-195 AD | - లంకాద్వీపపు రాజు గజబాహు, చేర ప్రభువు సెంగుట్టవన్, కాంకాల చోళుల పాలన. |
| 200 AD | - లిఖిత పద్ధతి వృద్ధి చెంది తమిళ బ్రాహ్మి లిపి నుండి 'వట్టిలుట్టు' లిపి తమిళలిపిగా మారుట. |
| 210 AD | - పాండ్యుల నెడుం చెరియన్ విజయం. |
| 300-590 AD | - కాలభ్రాల పాలన |
| 300-500 AD | - శిలప్పదికారం, మణిమేఖల లాంటి కావ్యాల రచన. |

(సెంగుట్టవన్ రాజు, ఇలంగొ అదిగళ్ అన్నదమ్ములుగా, శాత్తనార్ కవి ఇలంగొ మిత్రుడిగా శిలప్పదికారంలో చెప్పబడినా కొందరు పరిశోధకులు ఆ విషయాన్ని రామాయణ మహాభారత కావ్యాలలోలా కవి కథలో పాత్ర వహించినట్లు, ఈ కావ్యాలలో కూడ చేర్చబడి ఉంటారని భావిస్తున్నారు. అందుకనే క్రీస్తుశకం 300-500 ప్రాంతంలో రచించినా, కథాకాలాన్ని 175-195 ప్రాంతానికి చెందినట్లు వ్రాసారని కొందరి పరిశోధకుల అభిప్రాయం.

సంగం కాలం తరువాత కాలభ్రాలు వారి నోడించి పల్లవులు తమిళ దేశానికి రాజులైనారు. క్రీస్తుశకం 300-590 (కాలభ్రాలు); 300-500 ఇతిహాస కాలంగా, 560-580 పల్లవ సింహవిష్ణు పరిపాలన; 590-630 పల్లవ మహేంద్రవర్మ కాంచీపురాన్ని పాలించినట్లు తెలుస్తోంది.

కాబట్టి శిలప్పదికారం, మణిమేఖల ఇత్యాది కావ్యాల రచనలన్నీ పల్లవుల పరిపాలనకు ముందే జరిగాయని పరిశోధకుల విశ్వాసం.

క్రీస్తుపూర్వం 200 సంవత్సరాలకు ముందే మధ్య ద్రావిడ భాష అయిన 'తెలుగు' మూలద్రావిడ భాష నుంచి విడివడి ప్రత్యేక ప్రతిపత్తిని పొంది ఉంటుంది. వెంకటాచలమునకు ఉత్తరాన ఉన్న ప్రాంతమును ఆంధ్ర, తెలుగు, తెనుగు పదాలతో పిలిచేవారు. సెంగుట్టవన్ చేరరాజు ఉత్తరదేశ విజయయాత్రకు పోయినప్పుడు ఆంధ్రరాజు శాతకర్ణి సహాయం చేసినట్లు శిలప్పదికారంలో చెప్పబడినది.

సంస్కృత భాషా సంపర్కంతో తెలుగు భాష మణిప్రవాళ భాషగా రూపు దిద్దుకున్నది. తమిళ భాష తన ప్రత్యేకతను నిలుపుకుని సజీవ ద్రావిడ భాషగా నేటికీ నిలిచి ఉన్నది. సంస్కృత నామాలకూ సమానార్ధకమైన తమిళ పదాలను సృష్టించుకుని కవులు, సామాన్య ప్రజలు తమ భాషను సజీవంగా కాపాడుకున్నారు.

*****

తమిళ సాహిత్య చరిత్రలో 'సంగం' (క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం) కాలము స్వర్ణయుగంగా ప్రసిద్ధికెక్కింది. ప్రేమ, యుద్ధం, ప్రభుత్వం, వాణిజ్యం, విషాదంతోకూడిన సంఘటనల సమాహారమైన గ్రంథాలు - 18 భాగాలు,

(ఎనిమిది కవితా సంకలనాలు, పది ప్రేమ గాథలు) అయిదు మహేతిహాసాలు, వ్యాకరణ సూత్రాలతో పొందుపరచబడిన తొలి కావ్యం- తొల్కాప్పియం - ఈ కాలంలోనే వెలువడ్డాయి. ఈ కాలాన్ని తమిళకం (Tamilakam) అని పిలుస్తారు.

సంగం కాలానికి ముందు (క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం) మౌఖిక సాహిత్యం (Oral Poetry) సంచార గాయకులచే (Wandering bards) గానం చేయబడుతూ ఉండింది. లిపి, వ్రాత వచ్చిన తరువాత అవి గ్రంథస్థం చేయబడ్డాయి. చేర, చోళ, పాండ్య రాజుల మధ్య యుద్ధాలకు, శాంతికి మధ్యకాలంలో రాజాశ్రయులైన కవులు, కళాకారులు హాయిగా బ్రతికినా, యుద్ధపురోజుల్లో జీవనం దినదినగండమే! అశోకుని దండయాత్ర తమిళ ఎల్లలకు చేరకపోవడంతో ఆ కాలంలో సాహిత్య సృష్టి మిక్కుటంగా జరిగింది.

తమిళ సాహిత్యాన్ని వైయక్తికమైన (Subjective) ఆకమ్ (akam); బాహ్య విషయాల (Objective); పురమ్ (Puram)గా విభజించవచ్చును. 'ఆగమ్' కవిత్వంలో ప్రేమ,శృంగారం, విరహం, వేదన లాంటివి ప్రధానంగా కనిపిస్తే, పురమ్ కవిత్వంలో రాజులు, రాజ్యాలు, అధికారం, పరిపాలన, వ్యాకరణం, రణం, వీరత్వం, నీతిసూత్రాలు ముఖ్యంగా కానవస్తాయి. 'ఆగమ్'కవిత్వం ప్రియుడో, ప్రియురాలో, వాళ్ల చెలికాండ్లో చెబుతున్నట్లుంటే 'పురమ్' కవిత్వం తక్కువ అలంకారాలతో సూటిగా విషయాన్ని చెబుతుంది.

తమ చుట్టూ ఉన్న ప్రపంచం నుంచే కవులు సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తారు. తమిళ దేశంలోని నేల అయిదు రకాలు 'తిణై' (తినాయి-Thinai). 1) కురింజి (Kurinji) - పర్వతప్రాంతం; 2) ముల్లయి (Mullai) - అడవులు, 3) మరుతం (Marutham) - వ్యవసాయ భూములు, 4) నేౖతాల్ (Neythal)- సముద్రతీరం, 5) పాలయి (Paalai) - బంజరు భూములు. ఆయా ప్రాంతాలలోని కవిత్వం అక్కడ ప్రకృతిని, ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. కవిత్వానికి కూడా ఆ ప్రాంతాల తత్వం పేర్లగా మారడం గమనించవచ్చును.

సప్త తత్వాలుగా (తిణై) చెప్పబడిన కవిత్వ విధానాలు పురమ్ తినాయ్‌లలో 1) వెట్చి-గోగ్రహణం (Cattle raid); 2) వంచి - దండయాత్ర

(Preparation for war and invasion); 3) ఉలినాయి-ముట్టడి (Seize); 4) తుంపాయి-యుద్ధం (Battle); 5) వాకాయి-విజయం (Victory); 6) కంసి - విషాదం (Tragedy or the evanescent nature of life); 7) పతన్ - పొగడ్త (Praise) -గా ప్రసిద్ధికెక్కాయి.

కరంతాయి, నొచ్చి, వాగై, పొతువియళ్ ఇవికూడా సందర్భాన్ని బట్టి కవిత్వ రూపాన్ని సంతరించుకుంటాయి.

ప్రఖ్యాత తమిళ వ్యాఖ్యాత 'అతియార్కుకునల్లర్' (12-13th Century A.D.) అభిప్రాయం ప్రకారం తమిళ కవిత్వం రెండు విధాలు.

1) సొల్-తొతర్-నిలయి-సెయ్యుల్- స్వభావాన్ని (Properties)
2) పొరుల్-తొతర్-నిలయి-సెయ్యుల్ - వస్తువును (Content) ఏకసూత్రంగా తీసుకుని వ్రాయబడినవి కావ్యాలు.

అయింపెరుం కాప్పియం - మెయిల్ ఎయినాతర్ కవి పేర్కొన్న పంచ మహాకావ్యాలలో శిలప్పదికారం, మణిమేఖల, శివక చింతామణిలను త్రి ఇతిహాసాలుగా (Epic trilogy) విజ్ఞులుభావిస్తారు. కుండల కేశి, వలయ పతి కావ్యాలు నేడందుబాటులో లేవు.

తమిళ భాషలో అయిదు మహేతిహాసాలుగా (Greater Epics) పంచ కావ్యాలుగా ప్రసిద్ధికెక్కినవి.

| | గ్రంథం | రచయిత | కాలం |
|---|---|---|---|
| 1) | శిలప్పదికారం | ఇలంగో ఆదిగళ్ | క్రీస్తుశకం 1వ శతాబ్దం |
| 2) | మణిమేఖల | శీతలై శాత్తనార్ | క్రీ.శ. 1వ లేదా 5వ శతాబ్దం |
| 3) | శివక శింతామణి | తిరుతక్కదేవర్ | 10వ శతాబ్దం |
| 4) | వలయపతి | జైనముని | 9వ శతాబ్దం |
| 5) | కుండలకేశి | నగకుతనార్ | 5వ శతాబ్దం |

అయిదు చిన్న ఇతిహాసాలు (Lesser epics) 1) నీలకేశి, 2) నాగకుమార కావియం, 3) ఉదయన కుమార కావియం, 4) యశోధర కావియం, 5) శూలమణి.

'ఆగమ్'లో ఏడు భాగాలుగా చెప్పినా అయిదు తినాయి (విభాగాలు) అందరికీ తెలిసినవి.

1) కురింజి (Kurinji) -శృంగారం (Sexual union) - పర్వతాలు
2) న్యేతాల్ (Neytal) -విరహం (Pining) - సముద్రతీరం
3) పాలయి (Palai) -ఎడబాటు (Separation) - ఎడారి
4) ముల్లయి (Mullai) -ఆందోళన (Yearning) - మైదానం
5) మారుతం (Marutam) -విషణ్ణవదనం (Sulking) - నదీ ప్రాంతం
6) కైక్కిలాయి (Kaikkilai) -ఏకపక్ష ప్రేమ - (Onesided love or unsolicited love )
7) పెరుంధినాయి (Perunthinai) - సరిరాని ప్రేమ (Unsuited love) అక్రమ సంబంధం (Love against rules)

'సంగం' కాలం తరువాత తమిళ సాహిత్యంలోకి సంస్కృత కావ్య భావాలు ప్రవేశించాయి. క్రీస్తు శకం 300 నాటికి 'కాలభ్రా'లనబడే (Kalabhras) బౌద్ధమతావలంబకుల ప్రభావం, అదే సమయంలో జైనుల ప్రాభవం తమిళ సాహిత్యంలో మార్పులను తెచ్చాయి. పద్దెనిమిది కవితా సంకలనాలు వచ్చిన కాలమిది.

నీతి సూత్రాలను బోధించే ప్రసిద్ధ తిరుక్కురల్ సూక్తులు తిరువల్లువార్‌చే రచింపబడి తమిళ దేశమంతా ప్రాచుర్యం పొందాయి.

కాలభ్రాల అనంతరం దక్షిణాన పాండ్యులు, ఉత్తరాన పల్లవులు పరిపాలిస్తున్న కాలంలో (క్రీ.శ. 500-700) శైవ, వైష్ణవ ధర్మాలు వ్యాప్తిలోకి రాగా శైవులు-నయనార్లుగా, వైష్ణవులు-ఆళ్వార్లుగా మత, సాహిత్య సేవ చేసారు. శైవ గీతాలు-తిరుమురై-గా 'ఆరవవేదం'గా ప్రసిద్ధికెక్కాయి. వైష్ణవ గీతాలు- నాలాయిర దివ్య ప్రబంధం 'ద్రావిడ వేదం'గా వినుతికెక్కింది. సంస్కృత బృహత్కథననుసరించి కొంగు వెలిర్ (Kongu Velir) రచించిన పెరుంకథాయి ఈ కాలంలో పేరు తెచ్చుకున్నది.

క్రీస్తుశకం 11-13 శతాబ్దాల నాటికి చోళుల పరిపాలనలో దక్షణాపథం భోగ భాగ్యాలతో, శాంతిభద్రతలతోవిలసిల్లింది. శైవమత ప్రాధాన్యం పెరగగా శైవుల రచనలు తమిళంలో, వైష్ణవుల రచనలు సంస్కృతంలో వచ్చాయి. వైష్ణవులపై హింస, నిర్భంధాలు ఎక్కువైన కాలమిదే. కంబ రామాయణం వ్రాసిన కంబన్ ఈ కాలంవాడే! బాల సాహిత్యాన్ని వ్రాసిన అవ్వైయ్యార్ రచయిత్రి కంబన్ సమకాలికురాలు. (అతిచూడి, కొన్రై వెంతన్, మూతు రయి, నలవలి - ఈమె రచనలు)

తిరుతక్కదేవర్ క్రీస్తుశకం పదవ శతాబ్దంలో వ్రాసిన జీవక చింతామణి (Sivaka Sintamanai) తమిళ పంచ మహాకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది.

అనేక వ్యాకరణ గ్రంథాలు, యుద్ధకావ్యాలు వచ్చిన కాలమిది.

విజయనగర ప్రభువుల కాలం నాటికే తమిళరాజ్యం ఢిల్లీ సుల్తానుల పరమై ఉన్నది. హొయసలుల, చాళుక్యుల పతనానంతరం విజయనగర సామ్రాజ్య ప్రాభవం పెరిగి వాళ్లు తమిళ దేశాన్ని మధుర, తంజావూరు, జింజి నాయకులకు పరిపాలనను అప్పచెప్పారు. అసంఖ్యాకంగా మతాలు పెరిగిన కాలమిది. విల్లిభారతం, కాంతాపురాణం, కొక్కోకం, ఇతిహాసాలపై వ్యాఖ్యాన గ్రంథాలు, నిఘంటు చూడామణి - ఇవి-ఈ కాలం నాటి ప్రముఖ గ్రంథాలు.

పదిహేడవ శతాబ్దం నాటికి మహమ్మదీయ రచయితలు సయ్యద్ ఖాదర్ (సిద్ధక్కతి), ఒమర్ (ఉమర్ పులవార్)లు ప్రవక్తపై గ్రంథాలు రచించారు.వీర మామునివార్ (Costanzo Giuseppe Baschi - 1680-1746 AD) చతురకరతి అనే అక్షర క్రమ డిక్షనరీని, తెంబవాణి అన్న పేరుతో క్రీస్తు చరిత్రను రచించి తమిళ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచినాడు.

క్రీస్తుశకం 18, 19 శతాబ్దాలలో యూరోపియన్ల ప్రభావం తమళదేశంపై పడింది. మీనాక్షి సుందరం పిళ్లై, స్వామినాథ అయ్యర్, గోపాలకృష్ణ భారతి, రామలింగఅదిగల్, మరైమలై అదిగల్, సుబ్రహ్మణ్య భారతి, భారతి దాసన్ లాంటి ప్రముఖులు తమిళ సాహిత్యాన్ని పరిపుష్ఠం చేసినారు.

తమిళ భాషలో మొదటి నవల- 'ప్రతాపముదలియార్ చరితం'ను మయురం వేదనాయగన్ పిళ్లై - 1879లో వ్రాసినాడు. తరువాత కమలాంబాళ్ చరితం (రాజం అయ్యర్); పద్మావతి చరితం (మాధవయ్య) బ్రాహ్మణుల జీవితాల గురించి నవలలుగా వ్రాసారు. జయకాంతన్ నవీన తమిళ నవలలకు ఆద్యుడు. ఈతని నవల 'శిలానెరంగాలిల్ శిలా మణితరగాల్' చాలా ప్రసిద్ధికెక్కినది.

క్రైమ్, డిటెక్టివ్ నవలల్ని 1930 ప్రాంతాలలో బాగా చదివేవారు. కుప్పుసామి, దురైసామి అయ్యంగార్, తమిళవనన్ (డిటెక్టివ్ శంకర్‌లాల్ సృష్టికర్త)లు డిటెక్టివ్‌రచయితలు. శుభ, పత్తుకొట్టై ప్రభాకర్, రాజేష్ కుమార్, ఇంద్ర సౌందర్‌రాజన్, కల్కి కృష్ణమూర్తి, శాండిల్య, అరుణానందిని, రమణీచంద్రన్‌లు ఆధునిక తమిళ సాహిత్యంలో పేరుగాంచిన రచయితలు.

*****

శిలప్పదికారంలో నాయిక 'కణ్ణగి'. తన భర్త 'కోవలన్'తో పూంపుహార్ పట్టణంలో హాయిగా జీవిస్తూ ఉన్నది. మాధవి అనే వేశ్య ఆకర్షణలో చిక్కుకున్న 'కోవలన్'ను దక్కించుకున్నాక, ఇరువురూ పాండ్యుల రాజధాని మధురై వెళ్లారు. కణ్ణగి కాలి కడియాన్ని (శిలప్పదికారం-Story of anklet) కోవలన్ మధురైలో

అమ్మజూపినపుడు, అతడిని దొంగగా అనుమానించి బంధించి ఉరితీస్తారు. తనకు జరిగిన అన్యాయానికి కణ్ణగి ఆ రాజును నిలదీయడమే కాక మధురా నగరాన్ని మంటల్లోలా కాలేలా శపిస్తుంది.

కోవలన్, మాధవిల కుమార్తె మణిమేఖల. ఆమె తన జీవితాన్ని ఎలా గడిపిందీ, చివరకు బౌద్ధ సన్యాసినిగా హీనయాన బౌద్ధాన్ని ఎలా అనుసరించిందో తెలిపే ఈ కావ్యాన్ని 'సాతనార్' రచించాడు. బుద్ధుని జీవనయానం ఈ గ్రంథంలోమరో అంశం.

'జీవక చింతామణి'ని పదవ శతాబ్దంలో 'తిరుతక్కదేవర్' అనే జైన సన్యాసి రచించాడు. శీలం, ధనం, సుఖం, ఆనందం అనే నాలుగు జీవన సూత్రాల్నీ, పరిధుల్ని వివరిస్తూ సాగే మహాకావ్యం ఇది.

*****

క్రీస్తుపూర్వం 300 నుండి క్రీస్తుశకం 300 వరకు ఉన్న తమిళ సాహిత్యం 'సంగం' సాహిత్యంగా పిలువబడుతోంది. 473 మంది కవులు వ్రాసిన 2371 కవిత్వ ఖండికలు ప్రసిద్ధమైనవి. వీటిలో 120 కవితల్ని అజ్ఞాత రచయితలు రచించారు. క్రీస్తుశకం 1000లో కనుమరుగైన ఈ రచనలు పంధొమ్మిదవ శతాబ్దంలో ఆర్ముగ నయలార్, దామోదరం పిళ్లై, స్వామినాథ అయ్యర్ల కృషి వలన మరల వెలుగులోకి వచ్చాయి.

ప్రాచీన, ప్రస్తుత వస్తు శిల్ప, శైలి, భావ సంపదలతో ఉట్టిపడే తమిళ 'సంగం' కవిత్వం భారత కవిత్వంలో అసామాన్యమైనది. ఇంతకంటే బాగా వ్రాయలేమని నూతన కవులు ఒప్పుకునేంత అద్భుత పదరత్నహారం సంగం కవిత్వం.

వీటిలో- మహా సంకలనాలు పద్దెనిమిది. (ఎనిమిది కవితా సంకలనాలు, పది ప్రేమ గాథలు (Idylls); చిన్ని సంకలనాలు మరో పద్దెనిమిది. ఎనిమిది మహా సంకలనాలను ఎట్టుతొకయి (Ettuthokai) అంటారు.

ఈ కవితలు నాలుగు జీవిత పార్శ్వాలను స్పృశిస్తాయి. 1) ఆరమ్- శీలం; 2) పొరుల్-ధనం, రాజకీయాలు, 3) ఇంపమ్ - ప్రేమ, సుఖం, 4) విటు - మోక్షం

సంగం కవి సమ్మేళనాలు - తొలిసారిగా తెన్‌మధురై, అగస్త్యకవి అధ్యక్షతన పాండ్యరాజుల కాలంలో, రెండవ సభ కపాటపురంలో తొలికాప్పియం వ్రాసిన తొలికాప్పియార్ అధ్యక్షతన, మూడవ సభ మధురైలో నక్కిరార్ అధ్యక్షతన

జరిగాయి. మూడవ సభలో వచ్చినదే ఇప్పుడు లిఖిస్తున్న సంగం సాహిత్యం. క్రీస్తు పూర్వం 300 నుంచి క్రీస్తు శకం 300 వరకు స్వర్ణయుగంగా చెప్పబడుతున్న ఆ కాలంలోని ప్రసిద్ధ కవులు అగస్త్య, అవ్వైయార్, కడియాలుర్ ఉరుత్తి రంగన్ననార్, కపిలార్‌లు ప్రసిద్ధులు.

తరువాత కాలంలో (300-1000 AD) 'తిరుక్కురల్ - నీతివాక్కులను రచించిన తిరువల్లువార్, శిలప్పదికార రచయిత ఇలంగొ ఆదిగల్, నక్కీరర్, సితలాయిసత్తనార్, తిరుతక్కదేవర్‌లు పేరుగాంచారు.

తరువాత వచ్చిన భక్తియుగంలో (700-1700 A.D.) పన్నెండుగురు ఆళ్వారులు, 63 నాయినార్లు, సెక్కిజర్, కంబర్,ఒత్తకుతర్, అరునగరినాథర్, పత్తినాధర్, శివప్రకాశర్‌లు ఖ్యాతిగాంచగా, బ్రిటిష్ పరిపాలనలో (1700 A.D. తరువాత) సుబ్రహ్మణ్య భారతి, సుబ్రహ్మణ్య శివ, భారతీదాసన్, దేశిగ వినయగమ్ పిళ్లై, షేక్ తంబిపవలర్, రామలింగ స్వామిగళ్‌లు వన్నెకెక్కినారు.

నవీన కాలంలోకన్నదాసన్, వాలి, అన్నామలై రెడ్డియార్, వైరముత్తు, పుదుమై పితాన్, దొరైసామి, కార్షి కొనర్, విజయ్, మేధ, కందసామి, అఖిలేశ పిళ్లై, పెరుమాల్ రసు,మనుష్య పుతిరన్‌లుపేరు తెచ్చుకున్నారు.

❖❖❖❖❖

తొలకాప్పియం ప్రకారం ప్రాచీన తమిళ దేశానికి ఉత్తరాన వెంకటాచలం, దక్షిణాన కన్యాకుమార అగ్రం సరిహద్దులు. చేరనాడు, కొంగు, చోళ, పాండ్య, పుఘి, వేఝు, అరువ, పొంగర్, పునల్, ఓలి, కుట్ట, కుద, కార్క, సీతా, నంజిల్, అయె, నాగ నాడులు తమిళభాష మాట్లాడే ప్రాంతాలు.

ప్రస్తుతం పరిశోధకులు సంగం కాలాన్ని 300 B.C. - 300 A.D.గా పేర్కొంటున్నారు. అయితే ఎనిమిదవ శతాబ్దపు ఇరయనార్ అగప్పొరుల్ - సంగం కవి సభలు రమారమి 9990 సంవత్సరాల నుండి ఉన్నాయని తెలిపాడు. అప్పటి సాహిత్యం దాదాపుగా శిథిలం కాగా, ఆ స్వర్ణయుగపు ఆనవాళ్లను ఇప్పుడు లభ్యమవుతున్న సహస్రాంశ సాహిత్యంలో గమనించవచ్చు.

సంగం సాహిత్య కావ్యాలు రెండు రకాలుగా ఉంటాయి. 'ఆగమ్' సాహిత్యం సన్నిహితత్వాన్ని,ప్రేమ, శృంగార, వియోగ భావాల్ని వర్ణిస్తుంది. అంతర్లోకాన్ని స్పృశిస్తుంది. 'పురమ్' కవిత్వంలో ఎక్కువగా వీరుడి వర్ణన, ధీరోదాత్తత, శౌర్య పరాక్రమాలూ, నీతి బోధలూ, ఔదార్యం, దానం, ఆచారాలు, సమాజ స్థితిగతులు వర్ణించబడతాయి.

❖❖❖❖❖

నక్కీరార్ అభిప్రాయం ప్రకారం మొదటి తమిళ సంగం ఇప్పుడు సముద్ర గర్భంలో కలిసిన మధురై నగరంలో, 549 మంది సభ్యులు (శివుడు, కుబేరుడు, మురుగన్ లాంటి దేవతలు కూడా సభ్యులు) 4449 మంది కవులు, 89 మంది పాండ్యరాజ వంశీకుల పరిపాలనలో 4400 సంవత్సరాల కాలం నిలబడింది. 'అగత్తియం' వ్యాకరణాన్ని అనుసరించి వ్రాయబడిన- పరిపాదల్, ముదునారై, ముదుకురుగు, కలరియ విరయి కావ్యాలు ముఖ్యమైనవి.

రెండవ సంగం 'కపాటపురం'లో నెలకొల్పబడి 59 మంది సభ్యులతో, 3700 కవులతో, 3700 సంవత్సరాల పాటు నిలబడింది. 59 మంది పాండ్యరాజులు వెండర్ సెలియన్ నుంచి ముదత్తిరు మరన్ వరకు ఈ కాలంలో తమిళ దేశాన్ని పరిపాలించారు. సముద్రగర్భంలో కలిసిపోయిన ఈ కపాటపురం రామాయణం (సుగ్రీవుని ఉవాచ)లో కౌటిల్యుని అర్ధశాస్త్రంలో 'కపాటపురం'గా పేర్కొనబడి వున్నది.

బుదపురాణం, అగత్తీయం, మాపురాణం, ఈశైనునుక్కమ్ లోని వ్యాకరణ సూత్రాల ననుసరించి వ్రాయబడిన కావ్యాలు కలి, కురుగు, వెండలై, వియలమలయి అహవాల్.

మూడవ సంగం ప్రస్తుతపు మధురై నగరంలో ఏర్పడి 1850 సంవత్సరాలు నిలబడింది. 49 మంది పాండ్యరాజ వంశీకులు ముదత్తిరుమరన్ (ఇతని కాలంలో రాజధాని కపాటపురం నుంచి మధురైకు మార్చబడింది) నుంచి ఉక్కిరప్పెరు వాలుటి వరకు పరిపాలించారు. 49 మంది సభ్యులు, 449 మంది కవులు పాలుపంచుకుని వెలువరించిన కావ్యాలు అగత్తియం, తొలక్కాపియం వ్యాకరణ సూత్రాల ననుసరించినాయి. కురుంటొకయి, నెటుంటొకయి, కురుంటొకయి నానూరు, నర్తినయి నానూరు, పురనానూరు, అయింకురు నానూరు, పదిరుప్పాటు, కలి, పరిపాదల్, కుట్టు, వరి, సిర్రిసయి, పెరిసయి ప్రధానమైనవి.

49 మంది సభ్యులున్న మూడవ సంగంలో ముఖ్యులు కపిలార్, పరనార్, నక్కీరార్. వీరు శైవ భక్తులు. 63 మంది నాయనార్లలో పేర్కొనబడినవారు. శివ, నక్కీరుల పార్వతి కురుల సహజగంధంపై సంవాదం మనకు తెలిసినదే.

మూడవ సంగం మీనాక్షి సుందరేశ్వరుల దేవాలయంలోని స్వర్ణపద్మాల కొలనువద్ద జరిగినట్లు చెప్పబడుతున్నది.

తమిళ నాగరికతకు నెలవైన కుమారిఖండం కన్యాకుమారి అగ్రానికి దక్షిణంగా ఉండి వరదలలో సముద్ర గర్భంలో కలిసిపోయినట్లు ఐతిహ్యం ఉన్నది. మొదటి రెండు సంగంల ప్రదేశమదేనని ప్రజల విశ్వాసం.

క్రీస్తుశకం 470లో మధురై నగరంలో వజ్రనంది అనే జైనమతావలంబకుడు ద్రవిడ సంఘాన్ని ఏర్పరచాడు. ఆనాడు తమిళదేశం 'కాలభ్రా'లనబడే బౌద్ధ/జైన మతస్థుల పరిపాలనలో ఉన్నది. ద్రవిడ సంఘం తమిళ భాషాభివృద్ధికి తోడ్పడగా అనేక గ్రంథాలలో జైనుల విశ్వప్రకారం, పురాణాల ప్రభావం కనిపిస్తుంది.

❖❖❖❖❖

**తమిళదేశపు పండుగలలో ముఖ్యమైనవి.**

1. పొంగల్ - కోతల కాలపు పండుగ. సెవ్వల్ ప్రభువును, సూర్యుడిని ఆరాధిస్తారు. జనవరి 14/15 (థాయి)

2. పెరు వెనిల్ కడవిఝు - ఏప్రిల్ 14/15 (ఊట్రాయి) నడినెత్తిపై సూర్యుడు ప్రచండంగా అగ్ని నిప్పులు కక్కుతున్నపుడు ఈ వేసవి త్వరగా గడవాలని ప్రార్థించే పండగ. అగ్ని నక్షత్రం (రోహిణీ కార్తె ప్రారంభం).

1. ముఝుయి విఝువు (ఇంద్ర విఝు) - వర్షం కోసం పూజలు చైత్ర పూర్ణిమ నుంచి వైకాశి పూర్ణిమ వరకూ ఒక నెలపాటు జరిగే ఉత్సవాలు (Ootrai to Puyaaghi)

4. పూయాజి విశాగం, థాయి పూసమ్ - తమిళదేవుడు సెవయెల్ (Sevvaell) జన్మదినం, తిరుప్పరాన్ కుందరమ్ కూడల్ విద్యాలయంలోకి ప్రవేశం.

5. సుర్నవాయి విఝు - సెవ్వయెల్ దేవుడు దంబాసురుడైన శూరపద్ముడిని సంహరించే రోజు (ఇత్తిరాయి-కార్తీక మాసంలో నెలపొడుపు తర్వాత ఆరవ రోజు)

6. వాడయి విఝు (Vaadai Vizha) ఏలుదేవుడిని (సూర్యుడు) ఆహ్వానించడం (డిశంబరు 21/22 - (Winter Solistice) (పనమిజ్ - మార్గశిర మాసపు ఆరవరోజు)

7. ఆరుద్ర దరిశినమ్ (సెమ్మీన్ ఎజుమిన్ విఝువు) అతి ఇరయి దరిశినమ్ - శ్రీ చిదంబరం నుంచి శివుడు వచ్చేరోజు. అతి ఇరయిమిన్ - అంటే ఆరుద్ర నక్షత్రాన్ని (నందిపై నెలవున్న శివుడిని) మార్గశిరమాసంలో పౌర్ణమికి ముందు రోజు తెల్లవారు జామున దర్శించుకోవడం.

తమిళ దేశంలో కవులను 'పులవర్' అని, పండితులను సాంద్రర్ (Sandror) అని పిలుస్తారు. వృత్తితో సంబంధం లేకుండా అన్ని వర్గాలనుంచి వచ్చిన కళాకారులు.

1) తుడియన్ - తబలా లాంటి ఢక్కల వాయిద్యకారులు

2) పరెయాన్ -మేళ విద్వాంసులు. కూత్తు నాటక కళాకారులు. రాజాజ్ఞలను చాటింపు వేసేవారు.

3) ముఝువన్ - యుద్ధపు ప్రారంభ, అంత్యసమయాలను సూచించే భాంకార వాయిద్యకారులు.

4) కదంబన్ - కదంపరాయి అనే భేరీఢక్కలను మోగిస్తూ నాగస్వరం లాంటి సెరియొతుతిలను ఊదేవారు.

5) పాణన్ - యూజ్ వీణా విద్వాంసులు. గీతాకారులు, గాయకులు కవులు, పండితులతో సహా వీరందరూ రాజాశ్రయులు.

ప్రాచీన తమిళ దేశం 1) కురింజి - కొండ ప్రాంతం; 2) ముల్లయి- అటవీ ప్రాతం, 3) మరుతం - వరిపొలాలు, 4) నేృతల్ - సముద్ర తీరం, 5) పాలయి -బంజరు భూములుగా విభజించబడింది. ఈ వర్గాలను 'కుడి' అని పిలుస్తారు. వీళ్ల 1) మల్లారులు-రైతులు, 2) మలవార్లు-గిరిజనులు, 3) నాగరులు- నగర సంరక్షకులు, 4) కాదంబరులు-అడవి పుత్రులు, 5) తిరైయార్లు - తీరప్రాంతం వాళ్లు, నావికులు.

ప్రజలుండే ప్రదేశాన్ని'ఊరు' అంటారు. ఊళ్లు, పట్టణాలు, నగరాలు, రాజ్యాలుగా అభివృద్ధి చెందినాయి.

భౌగోళిక పరిస్థితులను బట్టి వేర్వేరు వృత్తులేర్పడినాయి.

**1) కురింజి (పర్వత) ప్రాంత ప్రజలు**

1) పొరుప్పలు-సైనికులు, 2) వెర్పనులు-తెగ నాయకులు, 3) సిలంబనులు- యుద్ధవిద్యా ప్రవీణులు 4) కురవరులు-వేటగాళ్లు, 5) కనవరులు- కొండలపైని అడవుల్లో నివసించేవారు, పర్వత పాదాల వద్ద నివసించేవారు.

**2) ముల్లయి (అటవీ ప్రాంతం) ప్రజలు**

1) కురుంపొరాయి నాదాన్ కిజత్తీలు - కొండలోయ ప్రాంతపు ప్రభువులు, 2) తొన్రాల్మనైవి - మంత్రులు, రాజకుటుంబీకులు, 3) ఇదైయార్లు - గోపికలు, గోపాలురు, 4) అయ్యర్లు-పశుపాలకులు

**3) మరుతం (వరిపొలాలు) ప్రాంతపు వాళ్లు**

1) మల్లార్, పల్లార్-రైతులు, వీరులు, 2) వెండనులు-చేర, చోళ, పాండ్య రాజ వంశీకులు, 3) ఉరన్లు-జమీందారులు, 4) మజిగ్నులు - వ్యవసాయదారులు, 5) ఉర్ఝువర్లు-రైతుకూలీలు.

**4) నైతల్ - (సముద్రతీరం) ప్రాంతపువాళ్లు**

1) సేరప్పనులు-చేపల వర్తకులు, 2) పులంపనులు-శాకాహారులు, 3) పరవలు-రాజులు, సముద్ర యోధులు, బేహారులు, సముద్రపు దొంగలు. 4) నులైయార్లు- చేపల వృత్తీ, కొబ్బరితోటలూ కలిగిన సంపన్నులు, 5) అలవార్లు - ఉప్పురైతులు.

**5) పాలయి (బంజరుభూమి) ప్రాంత ప్రజలు**

1) ఐనర్లు, 2) ఐతియార్లు - దొంగతనం చేసి జీవించేవారు.

**6) కడైయార్లు - వర్తకులు.**

❖❖❖❖❖

చిదంబరనాథ చెట్టియార్ తమిళ సాహిత్య కాలాన్ని 6 యుగాలుగా విభజించినాడు.

| | |
|---|---|
| 1) సంగం సాహిత్యకాలం (కూటములు) | - 200 B.C. - 200 A.D. |
| 2) సంగం అనంతరకాలం | - 200 A.D. - 600 A.D. |
| 3) తొలి మధ్యయుగం | - 600 A.D. - 1200 A.D. |
| 4) మధ్యయుగం | - 1200 A.D. - 1800 A.D. |
| 5) తొలి నవీన యుగం | - 1800 A.D. - 1900 A.D. |
| 6) నవీనయుగం | - 1900 A.D. తరువాత |

తమిళ సాహిత్య సంకలనాలు ముఖ్యంగా మూడు- 1) ఎత్తుటొకయి, 2) పత్తుపత్తు, 3) పదినెన్‌కిల్ కనక్కు.

ఎత్తుటొకయి ఎనిమిది కవితా సంకలనాల పుస్తకం- 1) నఱ్రినయి, 2) కురుంటొకయి, 3) అయింకురునూరు, 4) కలిట్టొకయి, 5) ఆకనానూరు, 6) పురనానూరు, 7) పదిఱ్రుపట్టు, 8) పరిపాదల్.

పత్తుపత్తు (పది ప్రేమగాథలు) - 1) పొరునరఱ్రు పద్రై, 2) శిరుపనఱ్రు పద్రై, 3) పెరుంపనఱ్రుపద్రై, 4) పొరునరఱ్రు పద్రై, 5) కుట్టర్ అఱ్రు పద్రై,6) ముల్లై పత్తు, 7) కురింజి పత్తు, 8) మదురై కంజి, 9) పత్తినపాలయి, 10) నెడునాల్‌వదయి.

పదినెన్‌కిల్ కనక్కులో తిరువళ్లువర్ రచించిన నీతివాక్యాలు 'తిరుక్కురల్', అనేకమంది జైన సన్యాసులు వ్రాసిన 'నలడియార్' ముఖ్యమైనవి. ఇవి ప్రజలు నడచుకోవాల్సిన విధానాన్ని తెలిపే నీతిబోధల కావ్యాలు.

క్రీస్తుశకం 200-600 A.D. లో వచ్చిన శిలప్పదికారం (ఇలంగొ అదిగళ్), మణిమేఖల (సత్తనార్), జీవకచింతామణి, వలయపతి, కుండలకేశి పంచ మహాకావ్యాలుగా పేరు గాంచాయి.

600-1200 A.D. కాలంలో శైవ వైష్ణవ గ్రంథాలు 1200-1700 కాలంలో శివజ్ఞాన బోధం, శివజ్ఞాన సిద్ధియార్ కావ్యాలు వెలువడ్డాయి. క్రీ.శ. 1610లో గోవాకు వచ్చిన రాబర్ట్ డి నోబిల్ 'తత్తువబోధిస్వామి'గా అనేక వచన గ్రంథాలు రచించగా, ఉమరు పులవారు మహమ్మదీయ మతాన్ని స్వీకరించి 'చిరపురాణం' అనే మహమ్మదు జీవిత చరిత్రను వర్ణించే కావ్యాన్ని రచించాడు.

కాన్‌స్టాంటియస్ బెస్చి (విరమ మునివార్ -1708-గోవా) 'తెంపవాణి'గా సెయింట్ జోసెఫ్‌జీవితగాధను రచించాడు. ఇతడు రచించిన 'చతుర అకరధి' నిఘంటువు చాలా ప్రసిద్ధమైనది.

19వ శతాబ్దంలో ఆర్ముగ నవలార్, రామలింగ ఆదిగళ్, మీనాక్షి సుందరం పిళ్లై, తరువాతి కాలంలో సుబ్రహ్మణ్య భారతి, దేశికవి నాయకం పిళ్లై, నమక్కల్ కలిగ్నార్, రామలింగం పిళ్లై, భారతీదాసన్, సుధానంద భారతీయార్ తమిళ సాహిత్యంలో ప్రసిద్ధ వ్యక్తులు.

తమిళ సాహిత్యం 300 BC – 300 AD నాడే బాగా అభివృద్ధి చెందిన నాగరిక సమాజపు పోకడల్ని తెలియబరుస్తుంది. ఆనాటి కవిత్వాన్ని మించిన కవిత్వం ఈనాడు కూడా చూడలేమేమో!

ఆనాటి స్త్రీల పాటల్లా ప్రధానమైనవి వ్యవసాయ జీవితానికి సంబంధించినవి. మంచెకాడ పక్షుల్ని అదిలిస్తూన్నట్లో, మొక్కలతో మాట్లాడుతున్నట్లో, గాయపడిన మగవాళ్లని అనునయిస్తూనో, తమ ప్రేమను వ్యక్తపరుస్తున్నట్లో ఉన్న పాటలు ప్రధానమైనవి.

స్త్రీల పాటలలో ముఖ్యంగా నాయకుడు, ఇష్టసఖి, నాయిక, అత్త, తల్లి, సవతి తల్లి కానవస్తాయి. స్త్రీ సౌందర్యానికి, పురుషుడి వీరత్వానికి ప్రాముఖ్యత ఎక్కువ.

'ఆకమ్' పాటలలో స్త్రీపాత్ర - యవ్వనంలో ఉన్న స్త్రీ, శృంగారాభిలాష, విరహం, ఎదురుచూపులు, భర్త ఇతర స్త్రీలతోతిరుగుతూ ఉంటే అసూయతో కూడిన కోపం, ఈ భావాల్ని వెలిబుస్తుంటే, 'పురమ్' పాటలలో స్త్రీ వయసు మీరినదిగానో, రాజనర్తకిగానో, విధవగానో సాక్షాత్కరిస్తుంది. శీలం, పతివ్రతా ధర్మాలు ఖచ్చితంగా ఆచరించవలసిన విషయాలు. సంతానోత్పత్తి దేవత, భూదేవతతో సమానమైనదిగా స్త్రీ భావించబడినా బహిష్ఠ సమయం, ప్రసవానంతరం, భర్త మరణానంతరం, ఈ సమయాలలో స్త్రీని నిషేధ వస్తువుగా పరిగణించేవారు.

'వెన్మనిపుట్టి' అనే కవయిత్రి రచించిన కురుంటొకయి-299 -

నెచ్చెలీ! భూమికన్నా ప్రాచీనమైన సముద్రం
తన అలలతో మన తీరాన్ని తాకి శుభ్రం చేస్తున్నది.
పక్షుల కిలకిలా రావాలతో పులకిస్తున్న
పున్నయి పూలవనంలో మేమిద్దరం కలుసుకున్నాము.
నాకళ్ళూ, చెవులూ అతడినే అంటిపెట్టుకున్నాయి.
అతడిని కౌగిలించుకున్నపుడు
అందంగా, శక్తివంతంగా మెరిసిన నా చేతులు
విడివడేప్పుడు నీరసించి వేలాడుతున్నాయి.

**తమిళ దేశములోని కొన్ని వృక్షాల పేర్లు-**

1) కరుంగకాలి (Ebony – నల్ల చేవమాను, కోవిదారం), 2) మరవెంబు (Mahagony – నందివృక్షం), 3) వెంబు (Neem – వేపచెట్టు), 4) మురుంగాయి (Moringa – మొరింగచెట్టు), 5) తెనాయి (Coconut – కొబ్బరిచెట్టు), 6) పనాయి (Palmira – తాటిచెట్టు), 7) దురియాన్ (Duriyan – అరటిచెట్టు), 8) పుల్లు (Grass - గడ్డి), 9) అరువంపుల్లు (Bermuda Grass)

**నఱ్రినయ్ : నఱ్రినయ్ అంటే మంచికవితలు** (Good Tinai). నాలుగు వందల పద్యాలు, 9-12 పాదాలుంటాయి. 192 మంది కవులు వ్రాసిన ఈ గీతాలకు విభజన లేదు.

సంగం కాలపు స్త్రీ కవయిత్రులలో వెళ్లి విటియార్, వెన్మనిపుట్టి, కవరపెంటు, కక్కై పతినియార్ నసల్లైయార్, ఒక్కురు మసత్తియార్, ముఖ్యంగా అవ్వైయార్ ప్రసిద్ధులు.

శివుని ఢమరుకము యొక్క ఒకవైపు నుండి పుట్టిన శబ్దము తమిళముగా, మరొక పక్క పుట్టిన శబ్దము సంస్కృతమయినదని ఓ పురాణ గాథ గలదు. శివుడు తమిళమును అగస్త్యునికి, సంస్కృతమును పాణినినికి నేర్పెననునది ఈ కథ ఆధారంగానే కావచ్చును.

సంగెం కాలంలో ప్రసిద్ధికెక్కిన స్త్రీ కవయిత్రి అవ్వైయార్. మన కందుబాటులో ఉన్న ఆమె కవితలు 59లో 26 ఆకమ్, 33 పురమ్ కవితలు ప్రేమ, వీరత్వం గురించి అద్భుతంగా వర్ణిస్తాయి. అవ్వైయార్ అంటే గౌరవనీయురాలైన అవ్వ. అచితన చింతామణి అభిప్రాయం ప్రకారం అవ్వైయార్ అని పేరు లేదా బిరుదు గల కవయిత్రులు కనీసం ముగ్గురున్నారు.

అవ్వైయార్-1 సంగం కాలం నాటి కవయిత్రి. అవ్వైయార్-2 కంబన్, ఒట్టకూతర్ (క్రీ.శ. 13వ శతాబ్దం)లకు సమకాలీనురాలు.

*****

## ఆకమ్ (ఆగమ్) కవిత్వం

ప్రేమ, ఎడబాటులోని పలుకోణాలను స్పృశిస్తూ వైయక్తికమైన భావాలను సున్నితంగా, సుందరంగా ప్రతిబింబించే పద చిత్రణే ఆగమ్ కవిత్వం. "మానవ జీవితంలోని అతి ముఖ్య ఘట్టమైన ప్రేమ గురించి వర్ణించే కవితలు సర్వకాలాల్లోనూ మానవుని ప్రతిబింబిస్తాయేగాని ప్రత్యేకించి ఎవరో వ్యక్తి ఉద్వేగాలను వివరించవు'' - అంటాడు హడ్సన్ మహాశయుడు

**ఆగమ్ కవిత్వం ఎనిమిది సంకలనాలుగా**

**ఎట్టుతొకయి (Eight anthologies) గా వెలువడింది.**

| | | |
|---|---|---|
| 1) అయింకురునూరు | 500 కవితలు | అహవల్ ఛందస్సు |
| 2) కురుంటొకయి | 400 కవితలు | అహవల్ ఛందస్సు |
| 3) నర్రినయ్ | 400 మంచి కవితలు | అహవల్ ఛందస్సు |
| 4) కల్లితొకయి | 150 కవితలు | కలి ఛందస్సు |
| 5) అకనానూరు | 400 కవితలు | అహవల్ ఛందస్సు |
| 6) పదిర్రుపత్తు | 80 కవితలు | అహవల్ ఛందస్సు |
| 7) పురనానూరు | 400 కవితలు | అహవల్ ఛందస్సు |
| 8) పరిపాదల్ | 22 కవితలు | |

ఈ ఎనిమిది కవితా సంకలనాల్లోని 2381 కవితలను 470 మంది కవులు వ్రాసారని అంటారు.

**అయింకురునూరు** -అంటే అయిదు వందల చిన్ని పద్యాలు. 3-5 పాదాలుండి, అయిదు 'టినయి' (తిణై) విభాగాలుగా వున్న ఈ కవితలను అయిదుగురు కవులు ఒక్కొక్కరు ఒక్కోరకపు విభాగంలో వంద కవితలు వ్రాసారు.

**అయింకురునూరు (అయిదువందల చిన్ని పద్యాలు)** గీతాలు 3-5 పాదాలతో ఉండి అయిదుగురు కవులు ఓరంపోకియార్ (మారుతమ్); అమ్మువనర్ (న్యేతాల్); కపిలార్ (కురింజి); పెయనార్ (ముల్లయి); ఒటలంతైయార్ (పాలయి) వ్రాసిన అద్భుత కవితలు.

**కురుంటొకయి** (Kuruntokai) - చిన్న పద్యాల సంకలనంలో 401 పద్యాలు, 6-8 పాదాలతో, టినాయి విభజన లేనివి. 205 మంది కవులు వీటిని రచించారు.

పన్నెండేళ్లకోసారి పుష్పించే 'కురింజి'పూల నుండి తేనెటీగలు సంగ్రహించిన మకరందం అతి తియ్యని తేనె అని ప్రజలు చెప్పుకుంటారు. నీలగిరి కొండలలోని 'తోడా' (Totuvar) తెగ ప్రజలు తమ వయస్సును వాళ్ల జీవితకాలంలో కురింజి పూలు ఎన్నిసార్లు పూసాయో అన్ని సంవత్సరాలుగా చెప్పుకుంటారు. పది, పన్నెండేళ్లకోసారి తెల్లటి కురింజి పూలు (Strobilanthes Kunthiana) కొద్దిరోజులు నీలగిరుల్ని తెల్లటి దుప్పటితో కప్పివేస్తాయి. ఆ అద్భుత సన్నివేశాన్ని ప్రేమతో సంధించిన గీతాలే కురింజి (Kurinci) గీతాలు.

**'కురింజి'** (Kurinci) గీతాలు ప్రేమికుల కలయికను, కురింజి పూలను, పర్వతాలను, అర్ధరాత్రిని, శీతాకాలాన్ని, జలపాతాల్ని, కోతి, ఏనుగు, అశ్వం, ఎద్దు లాంటి జంతువుల్ని, పనస, వెదురు, వెంకై వృక్ష లతల్ని, ఎర్రటి, నల్లటి నేలను రాళ్లు, గులకరాళ్లతో ఉన్న కొండ ప్రాంతాలను, కొండ జాతి ప్రజలను, తేనె అమ్మేవాళ్లను, సెయ్యోన్ లేదా మురుగన్ దేవుళ్లను వర్ణిస్తాయి. మురుగన్ భార్య 'వల్లి' పర్వత ప్రాంతానికి చెందినది. మురుగన్ ఎర్రటి కాంతాల్ పూలను ధరిస్తాడు. నెమలి అతడి వాహనం.

కురుంటొకయి (చిన్ని కవితల సంకలనం)లో 401 గీతాలు, 6-8 పాదాలతో, 205 మంది కవులు వ్రాసినవి. వీటిలో 'టినాయి' (Tinai) విభజన లేదు.

కురుంటొకయి-2లో ఇరయనార్ కవి ఏమంటున్నాడో చూడండి- "ఓ అందమైన రెక్కలున్న భ్రమరమా! నీ జీవితమంతా మకరందాన్వేషణలోనే గడిచింది గదా! నాకు నీవు 'కోరిక' గురించి కాక, నీవేం గమనించావో చెప్పు. నీకు తెలిసిన పూలకు దేనికైనా, నన్ను తనతో బంధించుకున్న యువతి కురులకున్న సువాసన, చక్కని పలువరుస, నెమలి నడక ఉన్నాయా?

**'ముల్లయి'** గీతాలలో ప్రియునికోసం ఎదురుచూస్తున్న ప్రియురాలి ఎదురు చూపులు, ముల్లయి (మల్లె - Jasmine) పూలు, అడివి, మైదానం, సాయంసమయం, మబ్బులు, ఎండాకాలం, లేళ్లు, కొన్రాయి మొక్కలు, నదులు, ఎర్రనేల, రైతులు, మేవన్, తిరుమల దేవుళ్ల ప్రస్తావన నేపథ్యంగా ఉంటుంది. సరస్సులు, జలపాతాలు, టేకు, వెదురు, చందన వృక్షాలు, మల్లెలు, కృష్ణుడిపై అచంచల భక్తితో ఎదురుచూస్తున్న గోపికలు ఇవన్నీ కథావస్తువులుగా ముల్లయి (అరణ్యాలు) పాటలలో కనిపిస్తాయి.

ముల్లయి గీతానికి ఓ ఉదాహరణ - (కురుంటొకయి-234) సూర్యుడు ఎర్రబడుతూ అస్తమిస్తున్నాడు. చీకటి పడుతుంటే నా బాధ తీవ్రమవుతున్నది. మల్లెలు వికసించే సాయం సమయమిది. కొందరికి ఇది అందంగా కనిపిస్తుంది. కోడిపుంజుల అరుపులు నగరమంతా వినవస్తున్నాయి. జంట లేని నా బోటివాళ్లకు సాయంకాలమొక దీర్ఘదినమే!

**మరుదం (మరుతమ్) గీతాలు** (Marutam) ప్రేమికుల జగడాల్ని, భార్య తన భర్తపై అలగడాన్ని, భర్తల వేశ్యా ప్రియత్వాన్ని చూపించే ఎత్తిపొడుపుల్ని వర్ణిస్తాయి. మరుతం పుష్పాలు, వరిపొలాలు, సూర్యోదయానికి ముందు తెల్లవారిన సమయం; ఏ ఋతువైనా కావచ్చును, చేపలు, బర్రెలు, నీటి దున్నలు, మామిడిచెట్లు, నీటి సరస్సులు, రేగడినేల, వ్యవసాయం, పశువుల పెంపకం, ఇంద్రుడు దేవుడుగా ఉన్న నేపథ్యంలో ఈ గీతాలుంటాయి.

త్రికోణ ప్రేమలు (Triangular Love), ఎత్తులు, పై ఎత్తులు, వరిపొలాల వద్ద నివసించే స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు - వస్తువులు.

మరుతమ్ (వరి పొలాలు) మరుతం (Lagerstromia speciosa) వృక్షాలు, ఎడబాటు ఈ పాటలలో విస్తృతంగా కనిపిస్తాయి. కురుంటొకయి-31వ గీతం చూడండి- "అతడు నాకు కనిపించలేదు. తిరునాళ్లలోని వీరుల మధ్యనా, జంటలుగా నృత్యం చేస్తున్న బాలికలతోను లేడు. నేనూ నర్తకినే గదా! అతని మీది ప్రేమలో చిక్కిన నా చేతుల్నుండీశంఖపు గాజులు జారిపోతున్నాయి. అతడూ నాట్యం నేర్చినవాడే! ఏమయ్యాడు?

**నెయిదల్ (నేౖతల్) పాటలు** నాయిక తన ప్రియుడి ఎడబాటుకు దుఃఖించడాన్ని వివరిస్తాయి. నీటికలువ, సముద్రతీరం, సూర్యాస్తమయం, మొసళ్లు, సొరచేపలు, పొన్నపూలు, సముద్రం, బావి, ఇసుక తిన్నెలు, ఉప్పుకల్లాలు, చేపలమ్మేవారు, జాలరులు, వరుణ దేవుడు నేపథ్యంగా ఈ పాటలుంటాయి.

సముద్రంలో వేటకు వెళ్లే జాలరులు, వారి జీవన విధానం, పడవలు, వలలు, పీతలు, ఇసుకలో గాడినేర్పరచే రథచక్రాలు, ఎండు చేపలవాసన, సముద్రపు ఘోష, చేపల కోసం ఎగుర్తున్న పక్షులు, జాలరి కన్యలు, వాళ్ల ఇళ్లు ఈ కవితలలో ప్రధాన ఆకర్షణలు.

నేౖతల్ పాటలలో ఎక్కువగా కనిపించే పుష్పం నీటి కలువ. అయింకురు నూరు-184వ పద్యం చూడండి- కలువలు వికసించిన కొలనుల్లో, కొంగలు చేపలను వేటాడుతున్నాయి. ఆహారం దొరకగానే ఎగిరి తీరపు చెట్లపై వాలుతున్నాయి. నా ప్రియుడుండే ఊరిని సముద్రం కడుగుతుంది. కాని, నాపై అతడి ప్రేమ ఆ సముద్రం కన్నా గొప్పది.

**'పాలయి' పాటలలో** ప్రధానంగా కానవచ్చేది- ప్రేయసీ ప్రియుల పలాయనం, దీర్ఘ కాలపు ఎడబాటు, నాయకుడి ప్రమాదకరమైన ప్రయాణం, లేచిపోవడం ఇత్యాదులు. పాలయి పుష్పాలు, ఎడారి, బంజరు భూములు, మధ్యాహ్న సమయం, అలిసిన జంతువులు - ఏనుగు, పులి, తోడేలు, బొమ్మజెముడు మొక్కలు, ఎండిన బావులు, నిలువనీరు, ఉప్పు నేలలు, ప్రయాణీకులు, దారి దోపిడీగాళ్లు, కొౖట్రావై (అమ్మతల్లి దేవత) ఈ గీతాల నేపథ్యంగా ఉండి ముల్లయి, కురింజి ప్రదేశాలు ఎండకు ఎండిన దృశ్యాలనుఆవిష్కరిస్తాయి.

ప్రేయసీ ప్రియుల ఎడబాటు, బీళ్లు, ఎడారులు, పాలయి వృక్షాలు (Wrightia tinctoria) ఈ కవితలలో ప్రధానాంశాలు- కురుంటొకయి- 130వ గీతంలో- అతడు భూగర్భంలోకి ప్రవేశించలేదు; ఆకాశానికీ ఎగబాకలేడు; సముద్రంపైన నడవనూ లేడు; మనం ప్రతి దేశాన్ని, నగరాన్ని, గ్రామాన్నీ వెదకుదాం! మన ప్రియుళ్లు ఎక్కడికి పోగలరు? - అని ఇష్టసఖి నాయికను ఓదారుస్తూ అంటుంది.

ఎటువంటి భౌగోళిక ప్రదేశానికీ చెందని గీతాలు - కైక్కిలయి (Kaikkilai); పెరుంటినయ్ (Peruntinai) వాటిని సూచించే పుష్పాలూ లేవు. అవి సరాసరి ఉద్వేగాలను వ్యక్తీకరిస్తాయి.

**కైక్కిలయి గీతాలు** సాధారణంగాఏకపక్ష ప్రేమను చిత్రిస్తాయి- పురనానూరు-83 - "కాటుక నలుపు గడ్డం, కాళ్లకు యుద్ధ కడియాలున్న ఆతడిని

కౌగలించుకోవాలన్న కోరికతో నా గాజులు చేతుల నుండి జారిపోతున్నాయి. అమ్మ చూస్తుందేమో, లోకం ఆడిపోసుకుంటుందేమోనని భయం. ఏం చేయాలో తెలీని సందిగ్ధతతో ఈ నగరం కూడా నాలాగే కంపిస్తూ రెండుగా విడిపోనీ!''

**పెరుంతినాయి** (Perunthinai) కవితలలో ఆచారానికి భిన్నమైన ప్రేమ, ఇష్టం లేని శృంగారం, బలాత్కారం, వయసులో తేడాలు, విధి నిర్వహణ వలన కలిగే ఎడబాటు వర్ణించబడతాయి. పురనానూరు-146 గీతం చూడండి! "విజయుడివైన పెకన్! నీ సంపదలు,మణిమాణిక్యాలు నాకక్కర్లేదు. నేను నీ ఘనతను గానం చేస్తున్నపుడు నీమీది ప్రేమతో చిక్కి శల్యమవుతున్న ఆ యువతి వద్దకు వెళ్లు. ఇదే నేను కోరే చిన్ని కోరిక. రథానికి జవనాశ్వాలను పూన్చి వాయువేగంతో ఆమెను చేరు! నెమలి వర్ణపు కురులున్న ఆమె మరల పరిమళభరిత పుష్పమాలికను ధరించి ఆనందపు డోలికలలో ఊగనీ!''

**అకనానూరు:** అకనానూరు అంటే నాలుగు వందల ఆకం కవితలు 13-15 పాదాలతో, బేసి సంఖ్య గలవి పాలయి; 2,8తో అంతమయ్యే సంఖ్య గలవి కురింజి; 4తో అంతమయ్యే సంఖ్య గలవి ముల్లయి; 6తో అంతమయ్యే సంఖ్యగలవి మరుతం; 0తో అంతమయ్యే సంఖ్యగలవి నేౖతల్ - వీటిని 142 మంది కవులు రచించారు.

## పురనానూరు

పురనానూరు కవితాసంకలనంలో 400 గీతాలు 'అకవాల్' ఛందస్సులో 150 మంది కవులచే వ్రాయబడినాయి.

ఆనాటి తమిళదేశపు రాజకీయ, సాంఘిక వ్యవస్థ గురించి తెలుసుకోడానికి ఈ సంకలనం ఉపయోగపడ్తుంది.

పురనానూరు, పతిఱ్రుపాతులోని కవితలు, గేయాలు జీవితపు ఆవలి పార్శ్వాన్ని, రాజులు, యుద్ధాలు, వాళ్ల గొప్పతనం, ఔదార్యం, నీతులు, వేదాంతం వీటిని వివరిస్తాయి. పతిఱ్రు పాతు చేరరాజుల గొప్పతనాన్ని గురించి వర్ణించిన 108 కవితల సంకలనం. పురనారూరు అనేక విషయాల కవితా కదంబం.

పురనానూరు కవితల్ని రచించిన 150 మంది కవులలో రాజులు, సైన్యాధిపతులు 14 మంది, 15 మంది స్త్రీలు. స్త్రీలలో 33 కవితలతో అవ్వైయార్ ప్రసిద్ధికెక్కినది.

కపిలార్, నక్కిరార్‌ల రచనలు అన్ని సంకలనాల్లోనూ ఉన్నాయి. ఈ కవితలలోని అంశాలు 1) వెట్టి-గో(గ్రహణం, 2) కరంతాయి-గోరక్షణ, 3) వంశ్చి-దండయాత్ర, 4) కంచి-నిర్వేదం, 5) యుజింగల్-ముట్టడి, 6) నొచ్చి-దుర్గ రక్షణ, 7) తుంపయి-యుద్ధోన్మాదం, 8) వాకయి-విజయం, 9) పాఠాన్-రాజును పొగిడి ధనాన్ని గ్రహించడం, 10) పొతు విచాల్-వీరత్వం, వీరుల సంస్మరణ, 11) కైక్కిలాయి-ఏకపక్ష ప్రేమ, ఏమీ ఆశించని ప్రేమ, 12) పెరుంటినాయి-అక్రమ సంబంధం, సరిపడని ప్రేమ.

✤✤✤✤✤

సంగం సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు ఆనాటి ప్రజల ఆహారం, ఆహార్యం గురించి అర్థమవుతుంది. వరి అన్నం, కూరగాయలు, మాంసాహారాలు, పాలు, వెన్నె, తేనె తమిళుల ఆహార పదార్థాలు. వేటగాళ్లు ఎర్రబియ్యం, ఉడుము మాంసం తింటే గొర్రెలకాపరులు జొన్న అన్నం, చిక్కుళ్లు, మొక్కజొన్నలు తినేవారు. రైతులు, రైతు కూలీలు వరి అన్నం, కోడికూర ఇష్టపడేవారు. జాలరులు చేపలకూర, వరి అన్నం తినేవారు. శాకాహారులు వరి అన్నం, కొబ్బరి అన్నం, మామిడికాయ పచ్చడి, దానిమ్మ గింజలు, కరువెంబు ఆకుల తాలింపు కూరలు ఆరగించేవారు. సముద్రపు చేపలు, రొయ్యలు, తాబేళ్లు తీర ప్రాంత ప్రజల ఆహారంగా- 'పెరుం-పనారు' అనే యాత్రాగ్రంథంలో వ్రాయబడింది.

కపిలార్ తన కురింజి పట్టు అనే గ్రంథంలో 99 పూలను వర్ణించాడు. తమిళ దేశంలో పూలను కొట్టుపు (చంపక, కొంగు), కొడిపు (మల్లెలు, మొల్లలు), నీర్‌పు (కలువ, తామర), నెలపు (తుంపయి, చామంతి)గా విభజించినారు.

పాండ్యరాజులు వేపపూల దండలను, చేరరాజులు తాటిపూల దండలను, చోళరాజులు అత్తిపూల దండలను ధరించేవారని ప్రతీతి.

చేరరాజులు దండయాత్రకు వెళ్లేప్పుడు వంసి పూలను (మాధవీలత); విజయ చిహ్నంగా తుమ్మయి పూలను, రాజ చిహ్నంగా తాటి (పామెరా) పూలను ధరించేవారు.

సంగం కాలంలో పేదవాళ్లు, సైనికులు, శ్రామికులు, యాత్రికులు కొబ్బరి కల్లు తాగేవారు. జాలరులు, తీరప్రాంతం వాళ్లు తాటికల్లును, ధనవంతులు వరిబియ్యం నుంచి, తాటకి పూల (Buhinia Tomentosa) నుంచి తయారైన మధువును, రాజకుటుంబీకులు యవన రాజ్యాల నుంచి దిగుమతి చేసుకున్న ద్రాక్ష సారాయిని తాగి ఆనందించేవారట.

తమిళ అక్షరమాలలో 12 యుయిరెటట్టు - అచ్చులు (ఆత్మ), 18 మెయ్యేలుట్టు- హల్లులు (దేహం); 1 అయితం-విసర్గ ఉన్నాయి. ఈ 31 అక్షరాలు, 216 గుణింతాక్షరాలు కలిపి మొత్తం 247 అక్షరాలుంటాయి. (యుయిర్ మెయ్యేలుట్టు)

ప్రాచీన కాలపు కావ్యాలలో పేర్కొనదగినవి 1) అట్రుప్పడై -సంగీత కళాకారులకు దారి చూపునది; 2) తిరుమురు గాట్రుపడై-మురుగన్ దేవుని, అందాన్ని వర్ణించునది; 3) పొరునరాట్రుప్పడై- కరికాల చోళుని గొప్పతనాన్ని అభివర్ణించునది; 4) పెరుంపాణాట్రుప్పడై-ఇళంత్రిరైయన్ రాజు పాలనా వర్ణనం; 5) శిరుపాణాట్రుప్పడై-పాణర్ అనే పేద సంగీత కళాకారుడి జీవిత వర్ణన.; 6) మలైపడు కడాం-కూత్తర్ కుటుంబ గాథ; 7) ముల్లైపాట్టు - ప్రియుడు యుద్ధానికి పోగా ప్రియురాలు ఎడబాటుతో దుఃఖించుట;8) కురింజిపాట్టు - రహస్య ప్రణయంలోని కష్టాలు, 9) పట్టినప్పాలై-ధన సంపాదనకై పరదేశమేగిన ప్రియుని తలుస్తున్న ప్రేయసి. 10) నెడునల్వాడై - యుద్ధరంగంలో ఉన్న తమవాళ్ల క్షేమం కోసం స్త్రీలు-'కొట్రవై' (కాళీ) మాతను వేడుకొనుట; 11) మదురైక్కాంచి - మధురానగర వర్ణన; నెడుంజెళియన్ ప్రశంస.

ఈ కావ్యాలలోని అద్భుత అలంకార విశేషములు ఈనాటికీ చిరస్థాయిగా ఉన్నవి. మచ్చుకు కొన్ని-

"రెండు ఖండములుగా చేయబడిన మామిడిపిందెలా ఉన్నవి ఆమె కనులు" అని ఒక వర్ణన.

"తూర్పున పూర్ణచంద్రుడు మా ఊరిలో నాకే స్వంతమయిన చంద్రబింబాన్ని గుర్తు చేస్తున్నాడు"

"ఏడ్చి ఏడ్చి కన్నీరు కార్చుచున్న కన్నులు,

వానకు తడిచి నీరోడుచున్న పూలవలె ఉన్నవి"

✣✣✣✣✣

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's narration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్ధానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book that has reached many places. (Sankaracharya's mystic poems explained and translated in modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam in simple, lucid English. The second revised edition with commentary is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

<u>**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**</u>

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బన్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black- చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠి కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు-మని-షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్-గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడినది..

36. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

37. **కుయ్యోమొర్రో శతకం** (ఛందోబంధ రహితం)

38. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

39. **భైరవ శతకం** (విభజనానంతర కవిత్వం)

40. **Bouquet of Telugu Songs and Lyrics (Telugu Learning Kit)**

41. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

42. **మణిమేఖల** – 'శిలప్పదికారం' తరువాత ఘట్టం. శాత్తనార్ రచనకు తెలుగు అనువాదం.

## త్వరలో...

**43.** **కలలు-విశ్లేషణ - స్వప్నశాస్త్రం రెండవభాగం (త్వరలో)**

**44.** **క్రీస్తు నడచిన దారి -** కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం. **(త్వరలో)**

**45.** **The Poems of Kuppam -** సీతారాం రచనకు ఇంగ్లీషు అనువాదం- **'Montages'.**

**46.** **దళిత వ్యాకరణం (The broken grammar) -** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**47.** **మాకూ ఓ భాష కావాలి (We need a language)-** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**48.** **అగ్నివృక్షం (The tree of Fire)-** ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య రచనకు ఇంగ్లీషు అనువాదం.

**49.** **రక్తకాసారం (The Blood Pond)-** అంపశయ్య నవీన్ ప్రఖ్యాత నవలకు ఇంగ్లీషు అనువాదం.

**50.** **Eighteen English Poets -** తెలుగులో **(త్వరలో)**

**51.** **మస్నవి -** మౌలానా జలాలుద్దీన్ రూమి అలౌకిక ద్విపదలు- తెలుగులో (త్వరలో)

**52.** **This is no streaking -** K.K. Menon Stories into English.

**53.** **రసధుని -** మూడు శతాబ్దాల, రెండువందల సంవత్సరాల (1770-1970) రష్యన్ కవిత్వ ప్రవాహం.

**54.** **కాయగూర శతకం -** 'తినబోతూ రుచి అడగనేల'

**55.** **అయ్యబాబోయ్ శతకం -** వర్తమాన రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాలు.

# Bibliography


1. The Cilappatikaram - Ilango Adigal - R. Parthasarathy
2. Poets of the Tamil Anthologies - George L. Hart
3. Manimekhalai - Sattanar - Alain Danielou
4. A History of Tamil Literature - M. Varadarajan
5. తమిళ వాఙ్మయ చరిత్రము - (వరదరాజన్)
   - తిమ్మావజ్ఝల కోదండరామయ్య
6. శైలగీతం - (కపిలార్) - ముదునూరి జగన్నాథరాజు
7. కాలి అందియ కథ - శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి
8. మణిమేఖల - శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి
9. తమిళ సరస్వతి అందెల రవళి (సంగం కవిత్వం)
   - డాక్టర్ లంకా శివరామప్రసాద్
10. భారతభారతి
11. Wikipedia.

ప్రపంచ సాహిత్యం-17



ఇల్లంగో అదిగళ్
విరచిత

# శిలప్పదికారం



(కన్నగి పాదమంజీర గాధ)

శిలప్పదికారం, మణిమేఖల, జీవక చింతామణి, వలయపతి, కుండలకేశి ఈ అయిదు తమిళ పంచకావ్యాలు. వీటిలో శిలప్పదికారం, మణిమేఖలలను జంట కావ్యాలుగా పిలుస్తారు. కాలి అందియ కథగా, పాదమంజీర గాధగా, కన్నగి కథగా, పత్తిని (పత్ని) దేవీచరితంగా ప్రసిద్ధికెక్కిన శిలప్పదికారం- చేర రాజకుటుంబీకుడైన ఇల్లంగో అదిగళ్‌చే క్రీస్తుశకం 150-400 సంవత్సరాల ప్రాంతంలో వ్రాయబడినది. ఈ కావ్యానికి కొనసాగింపుగా 'మణిమేఖల' కావ్యం కవి శీత్తలై శాత్తనార్‌చే రచింపబడినది.

## డాక్టర్ లంకా శివరామప్రసాద్